# ఉపాధ్యాయుల కరదీపిక

## తెలుగు

## 10వ తరగతి

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ

ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

## రూపొందించినవారు

**శ్రీ సువర్ణ వినాయక్,** కోఆర్డినేటర్, విద్యాప్రణాళిక, పాఠ్యపుస్తక విభాగం, ఎస్.సి.ఇ.ఆర్.టి., ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

**శ్రీ వొజ్జల శరత్‌బాబు,** తెలుగు పండితులు, సీతాఫల్‌మండి, హైదరాబాదు.

**శ్రీ ఎల్.ఎం.ప్రసాద్,** తెలుగు పండితులు, ప్ర.ఉ.పా., సి.వి.ఎల్, అంబర్‌పేట్, హైదరాబాదు.

**శ్రీ మువ్వల రాంబాబు,** స్కూలు అసిస్టెంట్, జి.ప.పా., జి.కోడూరు, విశాఖపట్టణం జిల్లా.

**శ్రీ అవుసుల భానుప్రకాశ్,** స్కూలు అసిస్టెంట్, జి.ప.ఉ.పా., లోనికలాన్, మెదక్ జిల్లా.

**శ్రీ నందిగామ కిశోర్‌కుమార్,** తెలుగు పండితులు, జి.ప.ఉ.పా., ఇప్పటూరు, మహబూబ్‌నగర్ జిల్లా.

**శ్రీ ఎస్.రఘు,** అసిస్టెంటు ప్రొఫెసర్, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వ విద్యాలయం, హైదరాబాదు.

**శ్రీ పల్లెర్ల రామమోహనరావు,** స్కూలు అసిస్టెంట్, జి.ప.ఉ.పా., వేముల, మహబూబ్‌నగర్ జిల్లా.

**శ్రీ వి.చెన్నయ్య,** స్కూలు అసిస్టెంట్, జి.ప.ఉ.పా., జగద్గిరినగర్, రంగారెడ్డి జిల్లా.

**శ్రీ చెరుకూరి వెంకట సూర్యనారాయణ శర్మ,** జి.ప.ఉ.పా., మగటపల్లి, తూర్పుగోదావరి జిల్లా.

**శ్రీ కె.జనార్ధన్,** స్కూలు అసిస్టెంట్, జి.ప.ఉ.పా., మంచిర్యాల్, ఆదిలాబాదు జిల్లా.

**శ్రీ కటుకోజ్వల మనోహరాచారి,** స్కూలు అసిస్టెంట్, జి.ప.ఉ.పా., తక్కళ్ళపల్లి, కరీంనగర్ జిల్లా.

**శ్రీమతి పల్లి మాధవి,** తెలుగు పండితులు, భారతీయ విద్యాభవన్, ఆత్మకూరి రామారావు పాఠశాల, జూబ్లిహిల్స్, హైదరాబాదు జిల్లా.

**శ్రీ పైడాల జనార్ధన్ రెడ్డి,** ఉపన్యాసకులు, జిల్లా విద్యా శిక్షణ సంస్థ, కర్నూలు జిల్లా.

## విషయనిపుణులు, ఎడిటింగ్

**డా॥ఎన్.ఉపేందర్‌రెడ్డి,**
ప్రొఫెసర్, విద్యాప్రణాళిక, పాఠ్యపుస్తక విభాగం,
రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,
ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

**శ్రీ సువర్ణ వినాయక్,**
కోఆర్డినేటర్, విద్యాప్రణాళిక, పాఠ్యపుస్తక విభాగం,
రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,
ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

## సలహాదారులు

**శ్రీ జి.గోపాల్‌రెడ్డి,** సంచాలకులు, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ, ఆంధ్రప్రదేశ్, హైదరాబాదు.

# ముందుమాట

చదువుకున్న వ్యక్తులు, ఆలోచన, విచక్షణతో వ్యవహరించే పద్ధతిపై ఆ సమాజాభివృద్ధి ఆధారపడి ఉంటుంది. ఏ సమాజంలోనైనా ప్రతి ఒక్కరు పాఠశాల విద్యను పూర్తిచేసినవారయితే వారివల్ల ఆ సమాజంలోని విభిన్న రంగాలు ప్రభావితం చెందుతాయి. అందుకే ప్రతి ఒక్కరు కనీసం పాఠశాల విద్యను పూర్తిచేసి ఉండాలని, సమాజాభివృద్ధి జరగాలని అందరూ ఆశిస్తుంటారు. పాఠశాల విద్యను పూర్తిచేసిన పిల్లలు, విన్నదాన్ని లేదా చదివిన దాన్ని అర్థం చేసుకోగల్గడం, దాన్ని విశ్లేషించగలగడం, ప్రతిస్పందించగలగడం, ప్రశ్నించగలగడం చేయగలగాలని, హేతుబద్ధమైన, విచక్షణతో కూడిన బాధ్యతాయుత పౌరులుగా రూపొందాలని రాష్ట్ర విద్యా ప్రణాళిక పరిధిపత్రం–2011 పేర్కొంది. ఇలాంటి పిల్లలవల్ల ఆ సమాజం జ్ఞానవంతమైన సమాజంగా మారుతుంది. ఇది దేశాభివృద్ధిని కూడా ప్రభావితం చేస్తుంది. దీన్ని సాకారం చేయడానికి మన రాష్ట్రంలో 2011 నుండి పాఠశాల విద్యలో సంస్కరణలు ప్రారంభమైనాయి.

చదువులను బట్టీవిధానాలకు దూరం చేయడానికి, అర్థవంతంగా నేర్చుకోవడానికి, జ్ఞాన నిర్మాణం చేసుకోవడానికి, పాఠ్యపుస్తక పరిధిని దాటి నేర్చుకోవడానికి, నేర్చుకొన్నదాన్ని దైనందిన జీవితంలో వినియోగించడానికి వీలుగా సామర్థ్యాలను నిర్ధారించి, వీటి సాధనకోసం నూతన పాఠ్యపుస్తకాలను రూపొందించారు. ఈ క్రమంలో 2014 సంవత్సరం నుండి పదవ తరగతి పాఠ్యపుస్తకాలు అమలులోకి వచ్చాయి. విద్యా సంస్కరణల్లో భాగంగా పాఠ్యపుస్తకాల ఆధునికీకరణ తొలి అడుగు మాత్రమే! వీటిని ఆశించిన విధంగా వినియోగించడం, పిల్లలు భాగస్వాములయ్యేలా చూడడం, ఆలోచన, సృజనాత్మకతను పెంచేలా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించడం అసలైన సవాలు. దీన్ని ప్రభావితం చేసేది పరీక్షలు లేదా మూల్యాంకన విధానాలు. ఇందుకోసం పరీక్ష విధానాలను సంస్కరించడానికి 2012–13 సం॥ నుండి నిరంతర సమగ్ర మూల్యాంకనాన్ని ఎనిమిదవ తరగతి వరకు అమలు చేస్తున్నారు. 2014–15 సంవత్సరం నుండి 9, 10 తరగతుల పరీక్షా విధానాలలో కూడా సంస్కరణలు అమలుకాబోతున్నాయి.

పదవ తరగతి నూతన పాఠ్యపుస్తకాల గురించి, పరీక్షల్లోని సంస్కరణల గురించి ఉపాధ్యాయులకు అవగాహన కల్పించడానికి, ఉపాధ్యాయ కరదీపికలను రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ రూపొందించింది. ఈ కరదీపికలో పాఠ్యపుస్తకాల తాత్విక అంశాలు, ప్రత్యేకతలు, సాధించాల్సిన సామర్థ్యాలు, వాటికి సంబంధించిన వ్యూహాలు, ఉపాధ్యాయుల తయారీ, వార్షిక ప్రణాళిక, పాఠ్యప్రణాళిక, పరీక్షల్లోని సంస్కరణాంశాలు, అవకాశాలు, ప్రతిపాదనలు, అంతర్గత మూల్యాంకనం విధివిధానాలు, సంగ్రహణాత్మక/ పబ్లిక్ పరీక్షల ప్రశ్న పత్రాల స్వభావం, భారత్వం, నమూనా ప్రశ్నపత్రాలు, జవాబుపత్రాలు దిద్దేవిధానం మొదలగు అంశాలను పొందుపర్చారు. రోజూ నిర్వహించే బోధనాభ్యసన ప్రక్రియలను అర్థవంతంగా మార్చడానికి ఈ కరదీపిక ఉపాధ్యాయులకు చేదోడుగా ఉంటుంది. దీని ఆధారంగా ఉపాధ్యాయులు తమ అనుభవం, సృజనాత్మకత, ఆలోచనతో సమర్థవంతంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించగలరని ఆశిస్తున్నాం.

పదవ తరగతి పూర్తిచేసిన పిల్లలు **'అవగాహన–ప్రతిస్పందన', 'వ్యక్తీకరణ–సృజనాత్మకత', 'భాషాంశాలు'** వంటి సామర్థ్యాలలో ప్రావీణ్యతను పొంది, తమకున్న భాషాసమర్థతలో జీవికను కూడా పొందగలరని నమ్ముతున్నాం. దీన్ని సాకారం చేయడానికి రూపొందిన 10వ తరగతి నూతన వాచకాలను, పరీక్షల సంస్కరణలతో మేళవించి విద్యార్థుల భాషాసామర్థ్యాల స్థాయిని పెంపొందించగలరని, ఇందుకు ఈ కరదీపికను ఉపాధ్యాయులు సందర్భోచితంగా ఉపయోగించగలరని ఆశిస్తున్నాం.

సంచాలకులు

తేది : 31–05–2014 రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,

స్థలం : హైదరాబాదు హైదరాబాదు.

# విషయసూచిక


| వ.సం | అధ్యాయం పేరు | పేజి సంఖ్య |
|---|---|---|
| I. | పాఠ్యపుస్తకం గురించి | |
| | A. పిల్లలకు సూచనలు | |
| | B. ఉపాధ్యాయులకు సూచనలు | |
| | C. పాఠాలు, ఇతివృత్తాలు | |
| | D. పాఠంలోని విషయం అమరిక క్రమం | |
| | E. పాఠం మధ్యంలోని ప్రశ్నలు | |
| | F. అదనపు – అంశాలు | |
| II. | పాఠ్యాంశాలు విశేషాంశాలు | |
| III. | విద్యా ప్రమాణాలు, సామర్థ్యాలు, సూచికలు, పాఠం వారీగా సాధించాల్సిన సామర్థ్యాలు | |
| IV. | సామర్థ్యాల వారీగా వ్యూహాలు | |
| V. | బోధనా ప్రణాళికలు – వార్షిక ప్రణాళిక, పాఠ్య ప్రణాళిక | |
| VI. | పదవ తరగతి పరీక్షలు – సంస్కరణ | |
| | A. ఆవశ్యకత | |
| | B. నేపథ్యం | |
| | C. మార్గదర్శకాలు | |
| VII. | నిర్మాణాత్మక మూల్యాంకనం నిర్వహణ విధానం | |
| | A. నిర్మాణాత్మక మూల్యాంకనం – వివరాలు, వివరణ, ఉదాహరణలు | |
| | B. అమలుపరిచే విధానం, ఆధారాలు | |
| | C. మార్కుల కేటాయింపు సూచికలు | |
| | D. ప్రగతి నమోదు | |
| VIII. | సంగ్రహణాత్మక మూల్యాంకనం (పబ్లిక్ పరీక్షల నిర్వహణ) | |
| | A. సామర్థ్యాల వారీగా భారత్వం | |
| | B. ప్రశ్నల రకం, సంఖ్య, స్వభావం, నమూనా ప్రశ్నలు | |
| | C. నమూనా ప్రశ్నాపత్రాలు | |
| | D. జవాబుపత్రాలు దిద్దడం – సూచికలు / మార్గదర్శకాలు | |
| | E. పాఠ్య పుస్తక వినియోగం – పరీక్షలకు సిద్ధం చేయడం | |
| IX. | పదవ తరగతి – పాఠ్య బోధన వనరులు – అదనపు గ్రంథాలు | |
| X. | ఉపాధ్యాయుని తయారీ | |



# I. పాఠ్యపుస్తకం గురించి

పాఠశాల విద్యలో పదవతరగతి చివరది. పిల్లలు పాఠశాల విద్య పూర్తయ్యేసరికి స్వతంత్ర్య పాఠకుడిగా, విలువలతో కూడిన భవిష్యత్ పౌరుడిగా ఎదగాలి. చదివినదాన్ని, దూరాన్ని అర్థం చేసుకోవడం, దాని గురించి ప్రతిస్పందించడం, అవసరమైతే ప్రశ్నించడం, విభిన్నకోణాలలో విశ్లేషించడంవంటివి చేయగలగాలి. వీటిని సాకారం చేయడంలో భాష యొక్క పాత్ర కీలకమైంది. భాషాభ్యసనం ద్వారా పిల్లలు విమర్శనాత్మక దృక్పథాన్ని, విశ్లేషణశక్తిని, సృజనాత్మకతను పెంపొందించుకోవాలి. ఆలోచించడం, వ్యక్తీకరించడం వంటివి అత్యంత ముఖ్యమైనవి. వీటిని సాధించడానికి పాఠ్యపుస్తకాలు తోడ్పడాలి. ఇందుకనుగుణంగా నిర్ధారించిన భాషాసామర్థ్యాల ఆధారంగా 10వ తరగతి నూతన పాఠ్యపుస్తకాన్ని రూపొందించారు.

9వ తరగతి విద్యార్థులు పొందిన భాషా సామర్థ్యాలు, సృజనాత్మకత మరింత పెంపొందించడానికి వీలుగా 10వ తరగతి తెలుగు పాఠ్యపుస్తకం తెలుగు దివ్వెలు–2 రూపొందించారు. ఈ పుస్తకం ద్వారా పిల్లలు విషయాన్ని అవగాహన చేసుకోవడం – ప్రతిస్పందించడం, సృజనాత్మకంగా వ్యక్తీకరించడం, భాషాంశాల సాధనపై మరింత పట్టు సాధించవచ్చు. భిన్న ఇతివృత్తాలు, వివిధ ప్రక్రియల్లో ఉన్న ఈ పాఠ్యాంశాలు విద్యార్థులకు మానవీయ, సాంస్కృతిక, సామాజిక, విలువలను అందిస్తాయి. ఉపాధ్యాయులు సోపానక్రమం ఆధారంగా బోధించడానికి వీలుగా పాఠ్యాంశ విషయాలను పొందుపర్చారు.

## అ. కీలక సూత్రాలు

### బట్టీ విధానానికి వ్యతిరేకంగా...

నేర్చుకోవడం అంటే పుస్తకంలోని విషయాన్ని జ్ఞాపకముంచుకోవడం కాదు. విన్న లేదా చదివిన అంశాన్ని అర్థం చేసుకొని విశ్లేషించాలి. భావాన్ని, అంతరార్థాన్ని గ్రహించాలి. వ్యక్తీకరించాలి. ఇందుకోసం ఆలోచింపజేసే రీతిలో, బహుళ

సమాధానాలు వచ్చేలా ప్రశ్నలు, అభ్యాసాలు ఉన్నాయి. రాబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో పాఠ్యపుస్తకంలోని ప్రశ్నల్ని ఉన్నదున్నట్లుగా అడగరు. కానీ పాఠ్యపుస్తకంలో ఇచ్చిన ప్రశ్నల స్వభావం కలవేరే ప్రశ్నలే పరీక్షల్లో వస్తాయి. కాబట్టి ఈ పాఠ్యపుస్తకం బట్టీ విధానానికి వ్యతిరేకం. (ప్రధాన పద్యాలు మాత్రం కంఠస్థం చేయాల్సి ఉంటుంది). "పాఠంపై పూర్తి పట్టు (అవగాహన) సాధించినప్పుడే ఎలాంటి ప్రశ్నలకైనా సమాధానం రాయవచ్చు" అనే అంశాన్ని దృష్టిలో ఉంచుకొని మాత్రమే బోధనాభ్యసనం కొనసాగాలి. అప్పుడే విద్యార్థులు ఎలాంటి ప్రశ్నలడిగినా సొంతంగా రాయగల్గుతారు. పాఠ్యాంశం, ప్రశ్నల స్వభావం, సాధించాల్సిన సామర్థ్యాల పట్ల స్పష్టమైన అవగాహన ఉపాధ్యాయులు పెంచుకోవాలి. ఆ దిశగానే బోధన జరగాలి. అప్పుడే బట్టీ విధానానికి విద్యార్థులు స్వస్తి పల్కుతారు.

### ❧ పాఠ్యపుస్తకం పరిధిదాటి నేర్చుకునేట్లు చేయడం

విద్యార్థులు సమాజం ద్వారా, పరిసరాల ద్వారా, ఇతర పఠన సామగ్రి ద్వారా అనేక విషయాల్ని నేర్చుకుంటారు. విద్యార్థులను ఆదిశగా ఉన్ముఖుల్ని చేయడానికి పాఠ్యపుస్తకం బాగా సహకరిస్తుంది. ఇందలి సృజనాత్మక కృత్యాలు, ప్రాజెక్టు పనులు, భాషా కార్యకలాపాలు, ప్రశంసాత్మక కృత్యాలు విద్యార్థిని ఆలోచింపజేసి, సమాజంతో మమేకమై అభ్యసించేలా ప్రోత్సహిస్తాయి. గ్రంథాలపేర్లు సేకరించడం, సుప్రసిద్ధుల వివరాలు సేకరించడం, జీవన విధానాల వైవిధ్యాన్ని పరిశీలించి పట్టికగా పొందుపర్చడం, దిన, వార పత్రికల ఆధారంగా విషయసేకరణ, కథలను సేకరించడం, ఇంటర్వ్యూ చేయడం తదితర కృత్యాలు విద్యార్థిని పాఠ్యపుస్తక పరిధిదాటి అభ్యసించేలా ఉపయోగపడతాయి. పాఠంలోని విషయం నేర్చుకున్న తర్వాత విద్యార్థులు, తాము నేర్చుకున్న విషయాన్ని సమకాలీన అంశాలతో అన్వయించగలగాలి. రచనను ప్రశంసించగల్గాలి. బహుకోణాల్లో ఆలోచించగలగాలి. కవి హృదయాన్ని ఆకళింపు చేసుకోగలాలి. సమాజంలో తనవంతు పాత్ర పోషించేలా ప్రేరణనివ్వాలి. ఆ దిశగా ఇందలి అభ్యాసాలు దోహదపడతాయి.

### ❧ తాము పొందిన జ్ఞానాన్ని పిల్లలు నిత్యజీవనంలో ఉపయోగించడం

పిల్లలు తాము పొందిన జ్ఞానాన్ని దైనందిన జీవితంలో వినియోగించగల్గాలి. అప్పుడే పాఠ్యపుస్తకం ద్వారా ఆశించే ప్రయోజనం నెరవేరినట్లు. ఇతరులతో సంభాషించడం, సమాచారం తెలుసుకోవడానికి ప్రశ్నించడం, వార్తాపత్రికలు మేగజైన్లు, కరపత్రాలు, సమాచార పట్టికలు చదివి అర్థం చేసుకోవడం, ఇతర అవసరాల కోసం లేఖలు రాయడం, దరఖాస్తులు రాయడం, చేయాల్సి ఉంటుంది. ఈ సందర్భాల్లో ఇతరులపై ఆధారపడకుండా తమకున్న భాషా సామర్థ్యాల్ని వినియోగించుకోగల్గాలి. ఈ సామర్థ్యాన్ని పెంచుకోడానికి పాఠ్యపుస్తకంలో "అవగాహన-ప్రతిస్పందన" కోసం వినడం మాట్లాడడం, చదవడం అభ్యాసాలు, "వ్యక్తీకరణ-సృజనాత్మకత" కోసం స్వీయరచన, సృజనాత్మకత, ప్రశంస, ప్రాజెక్టు పనులు వంటివి ఉన్నాయి. వీటి వల్ల పిల్లలు తాము పొందిన భాషా సామర్థ్యాలను తమ అవసరాల కోసం వినియోగించగలుగుతారు.

### ❧ పిల్లల జ్ఞానం, నేపథ్యం, సంస్కృతి

పాఠ్యపుస్తకంలో వివిధ భాషారూపాలున్నాయి. అయితే పిల్లలు వారు నేర్చుకున్న జ్ఞానం ఆధారంగా, వారి భాషలోనే సొంతమాటల్లో రాయడాన్ని ప్రోత్సహించేలా ప్రశ్నలు ఉన్నాయి. విద్యార్థుల్లో ఊహాశక్తి పెరిగేలా, వారు తమ చుట్టూన్న సమాజంతో మమేకమై అనేక అంశాలు నేర్చుకునేలా అభ్యాసాలున్నాయి. ప్రాజెక్టు పనులు, సృజనాత్మకత కృత్యాల్లో ఇచ్చిన

ప్రశ్నలు వారి జ్ఞానాన్ని వెలికితీస్తాయి. సాంస్కృతిక విలువలను పెంపొందిస్తాయి. వారి జీవిత అనుభవాల్ని వ్యక్తీకరించేలా చేస్తాయి. విద్యార్థుల అభ్యసనాన్ని మెరుగుపరుస్తాయి. విద్యార్థుల అనుభవాలు, తమ భాషను సమర్థంగా వ్యక్తీకరించేలా అభ్యాసాలు పొందుపర్చబడ్డాయి.

## ❧ సామర్థ్యాల వినియోగం...

పదో తరగతి పూర్తయేసరికి విద్యార్థులు తమ అనుభవాల్ని వివిధ ప్రక్రియల్లో వ్యక్తీకరించగలగాలి. తాను విన్న, చదివిన అంశాన్ని ఆకళింపు చేసుకుని సందర్భోచితంగా తగిన పదజాలంతో వినియోగించగలగాలి. ఇందుకు ఇందలి అభ్యాసాలు బాగా దోహదపడతాయి. వివిధ అంశాలపై ప్రశంసా పూర్వకంగా స్పందించేగుణం పెంపొందించడానికి ప్రశంస అభ్యాసాలున్నాయి. విషయాన్ని సేకరించడం, విశ్లేషించడం, నివేదిక తయారుచేయడం వంటి నైపుణ్యాలు పెంపొందించడానికి వివిధ అభ్యాసాలు పొందుపర్చారు. పిల్లల్లో కాల్పనిక, సృజనాత్మక శక్తులు పెంపొందించడానికి సృజనాత్మక ప్రశ్నలు బాగా సహకరిస్తాయి. భాషా వాచకాల ద్వారా సామర్థ్యాలు పొందడం ఒక పార్శ్వమైతే, తమకున్న సామర్థ్యాలను అవసరం మేరకు వినియోగించడం రెండవ పార్శ్వం. 10వ పాఠ్యపుస్తకం ప్రధానంగా పిల్లలు తమకున్న భాషా సామర్థ్యాలను వినియోగించుకొనేలా రూపొందించబడింది. ఇందుకనుగుణంగా అభ్యాసాలు ఉన్నాయి.

## ❧ ఆలోచన, వ్యక్తీకరణ, సృజనాత్మకత, భాషాభిరుచి:

భాష ద్వారానే ఆలోచించడం, వ్యక్తీకరించడం చేస్తాం. వ్యక్తీకరణ విభిన్న రూపాలలో ఉంటే అది సృజనాత్మక వ్యక్తీకరణ అవుతుంది. విభిన్న రచనలు, సాహిత్యాన్ని చదవడంపట్ల అభిరుచి ఏర్పడి అలవాటుగా మారాలి. ఇందుకనుగుణంగా 10వ తరగతి పాఠ్యపుస్తక రూపకల్పన జరిగింది. ఇందుకోసం "వ్యక్తీకరణ-సృజనాత్మకత"ను ఒక ప్రధానమైన భాషాసామర్థ్యంగా చేర్చి అభ్యాసాలను పొదుపరచారు. విభిన్న ప్రక్రియల్లోని పాఠ్యాంశాలు చదవడం, ప్రాజెక్టు పనులు చేయడం, సృజనాత్మక కార్యకలాపాలలో పాల్గొనడం ద్వారా భాషాభిరుచి పెరుగుతుంది. ఇందుకోసం ప్రాచీన, ఆధునిక సాహిత్య ప్రక్రియలను పాఠ్యాంశాలుగా చేర్చారు. వీటికి సంబంధించిన సామర్థ్యాలను అభ్యాసాలలో చేర్చారు.

## ❧ పరస్పర ప్రతి చర్యలకు కేంద్రంగా ఉండడం :

పాఠ్యపుస్తకంలోని అర్థసంగ్రహణం కోసం ఇచ్చిన విద్యార్థులకు సూచనలు, అవగాహన ప్రతిస్పందనలోని వినడం, మాట్లాడడం, ప్రశ్నలు, వ్యక్తీకరణ-సృజనాత్మకతలోని స్వీయరచన, సృజనాత్మకత ప్రశ్నలు, ప్రాజెక్టు పనులు వంటివి ప్రతిచర్యలకు (Interaction) అవకాశం కల్పించేలా ఉన్నాయి.

అర్థసంగ్రహణంలో తన మిత్రులతోను, ఉపాధ్యాయునితోను చర్చిస్తారు. వినడం-మాట్లాడడంలో మిత్రులతో జట్లుగా చర్చించే అవకాశం ఉంది. స్వీయరచనలో కూడా జట్లుగా ఏర్పడి సమాధానాలను కూర్చాల్సి ఉంటుంది. ప్రాజెక్ట్‌పనులలో కొన్ని సామూహిక కృత్యాలుగా ఉన్నాయి.

## ❧ తోటివారి ద్వారా, అదనపు సామాగ్రిద్వారా, సమాజసభ్యుల ద్వారా నేర్చుకోవడానికి వీలుండుట :

తోటి విద్యార్థులతో చర్చించిగాని, పాఠ్యపుస్తకేతర సామగ్రిని సంపాదించటం ద్వారాగాని, సమాజంలో ప్రముఖులను కలవడంద్వారాగాని, వివిధ సంస్థలతో సంపర్కం ఏర్పరుచుకొనిగాని విద్యార్థులు అదనపు జ్ఞానం పొందే అవకాశం ఉంటుంది. అందుకు అనుగుణమైన అభ్యాసాలున్నాయి. ప్రధానంగా ప్రాజెక్టు పనులు ఇందుకు ఉద్దేశించినవి.

**ఉన్నతవైఖరులు, మానవత్వపువిలువలు మానవ సంబంధాలు పెంపొందించడానికి ఉద్దేశించినవిగా ఉండడం :**

పిల్లల్లో ఉన్నత వైఖరులు, మానవత్వపు విలువలు, మానవ సంబంధాలు పెంపొందించడానికి పాఠాల్లో 'వ్యక్తీకరణ-సృజనాత్మకత'లో ప్రశంస పేరుతో అభ్యాసాలున్నాయి. పాఠ్యాంశాల ఎంపిక కూడా ఈ ఇతివృత్తాల నేపథ్యంలోనే జరిగింది. ఇందుకనుగుణంగా ప్రముఖ కవులు, రచయితలు రచించిన సాహిత్యం నుండి పాఠ్యాంశాలను ఎంపిక చేశారు. పాఠాల్లోని విషయాన్ని కూడా పిల్లల్ని ఆలోచింపజేసేలా, సమకాలిన అంశాలకు అన్వయించేలా పొందుపర్చారు.

పాఠకులకు ఉదా : ధన్యుడు, జానపదుని జాబు, గోరంతదీపాలు, నగరగీతం, శతకమధురిమ మొదలగు పాఠాలు ప్రథమ భాషలో ఉన్నాయి. భాగవతరత్నాలు, మనిషీ! మనిషీ, శతకమధురిమ పాఠాలు ద్వితీయభాషలో ఉన్నాయి.

**బహుముఖ విశ్లేషణ, విమర్శన సామర్థ్యాన్ని పెంపొందించేలా ఉండడం :**

విద్యార్థులు ఒక విషయం గూర్చి, సమస్యగూర్చి అనేక కోణాల్లో ఆలోచించడం, వాటిని విశ్లేషణ చేయడం లేదా విమర్శన చేయడం లేదా సమీక్ష చేయడం లాంటి సామర్థ్యాలు పెంపొందించడానికి అనువుగా అభ్యాసాలు ఉన్నాయి.

ఉదా : 20వ శతాబ్దాన్ని స్త్రీల శతాబ్దంగా గుర్తించవచ్చా? ఎందుకు? చర్చించండి. నగర జీవితం ఎందుకు సంక్లిష్టంగా మారింది? విచారించండి.

**సమకాలీన సామాజిక అంశాలపట్ల ఆసక్తి కలిగించడం :**

పిల్లలు వారి సమాజాన్ని, పరిసరాలను, పరిశీలిస్తూంటారు. ఆ పరిశీలనలతో వారి జ్ఞానాన్ని పెంచుకుంటూంటారు. అలా పెంచుకోవడంలో పాఠ్యపుస్తకం కూడా ప్రముఖ పాత్ర పోషించే విధంగా నూతన పాఠ్యపుస్తకాలున్నాయి. వారికి సమకాలీన సామాజిక అంశాలపట్ల ఆసక్తిని రేకెత్తించే రకంగా ఉన్నాయి.

ఉదా : నగరగీతం, మా ప్రయత్నం పాఠాలు

## ఆ. 10వ తరగతి పూర్తయ్యేసరికి విద్యార్థి సాధించాల్సిన సామర్థ్యాలు

ఈ వివరాలను పాఠ్యపుస్తకం ప్రారంభంలోనే పొందుపరచారు. దీనివల్ల ఉపాధ్యాయులతోపాటు, తల్లిదండ్రులకు కూడా అవగాహన ఏర్పడుతుంది. ఇది ఒక చెక్‌లిస్టులా ఉపయోగపడుతుంది.

### I. అవగాహన - ప్రతిస్పందన

ఇందులో వినడం - మాట్లాడడం, ధారాళంగా చదివి అర్థం చేసుకొని వ్యక్తీకరించడం అనే సామర్థ్యాలుంటాయి. వీటిలో పిల్లలు కింది అంశాలను చేయగలగాలి.

## II. వ్యక్తీకరణ సృజనాత్మకత

ఇందులో స్వీయరచన, సృజనాత్మకత, ప్రశంస అనే సామర్థ్యాలుంటాయి. వీటిలో పిల్లలు ఈ కిందివి చేయగలగాలి.

## III. భాషాంశాలు

ఇందులో పదజాలం, వ్యాకరణాంశాలు కింది తరగతుల్లో నేర్చుకున్న అంశాలతోపాటు ఈ కిందివి చేయగలగాలి.

## IV. ప్రాజెక్టుపనులు

- వివిధ సామర్థ్యాల సమాహారమిది. కథలు, కవితలు, ప్రసిద్ధుల వివరాలు, జీవన విధానాలు, సమీక్షలు, అభిప్రాయాలు సేకరించగలగాలి. నివేదికలు రాయగలగాలి. పట్టిక రూపంలో పొందుపరచి ప్రదర్శింపగలగాలి.

## ఇ. పిల్లలకు సూచనలు

పాఠ్యపుస్తకం గురించి పిల్లలందరూ అవగాహన చేసుకొని, సమర్థంగా వినియోగించడం కోసం పాఠ్యపుస్తకం కవర్‌పేజీలోపలివైపున పిల్లలకు సూచనలు చేర్చారు.

### పాఠ్యపుస్తకంలో ఎందుకు చేర్చారు?

విద్యార్థి కేంద్రీకృత బోధనకు అనువైన పాఠ్యపుస్తకమిది. ఈ పాఠ్య పుస్తకంలో కవర్‌పేజీ వెనుకవైపుననే 'విద్యార్థులకు సూచనలు' పేరిట విద్యార్థుల కోసం కొన్ని సూచనలివ్వబడ్డాయి. ఈ సూచనలు చదివితే పాఠ్యపుస్తకం యొక్క స్వరూప స్వభావాలు సులువుగా అర్థమవుతాయి. విద్యార్థులు విద్యా సంవత్సరం మొత్తంలో ఏం చేయాలి? ఎలా చదవాలి? పాఠ్యపుస్తకాన్ని ఎలా వినియోగించుకోవాలి? అనే ప్రశ్నలకు సమాధానం విద్యార్థులకు సూచనలు అందిస్తుంది.

### ఈ సూచనలు ఏం తెలుపుతున్నాయి?

పాఠ్యపుస్తక నిర్మాణక్రమం, పాఠాల అమరిక, పాఠ్య నిర్మాణ క్రమం తెలుస్తుంది. పాఠాల విభజన ఎలా ఉంది, పాఠం మధ్యలో ప్రశ్నలెందుకున్నాయి. ఉపాధ్యాయులను ఏ ప్రశ్నలు ఎలా అడగాలో పేర్కొనబడింది. విద్యార్థులు సమాధానాలు రాయడానికి సూచనలున్నాయి. ప్రశ్నలకు సమాధానం ఆలోచించి రాయాలని, ఉపాధ్యాయునితో చర్చించాలని సూచించబడింది. విద్యార్థులు సొంతంగా రాయడం అలవాటైతేనే బోర్డు పరీక్షల్లో తేలికగా రాయగల్గుతారు. విద్యార్థులకు సరైన మార్గనిర్దేశం జరిగినప్పుడే వారు బోధనాభ్యసన ప్రక్రియల్లో చురుగ్గా పాల్గొంటారు. అర్థంకాని విషయాల్ని ఉపాధ్యాయులతో చర్చించి సందేహనివృత్తి చేసుకుంనేటే భాషా సామర్థ్యాలు పెంపొందుతాయి.

### ఉపాధ్యాయులేం చేయాలి?

తప్పని సరిగా విద్యార్థుల చేత **"విద్యార్థులకు సూచనలు"** శీర్షిక కింద ఇచ్చిన అంశాలను చదివించాలి. అర్థం చేసుకునేలా సహకరించాలి. విద్యార్థులు స్వేచ్ఛగా ప్రశ్నించేందుకు అవకాశమివ్వాలి. విసుక్కోకుండా, నిరుత్సాహ పర్చకుండా సమాధానం చెప్పాలి. ఇదంతా జరగాలంటే ముందు ఉపాధ్యాయులు **"విద్యార్థులకిచ్చిన సూచన"**లను బాగా ఆకళింపు చేసుకోవాలి.

# ఈ. ఉపాధ్యాయులకు సూచనలు

## అవశ్యకత

నూతనంగా రూపొందించిన పాఠ్యపుస్తకంలో సమర్థంగా బోధించడానికి ఉపాధ్యాయులకు సూచనలు ఉన్నాయి. వీటిని ప్రతి ఉపాధ్యాయుడు తప్పనిసరిగా చదవాలి. పాఠ్యబోధన మొదలుకొని వార్షిక ప్రణాళిక తయారీవరకు ఎలా నిర్వహించాలో స్పష్టంగా వివరించారు. విద్యా సంవత్సరమంతా పాఠ్యపుస్తకాన్ని ఎలా వినియోగించుకోవాలో తెలియజేశారు. వాచక బోధనకు అవసరమైన మెళకువలను ఉపాధ్యాయులకు సూచనల్లో పొందుపర్చారు.

## ప్రస్తావించిన అంశాలు

వాచక బోధనకు అవసరమయ్యే కాలాంశాలు, పాఠ్యబోధనకు అవసరమయ్యే కాలాంశాల విభజన స్పష్టంగా పేర్కొన్నారు. సామర్థ్యాల సాధనలో ఏ సామర్థ్యానికి ఎన్ని పీరియడ్లు నిర్వహించాలో సూచించారు. ఉపాధ్యాయుడు పిల్లలతో చర్చించాల్సిన అంశాలను, బోధనకు అవసరమైన బోధనా పద్ధతులను కూడా సూచించారు. అభ్యాసాల్లో ఆయా సామర్థ్యాలను సాధించడానికి అవసరమైన సూచనలున్నాయి. సామర్థ్యాల సాధనలో ఉపాధ్యాయుడు విద్యార్థికి ఎలా సహకరించాలి, ఎలా అవగాహన కల్గించాలో స్పష్టంగా పేర్కొన్నారు. వార్షిక ప్రణాళిక, పాఠ్య ప్రణాళిక తయారుచేసుకోవడానికి ఏ ఏ అంశాలుండాలో పట్టిక ద్వారా తెలియజేశారు. పాఠ్య బోధన సోపాన క్రమంలో బోధించేలా పాఠం రూపొందించినప్పటికీ ఉపాధ్యాయులకు సూచనల్లో మరిన్ని వివరాలు ఉన్నాయి.

బోధించడమంటే విషయం వివరించడం కాదనీ, విషయంలోని విలువలను, కవి హృదయాన్ని పిల్లలు అర్థం చేసుకునేలా ఉపాధ్యాయులు శ్రద్ధ వహించడం, చర్చించడం, పిల్లలచేత చెప్పించడం, బహుకోణాల్లో విశ్లేషించడం జరిగినప్పుడే బోధన సమర్థంగా జరుగుతుందని తెలియజేశారు. ప్రాజెక్టుపనుల నిర్వహణకు ఉపాధ్యాయుని మార్గదర్శకత్వం తప్పనిసరి అనీ తెలిపారు. ప్రధానంగా స్వీయరచన సాధనలో విద్యార్థులు గైళ్ళు, సమాచార సంకలనాలు వాడకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయునిదే. విద్యార్థులు సొంతంగా రాయడానికి ఉపాధ్యాయుడు సహకరించాలి. బోధనాభ్యసనంలో ఉపాధ్యాయుని పాత్ర కీలకమైనదని గుర్తించినప్పుడే ఆశించిన సామర్థ్యాలు సాధించబడతాయని గుర్తించాలి.

## ఉపాధ్యాయులేం చేయాలి?

ప్రతి ఉపాధ్యాయుడు ముందుగా తప్పని సరిగా **'ఉపాధ్యాయులకు సూచనలు'** చదవాలి. అర్థం చేసుకోవాలి. కాలాంశ విభజనపట్ల అవగాహనకు వచ్చి ప్రణాళిక వేసుకోవాలి. పాఠం విభజించినట్లుగా బోధిస్తూ పాఠం మధ్యలో ప్రశ్నలడగాలి. పాఠం మధ్యలో అడిగే ప్రశ్నలు కూడా పాఠ్యపుస్తకంలో పొందుపర్చబడ్డాయి. వీటికి మరిన్ని ప్రశ్నలు జోడించి అడగాలి. విద్యార్థి ఆలోచనాశక్తిని పెంచేందుకే ఈ ప్రశ్నలున్నాయని గ్రహించాలి. ఆయా అభ్యాసాలకు కేటాయించిన కాలాంశం ఆధారంగా ప్రశ్నల్ని సాధింపజేయాలి. విద్యార్థులు సొంతంగా జవాబులు రాసేలా ప్రోత్సహించాలి. సహకరించాలేతప్ప నేరుగా సమాధానాలు రాయించరాదు. పాఠ్యపుస్తకంలో ఉన్నట్లుగా ప్రశ్నలు నేరుగా పబ్లిక్ పరీక్షల్లో రావు. పాఠ్యపుస్తకంలోని ప్రశ్నల స్వభావమున్న ప్రశ్నలు వస్తాయని గ్రహించాలి. కాబట్టి విద్యార్థులను ప్రశ్నలకు సొంతంగా జవాబులు రాసేలా ప్రోత్సహిస్తేనే వారు ఏ ప్రశ్నలడిగినా జవాబులు రాసేలా సిద్ధమవుతారు. పాఠ్యపుస్తకాన్ని పూర్తిగా వినియోగిస్తూ, విద్యార్థుల లేఖనాంశాలను జాగ్రత్తగా సరిదిద్దడం ద్వారా (ఎడిటింగ్) వారిలో లేఖన సామర్థ్యం పెంచాలి. అప్పుడే విద్యార్థులు స్వీయరచన సమర్థంగా చేయగల్గుతారు.

# ఉ. పాఠాలు - ఇతివృత్తాలు

'విద్యార్థి సర్వాంగీణ వికాసంవిద్యా లక్ష్యం' కదా! తెలుగు పాఠ్యపుస్తకం భాషా సామర్థ్యాలతోపాటు విద్యార్థి వికాసం పట్ల కూడా ప్రత్యేక దృష్టి నుంచింది. 10వ తరగతి ప్రథమ, ద్వితీయ భాషా వాచకాలను పరిశీలిస్తే మొత్తంగా 16 ఇతివృత్తాలు కనిపిస్తాయి. ఈ ఇతివృత్తాల ఎంపిక నేపథ్యం, ఆవశ్యకత, ప్రాధాన్యత గురించి తెలుసుకుందాం.

## 1. ప్రకృతి వర్ణన :

ప్రథమభాషా వాచకంలో మొదటి పాఠం 'వెన్నెల'ను ఈ ఇతివృత్తం ఆధారంగా ఎంపికచేశారు. వర్ణించడం కవిత్వంలో ప్రధానాంశమని అలంకారికులు పేర్కొన్నారు. (లోకోత్తర వర్ణనా నిపుణ కవికర్మ కావ్యమ్) సాహితీ జగత్తులో వర్ణనకు ప్రాధాన్యం ఎక్కువ. పిల్లల్లోని సృజనను, భావుకతను ఇది వెలికి తీస్తుంది. హృదయాన్ని సున్నితంగా మారుస్తుంది. భాషను ఉపయోగించే శక్తికి పదును పెడుతుంది. పరిశీలనా దృష్టిని సునిశితం చేస్తుంది. 'వెన్నెల' అందరినీ ఆకర్షించే ప్రకృతి వరం. పిల్లలు బహుకోణాల్లో ఆలోచించడానికి, అనుభూతిని వ్యక్తం చేయడానికి ఇది అవకాశం కల్పిస్తుంది. ప్రాచీన కాలంలో ప్రకృతిని ఏ ఏ వస్తువులతో పోల్చారో, ప్రస్తుతం వర్ణనాంశాలకు ఏ ఏ ఉపమానాలను ఎట్లా వినియోగించుకోవచ్చుననే ఆలోచన పెరిగే అవకాశమున్నది.

## 2. విలువలు :

ఆధునిక సమాజంలో విలువలు అడుగంటుతున్నాయన్న భావన సర్వత్రా కనిపిస్తున్నది. జీవన విలువలు, నైతిక విలువలు అని వీటిని స్థూలంగా రెండు భాగాలుగా విభజించవచ్చు. నీతిబోధ అనేది మొదటి నుండి భాషాబోధనలో ఒక ప్రధానాంశం. దీనికి అదనంగా జీవన గమనంలో అనుసరించవలసిన మానవీయ పద్ధతులలో కొన్ని అంశాలనెన్నుకొని పాఠాల్లో చేర్చడం జరిగింది. 10వ తరగతి వాచకాల్లో...

ప్రథమ భాషలో... ధన్యుడు (2), శతక మాధురి (6) రెండు పాఠాలు ప్రత్యేకంగా ఈ ఇతివృత్తాన్ని నేపథ్యంగా గల్గిఉన్నాయి.

> భారతరాజ్యాంగాన్ననుసరించి లౌకిక మానవతా విలువలను విద్యావిధానంలో చేర్చవలసిన అవసరం ఉన్నది.

**'ధన్యుడు'** పాఠంలో :- 'హిరణ్యకుని పూర్వవృత్తాంతం నేపథ్యంగా మానవుడు మసలుకోవలసిన తీరు తెన్నులు, పాటించవలసిన నీతి, నియమాల గురించి వివరించడం జరిగింది. సజ్జనుల వ్యవహారశైలి, ధనలోభం వల్ల కలిగే అనర్థాలు తెలుసుకోవడం, విజ్ఞత ప్రదర్శించడం మొదలగు అంశాలు విద్యార్థి మూర్తిమత్వాన్ని తీర్చిదిద్దుతాయి.

**'శతకమధురిమ'** పాఠం :- శతక పద్యాల ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడం లక్ష్యంగా నిర్దేశించిన పాఠమిది. ప్రతి తరగతిలోనూ సంప్రదాయంగా వస్తున్న పాఠం. శతకాలలోని నీతులను జీవితానికి అన్వయించుకొని జీవితాన్ని మెరుగుపరచుకోవడానికి ఉద్దేశించింది.

ద్వితీయ భాషలో - భాగవతరత్నాలు (1), శతక మాధురి (9) పాఠాలు ఈ ఇతివృత్తం ఆధారంగా నిర్దేశించిన పాఠాలు.

**'భాగవతరత్నాలు'** :– సరళ సుందరమైన శైలిలో సాగే భాగవత పద్యాల నుండి అలవోకగా విద్యార్థులు సూక్తులను గ్రహించగలరు. చిన్న చిన్న పద్యాల నుండి నైతిక విలువలకు సంబంధించిన పద్యాలు (6) ఇవ్వడం జరిగింది. చదువుకోవడం, పరోపకారం, సత్యవాక్కు, అతిథులను గౌరవించడం – తదితర విలువలు ఈ పాఠంలో ఉన్నాయి.

**'శతక మాధురి'** :– వివిధ శతకాల ఉండి సేకరించిన 6 పద్యాలున్నాయి. ఇవి ప్రవర్తనను, ధర్మాన్ని, స్థిత ప్రజ్ఞతను – మేల్కొలుపుతాయి.

## 3. స్త్రీలపట్ల గౌరవం :

ఆధునిక సమాజంలో స్త్రీలకు గల స్థానాన్ని గుర్తించాలని, పురుషులతో సమానంగా గౌరవించాలని, స్త్రీ శక్తిని గుర్తించాలనీ ఈ అంశం నేపథ్యంగా పాఠాల ఎంపిక చేయడం జరిగింది.

**'మాతృభావన (3)'** :– ఇతర మతస్థులైనా స్త్రీలను గౌరవించు మన సంస్కృతిని గూర్చి చెబుతూ, భారతీయ జీవన విధానం స్త్రీలను గౌరవించడమేగాక, పరమత సహనాన్ని కూడా పాటిస్తుందని ఈ పాఠం నేర్పుతుంది. విద్యార్థుల్లో సౌజన్యాన్ని, సామరస్య భావాన్ని పెంపొందించడం ఈ పాఠం ఉద్దేశం.

## 4. శ్రమ గౌరవం :

శ్రమించి సంపాదించడం తను చేయుపనిలో ఆనందాన్ని అనుభవించడం ఆర్జిత (సంపాదిత) ఫలంద్వారా అనిర్వచనీయ ఆనందం కలగడం. ఈ విషయంలో గ్రామస్థులు వారి వారి వ్యవసాయాది వృత్తులను ఎలా గౌరవిస్తారో ప్రథమభాషలో "జానపదునిజాబు" పాఠంలో తెలుపడం జరిగింది.

ఈ పాఠంలో జానపదుడు బీదతనం నుండీ తన చదువు సాగించలేక తన గ్రామానికి వెళ్ళిపని చేస్తూంటాడు. అక్కడా శ్రమించి సంపాదించిన సొమ్ములో ఎంత పవిత్రత, అనిర్వచనీయ ఆనందము సుఖం ఉందో తెలుపుతుంది.

ఉదా॥ లేఖ ద్వారా తన మిత్రునికి తెలుపుతాడు.

"జానపదుని జాబు" పాఠం చదివిన విద్యార్థిలో కష్టించి పనిచేయడం, చేసే పనిని గౌరవించి అభిమానించడం వృథా ఖర్చులను మానుకోవడం, తమ ధర్మాలను, బాధ్యతల్ని గుర్తించడం అనేవి ముఖ్యమైనవి.

## 5. స్ఫూర్తి :

చరిత్రతోపాటు సమకాలీన సమాజంలో కూడా అనేకమంది స్ఫూర్తి ప్రదాతలుంటారు. వారి వ్యక్తిత్వాతల నుండి స్ఫూర్తి పొంది విద్యార్థులూ మహోన్నత వ్యక్తులుగా ఎదగాలనే ఆశయంతో పాఠాలు ఎంపిక చేశారు.

ప్రథమభాష వాచకంలో 6వ పాఠమైన "నేనెరిగిన బూర్గుల" అనే పాఠం ద్వారా మరియు ఆ పాఠ్యభాగ రచయిత పి.వి.నరసింహారావుగారి వ్యక్తిత్వం ద్వారా కూడా విద్యార్థి 'స్ఫూర్తి' పొందాలి. బహుభాషా ప్రావీణ్యం పొందడం, సునిశితమైన పరిశీలన ఆకళింపు చేసుకొనుట, చతురత, ఉదారతలు కలిగి ఉండుట, పరోపకారం చేయుట, కష్టపడుట మొదలైన అనేక విషయాల్లో విద్యార్థులు స్ఫూర్తి పొంది ప్రభావితులు కావాలని ఈ పాఠం ఉద్దేశం.

## 6. సామాజిక స్పృహ :

మానవుడు సంఘజీవి. ఒంటరిగా జీవించలేడు. తన చుట్టూ ఉన్న మానవ సమాజంతో నిరంతర సంబంధాల్ని కలిగి ఉంటాడు. కలిగి ఉండాలి. అలా తన జీవితం సమాజంతో మమేకమై సాగాలి. అటువంటి సమాజం పట్ల తాను బాధ్యత తీసుకోవాలి. సమాజాన్ని పరిశీలించాలి. అవసరాల్ని గుర్తించాలి. తన కర్తవ్యాన్ని ఆలోచించాలి. తగిన కార్యాన్ని నిర్వహించాలి. ఈ స్పృహ విద్యార్థుల్లో పాదుకొల్పుట ఉద్దేశ్యంగా "సామాజిక స్పృహ" ఇతివృత్తంగా పాఠాలను రూపొందించడం జరిగింది.

ఇందుకనుగుణంగా ప్రథమ భాష పాఠ్యపుస్తకంలో 'నగరగీతం' (07వ పాఠం) మాణిక్యవీణ (11వ పాఠం) పాఠాలు రూపొందించబడినవి. అట్లే ద్వితీయభాషలో మనీషీ! మనీషి! పాఠాన్ని చేర్చారు.

**నగరగీతం** : ఈ పాఠంలో పల్లెల నుండి వలసలువచ్చి నగరాల్లో పడుతున్న బాధలు, నగర జీవితాలు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది. పల్లె ప్రజలపట్ల నగరవాసుల బాధ్యతలు, నగరవాసులు యాంత్రికతకు కాకుండా మానవతతో ఆలోచించి తమ బాధ్యతను గుర్తెరుగుట, విద్యార్థిలో తదనుగుణ ఆలోచన రేకెత్తించుట ఈ పాఠం ఉద్దేశ్యం.

## 8. హాస్యం :

మనిషి మానసికోల్లాసానికి లలిత కళలు ఎంతగానో తోడ్పడుతున్నాయి. అందు కవిత్వంలో రసాస్వాదన ప్రధాన అంశం. ప్రాపంచిక, వైయక్తిక చింత నుండి వ్యక్తిని విముక్తుణ్ణిచేసి ఆనంద పారవశ్య డోలికల్లో లాలించునది హాస్యం. విద్యార్థి అటువంటి అనుభూతిని పొందుటకు 10వ తరగతి తెలుగు ప్రథమ, ద్వితీయ భాష పాఠ్యపుస్తకాల్లో పాఠాలకు స్థానం కల్పించారు. ప్రథమభాష పాఠ్యగ్రంథంలోని 'యక్షుడి అప్పు' (8వ పాఠం) ద్వితీయ భాషలోని పిసినారి (6వ పాఠం) దీనికి సంబంధించినవి.

**యక్షుడి అప్పు** : కేశవదాసు పాత్రద్వారా ఆరోగ్యయుతమైన, ఆనందాయకమైన హాస్యం పండింది. విద్యార్థి హాస్యరసంపట్ల ప్రభావితుడై తాను కూడా స్వయంగా హాస్యాన్ని పండించగల సన్నివేశాల్ని సృష్టిచేయగలడని ఈ పాఠం ఆశిస్తుంది.

**పిసినారి** : లింగరాజు పాత్ర పిసినారి గుణంతో హాస్యాన్ని పండించింది. విద్యార్థి హాస్యరసాన్ని మనసారా ఆస్వాదిస్తాడు. అటువంటి సన్నివేశాలు సృష్టించి కథలూ చెప్పగలడు.

## 9. సంస్కృతి - కళలు :

సంస్కారయుతములైన ఆచార వ్యవహారాలే సంస్కృతి. సంస్కృతిలోని అనేక అంశాలు ఆ సమాజ సంస్కారం, కుటుంబ సంస్కారాలకు అద్దంపడుతాయి. సంస్కృతి, సంబంధ కార్యకలాపాలు విశ్వమానవ కల్యాణానికి బాటలు వేస్తాయి. మనుషుల మధ్య ఆత్మీయత, అనురాగాలను పెంపొందిస్తాయి. మానవాళి ఏకాత్మను చాటుతాయి.

కళలు మానసిక ఆనందాన్ని ఇనుమడింపజేస్తాయి. మొదడును చైతన్యవంతం చేస్తాయి. బలాన్నిస్తాయి. ఆలోచింపజేస్తాయి. సృజనాత్మకవికాసానికి తలుపులు తెరుస్తాయి. ఆ విధమైన వికాసాన్ని, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను విద్యార్థికి అందించి అతనిలో మన పరంపరానుగతమైన సంస్కృతి, కళలపట్ల ఆసక్తిని, అభిమానాన్ని కలిగించుటకు 10వ తరగతి ప్రథమ, ద్వితీయ భాష పాఠ్యపుస్తకాల్లో అవకాశం కల్పించారు

ప్రథమ భాష పుస్తకంలోని "బసవేశ్వర పరిణయం" (11వ పాఠం), ద్వితీయ భాషలోని "జానపద నృత్య సంగీతాలు" (8) పాఠాలు అట్టి అవకాశాన్ని కల్పిస్తున్నాయి. కల్యాణం (5వ పాఠం) కూడా ఈ అంశానికి చెందిన పాఠమే.

**బసవేశ్వర పరిణయం** : వివాహ సంస్కారం – వ్యక్తుల మధ్యనేగాక తరాల మధ్య కూడా విడదీయలేని ఆత్మీయ సంబంధాన్ని పెంపొందిస్తుంది. గౌరవాదరాభిమానములను ఎంతగానో పెంచుతుంది. వంశోన్నతిగావిస్తుంది. పవిత్రతను చాటుతుంది. వివాహంలో వివిధ కళా, ప్రదర్శనలు ఆనందోత్సాహాలిస్తాయి. ఆయా కళాకారుల కళాకౌశల ప్రదర్శనకు, పోషణకు ఉచితస్థానం కల్పించబడుతుంది. విద్యార్థి వీటన్నిటిని ఆకళింపు చేసుకోవడం ద్వారా సంస్కృతి ఔన్నత్యాన్ని గ్రహించగల్గుతాడు. సంస్కృతీ ఆధారంగా కళాపోషణ చేయగల్గుతాడు. ఆరోగ్య ఆనందదాయకమూ, శాస్త్రీయతలను గుర్తించగల్గుతారు. ఆకర్షితుడవుతాడు. పాఠం ఆధారంగా అక్కడివరకే పరిమితంకాకుండా వివిధ సంస్కృతీ వైవిధ్యాలను తెలుసుకొంటాడు. అందుకు పాఠం సహాయకారిగా నిలుస్తుంది.

**జానపద నృత్య సంగీతాలు** : జానపదుల జీవితాల్లో సారస్వత, నృత్య, సంగీతాది కళలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. నిశిత పరిశీలన ద్వారా ఈ విషయం ద్యోతకమౌతుంది. అంతరించిపోతూన్న ప్రాచీన కళల పరిరక్షణ విద్యార్థి బాధ్యతగా కృషిచేయడం ఈ పాఠం ద్వారా సాధించబడుతుంది. తాను స్వయంగా ఏదో ఒక కళను ఎన్నుకొని దాన్ని అభ్యసించి ఉన్నతికి దోహదం చేయడం ఈ పాఠం ద్వారా ఆశించారు.

## 10. స్త్రీ సాధికారత :

"యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్రదేవతా" స్త్రీకి ప్రథమస్థానం కల్పించి గౌరవించడం భారతీయ సంస్కృతి. "మాతృదేవోభవ" అని ఉపనిషద్వాక్యం, దేశౌన్నత్యమును ఇనుమడింపజేసి, ఏక సూత్రతపై నడిపించుటలో మూల (మౌలిక) వ్యవస్థ కుటుంబం. ఆ కుటుంబాన్ని సంస్కరించి సరియైన దిశగా పయనింపజేయుటలో ప్రధానపాత్ర స్త్రీది. అనగా ఇల్లాలిది. అయితే ఆధునిక కాలంలో స్త్రీ బాధ్యత మరికొంత పెరిగింది. సమాజం గూర్చి కూడా ఆలోచించగలిగే స్థితికి చేరింది. స్త్రీ పురుషులిరువురూ సమాన బాధ్యతలు స్వీకరించి కుటుంబాన్ని, సమాజాన్ని సమ్యగ్దిశలో నడిపించవలసిన అవసరం ఏర్పడింది. అయితే అనాదిగా స్త్రీ కుటుంబానికే పరిమితమైనందున, ఇప్పుడిప్పుడే బయటి ప్రపంచ బాధ్యతల్లో భాగస్వామి అవుతున్నందున కొన్ని కష్టాలు కలుగుట సహజం. అలా కష్టపడుతూనే స్త్రీ జనోద్ధరణ, సాధికారత కొరకై ఉద్యమించిన నారీమణులూ ఎందరో ఉన్నారు.

వారిని గూర్చి, స్త్రీ సాధికారత ఆవశ్యకతను తెలియజేసే ఉద్దేశ్యంతో పాఠ్యాంశాల్లో చేర్చడం జరిగింది. ప్రథమ భాష పాఠ్య పుస్తకంలో 'మాప్రయత్నం' పాఠం ఆధారంగా స్త్రీల సమస్యలు, పరిష్కారానికి కృషిచేసిన స్త్రీల వివరాలు తెలిపే గ్రంథం గురించి విద్యార్థుల దృష్టికి తేవడం జరిగింది.

**మా ప్రయత్నం :** ప్రథమ భాష – 'మహిళావరణం' అనే గ్రంథానికి ఓల్గా, వసంతకన్నబిరాన్, కల్పన కన్నబిరాన్ గార్లు రచించిన పీఠిక ఇది. దీని ద్వారా స్త్రీలలో వివిధ రంగాలకు చెందిన అనేక మందిని గూర్చి తెలుసుకొంటాడు. స్త్రీలు గూర్చి ఆలోచించు అవకాశం ఈ పాఠం కల్పిస్తుంది. వాళ్ళు ఎదుర్కొంటున్న సమస్యలనూ అవగాహన కల్పిస్తుంది. తద్వారా విద్యార్థుల్లో అభ్యుదయ భావాలు కలుగుటకు ఈ పాఠం ఉపయుక్తంగా ఉంటుంది.

## 11. మానవ సంబంధాలు – సామాజిక సేవ :

"మానవ సేవయే మాధవ సేవ" అని స్వామి వివేకానందగారు పేర్కొన్నారు. "మానవసేవగా సర్వప్రాణి సేవ" గా త్రిదండి రామానుజ చిన్న జీయరుస్వామి వారు అన్నారు. ఈ సృష్టిలోని 84 లక్షల జీవరాసుల్లో సర్వ శ్రేష్ఠమైన జీవి మనిషి. ఏ జీవికీలేని బుద్ధి, విచక్షణ జ్ఞానం మనిషికే ఉంది. కాబట్టి మానవుని ధర్మాలు. సక్రమంగా నిర్వహిస్తే విశ్వకల్యాణమే జరుగుతుంది. తోటి మనిషిపట్ల తన దృష్టి, సానుభూతి, ప్రేమల్ని పంచి పరస్పర సహకారాన్ని కలిగి ఉండుట, దీనులు, దుఃఖితులు, పీడితులు మొదలగువారి పట్ల సేవాభావంతో బాధ్యతలు నిర్వహించడం సమాజానికి ఎక్కడ, ఏ విషయంలో, ఎప్పుడు అవసరం పడినా తాను ముందుండే విధంగా విద్యార్థిలో సేవాదృక్పథాన్ని కలిగించుటకు పాఠాలను రూపొందించుట జరిగింది. "గోరంత దీపాలు" అనే ప్రథమ భాషలోని 12వ పాఠం ఈ దృక్పథాన్ని విద్యార్థుల్లో నింపుతుంది. వృద్ధుని పాత్ర ద్వారా విద్యార్థి సమాజం పట్ల తన బాధ్యతను గూర్చి ఆలోచించగలడు.

## 12. మానవ స్వభావం :

మానవ స్వభావం చాలా చిత్రమైంది. 'జిహ్వకోరుచి, పుఱ్ఱెకోబుద్ధి' అని సామెత. జీవలక్షణాన్ని బట్టి, పరిస్థితులను బట్టి మానవుల్లో స్వభావ వైవిధ్యం కనిపిస్తుంది. కొందరు గొప్పవాళ్ళు కూడా కొన్ని పరిస్థితుల్లో పతనమైన సందర్భాలను చరిత్ర చెపుతున్నది. అలాగే మాట తీరులో కూడా భిన్న స్వభావాలు సమాజంలో కనిపిస్తాయి. సూటిగా మాట్లాడేవారు, చాటుగా మాట్లాడేవారు, ఘాటుగా మాట్లాడేవారు. ఇలా ఎందరెందరినో చూస్తూంటాం. ఇందులో కూడా వ్యంగ్యంగా మాట్లాడడం ఒకకళ. నూతన స్వభావం త్రికరణాలూ (మనస్సు, వాక్కు, కర్మ) దర్శింపవచ్చు. దీన్ని తెలిపే ఉద్దేశ్యంతో ప్రథమ భాష పాఠ్యాంశంగా "భిక్ష" పాఠాన్ని, ద్వితీయభాష పాఠ్యాంశంగా "సంజయరాయబారం" పాఠ్యాంశాలను చేర్చడం జరిగింది.

**'భిక్ష'** : పాఠ్యభాగంలో వేదవ్యాసుడంతటి వాడు ఆకలిబాధకు లోబడి కాశీనగరాన్ని శపించబూనినాడు. తర్వాత కాశీపట్టణాన్ని విడిచి వెళ్ళవలసి వచ్చింది.

**'సంజయరాయబారం'** : పాఠ్యాంశంలో మానధనుడైన దుర్యోధనుడు ఎటువంటి స్థితికి వెళ్ళాడో ధృతరాష్ట్రుడు, సంజయ, ధర్మరాజు పాత్రల ద్వారా మానవ ధర్మాలు, స్వభావాలు చక్కగా వర్ణించబడినాయి.

ఈ పాఠములాధారంగా విద్యార్థి మానవ స్వభావాలను తెలుసుకొని మంచి స్వభావాన్ని పెంపొందించుకొంటాడు. అందుకు ఈ పాఠాలు సహకరిస్తాయి.

## 13. శాస్త్రీయ పరిశీలన :

మన మనచుట్టూ ఉండే పరిసరాలను ఉపయోగించుకొని వదిలివేయడమేగాక సునిశితమైన పరిశీలన చేయడం ఎంతేని ఆవశ్యకం. ఈ మధ్య ఏదో తెలుగు సినిమాలో ఏమిటి? ఎందుకు? ఎలా? అని సరదాకు, హాస్యానికే ప్రాధాన్యతనిచ్చిపెట్టినా నిత్య జీవితంలో అవి అవసరం. విద్యార్థి చెట్టు, పుట్ట, ప్రాణి అన్నింటినీ పరిశీలించాలి. పరిశీలన శాస్త్రదృష్టితో జరగాలి. తద్వారా విద్యార్థి మేథస్సు వికాసం చెందాలి. వికసించిన విద్యార్థి మేథోసంపద భావితరాలకు స్ఫూర్తినీ, ప్రేరణనివ్వాలి. ఈ దృష్టిని విద్యార్థిలో కలిగించుటకు ప్రథమభాష తెలుగు పుస్తకంలో 'చిత్రగ్రీవం' అనే పాఠ్యాంశానికి స్థానం దక్కింది.

చిత్రగ్రీవం అనే పక్షి దాని తల్లి దండ్రుల పెంపకం శిక్షణ మొదలగు అనేక విషయాల ద్వారా విద్యార్థి ఎదుగుదలకు అవసరమైన శిక్షణగా ఈ పాఠం ఉపకరిస్తుంది. పక్షులను పాత్రలుగా చేసినా మానవ ధర్మాలు, శిక్షణ, శాస్త్రీయత విషయాల్లో విద్యార్థిని ఆలోచింపజేస్తుంది. విద్యార్థిలో పరిశీలనాశక్తి పెరుగుతుంది.

## 14. జీవకారుణ్యం :

'ఈశ్వర స్సర్వభూతానాం' అన్ని జీవుల్లో భగవద్దర్శనం చేసుకోవడం భారతీయ సంస్కృతి. "ఆత్మవత్సర్వభూతేషు" అన్ని ప్రాణులూ తన వంటివే అనే పవిత్ర భావం కలిగి ఉండడం భారతీయ సంస్కృతి. చెట్టు, పుట్ట పాము, పక్షీ, పశువూ అన్నింటిలో దైవాన్ని చూడమన్నది అన్నింటినీ ఆదరించమన్నది. మన శరీరం, ప్రాణానికి ఎంత ప్రాధాన్యతనిస్తామో అదే ప్రాధాన్యతను అన్ని జీవుల పట్ల చూపాలన్నది. ఈ లక్షణాన్ని విద్యార్థిలో పాదుకొల్పుటకు ద్వితీయ భాష పుస్తకంలోని "మాట్లాగేనాగలి" పేరుతో 10వ పాఠంగా పాఠ్యాంశం చేర్చడం జరిగింది.

"మాట్లాడేనాగలి" పాఠంలో (ఎద్దు) కన్నన్ దాని యజమాని ఓసెఫ్‌ల గూర్చిన ఇతివృత్తం విద్యార్థుల్లో జీవులపట్ల కరుణ, జాలి పెంచుతుంది. సానుభూతికల్గిస్తుంది. జీవులకూ మనస్సుంటుంది. బాధలుంటాయి. అనే విషయాల్లో విద్యార్థి ఆలోచనలు సాగుతాయి.

## 15. ప్రేరణ :

'ఏ పుట్టలో ఏ శేషుడున్నాడో" ఇది సామెత నిత్యజీవితంలో తారసపడే అనేక మందిలో ఎవరితో మాట్లాడితే, కలిసినడిస్తే, ఏం ప్రేరణ లభిస్తుందో, ఏ స్నేహితుల సలహావల్ల ఏ మార్పు సంభవిస్తుందో తెలియదు గదా! ఎవరి ప్రేరణ జీవితంపై ప్రభావం చూపుతుందో. కాబట్టి విద్యార్థి సంఘంలోని సమకాలీన వ్యక్తులు, చారిత్రక మహా పురుషుల ద్వారా ప్రేరణపొంది ఉన్నత శిఖరాలు చేరాలనే ఉద్దేశ్యంతో ద్వితీయ భాష తెలుగు పుస్తకంలో "మొద్దబ్బాయిలూ మహామేధావులే" అనే పాఠ్యాంశం చేర్చడం జరిగింది. సంస్కృతం నేర్చుకోలేని రామాచార్లు మరో విధంగా కృషిచేసి ఉన్నత స్థానంలో

నిలుస్తాడు. ఈ పాత్రవల్ల విద్యార్థి తనకు ఇష్టమైన, ఆసక్తికల్గిన అంశాన్ని ఎన్నుకొని అందులో ఉన్నతి సాధించే విధంగా ఈ పాఠం ప్రేరణ నిస్తుంది.

**16. చైతన్యం :**

చేతనమును కలిగించునది చైతన్యం. తొలి కోడి కూతతో లోకం మేలుకుంటుంది. మహానుభావుల ప్రబోధంతో మానవత్వం పరిమళిస్తుంది. ఉపాధ్యాయుని బోధన విద్యార్థిని వికసింపచేస్తుంది. ఈ విధంగా ఒక్కొక్క సంఘటన, ఒక్కొక్క అనుభవం, ఒక్కో అనుభూతి విద్యార్థిలో ఎన్నెన్నో భావాలు మనస్సును తట్టి చైతన్య పరుస్తాయి. ఈ నేపథ్యంతో "నవోదయం" అనే ద్వితీయ భాష పాఠ్యపుస్తకంలోని పాఠ్యాంశం విద్యార్థిని చైతన్యపరుస్తుంది.

## ఊ. పాఠాలు - విషయాల అమరిక క్రమం

**పాఠాల క్రమం :**

పదవ తరగతి విద్యార్థికి, తను విన్నదాన్ని, చదివినదాన్ని గురించి విమర్శనాత్మకంగా ఆలోచించి విశ్లేషించే సామర్థ్యం వృద్ధి చెందాలి. మౌఖిక, లిఖిత భాషా రూపాలనైనా, ప్రక్రియలనైనా అర్థం చేసుకొని, వినియోగించగలగాలి, సమకాలీన అంశాలతో అన్వయించగలగాలి. ఉన్నత వ్యక్తిత్వాన్ని, వైఖరులను పెంపొందించుకొనగలిగారు.

వాటికి అనుగుణంగా మానవతా విలువలు, మానవ సంబంధాలు, స్త్రీల పట్ల గౌరవం, శ్రమను గౌరవించడం వంటివి పెంపొందించేలా పాఠాలు ఎంపిక చేసారు. పదవ తరగతిలోని పాఠాల అమరికను ఒకసారి పరిశీలిస్తే పై విషయం మరింత బాగా అవగాహన అవుతుంది. అదే విధంగా ప్రాచీన, ఆధునిక సాహిత్యాలు రెండిటికీ ప్రాధాన్యం ఇచ్చారు.

ప్రకృతి వర్ణన, విలువలు, స్ఫూర్తి, విమర్శ, సంస్కృతి, స్త్రీలపట్ల గౌరవం, మానవ స్వభావం, శాస్త్రీయ పరిశీలన, సామాజిక సేవ, స్త్రీ సాధికారత, హాస్యం మొదలైన ఇతివృత్తాల ఆధారంగా పాఠ్యాంశాల ఎంపిక జరిగింది. పద్యం, కథ, లేఖ, అభినందన వ్యాసం, నాటిక, ద్విపద, పీఠిక, వచనకవిత, అనువాదక కథ, కథానిక మొదలైన ప్రక్రియలలో ఉన్నాయి. విస్తార పఠనానికి రామాయణం ఉపవాచకంగా పెట్టడం జరిగింది.

గతంలోలాగా పద్య, గద్య భాగాలను వేర్వేరుగా పెట్టకుండా గద్య, పద్య పాఠాలను కలిపి ఉంటారు. పాఠ్యపుస్తకం చివర ఉపవాచకాన్ని చేర్చారు.

ఒక పాఠంలోని విషయాలను కూడా సోపానక్రమంలో బోధించడానికి వీలుగా అమర్చారు. ఉన్ముఖీకరణతో మొదలుకొని, నేపథ్యం, కవిపరిచయం, పాఠ్యాంశం, అభ్యాసాలు ఇలా చేర్చారు.

**పాఠంలో విషయాల అమరిక క్రమం**

చదవండి - ఆలోచించి చెప్పండి ఉన్ముఖీకరణం
↓
పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం
↓
పాఠ్యభాగ వివరాలు
↓
విద్యార్థులకు సూచనలు
↓
కవి పరిచయం
↓
ప్రవేశిక
↓
పాఠ్యాంశం → ఆలోచించండి - చెప్పండి
↓
ఇవి చేయండి

అంటే 8 సోపానాలలో పాఠ్యాంశ అవగాహన పూర్తవుతుంది. ఒక్కొక్క అంశం గురించి తెలుసుకొందాం.

## 1. చదవండి - ఆలోచించి చెప్పండి :

కింది తరగతులలో బొమ్మలు ఇచ్చి ప్రశ్నించడం ద్వారా ఉన్ముఖీకరణం చేయడం జరిగింది.

విద్యార్థికి తాను నేర్చుకొనబోయే పాఠ్యాంశంపై ఉత్సుకత కలిగిస్తూ, పాఠ్యాంశానికి సంబంధించి అతని పూర్వ జ్ఞానాన్ని పరిశీలిస్తూ, ఉత్తేజపరుస్తూ, ప్రస్తుత పాఠ్యాంశానికి విద్యార్థులను సంసిద్ధులను చేయడం ఈ శీర్షిక ఉద్దేశం.

10వ తరగతి విద్యార్థులను కవిత / సన్నివేశం / పద్యం / లేఖ / సంభాషణ / వచనకవిత / పాట / అభిప్రాయం / స్వగతాలను ఇచ్చి చర్చించడం ద్వారా ఉన్ముఖీకరణ చేయడం జరిగింది. ఉన్ముఖీకరణలో ఇచ్చిన ప్రశ్నలు నమూనాకు ఇచ్చినవి మాత్రమే. ఆ ప్రశ్నలేకాక ఇంకా ప్రశ్నించి, చర్చింపచేసి పాఠ్యోన్ముఖులను చేయాలి. పిల్లల్ని పాఠ్యాంశ ఇతివృత్తం గురించి ఆలోచింపజేయడానికి, పాఠంపట్ల ఆసక్తిని కల్గించడానికి ఈ అంశం తోడ్పడుతుంది. జ్ఞాననిర్మాణ క్రమంలో పూర్వజ్ఞానాన్ని కల్గించడానికి, పాఠ్యాంశానికి చెందిన పూర్వజ్ఞానాన్ని కల్గించడానికి, పాఠ్యాంశానికి చెందిన పూర్వరంగం (Project) గురించి అవగాహన కల్గించడానికి తోడ్పడుతుంది.

## 2. పాఠ్యాంశ ఉద్దేశం / నేపథ్యం :

కథలకు / పౌరాణికమైన / చారిత్రకమైన ఇతివృత్తంగల పాఠ్యాంశాలకు నేపథ్యం తెలుసుకోవలసిన అవసరం ఉంది. కనుక, అంతకు ముందు కథను తెలియజేయడానికి నేపథ్యాలు ఇవ్వడం జరిగింది.

శతక పద్యాలు / లేఖ / మహోన్నత వ్యక్తిత్వాలు / మొదలైన ఇతివృత్తాలుగల పాఠ్యాంశాలను నిర్ణయించడంలోగల ఉద్దేశం – 'పాఠ్యాంశ ఉద్దేశం'గా రాయడం జరిగింది. ఈ ఉద్దేశాన్ని అవగాహన కలిగించడానికి విద్యార్థులచే చదివించి, చర్చింపచేయాలి. నేపథ్యంపై కూడా చర్చ జరగాలి. నేపథ్యం, ఉద్దేశం ఈ రెండంశాలు కూడా పాఠ్యాంశ పూర్వరంగాన్ని అర్థంచేసుకోడానికి, మానసిక సంసిద్ధతను కల్గించడానికి ఇవి తోడ్పడతాయి.

**Pre Text - పాఠ్యాంశ పూర్వ రంగం**

పాఠ్యాంశ ఇతి వృత్తం గురించి, పాఠ్యాంశ సందేశం గురించి లేదా భావం, సారాంశం గురించి లేదా సమకాలీన అంశాలకు అన్వయించడం గురించి, పిల్లల్ని ఆలోచింపచేయడానికి, సంసిద్ధులను చేయడానికి పాఠం ప్రారంభంలో ఇచ్చిన ఉన్ముఖీకరణ అంశాలు తోడ్పడతాయి. పాఠ్యభాగం నేపథ్యం, ఉద్దేశం వంటివి పాఠం యొక్క పూర్వరంగాన్ని గ్రహించడానికి తోడ్పడతాయి. వీటి వలన కలిగిన ప్రాథమిక అవగాహనా అనుభవంతో పిల్లలు పాఠంలోని విషయంపట్ల ఆసక్తి ఏర్పరచుకుంటారు.

## 3. పాఠ్యభాగ వివరాలు :

పాఠ్యాంశం ప్రక్రియను ఇవ్వడం జరిగింది. పాఠ్యాంశం గ్రహింపబడిన గ్రంథం, ఆశ్వాసం వివరాలు ఇవ్వడం జరిగింది. విద్యార్థులచేత చదివించాలి. చర్చించాలి.

## 4. విద్యార్థులకు సూచనలు :

విద్యార్థులకు సూచనల్లో మూడు సూచనలు ఉన్నాయి. వాటిలో మొదటిది ప్రవేశికను చదివి పాఠంలోని విషయాన్ని ఊహించడం, పాఠం చదివి అర్థంకాని పదాల కింద గీసి, అర్థాలు తెలుసుకోవడం ఉంది.

అర్థంకాని పదాల కింద గీతలు గీసి, వాటి అర్థాలను ప్రయత్నించి తెలుసుకొంటే బాగా అవగాహన కలుగుతుంది. తప్పని సరిగా విద్యార్థులు అందరూ ఈ శీర్షికలోని సూచనలను అనుసరించే విధంగా ఉపాధ్యాయుడు ప్రోత్సహించాలి.

విద్యార్థులు ఒక విషయాన్ని నేర్చుకోవాలంటే, కొంత ప్రాథమిక పరిజ్ఞానం ఉండాలి. ఆ ప్రాథమిక పరిజ్ఞానాన్ని పరిశీలించాలి. విద్యార్థుల జ్ఞాన నిర్మాణానికి ఇది అత్యంత సహకారం అందిస్తుంది. నేర్చుకోవడమంటే జ్ఞాన నిర్మాణం జరగడం. ఏ విషయం గురించైనా ప్రాథమిక అవగాహన ఉండి చర్చలో పాల్గొంటే జ్ఞాన నిర్మాణం జరుగుతుంది. ఇందుకవసరమైన ప్రాథమిక పరిజ్ఞానం, అవగాహన కల్గించడానికి విద్యార్థుల సూచనలుపయోగపడతాయి. పాఠాలు చదవడం, అర్థంకాని పదాలు గుర్తించడం, నిఘంటువు ద్వారా, తోటివారి ద్వారా అర్థాలు తెలుసుకోవడం, పాఠ్యాంశ చిత్రం ద్వారా భావాన్ని ఊహించడం జరుగుతుంది. వీటివల్ల పిల్లలు పాఠంలోని విషయం గురించి జరిగే చర్చలలో పాల్గొనగలుగుతారు. జ్ఞానాన్ని నిర్మించుకొంటారు. కాబట్టి ఇవి జ్ఞానాత్మక శిక్షణకు తోడ్పడే అంశాలని పేర్కొనవచ్చు. దీనినే Congritive apprentship అంటారు.

## 5. కవి పరిచయం :

పాఠ్యాంశ రచయిత / కవి గురించి విద్యార్థులచేత చదివించి, చర్చింపచేసి అవగాహన కల్గించాలి. కవి / రచయిత గురించి అదనపు సమాచారం కూడా ఇస్తే మంచిది. కవి / రచయితపై విద్యార్థులకు గౌరవం పెరిగేలాగ చేయాలి. ఇతర రచనలు చదవాలనే కోరిక కలిగించాలి. ప్రోత్సహించాలి.

## 6. ప్రవేశిక :

ఒక విషయంలోకి ప్రేవేశించడానికి ద్వారం వంటివి ప్రవేశిక. ప్రవేశికను విద్యార్థులచే చదివించాలి. చర్చించాలి. దీనివలన పాఠ్యాంశం తెలుసుకోవాలనే తపన, ఆసక్తి పెరగాలి.

పాఠ్యాంశం తెలుసుకోవాలనే తపనను రేకెత్తించడానికి ప్రవేశిక పెట్టడం జరిగింది. ప్రవేశిక చదవమని ప్రోత్సహించడం జరిగింది. పాఠ్యాంశం కూడా విద్యార్థి సొంతంగా చదువుకోవాలి. కొంత అర్థం అవుతుంది. అర్థంకాని దానిపై తెలుసుకోవాలనే కోరిక కల్గుతుంది.

**Schema -** పాఠంలోని విషయం, భావం, ఇతివృత్తాల గూర్చి ముందస్తుగా ఊహించడానికి తోడ్పడేది ప్రవేశిక, తద్వారా పాఠంలోని విషయాన్ని ఆసక్తిగా వినడానికి, చర్చలో పాల్గొనడానికి, చదువుకోవడానికి ప్రవేశిక ప్రేరేపిస్తుంది. దీనినే schema అని కూడా అంటారు.

## 7. పాఠ్యాంశం – మధ్యలో ప్రశ్నలు :

ఒక పాఠంలోని విషయాన్ని ఎన్ని పీరియళ్ళలో బోధించి చర్చించాలో ఉపాధ్యాయులకు అవగాహన కల్గడానికి పాఠాన్ని భాగాలుగా విభజించారు. పాఠం నీటిని నిడివిని బట్టి 3 నుండి 4 భాగాలుగా విభజించారు. ఒక్కొక్క భాగాన్ని ఒక పీరియడ్‌లో బోధించి చర్చ నిర్వహించాలి.

పాఠ్యాంశాన్ని విద్యార్థులచే చదివించాలి. తర్వాత ఉపాధ్యాయుడు ఆదర్శవంతంగా, దోషరహితంగా, తగినంత గంభీరంగా రెండు సార్లు చదవాలి. పద్యాలను ఒకసారి విసంధిచేసి, ఒకసారి సమాస ఘటితంగాను చదవాలి. మరలా విద్యార్థులచే చదివించి, దోషాలు సవరించాలి. పాఠ్యాంశం గురించి చర్చించాలి. పాఠ్యాంశాన్ని పీరియడ్ల వారీగా విభజించడం జరిగింది.

పాఠ్యాంశ చర్చకు అనుకూలంగా “ఆలోచించండి – చెప్పండి” అనే పేరుతో కొన్ని ప్రశ్నలను బాక్సులలో ఇవ్వడం జరిగింది. ఇవి విద్యార్థుల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వడానికి ఉద్దేశించినవి. ఇదే విధంగా ఇంకా అనేక ప్రశ్నలువేసి, విద్యార్థులను ఉత్సాహంగా చర్చలలో పాల్గొనేలా చేయాలి. అవసరమైతే విద్యార్థులను కూడా ప్రశ్నించమనాలి.

పాఠ్యాంశబోధన సమయంలో పిల్లలు చర్చలో పాల్గొనాలి. ఇందుకు “ఆలోచించండి – చెప్పండి” ప్రశ్నలు తోడ్పడతాయి. ఈ ప్రశ్నలు బహుళ ప్రతిస్పందనలకు, అన్వయించడానికి, అభిప్రాయాలు చెప్పడానికి ఉద్దేశించినవి. ఈ క్రమంలో పిల్లలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేయడం ద్వారా తమనుతాము ఆవిష్కరించుకొంటారు. తరగతిలో జరిగే చర్చల ఫలితంగా, బహుళ ప్రనతిస్పందనల వల్ల తమ అభిప్రాయాలు మార్చుకోవడం, నేర్చుకోవడం వంటివి చోటు చేసుకొంటాయి.

## 8. ఇవిచేయండి :

ప్రతి పాఠంలో సామర్థ్యాల సాధనకోసం 'ఇవి చేయండి' శీర్షికతో అభ్యాసాలు ఉన్నాయి. దీనిలో అన్ని సామర్థ్యాలపై అభ్యాసాలు ఉన్నాయి. ఈ అభ్యాసాలపై తరగతి గదిలోనే అవగాహన కల్గించాలి. **"ఇవిచేయండి"**లోని అభ్యాసాలవల్ల పిల్లల్లో పాఠ్యాంశంపట్ల ఆలోచనాశక్తి పెరుగుతుంది. విమర్శనాత్మక దృక్పథం అలవడుతుంది. సృజనాత్మకత పెరుగుతుంది. వీటిని సాధించే క్రమంలో పిల్లలు వ్యక్తిగతంగాను, జట్లలోను పనిచేయవలసి ఉంటుంది. తద్వారా భాగస్వామ్య అభ్యసనం జరిగి, పిల్లల ఆలోచనాస్థాయి ఇనుమడిస్తుంది.

పాఠ్య విషయంపై పూర్తి అవగాహన పొందిన పిల్లలు ఆ పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలపై దృష్టిపెట్టాల్సిన ఆవశ్యకత ఉంటుంది. మనం ఇంతకుముందు చెప్పుకున్నట్టు పాఠాన్ని బోధించడం అంటే ఉన్ముఖీకరణ నుండి 'సూక్తి' వరకు ఉన్న అన్ని అంశాలను బోధనలో భాగంగానే నిర్వహించడం. భాషా సామర్థ్యాలైన **I. అవగాహన-ప్రతిస్పందన, II. వ్యక్తీకరణ - సృజనాత్మకత, III. భాషాంశాలు** కింద ఇచ్చిన అభ్యాసాలను తరగతిలో అవగాహన కల్పించాలి. ఈ సామర్థ్యాలపై అభ్యాసాలు 'ఇవిచేయండి' శీర్షికతో ఉన్నాయి. ప్రతి అభ్యాసాన్ని ముందుగా పూర్తి తరగతి కృత్యంగా విద్యార్థులకు ఎలా చేయాలో సూచనలు ఇవ్వాలి. పిల్లల్లో భాషా సామర్థ్యాలు పెంపొందించడానికి ఇవి రూపొందించారు. వీటి ద్వారా పిల్లలను ఆలోచింపజేయడం, వ్యక్తీకరణ శక్తిని వృద్ధిపరచడం ప్రధానం అలాగే ఈ అభ్యాసాలు విద్యార్థులకు సందర్భోచితంగా భాషా వినియోగ నైపుణ్యాలను పెంపొందిస్తాయి.

ఐతే పాఠాల వెనుక ఇచ్చిన అభ్యాసాలు కేవలం అభ్యాసం కొఱకు మాత్రమే ఉద్దేశించినవి. వీటి ద్వారా అనగా ఈ అభ్యాసాలను తరగతి గదిలో ఉపాధ్యాయుని సమక్షంలో అభ్యాసం చేయడం ద్వారా పరీక్షలలో ఏవిధమైన ప్రశ్నలకైనా సమాధానాలు రాయడానికి విద్యార్థులు సంసిద్ధులైయుంటారు. అందుకోసమే మనం బోధనలో 70% పీరియడ్లు అభ్యాసాల కొఱకే కేటాయించడం జరిగింది. ఉపాధ్యాయుడులందరూ దీన్ని దృష్టిలో పెట్టుకొని అభ్యాసాలను సాధనచేయించాలి. సంతంగా రాసేలా చూడాలి. వీటికి నిర్మాణాత్మక మూల్యాంకనంలో భారత్వం కూడా కేటాయించారు.

- ముందుగా అభ్యాసాన్ని పిల్లలతో చదివించాలి.
- సామర్థ్య స్వభావాన్ని బట్టి తగిన నిర్వహణ వ్యూహాన్ని ఎంపిక చేసుకోవాలి.
- పిల్లలను వ్యక్తిగతంగాగాని, జట్టులోగాని అభ్యాసాలను చేయమనాలి.
- పిల్లలు ప్రదర్శించిన వాటిపై చర్చ నిర్వహించాలి.
- అనంతరం పిల్లలతో చర్చించుకుంటూ సరిచేయాలి.
- సరిచేసిన అనంతరం నోటు పుస్తకాలలో రాయమనాలి.

పై విధంగానే ప్రాజెక్టుపనులు చేయడానికి కూడా సూచనలు ఇచ్చి పిల్లలతో చేయించాలి.

ఈ అభ్యాసాల నిర్వహణలో ఉపాధ్యాయుడు కేవలం ఒక సౌకర్యకర్తగా ఉంటూ పిల్లలు నేర్చుకోవడంలో సహకరించాలి. పిల్లలు ప్రతి ఒక్కరూ భాగస్వాములయ్యేలా, సామర్థ్యాలను సాధించేలా చూడాలి. ఎట్టి పరిస్థితుల్లో అభ్యాసాలను గైడ్లు చూసి రాయకుండా చూడాలి. అలాగే ఉపాధ్యాయుడు నల్లబల్లపై జవాబులను రాయరాదు. అలాగే ప్రక్క విద్యార్థి పుస్తకంలో చూసిరాయరాదు.

పిల్లలు భాష నేర్చుకోవడమంటే పాఠాల ప్రశ్నజవాబులను కంఠతాపెట్టడం కాదు. భాషనేర్చుకోవడమంటే సామర్థ్యాలను సాధించడమే. ఇందులో ఆలోచించడం, తమ అభిప్రాయాలను వ్యక్తపరచడం, కలిసిపనిచేయడం, తమదైన శైలిలో వాగ్రూప, లిఖిత రూపాలలో ప్రతిస్పందించడం, వ్యక్తీకరించడం వంటివి చోటు చేసుకుంటాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని అభ్యాసాల నిర్వహణ జరగాలి. సామర్థ్యాల సాధన జరగాలి.

## 6. చదవండి - తెలుసుకోండి :

పాఠంలో భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టుపని పూర్తయిన తరువాత "చదవండి – తెలుసుకోండి" అనే శీర్షికతో కొంత విషయం ఇవ్వడం జరిగింది. ఆయా పాఠాలకు సంబంధించిన కీలకమైన అదనపు సమాచారాన్ని ఇందులో పొందుపరచడం జరిగింది. విద్యార్థులను వీటిని చదివి, అదనపు సమాచారాన్ని తెలుసుకొనే విధంగా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి.


## 7. సూక్తి :

ప్రతి పాఠానికి చిట్టచివరి అంశంగా 'సూక్తి' ఇవ్వడం జరిగింది. పాఠంలో చెప్పిన విషయానికి అనుగుణంగా ఉండే విధంగా వీటిని పొందుపరచడం జరిగింది. ప్రసిద్ధమైన సంస్కృత శ్లోకాలను, భావాలను లేదా ప్రసిద్ధులైన వారి మాటలను సూక్తులుగా ఇవ్వడం జరిగింది. ఇది చదువుకొని విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం కలిగించుకోవాలి.

## ముగింపు :

ఆర్.టి.ఇ.-2009, ఆంధ్రప్రదేశ్ విద్యా ప్రణాళిక-2011 ప్రకారం నూతన భాషావాచకాలు రూపొందించారు. ప్రధానంగా ఇవి ఆలోచింపచేయడం, వ్యక్తీకరించడం, సృజనాత్మకత, విలువలు, వైఖరులు పెంపొందింపచేయడానికి ఉద్దేశించినవి. విమర్శనాత్మక, హేతుబద్ధమైన చింతనతో విచక్షణా జ్ఞానంతో వ్యవహరించేలా చేయడానికి ఈ పాఠ్యపుస్తకాలు దోహదపడతాయి. ఇందుకనుగుణంగా ఇతివృత్తాలు, పాఠ్యాంశాల ఎంపిక, అభ్యాసాలకూర్పు ఉన్నాయి. వీటిని ప్రణాళికాబద్ధమైన బోధనాభ్యసన ప్రక్రియలను అనుసరించి ఫలితాలు సాధించాలి.

ఎంత మంచి పాఠ్యపుస్తకమైనా ఉపాధ్యాయుడికి ధీటుకాదు. ఆ పాఠ్యపుస్తకాన్ని ఉపాధ్యాయుడు పూర్తిగా ఆకళింపు చేసకోవాలి. దాని ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు గురించి పట్టుసాధించాలి. బోధనకోసం ప్రణాళికలు చేసుకోవాలి. భాషాసామర్థ్యాల సాధనకోసం పాఠ్యపుస్తకం ఒక సాధనంగా ఉపయోగపడుతుంది. ఐతే పాఠ్యపుస్తకానికే పరిమితం కాకుండా పాఠ్యబోధనకు అవసరమైన అదనపు వివరాలు, విశేషాంశాలు, సమాచారాన్ని సేకరించుకోవాలి. అప్పుడే పాఠ్యపుస్తకం యొక్క లక్ష్యం నెరవేరుతుంది.



# II. పాఠ్యాంశాలు- విశేషాంశాలు

**(పాఠ్యాంశాల వివరణ)**

## 1. వెన్నెల

**- ఎఱ్ఱన**

సాహిత్యంలో వర్ణనకు అగ్రతాంబూలమీయబడింది. వర్ణించడమే కవిత్వమని, మనోహరమైన వర్ణననే కవిత్వమంటారని లాక్షణికులు పేర్కొన్నారు. కావ్యరచనలో వర్ణన ఒక భాగం. అయినా వర్ణన పట్ల మక్కువ ఎక్కువై అష్టాదశ వర్ణనలను కావ్యాలలో చేర్చారు. అటువంటి వర్ణనలు గల్గిన కావ్యాలను ప్రబంధాలు అంటారు. అది ఒక ప్రక్రియగా తెలుగు సాహిత్యంలో అభివృద్ధి చెందింది. రాయల కాలంలో ప్రబంధాలు విరివిగా వెలువడటం వల్ల కృష్ణరాయలకాలాన్ని ప్రబంధయుగం అన్నారు. ఈ ప్రబంధ లక్షణాలను ఇంచుమించు రెండువందల సంవత్సరాలనాడే ఎఱ్ఱన తన రచనల్లో ప్రదర్శించి మార్గదర్శకుడైనాడు. అందుకే ఈయన 'ప్రబంధ పరమేశ్వరుడు'గా కీర్తి వహించాడు.

ఎఱ్ఱన రచనల్లో వర్ణనలు విరివిగా గల్గిన రచన నృసింహపురాణం. నృసింహపురాణంలో కథ ప్రహ్లాద చరిత్ర. ప్రహ్లాదుని తండ్రి హిరణ్యకశిపుడి వనవిహారఘట్టం తర్వాత వసంత ఋతువర్ణన, సాయంకాలపు వర్ణన, చంద్రోదయం, వెన్నెల, ఉషోదయ వర్ణనలు వరుసగా పేర్కొన్నాడు. ఎఱ్ఱన వర్ణన శైలిని అవగాహన చేసుకునేందుకు ఈ పాఠం నిర్ణయించడమైంది. ఉత్ప్రేక్షాలంకార ప్రయోగానికి ఎఱ్ఱన పెట్టింది పేరు. వర్ణనల్లో అలంకారాలను ప్రదర్శించడం కవి నిపుణతకు అద్దం పడుతుంది.

ఏదైనా ఒక అంశాన్ని వర్ణించడానికి ఆ వస్తువును ఎంత లోతుగా పరిశీలించాలో, ఎన్ని ఉపమానాలను ప్రయోగించవచ్చో, ఎంత రమ్యంగా వివరించవచ్చో ఈ పాఠం ద్వారా గ్రహించవచ్చు. విద్యార్థుల భావనా బలానికి, ఊహాశక్తికి పదునుపెట్టే అవకాశం ఈ పాఠం కల్పిస్తుంది.

## వెన్నెల - అదనపు అంశాలు

### I. పద్యభావాల్లో సవరణలు... (6వ పేజీ)

1) అసమానమైన కాంతితో ప్రకాశించే సూర్యుణ్ణి చూసినట్లు ఇతరులను చూడటానికి ఇష్టపడదన్నట్లు పద్మము (పద్మిని) చంచలమైన తుమ్మెదలవంటి నల్లని కనుదామరలను వెంటనే మూసుకున్నది. (* పాఠ్యపుస్తకంలో 'మిణుకు మిణుకుమంటున్న చుక్కలను చూడలేక' అని ఉంది.) 'పద్మిని' అనేది ఉత్తమజాతి స్త్రీ లక్షణమని లాక్షణికులు పేర్కొన్నారు. (* 'తారక' అంటే నల్లని కనుగ్రుడ్డు అనే విశేషార్థమున్నది.)

2) (* 'నిశాసతి సరసంగా నటిస్తుంది' అని పాఠ్య పుస్తకంలో ఉంది. 'నటించడానికి సిద్ధపడగా' అనేది సరైన అన్వయం. ప్రతిపదార్థం చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.)

### II. సూచనలో దోషం :

8వ పేజిలో 5వ ప్రశ్నలో 8, 10 సంఖ్యగల పద్యాలకు ప్రతిపదార్థం రాయమని ఉంది. పద్యాల సంఖ్యను 5, 7గా సవరించుకోవాలి.

## విశేషాంశాలు

**సూత్రధారుడు :** నట బృందానికి నాయకుడు. కవి గురించి నాయకుడి గురించి కథా వస్తువు గురించి వివరిస్తాడు. నాటకం మొదట్లో నాంది ప్రస్తావనలు చేసి నిష్క్రమిస్తాడు. నాటక ప్రయోగము, అనుష్ఠానపు బాధ్యత అనే సూత్రమును (దారమును) ధరించేవాడు కాబట్టి సూత్రధారుడయ్యాడు.

సూత్రము అంటే దారము. సూత్రధారి అంటే దారాన్ని పట్టుకొని ఆడించేవాడు. మేళ నాయకుడు. ఆటాడించేవాడు, నడిపించేవాడు. పూర్వం తోలుబొమ్మలాట లాడించేటప్పుడు బొమ్మల కదలికలను దారంతో నియంత్రించే వ్యక్తి ఉండేవాడు. అతనే సూత్రధారుడు. అతని నైపుణ్యాన్ని బట్టే బొమ్మలాట రక్తి కడుతుండేది. రానురాను తెరవెనుక ఉండి, నేపథ్యంలో ఉండి వ్యవహారం నడిపించే వ్యక్తికి సూత్రధారి అనే పేరు స్థిరపడింది.

**చంద్రకాంత శిల :** వెన్నెలలో కరిగే స్వభావం ఉన్న రాయి. చలువరాయి. పవిత్రమైనదిగా భావిస్తారు. దీన్ని చంద్రకాంత మణి అని కూడ అంటారు.

**చకోరపక్షి :** వెన్నెలను ఆస్వాదించే పక్షి. చకోరపక్షి ఫాసియానిడే కుటుంబానికి చెందిన పక్షి. ఇది పాకిస్తాన్ దేశపు జాతీయ పక్షి. ఆసియా, ఆఫ్రికా, ఐరోపా ఖండాలలో ఇవి ఉన్నాయి. భూమిమీద గూళ్లు కట్టుకొని నివసిస్తాయి. గింజలు వీటి ఆహారం. సుదూర ప్రాంతాలకు వలస పోలేవు.

**కవిసమయాలు :** సమయము అంటే సంప్రదాయము. అంటే ఆచారము లేదా మర్యాద. ఈ సంప్రదాయాలు దేశాచారాల్లాగా ఎప్పుడో ఏర్పడ్డాయి. ఒక దేశంలో వ్యక్తులు ఆ దేశ ఆచారాలను పాటించినట్లుగానే కవులు కూడ కొన్ని సంప్రదాయాలు కవిత్వ రచనకు సంబంధించి పాటిస్తుంటారు. వీటినే కవి సమయాలు అంటారు. కాలక్రమంలో

ఔచిత్యవంతమైన కొత్త కవిసమయాలను కూడా సృష్టించుకోవచ్చు. కవి సమయాలు ప్రధానంగా మూడు రకాలు

(1) వస్తువులో ఉన్న ధర్మాన్ని చెప్పనివి

(2) వస్తువులో లేని ధర్మాన్ని చెప్పేవి

(3) నియమబద్ధంగా కొన్ని వస్తువులకు మరికొన్ని వస్తువులతో సంబంధాన్ని చెప్పేవి.

ఉదాహరణకు – కృష్ణపక్షంలో వెన్నెల ఉన్నట్లు, శుక్లపక్షంలో చీకటి ఉన్నట్లు. వర్ణించకూడదు. చెరువులలో హంసలు లేకపోయినా ఉన్నట్లు వర్ణించవచ్చు. వసంతకాలంలోనే కోకిల కూసినట్లు చెప్పాలి.

అ. **హిరణ్యకశిపుడు :** ఒకసారి శ్రీమహావిష్ణువును దర్శించడానికి సనకాది ఋషులు (సనకుడు, సనందనుడు, సనత్కుమారుడు, సనత్సుజాతుడు) వైకుంఠానికి వెళ్ళారు. అక్కడ ద్వారపాలకులైన జయ, విజయులు ఆ మహర్షులను అడ్డుకున్నారు. సనకాదులు కోపంతో జయ, విజయులను మూడు జన్మలు రాక్షసులు కమ్మని శపించారు. వారు తొలిజన్మలో హిరణ్యాక్ష, హిరణ్యకశిపులుగా తరువాత జన్మలో రావణ, కుంభ కర్ణులుగా చివరి జన్మలో శిశుపాల దంతవక్తులుగా జన్మించారు. ఈ కారణంగా సూర్యుని మానస పుత్రుడైన కశ్యప ప్రజాపతికి – దితికి (భార్య) హిరణ్యాక్ష – హిరణ్యకశిపులు జన్మించారు. దితి సంతానాన్ని దైత్యులని (రాక్షసులలో ఒక తెగ) అలాగే కశ్యప ప్రజాపతి వేరొక భార్యయైన అదితియొక్క సంతానాన్ని దేవతలని (ఒకతెగ) అంటారు.

హిరణ్యకశిపుడు తన తపస్సుతో బ్రహ్మను మెప్పించి – సజీవులతోగాని, నిర్జీవులతోగాని, దేవతలవలనగాని, రాక్షసులవలనగాని, నరులవలనగాని, జంతువులవలనగాని, రాత్రిగాని–పగలుకాని, గదిలోగాని–గదిబయటగాని, మరణం లేకుండా వరం పొందాడు. ఇతని భార్య లీలావతి, కొడుకు ప్రహ్లాదుడు. ప్రహ్లాదుడు విష్ణుభక్తుడు. వరగర్వంతో మితిమీరిన హిరణ్యకశిపుని, శ్రీమహావిష్ణువు నరశింహావతారమెత్తి సంహరించాడు.

ఆ. **అరణ్యపర్వశేషము :** నన్నయ ఆది, సభాపర్వాలను, అరణ్యపర్వం 4వ అశ్వాసం 142వ పద్యం "శారద రాత్రులుజ్జ్వల"------ పద్యం వరకు రచించాడు. 143వ పద్యమైన "స్ఫురదరుణాంశు......" పద్యంతో ప్రారంభించిన ఎఱ్ఱన 1595 గద్య పద్యాలతో అరణ్యపర్వాన్ని పూర్తిచేశాడు.

ఇ. **అష్టాదశవర్ణనలు :** నగరం, సముద్రం, ఋతువు, చంద్రోదయం, సూర్యోదయం, ఉద్యానం, జలక్రీడ, మధుపానం, రతి, విప్రలంభం, వివాహం, పుత్రోత్పత్తి, మంత్రం, ద్యూతం, ప్రయాణం, నాయకాభ్యుదయం, శైలం, యుద్ధం... ఇలా 18 అంశాల గురించి వర్ణించడాన్ని అష్టాదశవర్ణనలు అంటారు.

ఈ. **దిక్పాలకులు :** 1.తూర్పు–ఇంద్రుడు, 2.ఆగ్నేయం–అగ్ని, 3.దక్షిణం–యమధర్మరాజు, 4.నైఋతి–నిరృతి, 5.పడమర–వరుణుడు, 6.వాయువ్యం–వాయువు 7.ఉత్తరం–కుబేరుడు 8.ఈశాన్యం–ఈశానుడు. నాలుగు దిక్కులు, నాలుగు మూలలు కలిపి ఎనిమిది. వీటికి సంబంధించిన అధిపతులను అష్టదిక్పాలకులు అంటారు. నాలుగు దిక్కులు, నాలుగు మూలలు కలిపి ఎనిమిది. వీటికి సంబంధించిన అధిపతులను అష్టదిక్పాలకులు అంటారు.

# 2. ధన్యుడు

**- పరవస్తు చిన్నయసూరి**

గ్రాంథిక భాషలో రమ్యమైన శైలిని అనుసరించి, వచన రచన ద్వారా పాఠకులను ఆకట్టుకున్న విశిష్ట రచయిత పరవస్తు చిన్నయ సూరి. సంస్కృత సమాసపదభూయిష్టమైన వీరి శైలి జిగిబిగికలిగి పఠితలకు, శ్రోతలకు ఆనందాన్ని అందిస్తూ భాషపట్ల ఆసక్తిని, అనురక్తినీ కలిగిస్తుంది. నీతి చంద్రికలోని మిత్రభేదం - మిత్రలాభం కథలు, పశుపక్ష్యాదులు నేపథ్యంగా సాగుతూ మానవ మనస్తత్త్వాలను విశ్లేషిస్తాయి. నీతులను బోధిస్తాయి. లోకరీతులను ఆవిష్కరిస్తాయి.

మిత్రలాభంలో లఘుపతనకం అనే కాకి, హిరణ్యకుడనే ఎలుక, మంథరకుడనే తాబేలు, చిత్రాంగుడనే జింక మంచి మిత్రులు. వీళ్ళ జీవన విధానంలో, ఆహార విహారాల్లో వైవిధ్యమున్నది. అయినా కలిసిమెలిసి బ్రతుకుతున్నాయి. మిత్రులంతా కలిసి ముచ్చటించుకుంటున్నప్పుడు మంథరకుడు హిరణ్యకుణ్ణి, "ఎక్కడో నగరంలో ఉండవలసిన వాడవు, ఈ అడవిలో జీవించడానికి కారణం ఏమి"టని అడుగుతాడు. తాను మొదట చంపకవతి పట్టణంలో నివసించే వాణ్ణని, ఏ కారణంచేత ఈ అడవికి వచ్చాడో వివరించే కథ ఈ పాఠం.

ఇది కథ. ఇందులో కథనానికి ప్రాధాన్యత అధికం. సూరి శైలిపట్ల అవగాహన కల్గించి, కథన విధానం పిల్లలు అర్థం చేసుకునేటట్లు చేయడం. సుదీర్ఘ సమాసయుతమైన రచనలు చదవడంపట్ల ఆసక్తిని పెంచడం, ఆధునిక - ప్రాచీన శైలిభేదాన్ని గ్రహించేటట్లు చేయడం ఈ పాఠం ద్వారా సాధింపబడాలి.

## విశేషాంశాలు

**హితోపదేశం :** 12వ శతాబ్దంలో సంస్కృతంలో వెలువడిన గద్య పద్యాత్మక (చంపూ) రచన. రచయిత నారాయణ పండితుడు. ధవళచంద్రుడనే రాజు ఆస్థాన కవి. చిన్న పిల్లలు బాధ్యతాయుతమయిన పౌరులుగా ఎదగడానికి ఈ రచన చేశానని రచయిత చెప్పుకున్నాడు. క్రీ.పూ. మూడవ శతాబ్దానికి చెందిన పంచతంత్ర రచనలోని అనేకాంశాలు ఇందులోనూ కనిపిస్తాయి.

**లోభం :** అరిషడ్వర్గాలలో ఒకటి. లోభము అంటే పిసినారితనం. సంపాదించిన ధనాన్ని తాను అనుభవించకుండా ఇతరులను అనుభవించనీయకుండా దాచిపెట్టడం. ధనార్జనే ధ్యేయంగా లోభి బ్రతుకుతుంటాడు. దీనికోసం చెడుపనులు చేయడానికి కూడా వెనుకాడడు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అరిషడ్వర్గాలు.

**సంసార విష వృక్షస్య . . . . . . . . . . :** మానవ జన్మకు పరమ లక్ష్యం మోక్షప్రాప్తి అని పూర్వులు భావించారు. ఎంతో దుర్లభమైన మానవ జన్మని సార్థకం చేసుకోవాలి. కాని చాలామంది ఇహలోక బంధాలలో కూరుకొని పోతూ ఉంటారు. దీన్ని వివరించే శ్లోకం ఇది -

*సంసార విష వృక్షస్య ద్వే ఫలే హ్యమృతోపమే ।*

*కావ్యామృత రసాస్వాదః సంగతిః సజ్జనైస్సహ ॥*

ఒకటి –మంచి మాటలను ఆస్వాదించటం. సజ్జన సాంగత్యం చేయడం. రెండవది– కావ్యామృత రసాస్వాదన.దీని వల్ల లోక జ్ఞానం, ఆలోచనాశక్తి మొదలయిన గుణాలు అబ్బుతాయి. సజ్జన సాంగత్యం వల్ల మనో ధైర్యం, ఇంద్రియ నిగ్రహం వంటి గుణాలు వస్తాయి.

**నలుగురితో చెప్పుకోకూడనివి :** ఆయుర్విత్తం గృహచ్ఛిద్రం మంత్రవకాషధమైథునే దానం మానావమానౌచ నవగోప్యాని కారయేత్. 1.ఆయువు, 2.ధనం, 3.గృహచ్ఛిద్రం, 4.మంత్రం, 5.ఔషధం, 6.మైథునం, 7.దానం, 8.మానం, 9.అవమానం–వీటి గురించి ఇతరులకు చెప్పగూడదు.

**పంచతంత్రం :** ఐదుభాగాల కథాకావ్యం. 1.మిత్రలాభం 2.మిత్రభేదం 3. సంధి–విగ్రహం 4.లబ్ధనాశం 5. అసంప్రేక్ష్యకారిత్యం

**నీతిచంద్రిక :** రెండుభాగాలు మాత్రమే. మిత్రలాభం, మిత్రభేదం.

## 3. మాతృభావన

**– గడియారం వేంకటశేష శాస్త్రి**

ఆధునిక పంచమహాకావ్యాల్లో ఒకటిగా పేర్కొనదగిన చారిత్రక కావ్యం 'శ్రీ శివభారతం' చారిత్రక పురుషుడైన శివాజీ మహారాజు జీవితం నేపథ్యంగా సాగే ఈ కావ్యం నవరసభరితమైంది. ఉదాత్త చరిత్ర కల్గిన శివాజీ వ్యక్తిత్వాన్ని, స్త్రీలపట్ల పవిత్ర భావనను, పరమతసహనాన్ని, జీవకారుణ్యాన్ని, హింసాదౌర్జన్యాలపట్ల వ్యతిరేకతను ఈ గ్రంథం ప్రకటిస్తుంది. శివాజీ మహారాజు విశిష్టతను శేషశాస్త్రి ఇట్లా వివరించారు.

శా॥ ధీరాగ్రేసరమూర్తి; హైందవధరిత్రీభాగ్య సత్యాపన
ప్రారంభుండు; దయాగుణాంబుధి; మహారాష్ట్రాన్వయోత్తంసుడౌ
వీరక్షత్రియమౌళి; దేశమతగోవేదాది రక్షార్పిత
శ్రీరమ్యుండు; భవానిభక్తుడు; శివాజీరాజు సామాన్యుడే?!

పారతంత్ర్యాన్ని నిరసించి, స్వతంత్రేచ్ఛను రగుల్కొల్పే ప్రేరణాత్మకకావ్యమిది.

పరాయిపాలనలోనున్న తమదుర్గాలనొక్కొక్కటే జయిస్తున్న శివాజీదళం కళ్యాణికోటను వశపరచుకున్నది. ఆసైన్యానికి నేతృత్వం వహిస్తున్న అంబాజీసోన్‌దేవుడు అత్యుత్సాహంతో ఆకోట సర్దారుతోపాటు అంతఃపురస్త్రీని కూడా బంధించి, ఆమెను రాజుకు (శివాజికి) కానుకగా సమర్పించబోతాడు. పరస్త్రీలను తల్లులుగా భావించే శివాజీ ఆ దుశ్చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తాడు. భారతీయ సంప్రదాయంలో స్త్రీకి గల స్థానాన్ని ఈ సందర్భంగా వివరిస్తాడు.

స్త్రీని పవిత్రమూర్తిగా భావించాలని కుల,మత, వర్గభేదాలకు అతీతంగా వాళ్ళను పురుషులతో సమానంగా గౌరవించాలనే ఉదాత్తభావాలను విద్యార్థుల హృదయకేదారాల్లో నాటడం ఈ పాఠం ఉద్దేశం.

**యవనులు :** యదువు తమ్ముడైన తుర్వసుని వంశంలోని వారు యవనులు. గ్రీకు లేదా అరబ్ దేశీయులను ఇలా పిలవడం ఆధునికంగా మొదలైంది.

**ఏకాంకిక :** ఒకే అంకం ఉన్న నాటకం. ఇంగ్లీషులో దీన్ని One Act Play అంటారు. ప్రదర్శన యోగ్యంగా ఉంటుంది. నిడివి పావుగంట నుంచి ముప్పావుగంట వరకు ఉండవచ్చు. సాధారణంగా ఒకే సంఘటన, రెండు మూడు పాత్రలు ఉంటాయి. కథా వస్తువు ఏదైనా కావచ్చు. సుఖాంతం, దుఃఖాంతం, అధిక్షేపం, వ్యంగ్యం ఏదైనా ఉండవచ్చు.

అ. **అనసూయ :** మహాపతివ్రత అత్రిమహామునిభార్య. త్రిమూర్తులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఈమె పాతివ్రత్యాన్ని పరీక్షింపదలచారు. ఒకనాడు త్రిమూర్తులు బ్రాహ్మణ రూపంలో ఆమె ఆశ్రమానికి వెళ్ళి, తమకొకవ్రతమున్నదని ఆనాడు తమకు వడ్డించు వనిత దిగంబరిగ(వస్త్రములు లేకుండ) నుండవలెనని చెప్పిరి. బ్రాహ్మణ రూపంలో ముగ్గురు స్నానం చేసి పీటలమీద కూర్చున్నారు. అనసూయ వెంటనే వారిమీద మంత్రజలమును జల్లి శిశువులను చేసింది. దిగంబరియై వడ్డించి మరల వస్త్రములను ధరించి వారిని మామూలు రూపులుగా చేసింది. వారి భోజనానంతరము మరల శిశువులను చేసి తనవద్దనుంచుకొన్నది. తమ భర్తలను వెదకుతూ వచ్చిన ఉమా, లక్ష్మీ, సరస్వతులకు వారి భర్తలనిచ్చినది. త్రిమూర్తులు ఆమెపాతివ్రత్యానికి మెచ్చి ఏదైనా వరము కోరుకొమ్మన్నారు. అపుడామె వారిని కుమారులుగా కోరినది. త్రిమూర్తులు వారి అంశమున పుత్రులు పుడతారని వరమిచ్చిరి. ఈ విధంగా చంద్రుడు, దుర్వాసుడు, దత్తాత్రేయుడు ఈమె గర్భమున జన్మించిరి.

రామాయణంలో సీతారామలక్ష్మణులు ఈ అత్రిఅనసూయలు ఆశ్రమాన్ని సందర్శించారు. అనసూయ సీతకు సతీధర్మాలను బోధించి వాడని పూలను, సర్వమంగళమైన చీరను ఇచ్చెను.

ఆ. **సతీ సావిత్రి :** అల్పాయుష్కుడైన సత్యవంతునితో సావిత్రికి వివాహం జరిగింది. వివాహమైన కొద్దికాలానికే మరణం ఆసన్నమయింది. సత్యవంతుని తలను తన ఒడిలో పెట్టుకొని సేవలు చేస్తుంది. అంతలో యమధర్మరాజు సత్యవంతుని ప్రాణాలు తీసుకెళ్ళడానికి వచ్చాడు. తన భర్తప్రాణాలు తీసుకొని వెళ్ళవద్దని యమధర్మరాజును అనేక విధాలా వేడుకొంది. యమధర్మరాజు భర్తప్రాణాలు తప్ప ఏవైనా వరాలు కోరుకొమ్మన్నాడు. తన అత్తమామలకు అంధత్వం పోయి దృష్టి కలగాలని ఒక వరమూ, వారికి రాజ్యం కలగాలని ఒక వరమూ కోరుకుంది. ఆ వరాలను ఇచ్చినా తన పతి ప్రాణాలు ఇచ్చినంతవరకూ యమధర్మరాజును వెంటబడుతూ వెళ్ళింది. చివరకు ఆమె పతిభక్తికి మెచ్చి సత్యవంతుని ప్రాణాలను తిరిగి ఇచ్చి యమధర్మరాజు వెళ్ళిపోయాడు.

ఇ. **సుమతి :** కౌశికుడను కుష్ఠిరోగభార్య సుమతి. మహాపతివ్రత. ఒక రాత్రి తన భర్తను భుజములపై కూర్చుండబెట్టుకొని తీసుకొని వెళ్ళుచుండగా అతని కాళ్ళు మాండవ్యుడనే మహామునికి తగిలింది. అప్పటికే యమధర్మరాజుచే కొఱత (శూలంపై కూర్చుండబెట్టడం) వేయబడిన మాండవ్యుని పుండురేగింది. అతను కోపంతో తనపుండురేపినవాడు సూర్యోదయానికి మరణించాలని శపించాడు. ఆశాపాన్ని విన్న సుమతి తన పాతివ్రత్య మహిమతో సూర్యోదయాన్ని ఆపివేసింది. దేవతలు ప్రార్థించగా కొంతకాలానికి సూర్యోదయానికి అనుమతించింది. సూర్యోదయమయింది. కౌశికుడు మరణించాడు. మహాపతివ్రత అనసూయ వచ్చి కౌశికుని బ్రతికించింది.

**పులస్త్యబ్రహ్మసంతానం :** బ్రహ్మమానసపుత్రుడు పులస్త్యబ్రహ్మ, ఇతని కుమారుడు విశ్రావసుడు. అతని భార్య కైకసి. వీరి సంతానమే రావణుడు, కుంభకర్ణుడు, విభీషణుడు, శూర్పణఖ.

**శివాజీ :** ఛత్రపతి శివాజీ, షహాజీ, జీజియాబాయిల పుత్రుడు. మహారాష్ట్రప్రాంతాన్ని పరిపాలించిన ధీరుడు. హైందవ సామ్రాజ్యాన్ని సమర్థరామదాసు ఆదేశానుసారం ఔరంగజేబు మొదలైన మొగలాయిల నుండి కాపాడిన వీరుడు. భోంసలేశ వంశానికి చెందినవాడు. గొప్పదేశభక్తుడు. భవానీ భక్తుడు.

**యవన దేశం :** తురుష్కులు పరిపాలించిన ప్రాంతం

**యవన కాంత :** ముస్లింజాతికి చెందిన స్త్రీ

**సోన్‌దేవుడు :** శివాజి సామ్రాజ్యానికి సైనికాధికారి.

**ఆధునిక పంచకావ్యాలు :** రాణాప్రతాపసింహచరిత్ర, వందేమాతరం, ఆంధ్రపురాణం, పోతనచరిత్ర, శివభారతం.

## 4. జానపదుని జాబు

**- డా॥ బోయిభీమన్న**

ఆధునిక సాహిత్యంలో సంప్రదాయ కవిత్వాన్ని, నూతన ప్రక్రియలనూ సమర్థంగా నిర్వహించిన డా॥బోయిభీమన్న దళితుల అభ్యుదయాన్ని, ఉన్నతినీ మనసారాకోరుకొని, ఆ మార్గంలో సఫలీకృతుడైన సాహితీవేత్త. గ్రామీణ జీవనాన్ని అనుభవించిన భీమన్న పేదల జీవితాల్లోని సాధక బాధకాలను కళ్ళకు గట్టినట్లు వర్ణించారు.

ప్రక్రియరీత్యా ఇది లేఖ. లేఖలు కేవలం సమాచార వినిమయానికి పరిమితంగాక రాజకీయ, చారిత్రక, సాహిత్యాంశాలను ప్రతిఫలింపజేయడం మనకు తెలుసు. ఆధునిక సాంకేతిక విప్లవం ధాటికి లేఖా ప్రక్రియ కకావికలమైపోయినా వాటి సాహితీ విలువలు సార్వకాలికమైనవి. ప్రేరణదాయకమైనవి. లేఖ మన స్నేహితుడు. ఆత్మీయుడు కళ్ళఎదుట నిలుచొని మనతో మాట్లాడుతున్నంత చక్కని అనుభూతిని కలిగించేట్లుగా ఉండాలి. మన శ్రేయోభిలాషి మనకోసం ఎన్నో మంచి విషయాలు చెబుతున్నట్లుండాలి. మనసులో ఏమాలిన్యం లేకుండా స్వచ్ఛంగా తన భావాలను ప్రకటించాలి. లేఖలు కలకాలం భద్రంగా దాచుకొని కావాలనుకున్నప్పుడల్లా చూసుకొని సేదదీరడానికి ఉపకరించేటట్లుగా ఉండాలి.

అటువంటి లేఖారచనపట్ల ఆసక్తిని పెంచి, గ్రామీణజీవనం పట్ల సదవగాహన, ఆదరణ కల్గించడం ఈ పాఠం ద్వారా సాధింపబడాలి. పాత్రోచిత సంభాషణ, విషయవివరణ, కథనం.... ఇత్యాదులు లేఖలో ఎట్లా చొప్పించవచ్చో పిల్లలు గ్రహించేటట్లు చేయగల్గాలి.

## విశేషాంశాలు

**పురిటిలోనే సంధి కొట్టడం :** ప్రారంభంలోనే విఘాతం కలగటం. సన్నిపాత జ్వరము / టైఫాయిడ్ జ్వరాన్ని సంధి అంటారు. జ్వరం తీవ్ర దశలో ఉన్నపుడు మతి స్థిమితం తప్పి మాట్లాడే మాటలను సంధి వాగుడు అంటారు. పుటకలోనే కొందరికి ఈ దశ వస్తుంటుంది. ఒక పని మొదలు పెట్టగానే ఆటంకాలవల్ల ఆగిపోయే సందర్భంలో ఈ పలుకుబడిని ఉపయోగిస్తారు.

**కరకట్టు :** కరెక్ట్ (correct)అనే ఆంగ్లపదాన్ని కొందరు గ్రామీణులు ఇలా పలుకుతారు.

**దమ్మిడీ :** స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా పదేళ్ల దాకా రూపాయికి పదహారు అణాల పద్ధతిలోనే భారతీయ ద్రవ్య విధానం ఉండేది. అర్ధ రూపాయికి 8 అణాలు, పావలాకు 4 అణాలు. రెండు పరకలు లేదా 4 కానులు ఒక అణా. అణాలో 12వ వంతు ఒక దమ్మిడీ. 2 అణాలు ఒక బేడ.

**అంతర్వేది వెళ్ళగానే :** అంతర్వేదిలోని లక్ష్మీనరశింహస్వామి కళ్యాణం మాఘశుద్ధ ఏకాదశినాడు జరుగుతుంది. అంతర్వేది వెళ్ళగానే అంటే మాఘశుద్ధఏకాదశి వెళ్ళగానే అని అర్ధం.

## 5. శతక మధురిమ

**- శతక కవులు**

సంప్రదాయ కవిత్వాన్ని ఆరాధించినవాళ్ళు. ఆస్వాదించినవాళ్ళు. అనుసరించినవాళ్ళు చాలామంది కవులు శతకప్రక్రియద్వారా తమ భావాలను ప్రకటించినవాళ్ళే. శతకంలో ఏ పద్యానికాపద్యం ప్రత్యేకభావాన్ని ప్రకటించడానికి అనువుగా ఉండటం దీనికి ముఖ్యకారణం.

శతకాల్లో సమకాలీన సామాజికాంశాల విమర్శ సాధారణంగా కనిపించే లక్షణం. ఇది విద్యార్థులను ఆకట్టుకొంటుంది. తన చుట్టూఉన్న సమాజాన్ని విమర్శనాత్మకంగా చూడటం. విశ్లేషించడంతోపాటు, పద్యధారను, లయను గ్రహించగల్గితే రచన చేయాలనే ప్రేరణకూడా కల్గుతుంది.

ఈ పాఠంద్వారా విలువలు గ్రహించడం, దైనందిన జీవితంలో వినియోగించడంతోపాటు చూసిన, చదివిన, గ్రహించిన అంశాలను సవిమర్శకంగా విశ్లేషించేగుణాన్ని పిల్లల్లో జాగృతం చేయాలి.

## విశేషాంశాలు

**బృహస్పతి :** దేవతల గురువు. అంగిరసుడి కొడుకు. ఉతథ్యుడు, సంవర్తనుడు ఇతడి సోదరులు. బృహస్పతి భార్య తార. ఇతడికి శంయుడు అనే కొడుకున్నాడు. శుక్రనీతి,కణిక నీతి లాగా బృహస్పతి నీతి సూత్రాలు ప్రసిద్ధి చెందాయి.

**చింతామణి :** కోరిన కోర్కెలను తీర్చే మణి. ఇంగ్లీషులో wishfulfilling gem అంటారు.బౌద్ధ సాహిత్యానికి చెందిన ప్రజ్ఞాపారమిత గ్రంథం నాగరాజు శిరస్సు నుంచి ఈ మణిని పొందవచ్చని చెబుతుంది. ఇదే గ్రంథంలోని మరొక ప్రకరణం చింతామణి బుద్ధుడి అవశేషాల పరివర్తిత రూపం - అని వివరిస్తుంది.

- **శైవ పండిత త్రయం :** శ్రీపతి పండితుడు, మల్లిఖార్జున పండితారాధ్యుడు, శివలెంక మంచెన.
- **శైవ కవిత్రయం :** నన్నెచోడుడు, మల్లిఖార్జున పండితారాధ్యుడు, పాల్కురికిసోమన.
- **భాగీరథి :** భగీరథుని ప్రయత్నం చేత భూలోకమునకు తీసుకురాబడినది గంగ.
- **జాహ్నవి :** జహ్నుమహర్షిచేత త్రాగి విడువబడినది గంగ.
- **అంతరింద్రియాలు :** మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం
- **బాహ్యాఇంద్రియాలు :** కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మం.

## 6. నేనెరిగిన బూర్గుల

**- పి.వి.నరసింహారావు**

పరిచయం అవసరంలేని రాజకీయ దురంధరులు, బహుభాషాకోవిదులు, సాహితీవేత్త శ్రీపాములపర్తివేంకట నరసింహారావుగారు. ఆయనకు గురుతుల్యులైన బూర్గుల రామకృష్ణారావు గురించి స్ఫూర్తిదాయకమైన వ్యాసాన్ని అందించారు.

ఆవగింజమొదలు అణువిస్ఫోటనం వరకు ఏ విషయాన్నైనా వ్యాసం ద్వారా వివరించవచ్చు. వస్తువు, సందర్భం అనేవి వ్యాసాల్లోని వైవిధ్యతకు కారణం. జీవితానుభవాలను ఆధారం చేసుకొని పెద్దల జీవిత విశేషాలను వివరించడం ఎలాగో విద్యార్థులకు అవగాహన కల్గుతుంది. వచనరచన మధురంగా ఉండటానికి ఉపయోగించే భాష, శైలి ప్రముఖ భూమిక వహిస్తాయని గ్రహిస్తారు. ఇతివృత్తాన్ననుసరించి వ్యాసరచనలో వైవిధ్యం ప్రదర్శించగల్గేటట్లు పిల్లలకు అవగాహన కల్పించాలి.

### విశేషాంశాలు

**వామనుడు :** వామనుడు అదితి కశ్యపుల కొడుకు. కశ్యపుడికి పూర్వ జన్మలో విష్ణువిచ్చిన వరం వల్ల విష్ణువే వామనుడిగా పుట్టాడు. ఇతడు మిక్కిలి పొట్టివాడు. బలి చక్రవర్తి ముల్లోకాలనూ ఆక్రమించుకొని పరిపాలన చేస్తున్నపుడు వామనుడక్కడికి వచ్చి మూడడుగుల భూమిని దానంగా అడిగి విశ్వరూపాన్ని ధరించి ఒక పాదంతో భూమిని, మరో పాదంతో ఆకాశాన్ని ఆక్రమించాడు. మూడవ పాదాన్ని బలి తలపై ఉంచి అతణ్ణి పాతాళానికి అణగద్రొక్కాడు. పొట్టిగా ఉన్నా కూడా గొప్ప గొప్ప పనులు చేసే వారిని ఇలా పిలవడం కద్దు.

**కారాలు – మిరియాలు నూరటం :** ఒకరిపై మండిపడటం. రెండూ మంట పుట్టించేవే. ఈ రెంటిని కలిపితే వచ్చే ఫలితం అనూహ్యం. తీవ్రమైన ఆవేశాన్ని వెళ్లగక్కుతున్నాడని చెప్పే సందర్భంలో ఈ జాతీయం వాడుతారు.

**శ్రీరామరక్ష :** *శ్రీరాముడు దుష్ట శిక్షణకు, శిష్ట రక్షణకు కంకణం కట్టుకున్నాడు. ఆపదలో ఉన్నవారిని రక్షించడమే ఆయన పని. ప్రజల క్షేమమే తన ప్రధాన కర్తవ్యమని, అందుకోసం రాజ్యాన్ని, అవసరమయితే తన ప్రాణాలను త్యాగం చేస్తానని ప్రతిజ్ఞ చేశాడు. అలానే ప్రజా పాలన చేశాడు. ఆయన పాలనలో ప్రజలకు ఎలాంటి కష్టాలు లేవు. అందుకనే రామరాజ్యం సుఖ శాంతులు కలిగిస్తుందని లోకంలో అంతా చెప్పుకోవడం జరిగింది.*

*ఒకరోజు శ్రీరాముడు అయోధ్యలో కొలువు దీరి ఉండగా వృద్ధులైన బ్రాహ్మణ దంపతులు చనిపోయిన తమ పసిపిల్లవాడిని తెచ్చి రాముని ఎదుట ఉంచారు. రామా! నీ రాజ్యంలో ఎలాంటి అధర్మం జరగదని అంతా అంటారు కదా! చూడు, తల్లి దండ్రుల ఎదుటనే ఈ పసి పిల్లవానికి చావు తటస్థించింది. ఇది ఘోరమయిన విషయం కదా అని వారు దుఃఖించారు. అప్పుడు రాముడు ఈ అధర్మానికి తానే బాధ్యుడనని చెప్పి ఈ అక్రమం జరగటానికి కారణం ఏమిటో తెలుసుకొని రమ్మని భటులను రాజ్యంలో నలుమూలలకూ పంపాడు. తాను కూడా రథం మీద బయలుదేరాడు. ఒకచోట శంబూకుడు అనేవాడు బొందితో స్వర్గానికి పోవాలన్న ఆలోచనతో ఘోరమయిన తపస్సు చేస్తూండటం రాముడు చూశాడు. తపస్సు చేయడానికి అర్హతలేని శంబూకుడు అలా తపస్సు చేయడం వల్లనే బ్రాహ్మణ బాలుడు చనిపోయాడని శ్రీరాముడు గ్రహించాడు. వెంటనే శంబూకుని సంహరించాడు. శాపవశాన జన్మించిన శంబూకుడు రాముని చేతిలో మరణించి దివ్య రూపంతో స్వర్గానికి వెళ్లాడు. అపుడు ఇంద్రాది దేవతలు వచ్చి వరం కోరమని రాముణ్ణి అడిగారు. చనిపోయిన బ్రాహ్మణ బాలుని తిరిగి బ్రతికించమని రాముడు దేవతలను ప్రార్థించాడు. దేవతలు ఆ బ్రాహ్మణ కుమారుని బ్రతికించారు. అంతేకాక రామా ! నీ రాజ్యంలో ఎవరికీ, ముఖ్యంగా బాలలకు ఆయుర్దాయ లోపం ఎప్పుడూ ఉండదు. నీ పేరు చెప్పి దీవిస్తే పిల్లలకు ఆయుర్వృద్ధి కలుగుతుంది అని కూడా దేవతలు వరమిచ్చి వెళ్ళిపోయారు. ఈ కారణం వల్లనే కావచ్చు ఆయుర్వృద్ధి అవుతుందనే నమ్మకంతో తల్లులు పిల్లలకు నీళ్లు పోసిన తరువాత చివరకు 'శ్రీరామ రక్ష, నూరేళ్లాయుష్షు' అని దీవించి చుట్టూ నీళ్లు తిప్పి పోస్తూంటారు. శ్రీరాముడు రక్షగా ఉంటే ఎలాంటి కష్టమూ, ఆపదా రాదన్న విశ్వాసము లోకంలో ఏర్పడింది. (రెంటాల గోపాలకృష్ణ).*

**సామ్రాజ్యవాదం :** ఆర్థిక, సామాజిక తారతమ్యాలు లేని నూతన సమాజ స్థాపన కోసం ప్రయత్నించేది సామ్యవాద వ్యవస్థ. ప్రజల మధ్య అసమానతలను తొలగించి సంఘ జీవన విధానాన్ని సంస్కరించే ప్రయత్నం ఇది చేస్తుంది. సామాజిక జీవనం, పరిపాలనా విధానం, ఆర్థిక విధానాల్లో మార్పు ద్వారా దీన్ని సాధించవచ్చని భావిస్తుంది.

**స్వస్తి చెప్పు :** స్వస్తి అనే పదానికి క్షేమం, పుణ్యం, మంగళం, శుభం అని అర్థాలు. స్వస్తి వాచనం అంటే ఆశీస్సులు తెలిపే మాటలు. రాఘవాస్వస్తి, రావణాస్వస్తి అంటే అందరికీ మేలు కలగాలని కోరుకోవడం. కాలక్రమంలో ఈ మాటకు అర్థం మారిపోయి స్వస్తి చెప్పడం అంటే ముగింపు పలకడం అనే అర్థం వచ్చింది. మంగళం పాడటం అనే పద బంధాన్ని కూడా ఇదే అర్థంలో ఉపయోగిస్తున్నారు. సాధారణంగా స్వస్తి వచనాలు, మంగళం పాటలు కార్యక్రమంలో చివరలో ఉంటాయి. అందువల్ల ముగింపు పలకడం అనే అర్థంలో పై మాటలను వాడుతున్నారు.

**స్థితప్రజ్ఞత :** సుఖ దుఃఖాలకు అతీతంగా ఎలాంటి పరిస్థితులోనైనా ఒకేలా ఉండగల్గడం.

**జాగీర్‌దారీ కుటుంబం :** రాజుగారు బహుమానంగా ఇచ్చిన భూమిని 'జాగీరు' అంటారు. ఆ జాగీరు భూములను అనుభవించే కుటుంబాలను జాగీర్‌దారీ కుటుంబం అంటారు.

**మౌల్వీ :** తురుష్క పండితుడు.

**ముల్లాలు :** ముస్లిం మతగురువులు

**కరణాలు :** ఒకానొక గ్రామాధికారి, పూర్వం ఊరికి, భూములకు కొలతలు, లెక్కలువ్రాయు అధికారి.

**వీసమెత్తు :** ఒకటిలో పదహారవభాగం (అతి తక్కువ భాగము)

## 7. నగరగీతం

**– అలిశెట్టిప్రభాకర్**

అతిసాధారణ జీవితం గడిపిన అసాధారణ ప్రజ్ఞాశాలి ప్రభాకర్. ఆధునిక కవిత్వంలో మినీకవిత/కాలమ్ కవితది ప్రత్యేకమైన స్థానం. పత్రికల మొదటిపేజీలోనే ఈ కవితలను ప్రచురించడం వీటికి గల ప్రాధాన్యతను చెప్పకనే చెబుతున్నది. అల్పాక్షరాల్లో అనల్పమైన భావాలను ప్రకటించడం ఎంతో కష్టమైనపని. దాన్ని సమర్థంగా నిర్వహించినపుడే మినీకవిత సఫలం అవుతుంది. అలిశెట్టి ప్రభాకర్ తాను చెప్పదలచుకున్న విషయాలను ఎంత సూటిగా, ప్రతిభావంతంగా కవితల్లో ప్రకటించాడో విద్యార్థులకు అవగాహన కల్పించాలి. గణ.యతి నిబంధనలు లేకుండా, భావాన్నిబట్టి కవిత్వం అలవోకగా రాయవచ్చునన్న ఆలోచనల్ని పిల్లల్లో ప్రేరేపించాలి. తమచుట్టూఉన్న సమాజాన్ని కవితాత్మకంగా విశ్లేషించే ప్రయత్నం చేయడానికి విద్యార్థులను ప్రోత్సహించాలి.

### విశేషాంశాలు

**నగారా :** పెద్ద ఢంకా. డమరుకం. కంచుతో తయారు చేస్తారు. ఒక విషయాన్ని నలుగురికి తెలియ జేయటానికి దీన్ని మోగిస్తారు.

**నయాగరా :** ఇది ఒక జలపాతం. న్యూయార్కు – కెనడాల మధ్య నయాగరా నదిపై ఉన్న అతి పెద్ద జలపాతం. మూడు జలపాతాలను కలిపి ఇలా పిలుస్తారు.

**పద్మవ్యూహం :** మహాభారతంలో ఉపయోగించిన యుద్ధవ్యూహాలలో ఒకటి. దీన్నే చక్ర వ్యూహమనీ పిలుస్తారు. ఏడు వలయాలతో ఉండి శత్రు ప్రవేశానికి దుర్భేద్యంగా ఉంటుంది. మహా భారతంలో ద్రోణుడు పద్మవ్యూహాన్ని పన్నాడు. దీన్ని ఛేదించే పరిజ్ఞానం శ్రీకృష్ణుడికి, అర్జునుడికి, ప్రద్యుమ్నుడికి, అభిమన్యుడికి తప్ప మరెవరికీ తెలియనిది. యుద్ధంలో గత్యంతరం లేక ధర్మరాజు అభిమన్యుణ్ణి పద్మవ్యూహంలోకి ప్రవేశపెడతాడు. అభిమన్యుడు

ఎలా బయట పడాలో తెలియక ప్రాణాలు వదిలాడు. చాలా చిక్కుతో కూడిన వ్యూహమిది. ఇందులో ప్రవేశించినవారు అంత సులభంగా బయట పడలేరు. అందుకనే ఎవరైనా గొప్ప చిక్కు పరిస్థితుల్లో చిక్కుకుంటే అతడు పద్మవ్యూహంలో చిక్కుకున్నాడని అనడం జరుగుతున్నది. అంటే, అతను సులభంగా బయట పడలేడని అర్థంలో ఈ మాట ఉపయోగించబడుతున్నది. (రెంటాల గోపాలకృష్ణ).

## 8. యక్షుని అప్పు

**- కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ**

తెలుగులో తొలిజ్ఞానపీఠ అవార్డు గ్రహీత కవిసమ్రాట్ విశ్వనాథ్ సత్యనారాయణ కవీంద్రులు. కావ్యం, నవల, నాటకం, కథ, గేయం ఇత్యాదిప్రక్రియల్లో తన సాహితీవిశ్వరూపం ప్రదర్శించిన విశ్వనాథ నాటికల్లో నుంచి ఒక హాస్యనాటికను ఈ పాఠంగా నిర్ణయించారు.

చలనచిత్రాల రంగప్రవేశానికి ముందు ప్రపంచరంగస్థలాన్ని నాటకాలు ఉర్రూతలూగించాయి. ఇప్పుడు చూస్తున్న సినిమాలకు, టీవీ సీరియళ్ళకు మాతృకలు నాటికలే. విద్యార్థుల్లోని నటుల్ని, నటనాసక్తిని జాగృతం చేయడానికి ఈ పాఠం ఉపకరిస్తుంది. గంటలోపు సమయంలో ప్రదర్శించే నాటకాన్నే నాటిక అంటారు. అంకాల విభజన లేకుండా మొత్తం ప్రదర్శన ఒకే దృశ్యంలో ప్రదర్శిస్తే దాన్ని ఏకాంకిక అంటారు. ఈనాటిక ఐదురంగాల్లో ఉంది.

సాధారణంగా సహజత్వానికి భిన్నమైన అంశాలనుండి హాస్యం పుడుతుంది. 'యక్షుని అప్పు' కాల్పనిక కథాంశం. పర్వతం మానవరూపం ధరించి అప్పురాబట్టుకోవడం అనే ఇతివృత్తంలోనే హాస్యం కనబడుతుంది. నాటిక ప్రదర్శించడం. నాటికలోని భాషావిశేషాలను గుర్తించి ఆస్వాదించడం, ఇటువంటి రచనలు చేయడానికి ప్రేరణపొందడం ఈ పాఠం ద్వారా సాధించగల్గాలి.

### విశేషాంశాలు

**కుమార సంభవం :** కవికులగురువు కాళిదాసు రాసిన ప్రసిద్ధ కావ్యం. తారకాసుర సంహారం కోసం శివ పార్వతుల వివాహం జరగడం, కుమారస్వామి జన్మించడం మొదలయిన విషయాలను వర్ణించింది.

**మేఘసందేశం :** కాళిదాసు రచన. శ్లోకాలతో కూడిన ఈ రచనకు సంస్కృత సాహిత్యంలో విశిష్ట స్థానం ఉంది. కుబేరుడి కొలువులో ఉన్న ఒక యక్షుడు ఒక సంవత్సరం పాటు బహిష్కారానికి గురౌతాడు. అతడు ఆ హిమాలయాల్లోని కైలాస గిరికి పైన అలకాపురిలో ఉన్న తన ప్రియురాలికి ఒక మేఘంతో సందేశం పంపిస్తాడు. దారి తెలియడం కోసం అనేక దృశ్యాలను వర్ణిస్తాడు. బహిష్కరింపబడిన యక్షుడు చిత్రకూటం దగ్గర ఉన్న రామగిరి అరణ్యాలలో తిరుగుతూ ఉంటాడు.

**యక్షులు :** సప్తగణాలలో ఒక గణం వారు. సప్త గణాలు ఇవి – (1) ఋషులు, (2) గంధర్వులు, (3) నాగులు, (4) అప్సరసలు, (5) యక్షులు (6) రాక్షసులు (7) దేవతలు. మరొక అభిప్రాయం ప్రకారం – దేవతాగణాలలో ఒకరిగా వీరని భావిస్తారు. వీరి నివాసం అధో లోకాలలో ఒకటైన తలాతలం. వీరి నివాస పర్వతం శతశృంగం. వీరి రాజు కుబేరుడు. వీళ్ల పనుల్లో ఒకటి గుప్త నిధులకు కాపలా కాయడం.

**కుబేరుడు :** యక్షుల రాజు. సిరిసంపదలకు అధిదేవత. ఈయన్నే ధనపతి అని కూడా అంటారు. దిక్పాలకులలో ఒకడు. ఉత్తర దిక్కుకు అధిపతి. ఇతని నగరం అలకాపురి. విశ్రవసుని కొడుకు. ఈతని తల్లి ఇలబిల. ఇతని కొడుకు నలకూబరుడు. లంకానగరం మొదట్లో ఇతడిదే. రావణాసురుడు ఆక్రమించుకోవడంతో శివుడితో స్నేహం చేసి అలకాపురికి వచ్చాడు. కుబేరుడు ధనాధిపతి కాబట్టి కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరుడు వివాహం కోసం కుబేరుడి దగ్గర ఎక్కువ మొత్తంలో డబ్బు అప్పుగా తీసుకుంటాడు. ఆ అప్పును ఇప్పటికీ తీరుస్తూనే ఉన్నాడని నమ్ముతుంటారు.

**విక్రమార్క చక్రవర్తి :** ఉజ్జయినీ దేశాన్ని పరిపాలించిన రాజు. ఇతడి సోదరుడు భర్తృహరి. అతడు రాజ్యాన్ని పాలించి విరక్తి చెంది తపోవనానికి వెళ్తూ విక్రమార్కుడికి రాజ్యాన్ని అప్పగించాడు. అతడి దగ్గర ముసలి తనాన్ని మరణాన్ని పోగొట్టే ఒక ఫలం ఉండేది. భర్తృహరి విరక్తికి మూలకారణం ఆ ఫలమే. దాన్ని కూడా విక్రమార్కుడికే ఇచ్చి వెళ్లాడు. ఆ పండు కథ ఇది. ఒక బ్రాహ్మణుడు చాలా పేదవాడు. ఒక దేవతను నిష్ఠగా పూజిస్తూండేవాడు. ఆమె అతనికి ఒక పండును ఇచ్చి దీని వలన జరామరణాలు ఉండవు అని చెప్పింది. నే నెంతకాలం బ్రతికినా అడుక్కు తిని బతకాల్సిందేకదా! పరోపకారం చేసే రాజు చాలా కాలం జీవించడం మంచిది అని పండును భర్తృహరికి ఇచ్చాడు. భర్తృహరికి భార్య అంటే వల్లమాలిన ప్రేమ. తనకంటే ముందు చనిపోవడం ఇష్టం లేక పండును ఆమెకు ఇస్తాడు. రాజుగారి అశ్వశాలలో గుర్రాలు తోలేవాడిమీద ఆమెకు ప్రేమ. అందుకని పండు వాడికిచ్చింది. వాడు దాన్ని ఒక దాసికి ఇచ్చాడు. ఆ దాసి తన ప్రియుడయిన గోపకుడికి ఇచ్చింది. వాడికి పేడకళ్లు ఎత్తుకొనే ఒక అమ్మాయిమీద ప్రేమ. అందుకని పండు అక్కడికి చేరింది. పేడ బుట్టలో ఉన్న పండును చూసి రాజు ఆరా తీస్తే సంగతంతా బయట పడింది. అందుకని రాజు ఆ పండును స్వాధీనం చేసుకొని విక్రమార్కుడికి ఇచ్చాడు. విక్రమార్కుడికి భేతాళుడు స్నేహితుడు. ఊర్వశి రంభల నృత్య నైపుణ్యంలో తీర్పు చెప్పింది విక్రమార్కుడే. ఆ సందర్భంగా ఇంద్రుడు ఇతడికి మణిమయ సింహాసనాన్ని ఇచ్చాడు. ఆ సింహాసనంలోనే 32 సాలభంజికలు ఉన్నాయి. విక్రమార్కుడి పరాక్రమాన్ని తరువాతి కాలంలో ఆ సాలభంజికలే చెప్పాయి. విక్రమార్కుడి తపస్సుకు శివుడు ప్రత్యక్షమయ్యాడు. అమరత్వం కాకుండా ఏదైనా వరం కోరుకోమన్నాడు. 2½ సం॥ల బాలికకు కొడుకు పుట్టినపుడు తనకు మరణం వచ్చేలా వరం పొందాడు. కొంతకాలానికి ఒక కుమ్మరి వాడి ఇంట్లో 2½ సం॥ల వయస్సు గల ఆడపిల్లకు కొడుకు పుట్టాడు. అతడే శాలివాహనుడు. అప్పుడు విక్రమార్కుడు ప్రాణాలు విడిచాడు. చాలారోజుల తరువాత విక్రమార్కుడి సింహాసనం భోజరాజు వశమయింది.

**ఉరుమురిమి మంగలం మీద పడడం :** సాధారణంగా పాతకుండను తీసుకుని దాని పక్కన చేయి పట్టేంత రంధ్రం చేస్తారు. దాంతో అది ఇంకా బలహీనమౌతుంది. దాన్ని మంగలం అంటారు. మంగలంలో ఎండు మిరపకాయలు పేలాలు వంటివి వేయిస్తారు. అత్యంత శక్తివంతమైన ఉరుము బాగా బలహీనమైన మారుమూల ఉన్న మంగలం

మీద పడటం యాదృచ్ఛిక చర్య. అనుకోని ఒకదానికొకటి సంబంధం లేని విషయం ఏదన్నా జరిగితే ఈ సామెతను వాడతారు.

**కర్కోటకుడు :** కద్రువ కొడుకు వినతాకద్రువలు పందెం వేసుకున్నపుడు ఉచ్చైశ్రవం శరీరం నల్లగా కనబడేట్లు చేయమని కద్రువ తన కొడుకులను కోరింది. ఇలాంటి అన్యాయపు పని చేయలేమని వాసుకి మొ॥వాళ్లు అన్నారు. కర్కోటకుడు మాత్రం తల్లి చెప్పినట్లు విని ఉచ్చైశ్రవాన్ని అంటిపెట్టుకొని ఉన్నాడు. రాజ్యం పోగొట్టుకొని అడవుల్లో తిరుగుతున్న నల మహారాజును కరిచింది కూడా ఈ కర్కోటకుడే. నలుణ్ణి ఎవరూ గుర్తు పట్టకుండా ఉండడానికే కాటువేసి కురూపిని చేశానని చెప్పాడు. ఇతణ్ణి కీర్తిస్తే కలిదోషం తొలగుతుంది.

**కాళిదాసు :** ప్రాచీన సంస్కృతకవి. విక్రమాదిత్యుని ఆస్థానంలోనివాడని పరిశోధకుల భావన. సంస్కృత భాషలో మహాకావ్యాలను, నాటకాలను రచించిన కవి. కాళిదాసు రచనలను పరిష్కరించి వ్యాఖ్యానమందించిన విశిష్టుడు మల్లినాథసురి. కాళిదాసు రఘువంశం.

కుమారసంభవం, మేఘసందేశం, అభిజ్ఞాన శాకుంతలం, విక్రమోర్వశీయం మాళవికాగ్నిమిత్రం మొ॥రచనలు చేశాడు.

**దమ్మిడీ :** ప్రాచీన కాలంలో ద్రవ్యప్రమాణం అయిదు కాసులనాణెం. ఒకపైసగా చలామణిలో ఉండేది.

**ఊర్ధ్వలోకాలు 7 :** భూలోక, భువర్లోక, సువర్లోక, మహర్లోక, జనోలోక, తపోలోక, సత్యలోకాలు

**అధోలోకాలు 7 :** అతల, వితల, సుతల, తలాతల, రసాతల, మహాతల, పాతాళ లోకాలు

## 9. బసవేశ్వర పరిణయం

– పాల్కురికి సోమనాథుడు

అనేక సాహిత్యప్రక్రియలకు ఆద్యుడైన పాల్కురికి సోమనాథ కవీంద్రుని విశిష్టరచన బసవపురాణం. ఇది ద్విపదకావ్యం. ద్విపద పాడుకోవడానికి అనువైన లయ(ఛందస్సు)లో ఉంటుంది. పన్నెండు, పదమూడు శతాబ్దాల్లో సాహిత్యం మౌఖికంగానే ఎక్కువ ప్రచారంలో ఉండేది. పద్యాల్లో సాహిత్యంలో ముందు రగడలు, తరువోజలు, ద్విపదలు ప్రజలనోళ్ళలో నానుతూ ఉండేవి. అందుకే సామాన్యులకు అందుబాట్లో ఉన్న ద్విపద ప్రక్రియ ద్వారా బసవపురాణాన్ని ప్రచారం చేయడానికి పూనుకున్నాడు పాల్కురికి సోమనాథుడు.

వీరశైవమత ప్రచారంతోపాటు శ్రమజీవన సౌందర్యాన్ని, సర్వమానవసమానత్వాన్ని చాటాడు పాల్కురికి. బసవేశ్వరుని పరిణయం సందర్భంగా ప్రదర్శించిన కళల్ని, సంప్రదాయాలను కవి ఇందులో వివరించాడు. దీనివల్ల వివాహసంప్రదాయాల పట్ల అవగాహన. ఆనాటి వివాహాది వేడుకల్లో కళలకున్న ప్రాధాన్యం విద్యార్థులు గ్రహిస్తారు. ప్రజలకు అనువైనరీతిలో, ఆస్వాదించే విధంగా (పండిత పామర రంజకంగా) రచనలు చేయాలని, అవే అందరి నాలుకల మీద నిలుస్తాయని, హృదయాల్లో శాశ్వతస్థానం సంపాదిస్తాయని గ్రహించేటట్లు చేయాలి. ఇది విద్యార్థుల సృజనశక్తిని పదునెక్కిస్తుంది.

## విశేషాంశాలు

**మణిప్రవాళం :** భిన్న భాషా పదాల మేళవింపు, తండులాని గృహమందు నసిన్తి / తిండికైతే పదిమంది వసన్తి ॥ అనే శ్లోకం మణిప్రవాళ శైలికి ఉదాహరణ. ఇందులో తండులాని అనే సంస్కృత పదాన్ని, తరువాత గృహమందు అనే తెలుగు విభక్తితో ఉన్న పదాన్ని వాడారు.

**కోలాటం :** కోలా అంటే కర్రపుల్ల అని అర్థం. కోలాటం అంటే కర్రపుల్లలతో ఆడే ఆట అని అర్థం. ఇందులో ఇద్దరు లేదా అంతకన్న ఎక్కువ మంది రెండు చేతుల్లో కర్ర ముక్కలు పట్టుకొని పాటలు పాడుతూ గుండ్రంగా తిరుగుతూ లయాత్మకంగా అడుగులు వేస్తూ కర్ర ముక్కలు తాకించుకుంటూ ఆడుతారు. తిరునాళ్లలో, జాతర్లలో, ఉత్సవాల్లో బహిరంగంగా ఆడతారు. పాల్కురికి సోమన దీన్ని కోలాట గొడియ అన్నాడు. ఇది జానపదకళ.

**మకర తోరణములు :** మొసలి ఆకృతిలో నిర్మించిన తోరణాలు, అర్ధచంద్రాకృతిలో ద్వారానికి పైభాగంలో నిర్మిస్తారు.

**కస్తూరి :** ఒక పరిమళ ద్రవ్యం. మృగము నాభినుండి తీయబడిన సువాసనాభరిత పదార్థం.

**విభూతి వీద్యం :** వీద్యము అంటే తాంబూలం(విడెము), వీరశైవాచారులో జంగమదేవరలను, గురువులను, పీఠాధిపతులను ఆహ్వానించేటపుడు విభూతి కలిపి సమర్పించే తాంబూలమే విభూతివీద్యం. తెల్లని వస్త్రంలో విభూతితోపాటు తమలపాకులు, వక్కలు, ఖర్జూరపళ్ళు పెట్టి ఇస్తారు.

**గొండ్లి :** కోలాటంవంటిదే ఈ ఆటకూడా. నర్తకులు వృత్తాకారంలో నిలబడి తాళ లయానుగుణంగా చేసే నృత్యక్రీడ.

**పేరిణి :** యుద్ధ సన్నద్ధుల్ని చేయడానికి, వీరభక్తిని ప్రదర్శించడానికి పురుషులు చేసే నాట్యం.

**సాష్టాంగ నమస్కారం :** శరీరంలోని 8 భాగాలు నేలకు తాకేవిధంగా ప్రణామంచేయడం, 1.ఉరం (ఱొమ్ము), శిరం, శ్రవణచక్షురింద్రియాలు, చేతులు, పాదాలు, నోరు, ఉదరం

**దండనాయకుడు :** (పురుషులకు మాత్రమే ఉద్దేశించబడినది) సేనానాయకుడు. కీలకమైన పనుల్ని పర్యవేక్షించువాడు.

## 10. మాప్రయత్నం

**– ఓల్గా, వసంతకన్నాబిరాన్, కల్పనకన్నాబిరాన్**

స్త్రీవాద కవయిత్రులు / రచయిత్రులుగా పేరెన్నికగన్న ఓల్గా, వసంతకన్నాబిరాన్, కల్పన కన్నాబిరాన్‌ల సంపాదకత్వంలో వెలుగులోకొచ్చిన 'మహిళావరణం' గ్రంథానికిగల పీఠిక సంక్షిప్తరూపమే. 'మా ప్రయత్నం' పాఠం.

ఈ పాఠంలోకి ప్రవేశించడానికి ముందు 'స్త్రీవాదం' పట్ల అవగాహన ఏర్పడాలి. 1975-85 ప్రపంచ మహిళా దశాబ్దంగా ప్రకటించడం, పాశ్చాత్య దేశాల్లో ప్రారంభమైన 'ఫెమినిజం' ప్రపంచదేశాలన్నిటికీ విస్తరించడం, స్త్రీవాద

రచనలు స్త్రీలు మాత్రమే చేయాలనడం, వివిధరంగాల్లో ప్రతిభ చూపిన స్త్రీలను గుర్తించడం, అపరిమితమైన స్త్రీల శక్తియుక్తులను గుర్తించి గౌరవించడం – మొదలగు భావాలపట్ల ఉపాధ్యాయులకు సానుకూలమైన, స్పష్టమైన అవగాహన ఉండాలి.

స్త్రీలను గౌరవించడం, వాళ్ళ ప్రతిభావ్యుత్పత్తులను గుర్తించడం, పురుషులతో సమానమనే ఆలోచన కల్గించడం విద్యార్థుల హృదయాల్లో నెలకొనాలి. ఒకపుస్తకనిర్మాణం వెనుకున్న సాధక బాధకాలు, లోతైన ఆలోచనలు, పరిశోధనాత్మక దృక్పథం పిల్లలకు అవగాహన అయితే – ఇది పాఠశాల సంచికల సంపుటులను తయారుచేయడానికి, పుస్తకానికి ముందుమాట రాయడానికి, సమీక్షలు – నివేదికలు తయారు చేయడానికి ఉపకరిస్తుంది.

## విశేషాంశాలు

**జగన్నాథ రథ చక్రాలు :** భువనేశ్వర్‌లోని పూరీ జగన్నాథుని రథయాత్ర ప్రసిద్ధమైంది. 45 అడుగుల ఎత్తుతో 16 చక్రాలతో జగన్నాథుడి రథం ఉంటుంది. జగన్నాథుడి ఆలయంలో కులమత భేదాలకు తావులేదు. ఆ కార్యక్రమంలో అందరూ పాల్గొనవచ్చు. అదొక సమసమాజ లక్షణానికి నిదర్శనం. 'ఆచారాలు మంటకలిశాయి' అనే సందర్భంలో 'సర్వం జగన్నాథం' అని అంటూంటారు. శ్రీశ్రీ జగన్నాథుని రథ చక్రాలను పీడిత సమాజ విముక్తికి సాధనంగా భావించాడు.

**పితృస్వామ్యం :** ఆంగ్లంలో దీన్ని పేట్రియార్కి అంటారు. పితృస్వామ్యం అంటే తండ్రి అధికారిగా ఉండటం. ఇక్కడ పురుషులు కుటుంబంలో, సమాజంలో స్త్రీలపై పెత్తనం చెలాయిస్తారు. దీన్ని పురుషస్వామ్యం అని కూడా అంటారు. 'స్త్రీ అబల అనే దృక్పథంతో రచన చేయడం పితృస్వామ్య దృక్పథం అవుతుంది' అని స్త్రీ వాదుల అభిప్రాయం.

**గ్లోసరీ :** ఒక పుస్తకానికి సంబంధించిన ప్రత్యేక పారిభాషిక పదాలను వివరిస్తూ గ్రంథాంతంలో ఇచ్చే వివరణల పట్టికను గ్లోసరీ / పారిభాషిక పదకోశం అంటారు. ఒక పదం ఒక ప్రత్యేక రంగంలో ఏ అర్థంలో వాడబడిందో తెలుసుకోవడానికి గ్లోసరీలు ఉపయోగపడతాయి.

**తాపత్రయం :** ఆదిదైవికం, అధిభౌతికం, ఆధ్యాత్మికం ఈ మూడింటిని తాపత్రయంగా పేర్కొంటారు. కానీ వ్యవహారంలో ఆరాటానికి పర్యాయపదంగా తాపత్రయాన్ని ప్రయోగిస్తున్నాం.

## 11. మాణిక్యవీణ

**– విద్వాన్ విశ్వం**

ప్రముఖ పత్రికాసంపాదకులు, కవి, విమర్శకులు, పరిశోధకులు విద్వాన్ విశ్వంగారి పత్రికాశీర్షిక 'మాణిక్యవీణ'. ఇది ఆంధ్రప్రభ వారపత్రికలో నిర్వహించారు.

పత్రికలో శీర్షిక నిర్వహించడం అంటే – ఏదైనా ఒక ప్రత్యేకమైన పేరుతో క్రమం తప్పకుండా ప్రతివారం / మాసం సంబంధితాంశాలమీద రచనలు చేయడం. సమకాలీన సామాజికాంశాలను ఈ రచనలు ప్రతిబింబిస్తాయి. విమర్శిస్తాయి.

విశ్లేషిస్తాయి. ఆయా అంశాలపట్ల పాఠకులను జాగృతం చేస్తాయి. 'మాణిక్యవీణ' శీర్షికన విశ్వంగారు రచించిన కవితలు, వ్యాసాలు ఆలోచనాత్మక, రసాత్మక భావాలను మేల్కొల్పుతాయి.

వచనకవిత కేవలం మాటల కూర్పు గాదని, ధ్వని, వ్యంగ్యం, అలంకారం, విరుపులతో పాఠకుల హృదయాన్ని కదిలించి, మెదడుకు పదును పెట్టడమని ఈపాఠం నిరూపిస్తుంది.

పిల్లల్లో వచనకవితను అర్థం చేసుకునే విధానాన్ని పెంపొందించడం, శీర్షిక నిర్వహణ. పత్రికల్లో శీర్షికల పట్ల అవగాహన పెంచడం, రచనాశక్తిని ప్రోత్సహించడం ఈ పాఠం ద్వారా సాధింపబడాలి.

## విశేషాంశాలు

**మంత్రాలకు చింతకాయలు రాలడం :** మంత్రాలకు చింతకాయలుల రాలతాయని పూర్వం ఒకడు జనులను మోసం చేశాడు. ఇక్కడ మోసపుచ్చిన వాడికన్నా మోసపోయిన వాడినే నిందించాలి. మంత్రశక్తి గొప్పదే. శబ్దానికున్న శక్తి అపారమైనదే. ఈ రోజుల్లోనూ రాగాలతో రోగాలు నయం చేసే వాళ్లు కనిపిస్తూనే ఉన్నారు. కానీ అటువంటి మహత్తర శక్తి కలిగిన మంత్రాలతో చింతకాయలు రాలుస్తానని మోసపుచ్చేవారిని నమ్మకూడదు. చింతకాయలు రాల్చడానికి మంత్రాలను ఉపయోగించాల్సిన పనిలేదు. కపట స్వాములను దృష్టిలో పెట్టుకొని ఈ సామెత వచ్చి ఉంటుంది.

**పుట్ట కురుపు :** క్యాన్సర్ వ్రణం.

**కలమ ధాన్యం :** మేలిరకం బియ్యం. కలమము అన్నా ఇదే అర్థం.

**మహాప్రస్థానం :** ప్రస్థానం అంటే ప్రయాణం. తరలి పోవడం. మహా ప్రస్థానం అంటే దీర్ఘ ప్రయాణం. మహాభారతంలో మహా ప్రస్థాన పర్వం ఉంది. మహా ప్రస్థానం అంటే శరీర పతనం అయ్యే వరకూ యోగ సిద్ధితో సాగించే నిరంతర గమనం అనే అర్థం కూడా ఉంది. కానీ ఈ సందర్భంలో మానవ జాతి అనాదిగా చేస్తున్న, కొనసాగిస్తున్న ప్రయాణమే మహాప్రస్థానం.

**జ్ఞానం :** బుద్ధి

**విజ్ఞానం :** శాస్త్రసంబంధ బుద్ధి

**ప్రజ్ఞానం :** మోక్షసంబంధ బుద్ధి

## 12. గోరంతదీపాలు

- పులికంటి కృష్ణారెడ్డి

బుర్రకథ చెప్పడంలో ఎంత ప్రసిద్ధుడో కథానికారచనలోనూ అంతే లబ్ధప్రతిష్ఠుడు పులికంటి కృష్ణారెడ్డి. ఆయన 'కథావాహిని' లోని కథానిక 'గోరంతదీపాలు'

శీర్షికలోనే 'ప్రయత్నఫలం' ఎంత గొప్పగా ఉంటుందో (గోరంతదీపం - కొండంత వెలుగు) తెలుస్తున్నది కదా! కథానికలో 'సంఘటనల మధ్య సంబంధాన్ని కళాత్మకంగా చిత్రించడం' అనే లక్షణం ఈ కథానికలో ఎట్లా నిర్వహింపబడిందో గమనించండి. కథానిక రచనలోని కథనం, సంభాషణలు, పాత్రచిత్రణ వాస్తవిక చిత్రణ తదితర లక్షణాలతో ఈ కథానికను సమన్వయం చేసి చూడండి. ఏదైనా ఒక కథ రాయాలన్న సంకల్పం పిల్లల్లో పాదుకునేట్లు చేయండి.

సకల ప్రాణులను తనతో సమానంగా భావించడం, సమానంగా ప్రేమించడం, వృద్ధికోసం ప్రయత్నించడం అనే లక్షణాలు మానవత్వానికి ప్రతీక. ఇవే మనుషులమధ్య ఆరోగ్యకర సంబంధాలను నెలకొల్పి, సమాజాన్ని సుఖశాంతిమయం చేస్తాయి. పరస్పర ఆదర భావాన్ని పెంపొందిస్తాయి. దీనులపట్ల అనాథులపట్ల, బాధితులపట్ల సహానుభూతితో ప్రవర్తించాలన్న సహృదయతను ఈ పాఠం మేల్కొలుపగలగాలి.

**తంబుర :** ఇది ఒక తంత్రీ వాయిద్యం. సొరకాయ బుర్రతో కూడా దీన్ని తయారు చేస్తారు. ఒకటి లేదా రెండు తంత్రులు ఉండవచ్చు. తత్త్వాలు పాడేవాళ్లు ఎక్కువగా వాడుతారు. దీన్ని వాడటానికి పక్క వాయిద్యాదులతో పనిలేదు. తాళాలున్నా సరిపోతుంది. కర్రతో చేసిన తంబురను బుర్రకథకులు, ఒగ్గుకథకులు ఉపయోగిస్తారు. దీన్ని పక్క వాయిద్యాలతోనే ఉపయోగిస్తారు. దీనికి పక్క వాయిద్యంగా గుమ్మెత ఉంటుంది.

**తోలు బొమ్మలు :** స్వతంత్ర వ్యక్తిత్వం లేకుండా ఒకరి చెప్పుచేతల్లో బతికేవారిని తోలుబొమ్మలు అని వ్యవహరిస్తారు. జానపద కళారూపమైన తోలుబొమ్మలాట ఈ పదబంధ సృష్టికి మూలం. తోలుబొమ్మలాటలో తోలు బొమ్మలను తయారు చేసి దీప కాంతిలో వాటి నీడలు పడేలా చేసి బొమ్మలాటను ప్రదర్శించేవారు. సూత్రధారుడు తోలు బొమ్మలను దారంతో ఆడిస్తూండేవాడు.

**గిజిగాడి గూడు :** గిజిగాడు అనేది ఒక పక్షి. ఆంగ్లంలో దీన్ని *Weavers Bird* అంటారు. ఇవి ఒకరకం పిచ్చుకలు. వీటి గూటి నిర్మాణ సామర్థ్యం అత్యద్భుతం. తాటి నార, పీచు, గడ్డి మొదలయిన వాటితో గూడు అల్లుతుంది. వీటి గూళ్లు తలక్రిందులుగా చేసిన కిరసనాయిలు దీపం చిమ్నీలుగా ఉంటాయి. చిక్కు ముళ్లుగా, చిందరవందరగా ఉండే దాన్ని గిజిగాడి గూడు అనడం పరిపాటి.

**కొడిగట్టిన దీపం :** ఆరిపోవడానికి సిద్ధంగా ఉన్న దీపం. ఆముదం, కిరోసిన్ మొదలగువాటితో వెలిగించే దీపాలు కొంతసేపటికి కొడిగడతాయి. అంటే ఒత్తి చివర నల్లటి మసి పేరుకొని పోతుంది. ఇది దీప జ్వలనానికి అవరోధాన్ని కలిగిస్తుంది. చమురు అయిపోయిన సందర్భాల్లో కూడా ఇలా జరుగుతుంది. కొడిగట్టిన దీపాలు అంటే జీవిత చరమాంకంలో ఉన్నవారు అని అర్థం చెప్పుకోవచ్చు.

# 13. భిక్ష

**- శ్రీనాథుడు**

సంప్రదాయ సాహిత్యంలో మకుటంలేని మహారాజులా వెలుగొంది 'కవిసార్వభౌము'డనిపించుకున్న ప్రజ్ఞాశాలి శ్రీనాథకవి. వైవిధ్యభరితమైన రచనలతో సాహితీక్షేత్రాన్ని సుసంపన్నం చేసిన ధీశాలి. శ్రీనాథుని రచనల్లో కాశీఖండం, భీమఖండం విశిష్టరచనలు.

శ్రీనాథుని శైలితోపాటు కాశీపట్టణంలో వ్యాసుడు అనుసరించిన భిక్ష సంస్కృతిపట్ల అవగాహన పెంచుకోవాలి. కాశీవిశిష్టతను, గురుశిష్యసంబంధాన్ని, సహనగుణాన్ని తెలియజేస్తూ శ్రీనాథుని పద్యశైలి విద్యార్థులు గ్రహించేటట్లు చేయాలి.

'అతిథిదేవోభవ' అన్న మాటకు భారతీయజీవన విధానంలో ఎంతో ప్రాముఖ్యత ఉన్నదన్న విషయం విద్యార్థులు గ్రహించేటట్లు చేయాలి.

## విశేషాంశాలు

**బ్రాహ్మీ ముహూర్తం :** సూర్యోదయానికి 90 ని॥ల ముందు కాలాన్ని బ్రాహ్మీ ముహూర్తం అంటారు. బ్రాహ్మీ అంటే సరస్వతి అని కూడా అర్థం. బుద్ధిని పెంపొందించే సమయం కాబట్టి దీనికి ప్రాధాన్యం ఏర్పడింది. ఆధ్యాత్మికంగా, ఆరోగ్యపరంగా ఈ సమయం శ్రేష్ఠమైనది.

**ప్రాతర్మాధ్యాహ్నిక విధులు :** వ్యక్తి త్రివిధ ఋణాలను తీర్చుకోవడం కోసం నిత్య కర్మలు చేయాలి. స్నానం, సంధ్యావందనం, జపం, నిత్యాగ్నిహోత్రం, దేవతాపూజ, వైశ్వదేవం, అతిథిపూజ.

**దేవకార్యము :** భగవంతుడికి విశేషంగా చేసే పూజా కార్యక్రమం. రెండోది పితృదేవతాకార్యం. అంటే శ్రాద్ధము. శ్రాద్ధమునాడు భిక్ష సమర్పించరాదనే సంప్రదాయమున్నది.

**కామధేనువు :** దేవతల ఆవు. కోరిన కోర్కెలను తీరుస్తుంది. ఒకసారి దేవతలందరికి ఆకలివేసి బ్రహ్మ దగ్గరకు వెళ్లారు. ఆయన వాళ్లకు అమృతాన్ని ఇచ్చాడు. ఆ సురభిత్వ సంపద చేత సురభి పుట్టింది. (సురభి అంటే దేవతల ఆవు.) దాని సంతానమే అంతటా వ్యాపించింది.

**కాశి :** ప్రపంచంలో అతిపురాతన క్షేత్రం 5 క్రోశములు కోసం వ్యాపించినది వరుణ, అసి నదుల సంగమ ప్రాంతం కనుక 'వారణాసి' అయింది. విశ్వేశ్వరుని ఆలయం కలదు. పార్వతీమాతను అన్నపూర్ణగా కొలుస్తారు. దీనికి మహాశ్మశానమని కూడా పేరు. సప్తమోక్ష ధామాలలో ఇది ఒకటి.

**అష్టాదశ పురాణాలు :** భద్వయం మద్వయంబైన బ్రత్రయం వచతుష్టమమ్
అనాపలింగ కూస్కాని పురావ్కాని పృథక్ పృథక్ (ప్రచక్ష్యతే) ॥
భాగవత, భవిష్య
మత్స్య మార్కండేయ
బ్రహ్మ, బ్రహ్మాండ, బ్రహ్మ వైవర్త
అగ్ని, నారద, పద్మ, లింగ, గరుడ, కూర్మ, స్కాంద పురాణాలు

**మాధుకరము :** తుమ్మెదలు పువ్వులలోని పూతేనెను గ్రహించినట్లు, భిక్షుకులు గృహస్థుల ఇళ్ళవద్దకు వెళ్ళి భిక్షను గ్రహించి జీవించడం.

**పారణ :** ఉపవాసం ఉండి తర్వాత రోజు చేయు భోజనం (ఉపవాసానంతర భోజనం)

## 14. చిత్రగ్రీవం

**- ధనగోపాల్‌ముఖర్జీ**

అనువాదకథను పరిచయంచేస్తూ, పిల్లల్లోని పరిశీలనాశక్తికి పదునుపెట్టడం ఈ పాఠం ఉద్దేశం.

సరళమైనభాష. సహజమైన వర్ణనతో రచనలో కనిపిస్తుంది. ఏదైనా ఒక విషయాన్ని రాసేటప్పుడు ఎంతటిలోతైన పరిశీలన అవసరమౌతుందో ముందుగా ఉపాధ్యాయులు అర్థం చేసుకోవాలి.

పెంపకం, మూగజీవులపట్ల ప్రేమ, శ్రద్ధ, సహానుభూతి, ఆసక్తి, అభిరుచి తదితర సుగుణాలన్నీ విద్యార్థులు అప్రయత్నంగా ఈ పాఠం నుండి నేర్చుకోగలుగుతారు. మన భాషలోనే గాక ఇతర భాషల్లోనూ గొప్పరచనలున్నాయన్న సద్భావం పెంపొంది అన్యభాషా సంస్కృతులపట్ల గౌరవం పెంపొందుతుంది.

కథానిక రాయడానికి స్వానుభవాన్ని జోడించడంలోని మెళకువను గ్రహిస్తారు. 'జీవకారుణ్య' భావన పెంపొందుతుంది. అనువాద రచనల పఠనం పట్ల ఆసక్తికల్గుతుంది. ఇతర భాషల అధ్యయనానికి ప్రేరణలభిస్తుంది.

### విశేషాంశాలు

**నిమ్మకు నీరెత్తడం :** నిమ్మచెట్టుకు ఎంత నీరుపోసినా అది గ్రహించి నీరు పోశారా? లేదా? అన్నట్టుగానే ఉంటుంది. అలాగే పరిస్థితులకు స్పందించకుండా, ఉలుకూ పలుకూ లేకుండా ఉన్న వారి గురించి చెప్పడానికి దీన్ని ఉపయోగిస్తారు.

## ఉపవాచకం - ప్రథమ భాష - రామాయణం

పాఠశాల దశ పూర్తయ్యేసరికి విద్యార్థులు స్వతంత్ర్య పాఠకులుగా ఎదగాలి. భాషాభిరుచి కల్గిఉండాలి. పుస్తకపఠనం అలవాటుగా మారాలి. ఇందుకోసం ప్రాథమిక స్థాయిలో 'చదవండి - ఆనందించండి' అనే పేరుతో కథలు, గేయాలు వంటివి పొందుపరిస్తే, 6 నుండి 9వ తరగతి వరకు స్ఫూర్తిదాతల జీవిత విశేషాలు, కథలు, కథానికలను ఉపవాచక పాఠాలుగా చేర్చారు. విస్తార పఠనానికి కావల్సిన శిక్షణ వీటి ద్వారా లభిస్తుంది. పదవ తరగతిలో పిల్లలు సంక్షిప్త నవలను చదవడానికి అవసరమైన సహనం, భాషా సామర్థ్యం, భాషాభిరుచిని వృద్ధిపరచుకోవాలి.

ఇందుకోసం మానవతావిలువలు, భారతను సంస్కృతి, మానవ జీవిత ధర్మాలను వివరించే ఇతిహాసం రామాయణాన్ని సంక్షిప్తంగా రాసి ఉపవాచకంగా చేర్చారు. దీన్ని పిల్లలు చదవడం ద్వారా తల్లిదండ్రుల అనురాగం, సోదరప్రేమ, రాజధర్మం, రాజ్యపాలన, మానవుల స్వభావం, స్నేహబంధం, వినయం, వివేకంతో మెలగడం వంటి అంశాలను గ్రహించడానికి 'రామాయణం' తోడ్పడుతుంది.

## పాఠ్యాంశాలు - విశేషాంశాలు - ద్వితీయభాష

### 1. భాగవత రత్నాలు

**- బమ్మెరపోతన**

రామాయణ - భారత - భాగవతాలు భారతీయ చింతనకెత్తిన పతాకలు. ఇందులో భాగవతానికి భక్తి గ్రంథంగా ప్రత్యేక ముద్ర ఉన్నది. సంస్కృతంలో వ్యాసప్రోక్తమైన భాగవతం శబ్ద భావ విన్యాసాలతో తెలుగు అవతారమెత్తింది. బమ్మెర పోతనగారి కరస్పర్శతో. వెలువడిన భాగవతం, బమ్మెర పోతన పేర్లు వినని తెలుగువారుండరంటే అత్యుక్తి కాదు.

భాగవతం అంటే భగవత్తత్త్వ ప్రతిపాదిత కావ్యమనీ, మోక్ష శాస్త్రమనీ ప్రతీతి. కానీ తెలుగు భాగవతం అముష్మిక విషయాలనే కాకుండా ఐహిక విషయాలనెన్నింటినో సందర్భానుసారంగా లోకానికందించింది. జీవన సరళిని సరిదిద్దుకునే సందేశాల నిచ్చింది. భాగవతంలోని ప్రతి పద్యం రత్నమే. అలాంటి వాటిలో షడ్రత్నాలను 'భాగవత రత్నాలు'గా పాఠ్యరూపంలో అందించడం జరిగింది.

చదువు యొక్క అవసరమేమిటో సార్వకాలిక సందేశంగా పోతన హిరణ్య కశిపునిచే పలికించాడు. 'అందరికీవిద్య' అన్న భావాన్ని ప్రకటించాడు. భగవంతుడే బలమన్న ప్రతిపాదనను బలంగా వినిపించాడు. 'పరోపకారార్థ మిదం శరీరమ్' అని గుర్తుచేశాడు.

పరహిత ప్రాధాన్యతను వివరిస్తూ ఆడిన మాటకు కట్టుబడే మాన్యుల అసామాన్య నిష్ఠ ఎలా ఉంటుందో అక్షర బద్ధం చేశాడు.

'అతిథి దేవోభవ' అన్న ఉపనిషద్ సూక్తిని జ్ఞాపకంచేస్తూ అతిథి మర్యాద ఎలా చేయవచ్చో. తత్ఫలితమేమిటో చెప్పాడు.

ఈ మహితోక్తుల మందార మకరందాలను విద్యార్థులకందించాలని, అనుప్రాస అందాలను పరిచయం చేయాలన్నదే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

### 2. మొద్దబ్బాయిలూ మహామేధావులే

**- డా॥ తిరుమల రామచంద్ర**

'అయోగ్యో పురుషో నాస్తి' యోగ్యుడు కాని వాడెవడూ ఉండడన్నది సూక్తి సుధా సింధువులోని బిందువు. ప్రతి వ్యక్తిలో ఏదో శక్తి నిగూఢంగా ఉండనే ఉంటుంది. దాన్ని తట్టిలేపేవాడుంటే అది బహిర్గతమై ఆ వ్యక్తి కీర్తికి కారణభూతమౌతుంది.

విద్యారంగంలో విద్యార్థులను స్థూలంగా రెండు విభాగాలుగా చూస్తారు. మొద్దబ్బాయిలు, మేథావులుగా భావిస్తుంటారు. కాని యథార్థానికి మనం మొద్దబ్బాయిలనుకునే వారిలో కూడా గొప్ప ప్రతిభ దాగి ఉంటుంది. దానిని, మంచి సూచనలు,

సలహాలనివ్వడం మూలాన్నో వారు ఆత్మన్యూనత నుండి బయటపడడమేగాక, సమాజానికి ఉపయోగపడే శక్తులుగా ఎదుగుతారు. ఇలాంటి స్ఫూర్తినందించే జీవితానుభవమే అక్షర చైతన్యమే తిరుమల రామచంద్రగారి లేఖిని నుండి ప్రవహించింది.

శ్రీ తిరుమల వారు బహుముఖ ప్రతిభాసంపన్నులు. పరిశోధకులుగా వారి కీర్తి హిమవద్గిరి. వారి రచన వియద్గంగా ఝరి. సరళ సుందరంగా సాగే వారి వచనశైలి పాఠకుని మనసుకు ఇతోధికంగా పఠనోత్సాహాన్ని కలిగిస్తుంది. విషయ నివేదనలో అన్వయ కాఠిన్యం లేకుండా సాగుతుంది. వారి ఆత్మకథగా ఆవిష్కరింపబడిన 'హంపీ నుండి హరప్పా దాకా' అన్న గ్రంథం కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్నందుకుంది. ఇందులో నుండి గ్రహించిందే ఈ పాఠ్యాంశం.

ఆత్మీయమైన సలహా ఎంతటి ఘనకార్యం సాధించగలదో తెలపడం, విషయాన్ని అలతి అలతి మాటల్లో అందంగా వివరించగలగడం – అన్నవే ఈ పాఠ ప్రధానోద్దేశాలు.

## విశేషాంశాలు

**వషట్కారాలు :** 'ప్రజాపతిశ్చ వషట్కారశ్చ' అనే శ్రుతి ననుసరించి యజ్ఞాధిష్ఠాతృ విష్ణుదేవత 'వషట్కారః' అనబడును. ఇంకో అభిప్రాయంలో యజ్ఞం చేసే సమయంలో 'వషట్' శబ్దాన్నుచ్చరిస్తూ ఆహుతులకిచ్చే హోతను 'వషట్కార' అంటారు.

అయితే కొన్ని కుటుంబాలలో 'వషట్కారాలు' అంటే 'తిట్లు' అన్న అర్థంలో వ్యవహార ప్రయోగముంది.

**తద్జ్ఞులు (తత్‌జ్ఞులు) :**
1. 'తత్' అంటే 'దాని'ని అంటే బ్రహ్మన్ని తెలిసినవారు.
2. ఏ విషయమై ఉన్నదున్నట్లు గ్రహించేవారు.
3. తత్కాలీన జ్ఞానం కలిగినవారు.

**ప్రవర :** పేరు, కులం, గోత్రం – పెద్దలను కలిసినప్పుడు తన ఋషులు, గోత్రం, వేదశాఖ పేరు చెప్పుకొని నమస్కరించడం సంప్రదాయం. ఇది స్వయం పరిచయ విధానం.

**థర్డ్ ఫారం :** ఇప్పటి 7వ తరగతికి సమానం.

**ఆరవ ఫారం :** ఇప్పటి 10వ తరగతికి సమానం.

**వ్యాకరణ శిరోమణి :** 'శిరోమణి' స్నాతకోత్తర (పోస్ట్‌గ్రాడ్యుయేట్) పట్టా. వ్యాకరణ శాస్త్రంలో ఈ పట్టాపొందిన వారిని 'వ్యాకరణ శిరోమణి' అంటారు.

## 3. నవోదయం

– డా॥పల్లాదుర్గయ్య

ఉదయాస్తమయాలు కాలగమనంలో అంతర్భాగాలు. ఇవి నిత్యవ్యవహారమే అయినా ప్రతి ఉదయం కొత్తగా భాసిస్తుంది. హృదయాహ్లాదియై శోభిస్తుంది. సామాన్యుని సైతం ఆకర్షించగల ఉదయ రామణీయకత సహృదయ కవీశ్వరుని భావనాకాశంలో నవోదయ కాంతులను ప్రసరింపజేస్తుందనడం అత్యుక్తికాదు. ప్రస్తుతం డా॥ పల్లా దుర్గయ్యగారి నవోదయ వీక్షణాన్ని కవితా రూప పాఠ్యాంశంగా అందించడం జరిగింది.

డా॥ పల్లా దుర్గయ్యగారు బహుభాషాభిజ్ఞులు, శాస్త్రజ్ఞులు, కవి, పండిత పరిశోధక వతంసులు.

నవోదయ సమయాన ప్రకృతి అందాలు ఎలా ఉంటాయో చెప్పడం, విషయాన్ని కవితాత్మకంగా మలచడంలో ఎలాంటి పదబంధాలనుపయోగించాలో తెలపడం, మాత్రాఛందస్సులో సాగే ఈ రచనా సంవిధానాన్ని గమనిస్తూ విద్యార్థులు తమ భావాలను కూడా ఈ పద్ధతిలో రాసేందుకు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ పాఠాన్ని నిర్ణయించడమైనది.

## 4. సంజయ రాయబారం

– ఉషశ్రీ

మానవ జీవితాన్ని ప్రతిబింబించే అక్షరమణిదర్పణం మహాభారతం. మానవ స్వభావాలు, సంబంధ బాంధవ్యాలన్నీ సమున్నత రీతిలో ఇందులో సాక్షాత్కరిస్తాయి. 'భారతంలోలేనిది ప్రపంచంలో లేదని' వ్యాసుని ఆత్మవిశ్వాస ప్రకటన.

మహాభారతంలో మూడు రాయబారాలు ప్రముఖమైనవి. అవి ద్రుపద పురోహితుని రాయబారం, సంజయ రాయబారం, శ్రీకృష్ణ రాయబారం. ద్రుపద పురోహితుని ప్రతిపాదనకు సమాధానంగా కౌరవ పక్షాన సంజయుడు రాయబారిగా పాండవుల వద్దకు వచ్చాడు. సంజయుడు మాట్లాడే కళలో నేర్పరి. 'కర్ర విరగకుండా పాము చావకుండా' విషయ నివేదన చేయగల సమర్థుడు. ధర్మరాజు కూడా ఈ విషయంలో ఆరితేరినవాడే. ఇద్దరు వాక్కౌశలుల మధ్య సాగే సంభాషణనే ఈ పాఠ్యభాగం.

మహాభారతానికి వచన రూపమిచ్చిన వారెందరో ఉన్నారు. అందులో ఉషశ్రీ గారిది ప్రత్యేక పంథా. ప్రత్యక్ష వ్యాఖ్యానం చేస్తున్నట్లుగా రచించడం వారి లేఖనికి వెన్నతో పెట్టిన విద్య.

మహాభారత పాత్రల స్వభావాన్ని పరిచయం చేయడం, తద్వారా వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేయడం. ధ్వనిమంతంగా మాట్లాడడమెలాగో తెలపడం. ప్రత్యక్ష వ్యాఖ్యాన సదృశంగా రాయడానికి విద్యార్థులను ప్రోత్సహించడమే ఈ పాఠ ఉద్దేశం.

### విశేషాంశాలు

**ప్రారబ్ధం :** ఇప్పటి దేహానికి కారణమైన కర్మ

**వానప్రస్థం :** చతురాశ్రమాలలో మూడవది. (బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాస ఆశ్రమాలు) గృహస్థుడు తన కుమారునికి కుమారుడు కలుగగానే వాన ప్రస్థాశ్రమ స్వీకారం చేయాలి. సంసారిక జీవితం విరమించుకొని ఏ వనానికో వెళ్ళి వనవాస వ్రతాన్ని పాటిస్తూ జీవించడం.

## 5. కల్యాణం

**- తరిగొండ వెంగమాంబ**

భారతీయ సంస్కృతిలో ఆశ్రమ ధర్మాలకు విశిష్టస్థానమీయబడింది. గృహస్థాశ్రమ స్వీకారానికి నాందీ వాచకం 'కల్యాణం'. వివాహం – దంపతులు ఒకరినొకరు కేవలం వరించడానికి నిర్దేశించిన ప్రక్రియకాదు. అటు ఇటు తరతరాలు తరించడానికి ఏర్పరచిన విలక్షణ సంప్రదాయం. షోడశ సంస్కారాలలో ఒకటైన కల్యాణ సంస్కృతిలో ఎన్నెన్నో ఘట్టాలుంటాయి. వాటిని ఉటంకిస్తూ సాగిన పాఠ్యాంశం.

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ లేఖినితో సొగసులద్దుకున్న 'శ్రీరమాపరిణయము' అన్న ద్విపద కావ్యము నుండి ఈ పాఠ్యాంశాన్ని తీసుకోవడం జరిగింది. ఈ కావ్యం 400 ద్విపదలతో సాగింది. విభిన్న ప్రక్రియలలో విశిష్టరీతిలో రచనలు సాగించిన విదుషీమణి వెంగమాంబ.

ఇది లక్ష్మీ వేంకటేశ్వరుల కల్యాణం. దేవతలంతా విచ్చేసి ఈ మహోత్సవంలో పాల్గొన్నారు. వివాహ ప్రక్రియలోని వివిధ ఘట్టాలను తెలుపుతూ సంస్కృతీ విశిష్టతను చూడడమే ఈ పాఠం ప్రధానోద్దేశం. గానయోగ్యమైన ద్విపదను పరిచయంచేస్తూ, వెంగమాంబ సరళ సుందర రచనను ఆస్వాదించి ఆ దిశగా ప్రయత్నించేందుకు విద్యార్థులను పురికొల్పే లక్ష్యం కూడా ఇందులో ఉన్నది.

### విశేషాంశాలు

**స్నాతకం :** బ్రహ్మచర్యాశ్రమాన్ని పూర్తిచేసుకొని గృహస్థాశ్రమంలో ప్రవేశించటానికి గురువు అనుమతి పొందిన తరువాత స్నాతకం చేసుకోవాలి. ఇది సర్వ ప్రాయశ్చిత్తం కొరకు శరీర శుద్ధి కొరకు ఆచరించే కార్యం. బ్రహ్మచర్య దీక్ష వదలి, క్షురకర్మ చేయించుకొని, మంత్రపూతంగా స్నానమాచరించి స్నాతుడౌతాడు.

**వేదవ్రతం :** సంస్కారములలో నాలుగు వేదవ్రతాలు చెప్పబడ్డాయి. అవి మహానామ్నీ వ్రతం, మహావ్రతం, ఉపనిషద్వ్రతం, గోదానం. వీటి ప్రధానోద్దేశం ఎవరి (వేద) శాఖను వారు అధ్యయనం చేయుట. శాఖానుగుణమైన సంస్కారాలను పొందుట. ఈ వ్రతములు ఒక్కొక్క సంవత్సరము వరకు పరిమితమై ఉంటాయి. ఈ వ్రతాలను శ్రావణ పూర్ణిమనగాని, పుష్య, వైశాఖ మాసములందుగాని సంకల్పించి చేయవచ్చు. లేదా వివాహానికి పూర్వపు రోజునాడైనా చేయవలెనన్నది స్మృతి సమ్మతం.

**కాశీయాత్ర :** స్నాతకుడు సాలంకృతుడై చేతిలో కర్ర గొడుగు ధరించి, పాదుకలు వేసుకొని పసుపు గుడ్డను మెడలో వేసుకొని కాశీయాత్ర చేయడానికి బయలుదేరుతాడు. ఆ సమయంలో కన్యాదాత లేదా వధువు సోదరుడు స్నాతకుడిని కాశీకి వెళ్ళవద్దని తమ ఇంటి కన్యను స్వీకరించి గృహస్థాశ్రమ ప్రవేశం చేయవలసిందిగా ప్రార్థిస్తాడు. స్నాతకుడు అందులకు అంగీకరిస్తాడు. కన్యాదాత అతనికి నూతన వస్త్రాలు సమర్పించి, నోటిలో బెల్లం ముక్కను పెడతాడు.

**కన్యావరణం :** కన్యాదాత ఆహ్వానం మేరకు కాశీ యాత్రను విరమించుకొని వరుడు బంధుమిత్ర సపరివారంగా కన్యాదాత గృహానికి రావడం. కన్యను వరించడానికి రావడం కనుక 'కన్యావరణం' అన్నారు. వరుడు వస్తున్నాడు కనుక దీనికి 'వరాగమనం' అని కూడా పేరు. వరునివైపు వారినందరినీ సాదరంగా ఎదురేగి ఆహ్వానించి, గౌరవ మర్యాదలు చేస్తారు. అందుకే దీనిని 'ఎదురుకోళ్ళు' అని మరొకపేరు.

**మధుపర్కం :** తేనె, పెరుగు కలిపిన ద్రవ్యము. దీనిని కన్యాదాత వరునికిస్తాడు. వరుడు దీనిని సమంత్రకంగా స్వీకరిస్తాడు. 'మధుపర్కం' అంటే దధిమధు మిశ్రమమేనని ప్రధానంగా చెప్పబడినా వీటితోపాటు 'నెయ్యి'ని కూడా కలిపి చెప్పడం జరిగింది. ఈ మూడింటితోపాటు వేపుడు బియ్యం, పేలపిండి కలిపి ఐదింటి మిశ్రమంగా చెప్పిన సంప్రదాయం కూడా ఉంది. ఈ సందర్భంగా వరునికిచ్చే నూతన వస్త్రాలకు 'మధుపర్క' మన్న వ్యహారం కూడా ఏర్పడింది.

## 6. పిసినారి

**– కాళ్ళకూరి నారాయణరావు**

నాటకం దృశ్యకళ. సందేశాన్ని ప్రేక్షకుల హృదయాల్లోకి నేరుగా, ప్రభావవంతంగా తీసుకుపోగల శక్తివంతమైన మాధ్యమం నాటకం. నాటకాలను స్థూలంగా పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలుగా విభజించారు. సామాజిక విషయాలను ప్రతిబింబిస్తూ ఆలోచనలను రేకెత్తించేది సాంఘిక నాటకం. తెలుగు నాటకం చాలా సందర్భాలలో సాంఘిక సమస్యలను తలకెత్తుకుంది. పరిష్కార దిశగా ప్రజలు అడుగులు వేయడానికి ప్రోత్సహించింది. అలాంటి వాటిలో కాళ్ళకూరి నారాయణ రావు గారి 'వరవిక్రయం' అమిత ప్రజాదరణకు పాత్రమైంది.

కాళ్ళకూరి వారు బహుగ్రంథకర్తలు, నటులు, సామాజిక సేవా పరాయణులు, సంఘంలో ప్రబలిన వేశ్యావృత్తిని నిరసిస్తూ 'చింతామణి' నాటకాన్ని, మధ్యపాన అనర్థాలను తెలుపుతూ 'మధుసేవ' నాటకాన్ని, వరకట్న సమస్య తీవ్రతను తెలపడానికి 'వరవిక్రయం' నాటకాన్ని రచించారు. సమాజ సంస్కరణలో కవిగా బాధ్యతను నిర్వర్తించి ఆదర్శ ప్రాయులైనారు. కేవలం ఉపదేశాలకే పరిమితం కాకుండా స్వయంగా వరకట్నం తీసుకోకుండా వర్ణాంతర వివాహం చేసుకున్న చేతల మనిషి వారు. వారి 'వరవిక్రయం' నాటకంలోని ఒక సన్నివేశాన్ని ప్రస్తుతం పాఠ్యాంశంగా ఇవ్వడం జరిగింది. పిసినారితనం, వరకట్న దురాశ కలగలిసిన వ్యక్తి మనస్తత్వాన్ని సున్నిత హాస్యంతో ప్రకటించడమే ఇందులో ప్రధానాంశం.

నాటకం పట్ల అభిరుచిని కలిగించడం, నటించడానికి ప్రోత్సహించడం, పిసినారితనమనే దుర్గుణాన్ని నిరసించడం, ధనవ్యామోహాన్ని పరిహరించడం, సామాజిక విషయాలపై నాటికలు (హాస్య స్ఫూర్తితో) రాయడానికి ప్రేరేపించడం ఈ పాఠం ప్రధానోద్దేశం.

## 7. మనిషీ! మనిషీ!

**– ఇస్మాయిల్**

'జంతూనాం నరజన్మ దుర్లభం' అన్నారు. మనిషిగా జన్మించడమే కాదు. మనిషిగా జీవించడమూ కష్టమే. అందుకే 'నరుడు నరుడౌట ఎంతొ దుష్కరము సుమ్ము' అంటాడు డా॥ దాశరథి. ఎన్నెన్నో ప్రభావాలకులోనయి మానవత్వం మృగ్యమౌతున్నది. ఇది ఇలాగే కొనసాగితే మానవత అస్తిత్వమే ప్రశ్నార్థకమౌతుంది. అందుకే మానవీయ విలువలను చాటుతూ మానవతాక్షరవీణను మీటుతూ కవులు సమాజానికి సందేశమందిస్తూనే ఉన్నారు. ఎవరు ఎలా చెప్పినా అంతిమలక్ష్యం మానవుడే. అందించే సందేశం మానవతే. ఈ పరంపరలో తనదైన శైలిలో వచనకవితలో మానవతా ప్రవచనాన్ని గావించారు. ఇస్మాయిల్ గారు.

ఇస్మాయిల్‌గారు ప్రకృతి ప్రేమికులు. దీర్ఘంగా, సుబోధకంగా, సుందరంగా సాగుతుంది వారి రచన.

ప్రకృతిని మించిన గురువులేదని, పశుపక్ష్య వృక్షాల ద్వారా కూడా మనం ఎంతో నేర్చుకోవచ్చని, అందుకు నిశితంగా పరిశీలించే గుణం, ఆకళింపుచేసుకొని ఆచరించే తత్త్వం ఉండాలని, విభేదాలు, వైషమ్యాలు మానాలని, సంకుచిత ధోరణులను వదలాలని తెలపడం, భావాన్ని వచన కవితారూపంలో వ్యక్తీకరించగలగడం ఈ పాఠం ఉద్దేశం.

## 8. జానపద నృత్య సంగీతాలు

**– దేవులపల్లి రామానుజరావు**

కళలు ఆనందోపదేశాలను అందించే మహత్తర మాధ్యమాలు. ఇవి సంస్కృతిలో భాగం. కళాస్వాదన చేయలేనివాడు జడుడనడంలో జంకవలసిన పనిలేదు. జానపద కళలు విలక్షణలోను. విశిష్టతను సంతరించుకున్నవి. ఇందులో ప్రధానంగా, జానపద నృత్య, సంగీతాల గురించి దేవులపల్లి రామానుజరావుగారు చేసిన రేడియో ప్రసంగమే ప్రస్తుత పాఠ్యాంశం.

దేవులపల్లి వారు పత్రికా సంపాదకులు, సాహిత్య సంస్థల గాఢానుబంధం కలిగినవారు. సాహిత్య సాంస్కృతిక రంగాలకు జీవితాన్ని అంకితం చేసినవారు. కుదురైన పదాలతో, కుంటుపడని నడకతో వారి రచన సాగుతుంది.

కళలపట్ల, ప్రత్యేకంగా జానపద నృత్య సంగీతాలపట్ల అవగాహనను, అభిరుచిని కలిగించడం, కళలను ఆరాధించే దిశగా, అభ్యసించే దిశగా, ఆదరించే దిశగా విద్యార్థులను ప్రోత్సహించడం ప్రసంగ వ్యాస రచనకు సంసిద్ధులను చేయడం ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

## 9. శతక మాధురి

**- శతక కవులు**

సాహిత్య ప్రక్రియల్లో శతకం అనన్యాలంకారం. మామూలు కవి నుండి మహాకవి వరకు శతక రచనకుపక్రమించినవారే. భక్తి, నీతి, వైరాగ్య బోధలతో శతక పద్యాలు హృదయాన్ని సంస్కరిస్తాయి. శతక పద్యాలు ముక్తకాలు. అజ్ఞాన బంధవిముక్తకాలు. శతక పద్యమొకటైనా రాని సాహితీ పాఠకుడుండడనడం సాహసమేమీకాదు. అంతెందుకు... అక్షరం ముక్క రానివారు కూడా అలవోకగా శతకపద్యాలు పాడటం పల్లెల్లో మనం చూస్తున్నదే. శతక పద్య ప్రభావమటువంటిది. అందుచే ప్రతి తరగతిలో అనివార్యంగా శతకపద్యాలు పాదాలను మోపుతున్నాయి. శతక మాధురిని రుచి చూపించడానికే ప్రస్తుత పాఠ్యాంశం నిర్దేశించబడింది.

పెద్దలపట్ల ఆదరణభావం, మాతృమూర్తి, గురుమూర్తిపట్ల గౌరవభావం, అసత్యం పలకకపోవడం, దానగుణం, అనన్యభక్తి, సంపదలకు పొంగకపోవడం, ఆపదలకు కుంగకపోవడం వంటి వ్యక్తిత్వ వికాస విషయాలను విద్యార్థుల హృదయాలకు హత్తుకునేటట్లు వివరించడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

## 10. మాట్లాడే నాగలి

**- పొన్‌కున్నం వర్కెయ్**

మానవులకే కాదు ప్రాణులన్నింటికీ సంవేదనలుంటాయి. ఇది శాస్త్రీయంగా నిరూపించబడిన సత్యం. ముఖ్యంగా పెంపుడు జంతువులు యజమాని హృదయాన్నెరిగి నడుచుకునే సందర్భాలెన్నో సమాజంలో చూస్తున్నాము. కొన్ని సందర్భాలలో యజమాని, బంటు అన్న విభజనరేఖ మాయమై ఆత్మీయ బంధం పెనవేసుకున్న దాఖలాలున్నాయి. రక్త సంబంధాన్ని మించిన అనురక్త సంబంధం అది. అలాంటి వస్తువును గ్రహించి మానవీయత అంతస్సూత్రంగా ఆవిష్కరింపబడిన కథానిక 'మాట్లాడేనాగలి'.

పొన్‌కున్నం వర్కెయ్ మళయాళ రచయిత మానవతావాది. విభిన్న ప్రక్రియల్లో రచనా వ్యాసంగాన్ని కొనసాగించినవాడు.

జంతువులు మానవుల మనుగడకెంతో ఉపకరిస్తున్నాయి. వాటిని నిర్లక్ష్యంచేయడం, నిర్దాక్షిణ్యంగా వధించడం మానవతకే మాయని మచ్చని తెలపడం. జీవకారుణ్య భావనను విద్యార్థి హృదయంలో బలంగా నాటడం, అందంగా, ఆకర్షించేరీతిలో కథానికా రచనకు ఉపక్రమించేలా విద్యార్థులను ప్రేరేపించడం ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

## ఉపవాచకం - చైతన్య మూర్తులు

విద్యార్థిలో పఠనాసక్తిని పెంపొందిస్తూ విస్తారపఠనానికి వీలుకల్పించేది ఉపవాచకం. ఇందులో విషయావగాహనే ప్రధానం కాదు. విషయంతోపాటు విలువలనందుకోవడం, ప్రేరణను పొందడం కూడా జరగాలి. అందుకే 'చైతన్యమూర్తులు' పేరిట నలుగురు మహనీయుల జీవితాలను సంక్షిప్త పరిచయం చేయడం జరిగింది. ఇందులో ఒకరు గాత్ర సంగీత మేరుశిఖరి, మరొకరు వాద్య సంగీత గంగాఝరి. భక్త కవీశ్వరులొకరైతే, ప్రవక్త ఋషీశ్వరులు మరొకరు.

గాత్ర సంగీత ప్రపంచంలో అరుదైన ముద్రవేసిన గాయనీమణి ఎం.ఎస్.సుబ్బులక్ష్మి, పిన్నవయసుననే మిన్న అనిపించుకున్న ప్రతిభామూర్తి. నిరంతర సాధన, ఎంత ఎత్తుకెదిగినా ఒదిగి ఉండే వినయం, దేశభక్తి, కళానిష్ఠలతో సాగిన ఆమె సంగీత జీవన ప్రస్థానం భావితరాలకు మార్గదర్శకం.

వాగ్గేయకారుడిగా తెలుగు సాహిత్య చరిత్రలో సుస్థిరస్థానం సంపాదించుకున్నవారు కంచెర్ల గోపన. రామదాసుగా లోకానికి చిరపరిచితులు. భద్రాద్రి రామాలయ నిర్మాణం చేసినవారు. దాశరథిశతకం, కీర్తనలు రాసినవారు. అంటే సత్కార్య నిర్మాతగా, సత్కావ్య నిర్మాతగా చిరయశస్సునార్జించుకొన్నవారు. ఎన్ని కష్టాలెదురైనా భరించి, తరించిన అనన్యభక్తుడు.

కళకు కులమత భేదాలంటవని తన జీవితం ద్వారా చాటిచెప్పిన మనీషి ఉస్తాద్ బిస్మిల్లాఖాన్. షెహనాయి స్వరాలతో శ్రోతల హృదయతంత్రులను మీటే అద్భుత ప్రతిభ అతని సొత్తు. జాతీయ అంతర్జాతీయ స్థాయిలో సన్మానాలెన్ని పొందినా, గర్వాన్ని తన సరసకు రానీయని నిరాడంబరుడు. కుటుంబసభ్యులనే కాదు. పేదలకునూ కుటుంసభ్యులుగానే పరిగణించి ఆదరించిన నిఖార్సైన మానవతావాది. కాశీ, గంగల పట్ల అనుపమాన ఆత్మీయులను ప్రకటించిన దేశభక్తుడు. హాస్యప్రియుడు.

హింసాపీడిత సమాజానికి శాంతి సందేశాన్నందించిన మహనీయుడు గౌతమబుద్ధుడు. ఆత్మజ్ఞానంతో తాను తెలుసుకున్న విషయాలను లోకానికందించాడు. కరుణకు పెద్దపీటవేశాడు. సంఘం ధర్మబద్ధంగా సాగాలని ప్రవచించాడు. కులమతాలకతీతంగా తననాశ్రయించిన వారిని ఆదరించాడు. దుఃఖ నివృత్తి ఎలా జరుగుతుందో బోధించాడు. మహోన్నత మానవతకు నిలువెత్తు నిదర్శనంలా నిలిచాడు.

పైన పేర్కొన్న వీరంతా తమ జీవితాల ద్వారా జాతిపై చెరగనిముద్రవేశారు. వారి వారి జీవితాల్లోని మహోజ్వల ఘట్టాల ద్వారా విద్యార్థులు చైతన్యం పొందేందుకు ప్రేరేపించాలన్నదే ఈ ఉపవాచక ఉద్దేశం.

**ముగింపు :**

పదవ తరగతి ప్రథమ, ద్వితీయ భాషల పాఠ్యపుస్తకాలు పిల్లల్లో మానవతా విలువలు, సామాజిక స్పృహ, స్త్రీలపట్ల గౌరవం, శ్రమపట్ల గౌరవం, శాస్త్రీయ పరిశీలన వంటివి పెంపొందేలా పాఠాలను ఎంపిచేశారు. ప్రాచీన, ఆధునిక, సమకాలీన సాహిత్యం నుండి వివిధ కవి-------- రచించిన గ్రంథాల నుండి వివిధ ప్రక్రియలతో ఒకూడిన పాఠాలను ఎంపికచేశారు. వీటి ప్రాధాన్యతను, విశేషాంశాలను గ్రహించి పిల్లలకు పాఠ్యబోధన సమయంలో ఆసక్తికంగా, ఆలోచింపజేసేలా పనులు కల్పించాలి. తద్వారా తెలుగు భాషపట్ల అభిమానం ఏర్పడేలా చేయాలి. పాఠ్యపుస్తకంలోని పాఠాల ఉద్దేశం, నేపథ్యం ఆధారంగా భాషాసమర్థత కల్గిన వ్యక్తులుగా పిల్లలకు అభ్యాసం కల్పించాలి.



# III. విద్యాప్రమాణాలు (సామర్థ్యాలు), సూచికలు - పాఠం వారీగా సాధించాల్సిన సామర్థ్యాలు

పిల్లలందరిని బాధ్యతాయుతమైన, హేతుబద్ధమైన పౌరులుగా తీర్చిదిద్దడమే విద్య యొక్క ప్రాథమిక ఉద్దేశ్యం. విద్యను పొందడంలో... భాష మీద పట్టు సాధించడంలో విద్యార్థికి ఉపయోగపడే ప్రధానోపకరణం పాఠ్యపుస్తకం. పాఠ్యపుస్తకాలు పిల్లల్ని ఆలోచింపజేసేలా... తమలోని సహజ శక్తి సామర్థ్యాలను వినియోగించుకుని నేర్చుకునేలా దోహదపడాలి.

**భాషను నేర్చుకోవడమంటే?**

విద్యార్థి తాను విన్నది అవగాహన చేసుకోవడం, అర్థవంతంగా మాట్లాడడం, అవగాహనతో చదివి, సొంతమాటల్లో వ్యక్తీకరించడం. విన్నది, చూసింది సొంతంగా రాయడం... సృజనాత్మకతను జోడించడం. నూతన పదాలకు అర్థాలు తెలుసుకొని, వివిధ సందర్భాల్లో ఉపయోగించడం. భాషలోని మార్పులను, వివిధ ప్రక్రియలను – అర్థం చేసుకోవడం... మొదలగునవి చేయగలగాలి.

విద్యా హక్కు చట్టం – 2009 వచ్చిన తర్వాత విద్యార్థి ఫలితాల సాధన పూర్తిగా మారిపోయిందని చెప్పవచ్చు. ఇప్పటివరకు కేవలం జ్ఞాపకశక్తి లేదా బట్టీ విధానం ఆధారంగా నడుస్తున్న విద్యావిధానంలో సమూల మార్పులు చోటుచేసుకున్నాయి. విద్యార్థి ఆలోచనా విధానం, తార్కికశక్తి, స్వేచ్ఛాయుత అభిప్రాయ వ్యక్తీకరణ, శాస్త్రీయ పరిశీలనా దృక్పథం నూతనత్వానికి పట్టం కట్టిందని చెప్పవచ్చు.

విద్యార్థి ఒక తరగతి పూర్తి చేయడమంటే... ఆ తరగతికి నిర్దేశించిన సామర్థ్యాలను సాధించడమని అర్థం. ఆయా తరగతులకు సంబంధించిన సామర్థ్యాల సాధన గురించి APSCF-2011 స్పష్టంగా నిర్దేశించింది. ప్రస్తుత పదవ తరగతి పాఠ్యపుస్తకం నిర్దేశిత సామర్థ్యాలతో సమగ్రంగా రూపొందించబడింది.

ఇందులో భాగంగానే 10వ తరగతి విద్యార్థులు నిర్దేశిత సామర్థ్యాలను సాధించవలసి ఉంటుంది. పిల్లలు సాధించవలసిన సామర్థ్యాల గురించి తెల్సుకుందాం!

## సామర్థ్యాలు :

## ప్రథమభాష :

### I. అవగాహన - ప్రతిస్పందన

దీంట్లో **"వినడం - మాట్లాడడం, ధారాళంగా చదివి, అర్థంచేసుకొని, వ్యక్తీకరించడం"** అనే సామర్థ్యాలుంటాయి. వీటిలో పిల్లలు కింది అంశాలను చేయగలగాలి.

- విన్న, చదివిన అంశాలు అర్థం చేసుకోవాలి. తమ అభిప్రాయాలు వ్యక్తపరచాలి.
- సమర్థిస్తూ లేదా విభేదిస్తూ మాట్లాడగలగాలి, కారణాలు వివరించగలగాలి.
- నచ్చిన సందర్భాన్ని అనుభూతులను వర్ణించగలగాలి.
- పద్య భావాలు, పాఠ్యభాగ సారాంశాలు, కథలు, కథానికలను సొంతమాటల్లో చెప్పగలగాలి.
- వక్తృత్వ పోటీల్లో పాల్గొని మాట్లాడగలగాలి. సద్యోభాషణం చేయగలగాలి. (ఇచ్చిన అంశం గురించి అప్పటికప్పుడే మాట్లాడడం).
- పాఠం చదివి జాతీయాలు, సామెతలు గుర్తించగలగాలి.
- ఎవరు ఎవరితో అన్నారు? ఏ సందర్భంలో అన్నారు? గుర్తించగలగాలి.
- పాత్రల స్వభావాన్ని పట్టికరూపంలో తయారుచేయగలగాలి.
- భావాలకు తగిన పద్యపాదాలను, గేయపాదాలను గుర్తించాలి.
- వివరాల కనుగుణంగా పట్టికలు తయారుచేయగలగాలి.
- చదివిన అంశంలోని కీలకాంశాలు, కీలకపదాలు రాయగలగాలి.
- పేరాలకు శీర్షికలు పెట్టడం, శీర్షికలకనుగుణంగా పేరాలను గుర్తించడం చేయగలగాలి.
- అపరిచిత గద్యం లేదా పద్యాలు చదివి ప్రశ్నలకు జవాబులు రాయాలి. ప్రశ్నలు కూడా తయారుచేయగలగాలి.
- పాఠంలో చుక్కగుర్తున్న పద్యాలను చదివి, అర్థం చేసుకొని ప్రతిపదార్థం - రాయగలగాలి.

### II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

దీంట్లో **"స్వీయరచన, సృజనాత్మకత, ప్రశంస"** సామర్థ్యాలుంటాయి. వీటిలో పిల్లలు కిందివి చేయగలగాలి.

- కారణాలు రాయగలగాలి. వివరిస్తూ రాయగలగాలి.
- అభిప్రాయాలు రాయగలగాలి. ఇష్టాయిష్టాలు రాయగలగాలి.
- రచయిత అభిప్రాయాన్ని గ్రహించి వివరించగలగాలి.
- సమర్థిస్తూ లేదా విభేదిస్తూ రాయగలగాలి.

- ప్రకృతి దృశ్యాలను వర్ణించి రాయగలగాలి.
- రచనాశైలిని అభినందిస్తూ రాయడం, అభినందన వ్యాసం, కరపత్రాలు తయారుచేయడం, ఇంటర్వ్యూ కోసం ప్రశ్నావళి తయారుచేయడం, కవితలు రాయగల్గడం, సన్మానపత్రం తయారుచేయగలగడం, పత్రికలకు లేఖ లేదా సాహిత్యవ్యాసాలు రాయడం, సంభాషణలు రాయడం వంటివి చేయగలగాలి. సృజనాత్మకత సంభాషణలు, కథనాలు రాయగలగాలి.

## III. భాషాంశాలు

ఇది **"పదజాలం, వ్యాకరణాంశా"**లకు సంబంధించినది. కింది తరగతుల్లో నేర్చుకున్నవాటితోపాటు పిల్లలు కిందివి చేయగలగాలి.

- పదాలకు అర్థాలు, వ్యుత్పత్త్యర్థాలు, నానార్థాలు, పర్యాయ పదాలు రాయగలగాలి.
- ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలు రాయగలగాలి. జాతీయాలను సమర్థంతంగా వాక్యాల్లో ఉపయోగించాలి.
- ప్రకృతికి వికృతులను, వికృతికి ప్రకృతి పదాలు రాయగలగాలి.
- దైనందిన జీవితంలో సందర్భోచితంగా సరైన పదాలు జాతీయాలు, సామెతలు వినియోగించగలగాలి.
- ఆటవెలది, సీసం, ద్విపద లక్షణాలు అర్థం చేసుకోవాలి. ఆయా ఛందాలను గుర్తించగలగాలి.
- పుంప్వాదేశసంధి, విసర్గసంధి, నుగాగమ సంధి, ప్రాతాదిసంధి. శ్చుత్వసంధులను అర్థం చేసుకొని ఆయా సంధుల గురించి వివరించి రాయగలగాలి.
- అవ్యయీభావసమాసాన్ని అవగాహన చేసుకొని ఉదాహరణలు ఇవ్వగలగాలి.
- ముక్త పదగ్రస్త, లాటానుప్రాస, అతిశయోక్తి, అర్థాంతరన్యాస అలంకారాలు అవగాహన చేసుకొని గుర్తించగలగాలి.

## IV. ప్రాజెక్టుపనులు

ఇవి వివిధ సామర్థ్యాల సమాహారం, వివిధ సామర్థ్యాలను సందర్భోచితంగా వినియోగించే శక్తిని పిల్లలకు కలిగిస్తాయి. కథలు, కవితలు, రచయితల వివరాలు, సమాజసేవలో పాల్గొన్నవారి వివరాలు, జీవన విధానాల వివరాలు, సమీక్ష వ్యాసాలు మొదలైనవి సేకరించి నివేదికలు రాసి ప్రదర్శించాలి.

## ద్వితీయభాష :

### I. అవగాహన - ప్రతిస్పందన

దీంట్లో వినడం - మాట్లాడడం; ధారాళంగా చదివి, అర్థంచేసుకొని, వ్యక్తీకరించడం అనే సామర్థ్యాలుంటాయి. వీటిలో పిల్లలు కింది అంశాలను చేయగలగాలి.

- విన్న, చదివిన అంశాలను అర్థం చేసుకోవాలి. తమ అభిప్రాయాలను వ్యక్తపరచగలగాలి.
- సమర్థిస్తూ లేదా విభేదిస్తూ మాట్లాడగలగాలి, కారణాలను వివరించగలగాలి.
- పద్య భావాలు, పాఠ్యభాగ సారాంశాలు, కథలు, కథానికలను సొంతమాటల్లో చెప్పగలగాలి.
- ఎవరు ఎవరితో అన్నారు? ఏ సందర్భంలో అన్నారు? వంటివి పాఠంలో గుర్తించగలగాలి.

- పాత్రల స్వభావాన్ని పట్టికరూపంలో తయారుచేయగలగాలి.
- భావాలకు తగిన పద్యపాదాలను, గేయపాదాలను గుర్తించగలగాలి.
- చదివిన అంశంలోని కీలకాంశాలను, కీలకపదాలను రాయగలగాలి.
- అపరిచిత గద్యం లేదా పద్యాలు చదివి ప్రశ్నలకు జవాబులు రాయాలి. ప్రశ్నలు కూడా తయారుచేయగలగాలి.
- పాఠంలో చుక్కగుర్తున్న పద్యాలను చదివి, అర్థం చేసుకొని భావాలు రాయగలగాలి.

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

దీంట్లో స్వీయరచన, సృజనాత్మకత, ప్రశంస సామర్థ్యాలుంటాయి. వీటిలో పిల్లలు కిందివి చేయగలగాలి.

- కారణాలు రాయగలగాలి. వివరిస్తూ రాయగలగాలి.
- అభిప్రాయాలను రాయగలగాలి. నచ్చినవి, నచ్చనివి రాయగలగాలి.
- రచయిత అభిప్రాయాన్ని గ్రహించి వివరించగలగాలి.
- సమర్థిస్తూ లేదా విభేదిస్తూ రాయగలగాలి.
- అభినందిస్తూ రాయడం, కరపత్రాలు తయారుచేయడం, లేఖలు రాయడం, సంభాషణలు రాయడం వంటివి చేయగలగాలి.

## III. భాషాంశాలు

ఇది పదజాలం, వ్యాకరణాంశాలకు సంబంధించినది. కింది తరగతుల్లో నేర్చుకున్నవాటితోపాటు పిల్లలు కిందివి చేయగలగాలి.

- పదాలకు అర్థాలు, నానార్థాలను, వ్యుత్పత్త్యర్థాలు, పర్యాయ పదాలను రాయగలగాలి.
- ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలు రాయగలగాలి.
- ప్రకృతికి వికృతులను, వికృతికి ప్రకృతి పదాలు రాయగలగాలి.
- దైనందిన జీవితంలో సందర్భోచితంగా సరైన పదాలను వినియోగించగలగాలి.
- భాషాభాగాలు, కర్తరి కర్మణి వాక్యాలు, వాక్యభేదాలను గుర్తించగలగాలి.
- త్రికసంధి, యణాదేశసంధులను గుర్తించగలగాలి.
- అవ్యయీభావం, విశేషణ పూర్వపద కర్మధారయ సమాసాలను గుర్తించగలగాలి.
- అతిశయోక్తి అలంకారం గుర్తించగలగాలి.
- గురులఘువులను గుర్తించగలిగి, ఉత్పలమాల లక్షణాల్ని తెలపగలగాలి.

## IV. ప్రాజెక్టుపనులు

ఇవి వివిధ సామర్థ్యాల సమాహారం, వివిధ సామర్థ్యాలను సందర్భోచితంగా వినియోగించే శక్తిని పిల్లలకు కలిగిస్తాయి. కథలు, కవితలు, రచయితల వివరాలు, సమాజసేవలో పాల్గొన్నవారి వివరాలు మొదలయినవి సేకరించి నివేదికలు రాసి ప్రదర్శించాలి.

## పాఠం వారిగా సాధించాల్సిన సామర్థ్యాలు :

### 1వ పాఠం : వెన్నెల

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన - ప్రతిస్పందన** | |
| | (i) వినడం - మాట్లాడడం | 1. ప్రకృతిలోని వివిధ సందర్భాలను వర్ణించడం వల్ల కలిగే అనుభూతుల గురించి చర్చించగలగాలి.<br>2. నచ్చిన ఒక సందర్భాన్ని వర్ణించి చెప్పగలగాలి. |
| | (ii) ధారాళంగా చదవడం - అవగాహన చేసుకోవడం - రాయడం | 1. ఎఱ్ఱన, పోతన పద్యాలను ధారాళంగా చదవగలగాలి. అవగాహన చేసుకుని పోల్చగలగాలి.<br>2. చుక్క గుర్తున్న పద్యాలను ధారాళంగా చదివి, ప్రతి పదార్థం రాయగలగాలి. |
| II | **వ్యక్తీకరణ - సృజనాత్మకత**<br>(i) స్వీయరచన | 1. ఇచ్చిన వాక్యాన్ని కవి ఏ సందర్భంలో పేర్కొన్నాడో వివరించగలగాలి. పాఠ్య సారాంశాన్ని సొంతమాటల్లో రాయగల్గాలి.<br>2. వెన్నెలను వర్ణించడానికి ఎన్నుకొన్న అంశాలను వివరించగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. ఒక ప్రకృతి దృశ్యమునుగాని, సన్నివేశమునుగాని వర్ణిస్తూ రాయగలగాలి. ఉదా॥ సూర్యోదయం / సూర్యాస్తమయం<br>2. కవి శైలిని ప్రశంసిస్తూ రాయగలగాలి. |
| III | **భాషాంశాలు** | |
| | (i) పదజాలం | 1. సందర్భానుసారంగా మాటల అర్థాలను గ్రహించి, వాటిని సొంత వాక్యాల్లో ఉపయోగించగలగాలి.<br>2. నిఘంటువు సహాయముతో నానార్థములను, పర్యాయపదాలను రాయగలగాలి.<br>3. ప్రకృతి - వికృతులను రాయగలగాలి. |

## 2వ పాఠం : ధన్యుడు

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన - ప్రతిస్పందన**<br>(i) వినడం - మాట్లాడడం | 1. చూడాకర్ణుని మాటలపై అభిప్రాయాన్ని చెప్పగలగాలి.<br>2. "ధనలోభం సర్వ ఆపదలకు మూలం" అనే విషయాన్ని సమర్థిస్తూ, వ్యతిరేకిస్తూ అభిప్రాయం చెప్పగలగాలి.<br>3. పాఠం శీర్షికను విశ్లేషిస్తూ చెప్పగలగాలి. |
| | (ii) ధారాళంగా చదవడం - అవగాహన చేసుకోవడం - రాయడం | 1. పాఠాన్ని చదివి ఇచ్చిన వాక్యాలు ఎవరు ఎవరితో అన్నారు గుర్తించి రాయగలగాలి.<br>2. అపరిచిత పద్యాన్ని చదివి భావాన్ని పూరిస్తూ రాయగలగాలి.<br>3. పాఠ్యాంశం ఆధారంగా చూడాకర్ణునికి, వీణాకర్ణునికి మధ్య జరిగిన సంభాషణ రాయగలగాలి. |
| II | **వ్యక్తీకరణ - సృజనాత్మకత**<br>(i) స్వీయరచన | 1. పాఠం ఆధారంగా ఇచ్చిన వాక్యాల గురించి వివరించగలగాలి. కీలక పదాల గురించి సోదాహరణంగా వివరించగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. ఇచ్చిన వాక్య ఔచిత్యాన్ని సృజనాత్మకంగా వివరించగలగాలి. కథను నాటికగా మలచగలగాలి.<br>2. రచయిత రచనా విధానాన్ని ప్రశంసించగలగాలి. |
| III | **భాషాంశాలు**<br>(i) పదజాలం | 1. ఇచ్చిన వాక్యాల అర్థాలను సొంతమాటల్లో వివరించగలగాలి.<br>2. ప్రకృతి - వికృతులు, వ్యుత్పత్తి అర్థాలను రాయగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. సంధులు, సమాసాలను గుర్తించి రాయగలగాలి, పుంప్వాదేశసంధి గురించి తెలుసుకొని సూత్రీకరణ చేయగలగాలి.<br>2. వచన రచనలో ఉండే శైలి భేదాల్ని గుర్తించగలగాలి. |

## 3వ పాఠం : మాతృభావన

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన – ప్రతిస్పందన**<br>(i) వినడం – మాట్లాడడం | 1. స్త్రీలపై జరిగే దాడులకు కారణాలు, నివారణోపాయాలు గురించి చర్చించగలగాలి.<br>2. కుటుంబం, సమాజం అభివృద్ధిలో స్త్రీలపాత్ర గురించి మాట్లాడగలగాలి. |
| | (ii) ధారాళంగా చదవడం – అవగాహన చేసుకోవడం – రాయడం | 1. చుక్క గుర్తున్న పద్యాలకు ప్రతిపదార్థం రాయగలగాలి.<br>2. పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి. |
| II | **వ్యక్తీకరణ – సృజనాత్మకత**<br>(i) స్వీయరచన | 1. ఇచ్చిన ప్రశ్నలకు సొంతమాటల్లో సమాధానాలు రాయగలగాలి, అభిప్రాయాలు వివరించగలగాలి.<br>2. శివాజీ వ్యక్తిత్వాన్ని విశ్లేషించగలగాలి. శివాజీ మాటలను విద్యార్థి తన సొంత అనుభవాల ఆధారంగా సమర్థించగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. పాఠ్యాంశాన్ని 'ఏకాంకిక' రూపంలో రాసి, ప్రదర్శించగలగాలి.<br>2. స్త్రీల పట్ల గౌరవం పెంపొందించే నినాదాలను, సూక్తులను రాయగలగాలి. |
| III | **భాషాంశాలు**<br>(i) పదజాలం | 1. ఇచ్చిన పర్యాయ పదాలకు సంబంధించిన పదాన్ని పాఠ్యాంశం ఆధారంగా గుర్తించగలగాలి.<br>2. పాఠ్యాంశం ఆధారంగా గదులను పూరించగలగాలి. ప్రకృతి, వికృతులను జతపరచగలగాలి. వేరుచేయగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. సంధులు, సమాసాలను గుర్తించి, సూత్రాలను తెలపగలగాలి. అనునాసికసంధి గురించి తెలుసుకొని సూత్రీకరణ చేయగలగాలి.<br>2. అలంకారాన్ని, ఛందో వైవిధ్యాన్ని గుర్తించి, లక్షణాలను రాయగలగాలి. సీస పద్య లక్షణాన్ని తెలుసుకొని గుర్తించగలగాలి. |

# 4వ పాఠం : జానపదుని జాబు

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన – ప్రతిస్పందన** | |
| | (i) వినడం – మాట్లాడడం | 1. ఇచ్చిన విషయాన్ని సమర్థిస్తూ, సకారణంగా మాట్లాడగలగాలి. ఉదా॥ పల్లెగొప్పదా? పట్నం గొప్పదా?<br>2. ఇచ్చిన అంశాన్ని గురించి అర్థవంతమైన చర్చ చేయగలగాలి. ఉదా: వ్యవసాయం చేసేవారి సంఖ్య క్రమంగా తగ్గటానికి కారణాలు వివరించగలగాలి. |
| | (ii) ధారాళంగా చదవడం – అవగాహన చేసుకోవడం – రాయడం | 1. పాఠ్యాంశమును చదివి ఇచ్చిన వాక్యాలు ఎవరు ఎవరితో ఏ సందర్భంలో అన్నారో గుర్తించగలగాలి.<br>2. అపరిచిత గద్యాన్ని చదివి సరియైన సమాధానాలు రాయగలగాలి.<br>3. పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి. |
| II | **వ్యక్తీకరణ – సృజనాత్మకత** | |
| | (i) స్వీయరచన | 1. అభిప్రాయాలు రాయగలగాలి. రచయిత ఉద్దేశాల్ని, వివరిస్తూ రాయగలగాలి. ఇచ్చిన అంశాన్ని వివరిస్తూ / సమర్థిస్తూ రాయగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. ప్రకృతి దృశ్యాలను వర్ణిస్తూ మిత్రుడికి లేఖ రాయగలగాలి.<br>2. పాఠం ఆధారంగా నినాదాలు, సూక్తులు రాయగలగాలి. |
| III | **భాషాంశాలు** | |
| | (i) పదజాలం | 1. ఇచ్చిన పదాలకనుగుణంగా సంబంధింత పదాల్ని కలపగలగాలి.<br>2. పదాల్ని సొంతవాక్యాల్లో రాయగలగాలి.<br>3. కీలక పదాలు లేదా వాక్యాలను వివరిస్తూ రాయగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. వాక్యాల్లో ఇచ్చిన సంధిపదాలను గుర్తించి, సూత్రీకరించగలగాలి.<br>2. సంశ్లిష్ట, సంయుక్త వాక్యాలుగా మార్చగలగాలి.<br>3. ప్రాతాధి సంధి గురించి తెలుసుకుని సూత్రీకరణ చేయగలగాలి. |

# 5వ పాఠం : శతక మధురిమ

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన - ప్రతిస్పందన** | |
| | (i) వినడం - మాట్లాడడం | 1. కీలక పదాల గురించి మాట్లాడగలగాలి. |
| | (ii) ధారాళంగా చదవడం - అవగాహన చేసుకోవడం - రాయడం | 1. ఇచ్చిన భావం ఆధారంగా పద్య పాదాలు గుర్తించగలగాలి.<br>2. పాదభంగం లేకుండా పద్యాల్ని పూరించగలగాలి.<br>3. అపరిచిత పద్యాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి. |
| II | **వ్యక్తీకరణ - సృజనాత్మకత** | |
| | (i) స్వీయరచన | 1. ఇచ్చిన ప్రశ్నలకు సొంతమాటల్లో జవాబులు రాయగలగాలి.<br>2. తన అనుభవాలను జోడించి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. మిత్రుడికి లేఖ రాయగలగాలి.<br>2. ఇచ్చిన అంశానికి అనుగుణంగా ఇంటర్వ్యూకు ప్రశ్నావళిని రూపొందించగలగాలి. |
| III | **భాషాంశాలు** | |
| | (i) పదజాలం | 1. ఇచ్చిన పదాలకు అర్థాలు రాసి, సొంతవాక్యాలు రాయగలగాలి.<br>2. వ్యుత్పత్తి అర్థాలు రాయగలగాలి. పర్యాయపదాలు రాసి, వాటితో వాక్యాలు రాయగలగాలి.<br>3. ప్రకృతి, వికృతుల పట్టిక తయారుచేయగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. అలంకారంపై చర్చించగలగాలి.<br>2. విసర్గ సంధి గురించి తెలుసుకొని సూత్రీకరించగలగాలి. |

# 6వ పాఠం : నేనెరిగిన బూర్గుల

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన – ప్రతిస్పందన** | |
| | (i) వినడం – మాట్లాడడం | 1. ఇచ్చిన అంశంపై అభిప్రాయాలు తెలుపగలగాలి. |
| | (ii) ధారాళంగా చదవడం – అవగాహన చేసుకోవడం – రాయడం | 1. పట్టికలో ఇచ్చిన ప్రత్యేక పదాల వివరాలను పాఠం ఆధారంగా ఏయే పేరాల్లో ఉన్నాయో గుర్తించి పట్టికలో రాయగలగాలి.<br>2. పాఠంలోని మొత్తం జాతీయాల్ని గుర్తించి రాయగలగాలి.<br>3. అపరిచిత గద్యాన్ని చదివి ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.<br>4. పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి. |
| II | **వ్యక్తీకరణ – సృజనాత్మకత** | |
| | (i) స్వీయరచన | 1. బూర్గుల, పి.వి.గార్ల సంబంధాన్ని సమర్థిస్తూ రాయగలగాలి.<br>2. ఇచ్చిన వాక్యానికి సందర్భాన్ని తెలిపి కారణాలను వివరించగలగాలి.<br>3. బూర్గుల వ్యక్తిత్వం గురించి సొంతమాటల్లో రాయగలగాలి.<br>4. ఇచ్చిన అంశాల్ని సమర్థిస్తూ రాయగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. పాఠంలోని పదజాలం విశిష్ట లక్షణాల ఆధారంగా కవితను రాయగలగాలి.<br>2. నచ్చిన ఉపాధ్యాయుడిని ప్రశంసిస్తూ "సన్మాన పత్రాన్ని" రాయగలగాలి. |
| III | **భాషాంశాలు** | |
| | (i) పదజాలం | 1. జాతీయాలను సొంతవాక్యాల్లో రాయగలగాలి.<br>2. వృత్తులు వాటి ప్రత్యేక లక్షణాలకు సంబంధించిన పదాలను పట్టిక రూపంలో రాయగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. వాక్యంలో సూచించబడిన పదాల సంధులను గుర్తించగలగాలి.<br>2. తత్పురుష భేదాలను గుర్తించి సమాస నిర్ణయం చేయగలగాలి.<br>3. కర్తరి, కర్మణీ వాక్యాలను గుర్తించగలగాలి. సమన్వయించగలగాలి.<br>4. నుగాగమ సంధి గురించి తెలుసుకుని సూత్రీకరణ చేయగలగాలి. |

# 7వ పాఠం : నగరగీతం

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన – ప్రతిస్పందన** | |
| | (i) వినడం – మాట్లాడడం | 1. తాను చూసిన నగరాల్లో తనకు నచ్చిన / నచ్చని అంశాలు తెలుపగలగాలి.<br>2. వలసలు, వలస వ్యక్తుల గురించి చెప్పగలగాలి. |
| | (ii) ధారాళంగా చదవడం – అవగాహన చేసుకోవడం – రాయడం | 1. ఇచ్చిన కవితాపంక్తుల్లో దాగిన అంతరార్థాన్ని రాయగలగాలి.<br>2. ఇచ్చిన పేరాను చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.<br>3. పాఠం ఆధారంగా ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి. |
| II | **వ్యక్తీకరణ – సృజనాత్మకత** | |
| | (i) స్వీయరచన | 1. పల్లెకు, నగరానికి గల వ్యత్యాసాన్ని తెలుపుతూ రాయగలగాలి.<br>2. కవి ఆంతర్యాన్ని వివరిస్తూ రాయగలగాలి.<br>3. నగరంలో అందరూ ఎందుకు జీవించాలనుకుంటున్నారో సొంతమాటల్లో రాయగలగాలి.<br>4. పాఠ్య సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలగాలి.<br>5. సంక్లిష్టమైన నగర జీవనాన్ని విశ్లేషించగలగాలి.<br>6. నగర జీవితంలోని నిజానిజాన్ని గురించి రాయగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. కవితకు మరో పార్శ్వంగా నగర జీవనంపై వ్యాసం రాయగలగాలి.<br>2. పల్లె గొప్పదనాన్ని వర్ణిస్తూ వచన కవిత రాయగలగాలి. |
| III | **భాషాంశాలు** | |
| | (i) పదజాలం | 1. సొంతవాక్యాలు, పర్యాయపదాలు రాయగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. ఇచ్చిన కవితాభాగాల్లోని అలంకారాన్ని గుర్తించగలగాలి.<br>2. ముక్త పదగ్రస్తం, యమకం, లాటానుప్రాసం అలంకారాలను తెలుసుకొని గుర్తించగలగాలి. |

## 8వ పాఠం : యక్షుడి అప్పు

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన – ప్రతిస్పందన**<br>(i) వినడం – మాట్లాడడం | 1. నాటికలోని హాస్య సంఘటనలను చెప్పగలగాలి. |
| | (ii) ధారాళంగా చదవడం – అవగాహన చేసుకోవడం – రాయడం | 1. ఇచ్చిన వాక్యాలను పాఠం ఆధారంగా ఎవరు ఎవరితో అన్నారో రాయగలగాలి.<br>2. పాత్రల స్వభావాన్ని పట్టికలో రాయగలగాలి.<br>3. పాఠం ఆధారంగా తప్పొప్పులు గుర్తించగలగాలి.<br>4. పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి. |
| II | **వ్యక్తీకరణ – సృజనాత్మకత**<br>(i) స్వీయరచన | 1. పాత్రల స్వభావాన్ని విశ్లేషిస్తూ రాయగలగాలి.<br>2. పాఠం ఆధారంగా అప్పు ఇచ్చేవారి స్వభావాన్ని విశ్లేషిస్తూ రాయగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. నాటికను కథా రూపంలో రాయగలగాలి.<br>2. నాటికను పొడిగించి, హాస్య స్ఫోరకంగా రాయగలగాలి. |
| III | **భాషాంశాలు**<br>(i) పదజాలం | 1. ఇచ్చిన మాటలను వివరించగలగాలి.<br>2. సొంత వాక్యాలు రాయగలగాలి.<br>3. పర్యాయపదాలు రాయగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. అనునాసిక, పడ్వాది సంధులను గుర్తించి, సూత్రాలను రాయగలగాలి.<br>2. వాక్యాలను ప్రత్యక్ష, పరోక్ష కథనాల్లో మార్చగలగాలి.<br>3. అతిశయోక్తి అలంకారాన్ని తెలుసుకొని, గుర్తించగలగాలి. |

## 9వ పాఠం : బసవేశ్వర పరిణయం

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన – ప్రతిస్పందన** | |
| | (i) వినడం – మాట్లాడడం | 1. పెళ్ళి వేడుకల్లో ఉన్న సాంప్రదాయాల గురించి చెప్పగలగాలి.<br>2. ద్విపదను రాగంతో, భావంతో పాడగలగాలి. |
| | (ii) ధారాళంగా చదవడం – అవగాహన చేసుకోవడం – రాయడం | 1. అపరిచిత పద్యాన్ని చదివి ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.<br>2. పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి. |
| II | **వ్యక్తీకరణ – సృజనాత్మకత** | |
| | (i) స్వీయరచన | 1. పాఠ్య సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలగాలి.<br>2. ప్రాచీన కావ్యాలకు సంబంధించిన పాఠాలు చదవడంవల్ల కలిగే ప్రయోజనాలను వివరించగలగాలి.<br>3. నేటి వివాహాల్లో వధూవరుల అలంకరణలెలా ఉంటాయో సొంతమాటల్లో రాయగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. ద్విపదను వచన కవిత్వంగా మలచగలగాలి.<br>2. వివాహాలపై విమర్శనాత్మకంగా ఒక లేఖ రాయగలగాలి. |
| III | **భాషాంశాలు** | |
| | (i) పదజాలం | 1. సందర్భాన్ననుసరించి మాటల ఉపయోగాలను గ్రహించి, వాక్యాలను రాయగలగాలి.<br>2. నానార్థాలు, పర్యాయపదాలు, ప్రకృతి వికృతులను రాయగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. సంధులు, సమాసాలు, అలంకారాలు గుర్తించగలగాలి.<br>2. ద్విపద ఛందస్సును గురించి తెలుసుకొని గుర్తించగలగాలి. |

# 10వ పాఠం : మా ప్రయత్నం

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన - ప్రతిస్పందన** | |
| | (i) వినడం - మాట్లాడడం | 1. బాలికా విద్య - ఆవశ్యకత మొ॥ విషయాలపైన మాట్లాడగలగాలి.<br>2. 20వ శతాబ్దం స్త్రీల శతాబ్దం అనే అంశంపై చర్చించగలగాలి. |
| | (ii) ధారాళంగా చదవడం - అవగాహన చేసుకోవడం - రాయడం | 1. ఇచ్చిన వాక్యాలు పాఠంలో ఎక్కడున్నాయో గుర్తించి సందర్భాన్ని వివరించగలగాలి.<br>2. అపరిచిత గద్యాన్ని చదివి ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.<br>3. పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి. |
| II | **వ్యక్తీకరణ - సృజనాత్మకత** | |
| | (i) స్వీయరచన | 1. చరిత్ర నిర్మాతలుగా స్త్రీలు ప్రధానంగా ఉన్నారనే భావన సంపాదకులకు కలగడానికి గల కారణాలను వివరించగలగాలి.<br>2. పీఠికా కర్తల యొక్క ఆంతర్యాన్ని వివరించగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. మహిళలు ధైర్యంగా మెలగాలని తెలియజేసేలా కరపత్రం తయారుచేయగలగాలి.<br>2. వార్షికోత్సవంలో ప్రసంగించే మహిళా రచయిత్రిని ఇంటర్వ్యూ చేయడానికి ప్రశ్నల జాబితాను తయారుచేయగలగాలి. |
| III | **భాషాంశాలు** | |
| | (i) పదజాలం | 1. వాక్యాల్లో సూచించిన పదాలకు పర్యాయపదాలు రాయగలగాలి.<br>2. జాతీయాలను ఏయే సందర్భాలలో వాడతారో వివరించగలగాలి.<br>3. కీలక పదాల గురించి వివరించగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. వాక్య భేదాలను గుర్తించి రాయగలగాలి.<br>2. సంధులు, పదాల మధ్య సంబంధాన్ని గుర్తించి సూత్రాన్ని రాయగలగాలి.<br>3. సమాసాలు, విగ్రహవాక్యాలను జతపరచగలగాలి.<br>4. శబ్దాలంకారాన్ని గుర్తించగలగాలి. |

# 11వ పాఠం : మాణిక్యవీణ

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన – ప్రతిస్పందన** | |
| | (i) వినడం – మాట్లాడడం | 1. 'మాణిక్యవీణ' కవిత విన్న తర్వాత కలిగిన అనుభూతిని చెప్పగలగాలి.<br>2. కవితను భావయుక్తంగా చదివి భావాన్ని సొంతమాటల్లో చెప్పగలగాలి.<br>3. పొట్లపల్లిగారు రాసిన కవితను చదివి జవాబులు రాయగలగాలి. |
| | (ii) ధారాళంగా చదవడం – అవగాహన చేసుకోవడం – రాయడం | 1. పాఠంలోని అంత్యప్రాసలున్న పదాలను వెతికి, మరికొన్ని పదాలను రాయగలగాలి.<br>2. పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి. |
| II | **వ్యక్తీకరణ – సృజనాత్మకత** | |
| | (i) స్వీయరచన | 1. చరిత్రలో మైలురాళ్ళుగా నిల్చిన అంశాలను చదివి, భావనలను రాయగలగాలి.<br>2. కవితలోని వర్ణనలపై సొంత అభిప్రాయాలను రాయగలగాలి.<br>3. కవి వర్ణనలను సమర్థించగలగాలి. కవితా సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. పరిసరాల్లో, మానవ జీవితాల్లో కల్గిన మార్పులను వర్ణిస్తూ కవిత రాయగలగాలి.<br>2. విద్వాన్ విశ్వం కవితా శిల్పాన్ని ప్రశంసిస్తూ మిత్రునికి లేఖ రాయగలగాలి. |
| III | **భాషాంశాలు** | |
| | (i) పదజాలం | 1. వాక్యాల్లోని పదాలకు అర్థాలురాసి, సొంతమాటల్లో రాయగలగాలి.<br>2. పాఠం ఆధారంగా వాక్యాలకు సమానమైన పదాలను వెతికి రాయగలగాలి.<br>3. జాతీయాలనుపయోగిచు సందర్భాలను తెలిపి, సొంతవాక్యాల్లో ఉపయోగించగలగాలి.<br>4. పదాలకు అర్థాలను, వికృతి పదాలకు ప్రకృతి పదాలను చేర్చి వాక్యాలను రాయగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. నుగాగమ సంధి పదాలను గుర్తించి విడదీసి సూత్రాలను రాయగలగాలి.<br>2. సమాసపదాలకు విగ్రహవాక్యాలను సమాసాలను జతపరచగలగాలి.<br>3. శ్లేషాలంకారం గుర్తించగలగాలి. |

# 12వ పాఠం : గోరంత దీపాలు

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన – ప్రతిస్పందన**<br>(i) వినడం – మాట్లాడడం | 1. శీర్షికను సకారణంగా చర్చించగలగాలి. |
| | (ii) ధారాళంగా చదవడం – అవగాహన చేసుకోవడం – రాయడం | 1. పాఠాన్ని పూర్తిగా చదివి,వర్ణనలకు సంబంధించిన కీలక పదాలను రాయగలగాలి.<br>2. ఇచ్చిన వాక్యాలు ఎవరు, ఎవరితో ఏ సందర్భాల్లో అన్నారో రాయగలగాలి.<br>3. పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి. |
| II | **వ్యక్తీకరణ – సృజనాత్మకత**<br>(i) స్వీయరచన | 1. ఇచ్చిన వాక్యాలపై అభిప్రాయాలు రాయగలగాలి.<br>2. పాత్రల స్వభావన్ని, గొప్పతనాన్ని సొంతమాటల్లో రాయగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. పర్యాటక క్షేత్రం గురించి వర్ణించి రాయగలగాలి.<br>2. ఇచ్చిన పేరాను చదివి సంబంధిత చిత్రాన్ని గీసి రంగులు వేసి కవిత రాయగలగాలి.<br>3. హాస్య సంభాషణ రాయగలగాలి. |
| III | **భాషాంశాలు**<br>(i) పదజాలం | 1. అర్థాలు, సొంతవాక్యాలు రాయగలగాలి.<br>2. ఇచ్చిన సమాచారం ఆధారంగా పదాలను రాయగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. పుంప్వాదేశ, టుగాగమ, అత్వ, ద్విరుక్తటకార సంధుల పదాలను గుర్తించి, సూత్రాలను రాయగలగాలి.<br>2. శ్చుత్వ సంధి గురించి తెలుసుకుని గుర్తించగలగాలి. |

## 13వ పాఠం : భిక్ష

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన - ప్రతిస్పందన** | |
| | (i) వినడం - మాట్లాడడం | 1. అపరిచిత పద్యాన్ని చదివి, అందులోని విషయాన్ని చెప్పగలగాలి.<br>2. "అన్ని దానాల్లోకి అన్నదానం మిన్న" అను అంశంపై చర్చించగలగాలి. |
| | (ii) ధారాళంగా చదవడం - అవగాహన చేసుకోవడం - రాయడం | 1. చుక్కగుర్తున్న పద్యాలకు ప్రతి పదార్థం రాయగలగాలి. |
| II | **వ్యక్తీకరణ - సృజనాత్మకత** | |
| | (i) స్వీయరచన | 1. పాఠంలోని కథను సంక్షిప్తంగా రాయగలగాలి.<br>2. వ్యాసుని స్వభావాన్ని వివరించగలగాలి.<br>3. "నేడు నిన్నటి మఱునాడు నిక్కువంబు" అను మాటల సందర్భాన్ని వాటి అంతరార్థాన్ని తెలుపగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. కోపాన్ని తగ్గించుకోవడం మంచిది అనే అంశంపై మిత్రునికి లేఖ రాయగలగాలి.<br>2. భిక్ష, రక్ష, పరీక్ష, సమీక్ష, వివక్ష అనే పదాలతో చక్కని భావంతో కవిత రాయగలగాలి. |
| III | **భాషాంశాలు** | |
| | (i) పదజాలం | 1. పర్యాయపదాలు, నానార్థాలు, ప్రకృతి, వికృతులను గుర్తించి రాయగలగాలి.<br>2. సొంతవాక్యాలు రాయగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. పద్యపాదాల్లోని సంధులను గుర్తించి, సూత్రాలను రాయగలగాలి.<br>2. పద్యపాదాల్లోని ఛందోభేదాలను గుర్తించి సమన్వయం చేయగలగాలి.<br>3. అర్థాంతరన్యాసాలంకారాన్ని తెలుసుకొని గుర్తించగలగాలి. |

# 14వ పాఠం : చిత్రగ్రీవం

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన - ప్రతిస్పందన** | |
| | (i) వినడం - మాట్లాడడం | 1. మనుష్యులు, జంతువుల, పక్షుల పెంపకాలపై సకారణమైన అభిప్రాయాలను తెలుపుతూ మాట్లాడగలగాలి. |
| | (ii) ధారాళంగా చదవడం - అవగాహన చేసుకోవడం - రాయడం | 1. పాఠం ఆధారంగా ఇచ్చిన పేరాను పూరించగలగాలి.<br>2. పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.<br>3. అపరిచిత గద్యాన్ని చదివి ఖాళీలు పూరించగలగాలి. |
| II | **వ్యక్తీకరణ - సృజనాత్మకత** | |
| | (i) స్వీయరచన | 1. చిత్రగ్రీవం పాఠం ఆధారంగా ఆశ్చర్యం కలిగిన విషయాల గురించి సొంతమాటల్లో రాయగలగాలి.<br>2. చిత్రగ్రీవం గురించి సొంతమాటల్లో వర్ణించగలగాలి.<br>3. శిశువుల పెంపకంలో పక్షులకు, మనుషులకు మధ్య ఉన్న సామ్యాలను రాయగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. తనకు తెలిసిన జంతువులను గురించి కథనాన్ని రాయగలగాలి.<br>2. పిల్లలకు, పక్షులకు మధ్య జరిగే సంభాషణలను ఊహించి రాయగలగాలి. |
| III | **భాషాంశాలు** | |
| | (i) పదజాలం | 1. పదబంధాలనుపయోగించి సొంతవాక్యాలు రాయగలగాలి.<br>2. పదాలను వివరించి రాయగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. శ్లేష, అర్థాంతరాన్యాస లక్షణాలను రాయగలగాలి.<br>2. ఇచ్చిన లక్ష్యానికి అలంకారం గుర్తించగలగాలి.<br>3. సీసం, ఆటవెలది, తేటగీతి ఛందోలక్షణాలను రాయగలగాలి.<br>4. కంద పద్య లక్షణాన్ని తెలుసుకుని వివరించగలగాలి. సమన్వయం చేయగలగాలి. |

## ఉపవాచకం : రామాయణం

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | అవగాహన – ప్రతిస్పందన<br>(i) వినడం – మాట్లాడడం | 1. ఉపవాచకాన్ని చదివి తనకు నచ్చిన సందర్భాలను, అంశాలను చెప్పగలగాలి.<br>2. అందలి సంస్కృతి – సంప్రదాయాలను జీవన విధానాలను, మానవ స్వభావాలను వివరించగలగాలి. సొంత మాటల్లో చెప్పగలగాలి. |
| | (ii) ధారాళంగా చదవడం – అవగాహన చేసుకోవడం – రాయడం | ఉపవాచకంలోని ఏ పేరా నుండైనా ఏ రూపంలో అడిగిన ప్రశ్నలకైనా జవాబులు రాయగలగాలి.<br>ఉదా: ♦ ప్రశ్నలకు జవాబులు రాయడం.<br>♦ ప్రశ్నలు తయారుచేయడం.<br>♦ తప్పొప్పులను గుర్తించగలగడం.<br>♦ ఖాళీలను పూరించగలగడం.<br>♦ కీలక పదాలను వివరించగలగడం. |
| II | వ్యక్తీకరణ – సృజనాత్మకత<br>(i) స్వీయరచన | 1. ఉపవాచకంలోని పాత్రల స్వభావాలను వర్ణిస్తూ రాయగలగాలి.<br>2. ఆయా అంశాలపట్ల తన అనుభూతులను స్పష్టంగా వ్యక్తీకరించగలగాలి.<br>3. తాను ప్రత్యక్ష భాగస్వామియైతే స్పందించే విధం రాయగలగాలి.<br>4. ఆయా పాత్రలు / సంఘటనలు / కథల ద్వారా గ్రహించిన సందేశాన్ని వివరిస్తూ రాయగలగాలి.<br>5. తనకు నచ్చిన అంశాలను సకారణంగా వివరించగలగాలి. |

## ద్వితీయ భాష - 10వ తరగతి

## 1. భాగవతరత్నాలు

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన - ప్రతిస్పందన** | |
| | (i) వినడం - మాట్లాడడం | 1. విద్యార్థులకు తెలిసిన శాశ్వత కీర్తిమంతులను గురించి చెప్పగలగాలి.<br>2. పద్యాల భావాలను సొంతమాటల్లో చెప్పగలగాలి. |
| | (ii) చదవడం - అవగాహన చేసుకోవడం - రాయడం | 1. గద్యాన్ని చదివి సరైన వాటిని గుర్తించగలగాలి.<br>2. పాఠం ఆధారంగా జవాబులు రాయగలగాలి. |
| II | **వ్యక్తీకరణ - సృజనాత్మకత** | |
| | (i) స్వీయరచన | 1. పాఠంలోని ప్రశ్నలకు ఐదేసి, పదేసి వాక్యాల్లో జవాబులు రాయగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. మొదటి పద్యం ఆధారంగా ఒక కథను రాయగలగాలి.<br>2. ఇతరుల మేలు కోరడం ఆవశ్యకతను వివరిస్తూ మిత్రునికి లేఖను రాయగలగాలి. |
| III | **భాషాంశాలు** | |
| | (i) పదజాలం | 1. ప్రకృతి వికృతులను జతపరచగలగాలి.<br>2. పదాలకు అర్థాలు రాసి సొంతవాక్యాల్లో ఉపయోగించగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. వాక్యాల్లోని గీతగీసిన పదాలు ఏ భాషాభాగాలో గుర్తించగలగాలి.<br>2. విభక్తి ప్రత్యయాలతో ఖాళీలను పూరించగలగాలి.<br>3. ఇచ్చిన వాక్యాలను కర్తరి / కర్మణి రూపాలుగా రాయగలగాలి. |

# 2. మొద్దబ్బాయిలూ మహామేధావులే

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన – ప్రతిస్పందన** | |
| | (i) వినడం – మాట్లాడడం | 1. పాఠం ద్వారా కల్గిన అనుభూతులను, అభిప్రాయాలను సొంతమాటల్లో చెప్పగలగాలి. |
| | (ii) చదవడం – అవగాహన చేసుకోవడం – రాయడం | 1. పాఠం ఆధారంగా పట్టికను పూరించగలగాలి.<br>2. పాఠంలోని వాక్యాలు ఎవరు ఎవరితో అన్నారో రాయగలగాలి.<br>3. గాంధీ బోధనలకు సంబంధించిన పేరాను చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.<br>4. పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి. |
| II | **వ్యక్తీకరణ – సృజనాత్మకత** | |
| | (i) స్వీయరచన | 1. పాఠంలోని ప్రశ్నలకు ఐదేసి, పదేసి వాక్యాల్లో సమాధానాలు రాయగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. చదువులో వెనుకబడిన మిత్రున్ని ప్రోత్సహిస్తూ లేఖ రాయగలగాలి.<br>2. ఇవ్వబడిన అంశముపై సొంత అభిప్రాయాలతో ఒక వ్యాసం రాయగలగాలి. |
| III | **భాషాంశాలు** | |
| | (i) పదజాలం | 1. పదాలతో సొంతవాక్యాలు రాయగలగాలి.<br>2. ఇచ్చిన ఖాళీలలో సరైన పదాలు రాయగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. సంధులకు సంబంధించిన ఖాళీలను పూరించగలగాలి.<br>2. పదాలకు విగ్రహవాక్యాలు రాసి సమాసాల పేర్లు రాయగలగాలి.<br>3. త్రికసంధి పదాలను గుర్తించి సంధి విడదీసి సూత్రములను రాయగలగాలి. |

# 3. నవోదయం

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన - ప్రతిస్పందన**<br>(i) వినడం - మాట్లాడడం | 1. నవోదయం పాఠం ద్వారా ఏం తెలుసుకున్నారో చెప్పగలగాలి. |
| | (ii) చదవడం - అవగాహన చేసుకోవడం - రాయడం | 1. వివిధ భావాలుగల పంక్తులు కవితలో ఎక్కడున్నాయో గుర్తించగలగాలి.<br>2. కవితను చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.<br>3. నవోదయంతో జరుగు వివిధ అంశాలను రాయగలగాలి. |
| II | **వ్యక్తీకరణ - సృజనాత్మకత**<br>(i) స్వీయరచన | 1. కవితలోని వాక్యాల ద్వారా గ్రహించిన విషయాలను, కవి యొక్క ఉద్దేశాన్ని రాయగలగాలి.<br>2. నవోదయం శీర్షిక తగిన విధంగా ఉందనే కారణాలు వివరించగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. కవితలోని ఖండికలను చదివి సూర్యోదయాన్ని వర్ణించగలగాలి.<br>2. కవిత / గేయాన్ని రాయగలగాలి. |
| III | **భాషాంశాలు**<br>(i) పదజాలం | 1. సొంతవాక్యాలు, పర్యాయపదాలు రాయగలగాలి.<br>2. ప్రకృతి, వికృతి పదాలతో పట్టిక రాయగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. ఇచ్చిన పేరాను చదివి ఉత్తమ, మధ్యమ, ప్రథమ పురుష వాక్యాలను వేరుచేసి జతపరచగలగాలి.<br>2. 'అంత్యానుప్రాస' అలంకారాన్ని గుర్తించగలగాలి. దాన్ని సమర్థిస్తూ రాయగలగాలి. |

# 4. సంజయ రాయబారం

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన – ప్రతిస్పందన** | |
| | (i) వినడం – మాట్లాడడం | 1. ఇచ్చిన అంశాలను సమర్థిస్తూ మాట్లాడగలగాలి.<br>2. వివిధ అంశాలు ఏ సందర్భంలోనివో మాట్లాడగలగాలి. |
| | (ii) చదవడం – అవగాహన చేసుకోవడం – రాయడం | 1. పాఠంలో ఎవరి స్వభావాలు, గుణాలు ఎలాంటివో గుర్తించి పట్టికలో రాయగలగాలి.<br>2. ఇచ్చిన పేరాను చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి.<br>3. పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి. |
| II | **వ్యక్తీకరణ – సృజనాత్మకత** | |
| | (i) స్వీయరచన | 1. ఇచ్చిన ప్రశ్నలకు ఐదేసి, పదేసి వాక్యాల్లో సరైన విధంగా జవాబులు రాయగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. సంజయ రాయబారం ఘట్టాన్ని సంభాషణల రూపంలో రాసి, ప్రదర్శించగలగాలి.<br>2. యుద్ధకాంక్షవల్ల నష్టాలు వివరిస్తూ, శాంతి కాంక్షను తెలిపేలా దినపత్రికకు ఒక లేఖను రాయగలగాలి. |
| III | **భాషాంశాలు** | |
| | (i) పదజాలం | 1. ఇచ్చిన పదాలకు వ్యతిరేక పదాలు రాసి సొంతవాక్యాలు రాయగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. పురుష, స్త్రీ వాచకాలను సూచించే వాక్యాలను పట్టిక రూపంలో రాయగలగాలి.<br>2. యణాదేశసంధి పదాలను గుర్తించి, విడదీసి, సూత్రీకరించగలగాలి. |

## 5. కల్యాణం

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన - ప్రతిస్పందన** | |
| | (i) వినడం - మాట్లాడడం | 1. పాఠాన్ని రాగంతో పాడగలగాలి.<br>2. నాటి, నేటి పెండ్లిళ్ళలోని మార్పులను, కారణాలను వివరించగలగాలి. |
| | (ii) చదవడం - అవగాహన చేసుకోవడం - రాయడం | 1. ఇచ్చిన వాక్యాలను పాఠం ఆధారంగా వరుసక్రమంలో రాయగలగాలి.<br>2. ద్విపదను చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి. |
| II | **వ్యక్తీకరణ - సృజనాత్మకత** | |
| | (i) స్వీయరచన | 1. విద్యార్థులు చూసిన వివాహ ఘట్టాన్ని సొంతమాటల్లో రాయగలగాలి.<br>2. పాఠం సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. పాఠ్యాంశ భావాన్ని కథా రూపంలో రాయగలగాలి.<br>2. వివాహ సంస్కృతి గొప్పదనాన్ని ప్రశంసిస్తూ వ్యాసం రాయగలగాలి. |
| III | **భాషాంశాలు** | |
| | (i) పదజాలం | 1. ప్రకృతి వికృతులను జతపరచగలగాలి.<br>2. వాక్యాల్లో గీతగీసిన పదాలకు అర్థాలు రాసి వాటిని సొంతవాక్యాల్లో రాయగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. గుణసంధి, త్రికసంధులను గుర్తించి, విడదీసి రాయగలగాలి.<br>2. ఇచ్చిన వాక్యాల్లోని అలంకారాన్ని గుర్తించి రాయగలగాలి.<br>3. గురులఘువులను గుర్తించి, అవి ఏ గణాలో రాయగలగాలి. |

## 6. పిసినారి

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన - ప్రతిస్పందన** | |
| | (i) వినడం - మాట్లాడడం | 1. అత్యాశపరులు, పిసినారులవల్ల కలుగు పరిణామాలను వివరించగలగాలి. |
| | | 2. లింగరాజు లక్ష్మీదేవిని ప్రార్థించిన విధానం వివరించగలగాలి. |
| | (ii) చదవడం - అవగాహన చేసుకోవడం - రాయడం | 1. ఇచ్చిన వాక్యాలు పాఠ్యాంశం ఆధారంగా ఎవరు ఎవరితో ఏ సందర్భంలో అన్నారో రాయగలగాలి. |
| | | 2. ఇచ్చిన గద్యం చదివి ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి. |
| II | **వ్యక్తీకరణ - సృజనాత్మకత** | |
| | (i) స్వీయరచన | 1. ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి. |
| | | 2. వరవిక్రయంలోని లింగరాజు స్వభావాన్ని వర్ణించి రాయగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. వరవిక్రయంను వార్షికోత్సవం నాడు ప్రదర్శించగలగాలి. |
| | | 2. వరకట్న దురాచారాన్ని రూపుమాపిన సంఘ సంస్కర్తలను అభినందిస్తూ మిత్రునికి లేఖ రాయగలగాలి. |
| | | 3. వరకట్న నిర్మూలనకై ఒక కరపత్రం తయారుచేయగలగాలి. |
| III | **భాషాంశాలు** | |
| | (i) పదజాలం | 1. వాక్యాల్లో గీతగీసిన పదాల అర్థాలను పద పట్టిక ఆధారంగా రాయగలగాలి. |
| | | 2. ప్రకృతి వికృతులను గుర్తించగలగాలి. |
| | | 3. పర్యాయపదాలను పట్టిక ఆధారంగా రాయగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. పదాలకు విగ్రహవాక్యాలు రాసి అవి ఏ సమాసాలో గుర్తించగలగాలి. |
| | | 2. అవ్యయీభావ సమాసంను గుర్తించగలగాలి. |

# 7. మనిషీ! మనిషీ!

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన - ప్రతిస్పందన**<br>(i) వినడం - మాట్లాడడం | 1. ఆకాశంలో ఎగిరే పక్షులను చూసినప్పుడు ఎలాంటి అనుభూతి కలుగుతుందో చెప్పగలగాలి.<br>2. నచ్చిన మనిషి గురించి మాట్లాడగలగాలి. |
| | (ii) చదవడం - అవగాహన చేసుకోవడం - రాయడం | 1. ఇచ్చిన భావాలకు సరిపోలిన కవితా పంక్తులను రాయగలగాలి.<br>2. ప్రశ్నలకు జవాబులు పాఠం ఆధారంగా రాయగలగాలి. |
| II | **వ్యక్తీకరణ - సృజనాత్మకత**<br>(i) స్వీయరచన | 1. 'కవిత' ఆధారంగా సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలగాలి.<br>2. 'కవిత' ఆధారంగా మనిషి ఎలా ఉండాలని భావిస్తున్నారో వివరించి రాయగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. కవితరాసిన కవి ఇస్మాయిల్‌ను ప్రశంసిస్తూ మిత్రునికి లేఖ రాయగలగాలి. |
| III | **భాషాంశాలు**<br>(i) పదజాలం | 1. గీతగీసిన పదాలకు పర్యాయపదాలు రాయగలగాలి.<br>2. వికృతి పదాలకు పాఠంలోని ప్రకృతి పదాలను గురించి రాయగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. సామాన్య, సంశ్లిష్ట వాక్యాలను గుర్తించి రాయగలగాలి.<br>2. ఇచ్చిన పదాలకు, పాదాలకు గణాలను గుర్తించగలగాలి.<br>3. అతిశయోక్తి అలంకారాన్ని గుర్తించి రాయగలగాలి. |

## 8. జానపద నృత్య సంగీతాలు

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన - ప్రతిస్పందన** | |
| | (i) వినడం - మాట్లాడడం | 1. జానపదుల జీవితానికి, నృత్య సంగీతాలకు ఉండే అవినాభావ సంబంధంపై అభిప్రాయాలను చెప్పగలగాలి.<br>2. పాఠంలోని పేరాలను చదివి విషయం ఆధారంగా శీర్షికను నిర్ణయించగలగాలి. |
| | (ii) చదవడం - అవగాహన చేసుకోవడం - రాయడం | 1. ఇచ్చిన పేరాను చదివి ప్రశ్నలు తయారుచేయగలగాలి. పేరా కింద ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయగలగాలి. |
| II | **వ్యక్తీకరణ - సృజనాత్మకత** | |
| | (i) స్వీయరచన | 1. ప్రశ్నలకు సమాధానాలు రాయగలగాలి.<br>2. జానపద నృత్య సంగీతాల గొప్పదనాన్ని వివరిస్తూ వ్యాసం రాయగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. మన సంస్కృతిని కాపాడటంకోసం చేయవలసిన వాటితో ప్రసంగ వ్యాసాన్ని తయారుచేయగలగాలి. |
| III | **భాషాంశాలు** | |
| | (i) పదజాలం | 1. పదాలతో సొంతవాక్యాలు రాయగలగాలి.<br>2. పదాలను వివరించగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. వాక్యములలోని అలంకారాన్ని గుర్తించి, లక్షణాలను రాయగలగాలి.<br>2. ఇచ్చిన పదాలను విడదీసి ఏ సంధులో గుర్తించగలగాలి.<br>3. సమానపదాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాసాన్ని సూత్రీకరించగలగాలి. |

# 9. శతక మాధురి

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన - ప్రతిస్పందన** | |
| | (i) వినడం - మాట్లాడడం | 1. వృద్ధుల కష్టాలను, చూసిన సంఘటనలను చెప్పగలగాలి.<br>2. తల్లి మనస్సు ఎలాంటిదో చెప్పగలగాలి. |
| | (ii) చదవడం - అవగాహన చేసుకోవడం - రాయడం | 1. పద్యభావాలు చదివి సరయిన సమాధానములు గుర్తించగలగాలి.<br>2. పద్యపాదాల ఆధారంగా వాక్యాలను వరుస క్రమంలో రాయగలగాలి. |
| II | **వ్యక్తీకరణ - సృజనాత్మకత** | |
| | (i) స్వీయరచన | 1. ప్రశ్నలకు అడిగిన విధంగా జవాబులు రాయగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. పద్యాల ఆధారంగా సూక్తులను తయారుచేయగలగాలి.<br>2. మనం అలవరచుకోవలసిన మంచి గుణాల జాబితా తయారు చేయగలగాలి. |
| III | **భాషాంశాలు** | |
| | (i) పదజాలం | 1. గళ్ళలో ఇచ్చిన అక్షరాల ఆధారంగా శతకాల పేర్లు రాయగలగాలి.<br>2. పట్టికలోని వికృతి పదాలను గుర్తించి ప్రకృతి పదాలను సూటిగా రాయగలగాలి.<br>3. గీత గీసిన పదాలకు అర్థం తెలిపి సొంత వాక్యాల్లో ప్రయోగించగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. ఇచ్చిన లక్ష్యంతో అలంకారాన్ని గుర్తించగలగాలి.<br>2. సమాస పదాలు రాసి, సమాసాలు గుర్తించగలగాలి.<br>3. ఉత్పలమాల ఛంధోలక్షణాన్ని తెలుసుకుని గుర్తించగలగాలి. |

# 10. మాట్లాడే నాగలి

| క్ర.సం. | సామర్థ్యం | సాధించాల్సిన సామర్థ్యాలకు సూచికలు |
|---|---|---|
| I | **అవగాహన - ప్రతిస్పందన** | |
| | (i) వినడం - మాట్లాడడం | 1. కథను సొంతమాటల్లో చెప్పగలగాలి. కథా శీర్షికకు సకారణాలను చూపించగలగాలి. |
| | (ii) చదవడం - అవగాహన చేసుకోవడం - రాయడం | 1. ఇవ్వబడిన వాక్యాలు పాఠంలో ఏ పేరాలో ఉన్నాయో గుర్తించి గీత గీయగలగాలి.<br>2. అపరిచిత గద్యాన్ని చదివి ఖాళీలు పూరించగలగాలి. |
| II | **వ్యక్తీకరణ - సృజనాత్మకత** | |
| | (i) స్వీయరచన | 1. కథను కొనసాగించి ముగింపును రాయగలగాలి.<br>2. తాను ఆస్థానం (కన్నన్)లో ఉంటే ఏం చేసేవాడో రాయగలగాలి.<br>3. మూగజీవాలపై ఎందుకుప్రేమ చూపించాలో రాయగలగాలి. |
| | (ii) సృజనాత్మకత / ప్రశంస | 1. మూగజీవాలకు నోరొస్తే ఊహాత్మకంగా కథ రాయగలగాలి. |
| III | **భాషాంశాలు** | |
| | (i) పదజాలం | 1. వాక్యాల్లో సూచించిన పదాలు అర్థాలు రాసి, సొంతవాక్యాలు రాయగలగాలి. |
| | (ii) వ్యాకరణాంశాలు | 1. సమాసాలకు ఉదాహరణ రాసి విగ్రహవాక్యాలు రాయగలగాలి.<br>2. ఇచ్చిన పద్య పాదాల గణ విభజన చేసి యతి ప్రాసలను గుర్తించగలగాలి. |

**ముగింపు :**

ప్రతి పాఠాన్ని బోధించడానికి ముందు ఆ పాఠంలోని విషయం ఏముంది? అభ్యాసాలు ఏమిచ్చారు? పాఠం పూర్తయ్యేసరికి సాధించాల్సిన సామర్థ్యాలుఏవో తెల్సుకోవాలి. అప్పుడే వాటిని సాధించడానికి అవసరమైన బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించగలం. ఇందుకోసం ఈ అధ్యాయంలో చర్చించిన విషయాలను వినియోగించుకొందాం.



# IV. బోధనా వ్యూహాలు

భాష అంటే ఆలోచించడం, వ్యక్తీకరించడం. భాషా బోధన ద్వారా పిల్లల్లో ఆలోచనాశక్తి, వ్యక్తీకరణశక్తి వృద్ధిచెందాలి. ఇందుకనువైన వ్యూహాలను అమలుపరచాలి. పాఠ్యాంశాల గురించి చర్చించడానికి, అభ్యాసాలను నిర్వహించడానికి, పిల్లల అవగాహనను పెంపొందించడానికి దోహదపడే వ్యూహాల గురించి తెలుసుకొందాం.

## 1. KWL వ్యూహం :


**(నాకేం తెలుసు? నాకేం తెలియాలి? నేనేం తెలుసుకున్నాను?)**

ఏదేని ఒక అంశం గురించి చర్చించే ముందు పిల్లల్ని ఆ అంశం గురించి వారికేం తెలుసో అడగాలి. ఇది మొదటి సోపానం. తరవాత ఆ అంశం గురించి వాళ్ళు ఏం తెలుసుకోవాలనుకుంటున్నారో చర్చించాలి. వాళ్ళ అభిప్రాయాలు వినాలి. ఇది రెండవ సోపానం. ఇలా చర్చించిన తర్వాత విషయావగాహన అయిన పిదప వాళ్ళకు ఏమి అర్థమైంది ఏమి నేర్చుకున్నారో అడగాలి. ఇది మూడవ సోపానం. ఈ వ్యూహంలో ఒక అంశాన్ని పిల్లలకు పరిచయం చేసేటప్పుడు వాళ్ళకు ఆ అంశంపట్ల ఉన్న పూర్వ జ్ఞానాన్ని, ఆసక్తిని, వారి అవగాహనను నేర్చుకుంటున్నామనే స్పృహతో తెలుసుకోవడం అనేది జరుగుతుంది. ఇందులో ముందుగా ఊహించడానికి, తాము ఊహించినదాన్ని వాస్తవాలతో పోల్చుకోవడానికి, ఆసక్తికరమైన అభ్యసనానికి అవకాశం ఉంటుంది.

## 2. భావనా చిత్రం :

పిల్లలకు తమ పరిసరాలతో, ప్రతిచర్యలు జరపడం వల్ల ఎంతో అనుభవ జ్ఞానాన్ని పొందుతారు. ఎన్నో విషయాలపట్ల అవగాహన తమదైన శైలిలో స్పందిస్తుంటారు. మైండ్ మ్యాపింగ్ అనేది పిల్లల్ని ఒక అంశం పట్ల మేథోమథనం చేయించడం ముఖ్యంగా అంశానికి సంబంధించిన కీలక పదాలను నల్లబల్లపై రాసి ఆ పదాల భావనలను అందరితో చర్చించడం

జరుగుతుంది. పిల్లల స్వేచ్ఛా అభిప్రాయాలకు ఇందులో స్థానం ఉంటుంది. ఒకే అంశం గురించి పిల్లలను వివిధ కోణాల్లో ఆలోచింపజేయడం, ఆలోచనల సారాన్ని క్రమానుగుణంగా రాయడం ద్వారా వారిలో స్వీయరచనను ప్రోత్సహించడానికి ఈ వ్యూహం ఉపకరిస్తుంది. కింది ఉదాహరణను గమనించండి.




### 3. నృత్యాభినయం :

విద్యార్థులు తాము విన్న, చదివిన, తెలుసుకున్న అంశాలను స్వయంగా అభినయంతో నృత్యరూపకంగా ప్రదర్శించడమే కొరియోగ్రఫీ. ఇందులో నృత్యరూపక పాఠ్యాంశాలను ప్రదర్శించడానికి అవకాశముంటుంది. ఇందుకు ముందుగా పాఠ్య పాఠాంశాన్ని చదివించి పాత్రలను నిర్ణయించాలి. ఆ పాత్రలు పోషించడానికి పిల్లల్ని ఎంపికచేయాలి. సన్నివేశ దృశ్యాలకు కూడా పిల్లల్ని ఎంపిక చేయాలి. అంటే వృక్షాలు, పొదలు, కొండలు, నీటిమడుగులు వీటిని చూపడానికి కూడా పిల్లల్ని ఎంపికచేయాలి. ఇలా ఎంపికచేసిన పిదప జట్టులో సాధన చేయించాలి. ప్రదర్శించే సమయంలో నేపథ్య పాటను కూడా సాధన చేయించాలి. నృత్యరూపకాన్ని ప్రదర్శింపజేయాలి.

ఉదా : యక్షుడి అప్పు, పిసినారి (ద్వితీయభాష)

### 4. ఏకపాత్రాభినయం :

ఏదైనా ఒక పాఠ్యాంశంగాని అందులో ఒక పాత్ర మాట్లాడిన విషయాన్నిగాని తీసుకొని వ్యక్తిగతంగా, స్వగతంగా విద్యార్థిచేత పాత్రోచితంగా అభినయం చేయించడాన్నే ఏకపాత్రాభినయం అంటారు.

ఉదా : బూర్గుల పాత్ర, జానపదుని పాత్ర

### 5. మూకాభినయం :

మౌనంగా అభినయిస్తూ భావ వ్యక్తీకరణ చేయడమే మూకాభినయం. ఒక సంఘటనగాని, సన్నివేశాన్నిగాని ప్రేక్షకులకు అర్థమయ్యే రీతిలో అభినయించి చూపడాన్ని మూకాభినయం అంటారు. ఇందులో డైలాగులు, బ్యాక్‌గ్రౌండ్‌లు ఉండవు. కేవలం మౌనంగా నటించడమే ఉంటుంది.

ఉదా : గోరంతదీపాలు పాఠంలోని సన్నివేశాలను, మాట్లాడేనాగలి (ద్వితీయభాష) పాఠంలోని సన్నివేశాల్ని కూడా మూకాభినయం చేయవచ్చు.

**6. జట్టుపనులు నిర్వహించడం :**

పాఠాలకు సంబంధించిన కొన్ని అంశాలను జట్టులో నిర్వహించడం ద్వారా తోటివారితో కలిసి పనిచేయడం, అభిప్రాయాలను పంచుకోవడం, నివేదిక రాయడం, అర్థాలు గ్రహించడం మొదలగునవి చేయవచ్చు. జట్టుపని అనంతరం జట్టుచేత ప్రదర్శింపజేయాలి. వివిధ జట్లవారు రాసిన వాటిని ప్రదర్శించినప్పుడు చర్చించడం ద్వారా వారి వారి జట్టు పనులను సరిచేసుకోవడం జరుగుతుంది. వ్యక్తీకరణ-సృజనాత్మక అభ్యాసాలలోని సృజనాత్మక అంశాలను జట్టుపనులుగా ఇవ్వవచ్చు. ప్రాజెక్టుపనులు, ప్రశంసాత్మక పనులను కూడా జట్టుపనులుగా ఇవ్వవచ్చు.

**7. ప్రాజెక్టుపనులు :**

ప్రాజెక్టుపనులు వివిధ కృత్యాల సమాహారం. ప్రాజెక్టు పనులను ఇంటిపనులుగా ఇవ్వాలి. ఇంటిపనిగా ఇచ్చేముందు ప్రాజెక్టుపనిలో పిల్లలు ఏంచేయాలో, ఎలా చేయాలో సూచనలు ఇచ్చి అర్థం చేయించాలి. ప్రాజెక్టుపని స్వభావాన్నిబట్టి వ్యక్తిగతంగా లేదా జట్టుపనిగా ఇవ్వాలి. జట్టుపనులుగా ఇచ్చేటప్పుడు ఆ ప్రాజెక్టుపనిలో జట్టులోని సభ్యులు ఎవరెవరు ఏమేం చేయాలో స్పష్టంగా బాధ్యతలను కేటాయించాలి. ప్రాజెక్టుపనిని పూర్తిచేసిన తరవాత పిల్లలతో ప్రదర్శింపజేయాలి. పిల్లలు ప్రాజెక్టుపనులను ప్రదర్శించేటప్పుడు దోషాలుంటే సవరించాలి. అవసరమైన సలహాలు, సూచనలు అందించాలి. పిల్లలతో ప్రదర్శనాంతరం ప్రాజెక్టుపనిని ఎలా నిర్వహించారో ఒక నివేదిక రాయించాలి. ఈ నివేదికలో ప్రాజెక్టు పనిలో, ఎవరెవరు సభ్యులు? ఎవరెవరు ఏ బాధ్యతలను స్వీకరించారు? ప్రాజెక్టుపనికి సంబంధించి వివరాలను ఎలా సేకరించారు ఏ ఏ విషయాలు అందులో ఉన్నాయి వంటి సమాచారాన్ని నివేదిక రూపంలో పిల్లలు రాయాలి. (ప్రాజెక్టు పనుల జాబితా తదుపరి పేజీల్లో ఉన్నాయి.)

**8. చర్చలు :**

ఒక అంశం గురించి ఎవరెవరు ఏమేమి అన్నారో ఎటువంటి అభిప్రాయాలను వ్యక్తపరచారో సేకరించి నివేదికలు రాసి ప్రదర్శించడం.

'మా ప్రయత్నం' పాఠంలో "20వ శతాబ్దాన్ని స్త్రీల శతాబ్దం" గురించి చర్చించడం.

**9. స్వీయ అవగాహన - ప్రదర్శన :**

ఏదేని అంశానికి సంబంధించిన విషయాన్ని పిల్లలే తమకు తాము చదివి అర్థం చేసుకొని దాన్ని ఏకపాత్రాభినయ రూపంలోనూ, నాటకీకరణ రూపంలోనూ, తోలుబొమ్మలాట రూపంలోనూ ఇలా ఏ రూపమనేది వాళ్ళే నిర్ణయించుకొని ప్రదర్శించాల్సి ఉంటుంది.

**10. జిగ్ సా విధానం :**

ఈ విధానంలో ఒక అంశానికి సంబంధించిన విషయాన్ని భాగాలుగా / పేరాలుగా విభజించుకొని 4, 5 గురికి ఒక్కోపేరా చొప్పున పంచాలి. ఎవరి భాగాన్ని వాళ్ళు చదువుకోవాలి. పూర్తి అవగాహన చేసుకోవాలి. తర్వాత అందరూ కలిసి వారు చదివిన భాగంపై అనుభవాలను పంచుకొని దానిపై సంపూర్ణ అవగాహనకు రావాలి.

## 11. క్లోజ్ టెస్ట్ :

ఇది చదవడం – అర్థంచేసుకొనే సామర్థ్యాన్ని పెంచడానికి ఉపయోగపడే వ్యూహం. ఇందులో ఒక అంశంలో ప్రతి 5వ పదాన్ని తొలగించి ఇస్తారు. దాన్ని చదువుకొంటూ తొలగించిన స్థానంలోని పదాన్ని ఊహించాలి, నింపాలి.

## 12. సాహిత్య కార్యక్రమాలు :

ఒక అంశాన్ని నాలుగు భాగాలుగా విభజించి ఒక్కొక్క జట్టుకు భాషాపరమైన అభ్యాసాన్ని కేటాయించాలి. అంటే చదివిన అంశం గురించి ఒక జట్టుకు పదజాలం, సామెతలు వంటివి ఇంకోజట్టుకు చదివిన అంశంలోని భాషా గొప్పతనం గురించి, ఇంకో జట్టుకు చదివిన అంశంపై చిత్రాలు గీయమని మరోజట్టుకు చదివిన అంశంపై ప్రశ్నలు తయారుచేయమని లేదా వ్యాఖ్యానం రాయమని చెప్పవచ్చు. అంటే ఒకే అంశంపై అన్ని జట్లవాళ్ళు సాహిత్యపరంగా పనిచేస్తారు. ఆయాజట్లకు తాము చేసిన పనులను ఇతర జట్లకి వివరిస్తారు.

## 13. పుస్తక సమీక్షలు నిర్వహించడం :

పిల్లల పఠనాభిలాషను పెంపొందించడానికి పాఠశాలకు సరఫరాచేసిన గ్రంథాలయ పుస్తకాలను ఉపయోగించుకోవాలి. పిల్లల్ని వివిధ సాహిత్య రూపాలలో ఉన్న పుస్తకాలను చదవమనాలి. పిల్లలు చదివిన వాటిపై సమీక్షలు నిర్వహించాలి. సమీక్షలో

- వాళ్ళు చదివిన పుస్తకమేది?
- చదివిన అంశంపై అభిప్రాయం తెలపడం.
- చదువుతున్నప్పుడు వాళ్ళు పొందిన అనుభూతులను తెలపడం.
- చదివిన అంశంలోని పాత్రల గురించి, సంఘటనల గురించి తెలపడం.
- కవి ఏ ఉద్దేశంతో ఆ అంశాన్ని రాసారో చర్చించడం.

మొదలగు అంశాల ఆధారంగా సమీక్ష రాయాలి.

## సామర్థ్యాల వారీగా బోధనా వ్యూహాలు

## I. అవగాహన - ప్రతిస్పందన

ఈ అభ్యాసంలో 'వినడం – మాట్లాడడం', 'చదవడం – అర్థం చేసుకొని వ్యక్తీకరించడం' సామర్థ్యాలకు సంబంధించిన ప్రశ్నలుంటాయి. మనం వాటిని గుర్తించి, వాటి స్వభావాన్నిబట్టి బోధనావ్యూహాలు అనుసరించాలి.

### (ఎ) వినడం – మాట్లాడడం :

ప్రాథమిక స్థాయిలో విద్యార్థి విని అర్థం చేసుకొని మాట్లాడే స్థాయికి చేరుకుంటే, మాధ్యమిక స్థాయిలో, విని అర్థం చేసుకొని, ఆలోచించి మాట్లాడడం నేర్చుకుంటాడు. ఇక సెకండరీ స్థాయి చేరుకొనేటప్పటికి వినడంలో

మార్పు వస్తుంది. అర్థం చేసుకోవడం, ఆలోచించడం, విశ్లేషించుకోవడం, తన వాదనకు సరైన కారణాలను సమర్థంగా నిర్మించుకోవడం, బహుకోణాల్లో స్పందించడం తద్వారా మాట్లాడడం చేస్తారు. అందుకే ప్రాథమిక స్థాయి నుండి సెకండరీ స్థాయి వరకు గల పాఠ్యపుస్తకాల్లో "వినడం - మాట్లాడడం" అనే సామర్థ్యాన్ని అభ్యాసాల్లో చేర్చడం జరిగింది.

ఇప్పుడు మనం పాఠ్యపుస్తకాల్లోని పాఠాలలో ఇచ్చిన వినడం - మాట్లాడడం సామర్థ్యానికి సంబంధించిన ప్రశ్నలను పరిశీలిద్దాం.

**ప్రథమ భాష తెలుగు :**

- 'వెన్నెల' పాఠంలో వెన్నెలను వర్ణించడం గమనించారు కదా! ప్రకృతిలోని వివిధ సందర్భాలను వర్ణించడంవల్ల మీకు కలిగిన అనుభూతులను తరగతి గదిలో చర్చించండి.
- చూడాకర్ణుని మాటలను బట్టి మీకర్థమైన విషయమేమిటి? దానిపై మీ అభిప్రాయమేమిటో చెప్పండి.
- "ఆహా! ధనలాభము సర్వయాపదలకు మూలము కదా!" ఈ విషయాన్ని సమర్థిస్తూ లేదా వ్యతిరేకిస్తూ మీ అభిప్రాయాలు చెప్పండి.
- 'ధన్యుడు' పాఠం ఉంది కదా! శీర్షికను విశ్లేషిస్తూ చెప్పండి.
- ప్రస్తుతం స్త్రీలపై జరిగే దాడులకు కారణాలు-నివారణోపాయాలు చర్చించండి.
- "వ్రతాలు, ఆచారాలు, దానగుణం" ఈ అంశాల గూర్చి మాట్లాడండి.
- "యక్షుడి అప్పు" నాటికలో హాస్యం కలిగించే సంఘటనలు ఏమేమి ఉన్నాయో చెప్పండి.
- పెళ్ళి వేడుకలో పాటించే సంప్రదాయాలు ఏవేవి? తెలపండి.
- "బసవేశ్వర పరిణయం" పాఠాన్ని రాగంతో, భావంతో చదవండి.
- "మాణిక్యవీణ" వచనకవితను భావయుక్తంగా చదవండి. దాని భావాన్ని సొంతమాటల్లో చెప్పండి.
- "గోరంత దీపాలు" అనే శీర్షిక ఈ పాఠానికి తగిన విధంగా ఉందా? ఎందుకు? సకారణంగా చర్చించండి.

**ద్వితీయ భాష తెలుగు :**

- మీకు తెలిసిన శాశ్వత కీర్తివంతులను గురించి చెప్పండి.
- 'భాగవత రత్నాలు' పాఠంలోని పద్యాలకు భావాలు సొంతమాటల్లో చెప్పండి.
- "మొద్దబ్బాయిలు మహా మేధావులే" అని పాఠంపేరు విన్నప్పుడు మీలో కలిగిన అనుభూతులను తెలపండి.
- నవోదయం అంటే మీరేమనుకుంటున్నారు? ఎందుకని అలా భావిస్తున్నారు?
- "యుద్ధం పనికి రాదు" దీనిని సమర్థిస్తూ మాట్లాడండి.
- 'నాటి'తో పోల్చితే 'నేటి' పెండ్లిళ్ళలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఎందుకు? కారణాలు వివరిచండి.
- లింగరాజు వంటి అత్యాశపరులు మీకెవరైనా తెలుసా? పిసినారులవల్ల ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో వివరించండి.

- ఆకాశంలో ఎగిరే పక్షులను చూసినప్పుడు నీకు ఏమనిపిస్తుంది?
- "మాట్లాడే నాగలి" కథను సొంతమాటల్లో చెప్పండి.

> 'వినడం – మాట్లాడడం' సామర్థ్యానికి సంబంధించిన ప్రశ్నలు పరిశీలించారు కదా!
>
> - ఎన్ని రకాల ప్రశ్నలు అడిగారో చెప్పండి.
> - ఈ ప్రశ్నలు 'వినడం – మాట్లాడడం' సామర్థ్యాన్ని సాధించడానికి ఎలా ఉపయోగపడతాయో వివరించండి.

**'వినడం – మాట్లాడడం' ప్రశ్నల స్వభావం :**

- అనుభూతులను తెల్పడానికి వీలుగా ఉన్నాయి.
- పాఠంలోని విషయాన్ని సొంత అభిప్రాయాలతో చెప్పే విధంగా ఉన్నాయి.
- ఒక విషయాన్ని సమర్థిస్తూ చెప్పడానికి వీలుగా ఉన్నాయి.
- తన చుట్టు ఉన్న సమాజాన్ని, పరిస్థితులను పరిశీలించి చెప్పడానికి వీలుగా ఉన్నాయి.
- చదివిన అంశాన్ని అవగాహనలో చెప్పడానికి వీలుగా ఉన్నాయి.
- సంఘటనలు విశ్లేషించి చెప్పడానికి వీలున్నాయి.
- సొంతమాటల్లో చెప్పడానికి వీలుగా ఉన్నాయి.
- కారణాలు – నివారణోపాయాలు చెప్పడానికి, చర్చించడానికి వీలుగా ఉన్నాయి.
- ఒక విషయాన్ని వ్యతిరేకిస్తూ అభిప్రాయం చెప్పడానికి వీలుగా ఉన్నాయి.
- ఊహించి చెప్పడానికి వీలుగా ఉన్నాయి.
- స్వేచ్ఛగా మాట్లాడడానికి వీలుగా ఉన్నాయి.
- అనుభవాల్ని జోడించి చెప్పడానికి వీలుగా ఉన్నాయి.
- అనేక రకాల జవాబులు చెప్పడానికి వీలుగా ఉన్నాయి.

**తరగతి గది నిర్వహణ :**

- ఇది పూర్తి తరగతి కృత్యం.
- అవగాహన – ప్రతిస్పందన అభ్యాసంలోని వినడం – మాట్లాడడం సామర్థ్యానికి సంబంధించిన ప్రశ్నలు నల్లబల్లపై రాయాలి.
- ప్రతి ప్రశ్నను విద్యార్థులందరిని అడగాలి. ఒక్కొక్క విద్యార్థిచే మాట్లాడించాలి.
- అవసరం ఉన్నచోట అనుబంధ ప్రశ్నలు అడగవచ్చు.
- అందరిని మాట్లాడించిన తర్వాత ఒక విద్యార్థిచేత జవాబును క్రోడీకరింపజేయాలి.

'వినడం – మాట్లాడడం' సంబంధించిన అన్ని ప్రశ్నలకు ఇలాగే చేయించాలి.

విద్యార్థులు చెప్పే సమాధానాలను ఖండించరాదు. ఎందుకంటే విద్యార్థి తన వాతావరణం నుంచో, తన వ్యవహారిక భాషాస్థితుల నుంచో, తన అనుభవాలనుంచో సమాధానాలు చెప్పే ప్రయత్నం చేస్తారు. వాటిని ఖండించడం వల్ల తాను మాట్లాడే స్థితిని కోల్పోయి భయంతో మౌనంగా ఉండే ప్రమాదం ఉంది.

విద్యార్థులు చెప్పే సమాధానాల్లో దొర్లే దోషాలను ఆప్యాయతతో సవరించాలి. విద్యార్థుల సహజమైన మాటలను ప్రోత్సహించాలి. వాళ్ళను అభినందించాలి.

## (బి) చదవడం – అర్థం చేసుకొని వ్యక్తీకరించడం :

ప్రాథమిక స్థాయిలో ధారాళంగా చదవడం చేయగలిగిన పిల్లలు ప్రాథమికోన్నత స్థాయిలో చదివిన అంశాన్ని అవగాహన చేసుకోవడం. దాన్ని వివరించగలగడం. ప్రతిస్పందించడంలో శిక్షణ పొందుతారు. సెకండరీస్థాయిలో పిల్లలు చదివిన అంశం గురించి విమర్శనాత్మక దృష్టితో ఆలోచించగలగాలి. కవి, రచయిత అంతరాత్మను, ఉద్దేశాన్ని పట్టుకోగలగాలి. 'చదవడం' అనే సామర్థ్యం ద్వారా పిల్లల్లో పఠనాభిలాష పెరగడం. అర్థం చేసుకొని వ్యక్తీకరించడం. తన జ్ఞాన పరిధిని విస్తృతపరచుకోవడం జరగాలి. ఇందుకోసం ప్రతి పాఠంలో అభ్యాసాలు ఉన్నాయి.

ఇప్పుడు మనం పాఠ్యపుస్తకంలో ఇచ్చిన "చదవడం – అర్థం చేసుకొని వ్యక్తీకరించడం' సామర్థ్యానికి సంబంధించిన ప్రశ్నలు పరిశీలిద్దాం.

**ప్రథమ భాష తెలుగు :**

- "అనృత మాడుటకంటె మౌనం మేలు" ఈ వాక్యం ఎవరు ఎవరితో అన్నారో రాయండి.
- "ఇల్లాలింటికి .......... రామేశ్వరా!" ఈ పద్యాన్ని చదవండి, భావాన్ని రాయండి.

  **భావం :** __________________ ఎంతటి పని ఐనా __________________ ఆవుల మందను __________________ తన బాణాలతో ఆ బలమైన __________________ అర్జునుడే కదా!
- చూడాకర్ణునికి, వీణాకర్ణునికి మధ్య జరిగిన సంభాషణను రాయండి.
- శివాజీ కొలువులోని వారంతా నిశ్చేష్టులవడానికి కారణం ఏమిటి? పాఠం ఆధారంగా జవాబు రాయండి.
- పనిచేస్తూ ఉంటే అనుభవం ................ ఏది ఈ లోకంలో లేదు (పుట 41) (వాక్యాలను పాఠ్యపుస్తకంలో 41వ పుటలో చూడాలి) పై పేరా చదవండి. 11 వాక్యాలు సరైనవో కాదో ✓, ✗ గుర్తులచే సూచించండి.
- వ్యవసాయదారుల కష్టాన్ని కవి ఏమని వివరించాడు? ఈ ప్రశ్నకు పాఠం ఆధారంగా జవాబు రాయండి.
- (అ) ఎల్లప్పుడు ఇతరుల దోషాలను చూడడం.

  (ఆ) పేదవాడికి ఆహారం, బట్టలు దానం చేయడం.

  (ఇ) సంపద రహస్యంగా వచ్చి చేరుతుంది.

  పై వాక్యాలు 'శతకమధురిమ' పాఠంలో ఏ పద్యపాదాలకు సరిపోతాయో గుర్తించండి.

- "బీదలకన్న ........... చిత్తమా" ఈ పద్యాన్ని పాదభంగం లేకుండా పూరించండి. (48వ పేజీ)
- "సత్య సూక్తి ఘటించు ........... సకలార్థ సాధకంబు" ఈ పద్యాన్ని చదవండి. కింది ప్రశ్నలకు జవాబులు రాయండి. (పుట 51)
- "నేనెరిగిన బూర్గుల" పాఠం చదవండి. జాతీయాలు గుర్తించండి. రాయండి.
- క్లిష్ట పరిస్థితుల్లో రాజ్యాధికారం ..........................................

  .................................... అదీ రుద్రమదేవి ఘనత (66వ పుట)

  పై గద్య భాగాన్ని చదవండి. కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.
- 'యక్షుడి అప్పు' పాఠం ఆధారంగా పాత్ర స్వభావాన్ని పట్టికలో రాయండి. (పుట 91)
- 'యక్షుడి అప్పు' పాఠం ఆధారంగా తప్పొప్పులను గుర్తించండి. (పుట 91)
- ఎన్ని దినములు నీవు

  ..................................

  ..................................

  ఫలమేమి కలదోయి (పుట 123)

  పై కవిత చదవండి. ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయండి.
- 'మాణిక్య వీణ' పాఠం చదవండి. అంత్యప్రాసలున్న పదాలు వెతకండి. అలాంటివే మరికొన్ని పదాలను రాయండి.
- చాతక పక్షుల ముక్కులు చాలా చిన్నవి. తాము ........................................

  ఇదీ చాతక పక్షుల వాస్తు కళా నైపుణ్యం (పుట 165)

  పై పేరా చదవండి. కింది ఖాళీలు పూరించండి.

**ద్వితీయ భాష తెలుగు :**

- మిత్రుడు చెడుపనులు నుంచి దూరం చేస్తాడు ............... ఉత్తమ మిత్రుడు అని భావిచాలి (పుట 5)

  పై గద్యాన్ని చదవండి. కింది వాక్యాల్లో తప్పు ఒప్పులను గుర్తించండి.
- చీకటి తెరతొలగునులే

  ..................................

  ..................................

  నవ జీవనం పిలుచునులే (పుట 21)

  పై గేయ కవితను చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

- (అ) సురుచిర మంగళ సూత్రంబు గట్టె

  (ఆ) తన వధూయుక్తుడై దానంబు చేసె

  (ఇ) వలనొప్ప వేర్వేఱ వరుసగా నగపె

  (ఈ) మనము రంజిల్లగా మధుపర్క మిచ్చె

  (ఉ) కరుణించి హరికర గ్రహణంబు చేసి

  ఈ వాక్యాలను 'కల్యాణం' పాఠం ఆధారంగా సరైన క్రమంలో రాయండి.

- "జానపద నృత్య సంగీతాలు" పాఠం చదవండి. సూచించిన పేరాకు శీర్షికను నిర్ణయించండి.

| పేరా సంఖ్య | పేరాకు శీర్షిక |
|---|---|
| 4వ | |
| 5వ | |
| 6వ | |

- ఒక పండుగ రోజు ఆశ్రమంలో సేవ చేస్తున్న ఒక ముసలమ్మ ..................... అన్నారు భగవాన్ (92 పుట) పేరా చదవండి. కింది ఖాళీలు పూరించండి.

  పై ప్రశ్నలు చదివారు కదా! కింది పట్టికను పూరించండి.

| పాఠం చదవడానికి ఉద్దేశించబడిన అభ్యాసాలు ఎన్ని | చదివి అవగాహన చేసుకోవడానికి ఉద్దేశించబడిన అభ్యాసాలు ఎన్ని | చదివిన అంశాలు ప్రశ్నలు జవాబులు రాయదానికి ఉద్దేశించబడిన అభ్యాసాలు ఎన్ని |
|---|---|---|
| | | |

**ప్రశ్నల స్వభావం :**

- పాఠంలోని సందర్భాన్ని రాసేలా ప్రశ్నలున్నాయి.
- పద్యాలు / గేయాలు / చదివి భావాన్ని రాసేలా ఉన్నాయి.
- పాఠం ఆధారంగా జవాబులు రాసే విధంగా ఉన్నాయి.
- పాఠంలోని వివిధ అంశాలు గుర్తించేలా ప్రశ్నలున్నాయి.
- పాత్ర స్వభావాన్ని చెప్పేలా ఉన్నాయి.

- తప్పొప్పులను గుర్తించేలా ప్రశ్నలు ఉన్నాయి.
- పాఠం మళ్ళీ మళ్ళీ చదివించేలా ఉన్నాయి.
- చదివి అవగాహన పొందేలా ఉన్నాయి.
- శీర్షికను గురించి ఆలోచించేలా, చర్చించేలా ఉన్నాయి.
- ఆలోచించడానికి అవకాశం కల్పించేలా ఉన్నాయి.
- చదివింది అర్థమయ్యిందో తెలుసుకొనే విధమైన ప్రశ్నలున్నాయి.

**తరగతి గది నిర్వహణ :**

- ఇది వ్యక్తిగత కృత్యం.
- అవగాహన - ప్రతిస్పందన అభ్యాసంలోని "చదవడం - అర్థం చేసుకొని వ్యక్తీకరించడం" సామర్థ్యానికి సంబంధించిన ప్రశ్నలు గుర్తించాలి.
- విద్యార్థులకు ప్రశ్నలకు సంబంధించిన సూచనలు ఇవ్వాలి.
- విద్యార్థులందరిచేత వ్యక్తిగతంగా సాధన చేయించాలి.
- విద్యార్థులు రాసినవి చదివించాలి.
- వారు చేసిన దోషాలను వెనువెంటనే సవరించాలి.

ఎక్కువ ప్రశ్నలు ఉన్నప్పుడు సమయాన్ని బట్టి కొన్నింటిని ఇంటిపనిగా ఇవ్వవచ్చు. (ఇంటిపని అనేది ఖచ్చితంకాదు)

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

### (ఎ) స్వీయరచన :

స్వీయరచన అంటే విద్యార్థి తన సొంత ఆలోచనలతో, తన దైనశైలిలో ప్రశ్నలకు జవాబులు రాయడం. విధం లేదా తెలిసిన అంశాలను గురించి రాయడం. ప్రాథమిక, మాధ్యమిక స్థాయి నుండి పిల్లలు సెకండరీ స్థాయికి చేరుకొనే క్రమంలో ఆలోచనా శక్తి కూడా పెరుగుతుంది. SCF-2011 నిర్దేశించిన ప్రకారం అవగాహన చేసుకొని తన సొంతమాటల్లో రాయడం అనేది రావాలి. అంటే విమర్శనాత్మక, బహుకోణీయాలోచన, సమస్యా పరిష్కార సాధన మొదలగు అనేక విషయాల్లో తాను స్వయంగా రాయాల్సి ఉంది. అభిప్రాయాలను లిఖిత రూపంలో వ్యక్తీకరించాల్సి ఉంటుంది. అందుకే సెకండరీ స్థాయిలో ఈ స్వీయరచన ఉన్న ప్రశ్నల స్థాయి పెరుగుతుంది. విద్యార్థులలో ఈ సామర్థ్యాన్ని పెంచేలా అభ్యాసాలున్నాయి.

పాఠ్య పుస్తకం అభ్యాసాలలో ఇచ్చిన స్వీయరచన ప్రశ్నలను పరిశీలిద్దాం.

**ప్రథమ భాష తెలుగు :**

- "వెన్నెల" పాఠంలోని పద్య భావాలను ఆధారంగా చేసుకొని సారాంశాన్ని ఇరవై వాక్యాలకు కుదించి రాయండి.
- "వివేక హీనుడైన ప్రభువును సేవించుట కంటె వనవాసముత్తమం" దీని ఔచిత్యాన్ని గురించి చర్చించండి.
- "శివాజీ ఆదర్శం"లోని గొప్పతనాని&్న సొంత మాటల్లో రాయండి.
- "స్త్రీ రత్నములు పూజ్యులు" అన్న శివాజీ మాటలను మీ సొంత అనుభవాల ఆధారంగా సమర్థించండి.
- పల్లెటూళ్ళు సుభిక్షం ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుంది. అలాంటి పల్లెటూళ్ళు రోజు రోజుకు తమ ఉనికిని, సంస్కృతిని, ఆత్మను కోల్పోతున్నాయి. ఇందుకు గల కారణాలు ఏమై ఉంటాయి. ఇవి కళకళలాడాలంటే మనం ఏం చేయాలి?
- నైతిక విలువలంటే ఏమిటి? మీరు గమనించిన విలువల్ని పేర్కొనండి.
- "నేనెరిగిన బూర్గుల" పాఠం ఆధారంగా "గొప్పవారి సాంగత్యం వల్ల కలిగే స్ఫూర్తి గొప్పగా ఉంటుంది" అనే అంశం గురించి సమర్థిస్తూ రాయండి.
- నగరాన్ని రసాయనశాలగా, పద్మవ్యూహంగా వర్ణించడంలోని నిజానిజాల గురించి చర్చించండి.
- "యక్షుడి అప్పు" పాఠం ఆధారంగా అప్పు ఇచ్చేవారి స్వభావం ఎలా ఉంటుందో విశ్లేషిస్తూ రాయండి.
- ప్రాచీన కావ్యాలకు సంబంధించిన పాఠాలు చదవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించండి.
- చరిత్ర నిర్మాతలుగా స్త్రీలు ప్రధానంగా ఉన్నారనే భావన సంపాదకులకు కలగడానికి గల కారణాలను వివరించండి.
- "గోరంత దీపాలు" కథానికలో వృద్ధుని పాత్ర స్వభావాన్ని, గొప్పతనాన్ని సొంతమాటల్లో రాయండి.
- శిశువుల పెంపకంలో పక్షులకు, మానవులకు మధ్య ఉన్న సామ్యాలను రాయండి.

**ద్వితీయ భాష తెలుగు :**

- "అతిథి దేవోభవ" దీన్ని సమర్థిస్తూ రాయండి.
- శాశ్వత కీర్తి గలవారని ఎవరిని అంటారు? ఎందువల్ల? కారణాలు రాయండి.
- సంజయుని రాయబారంలోని విషయాలు ఆధారంగా పాండవులు, కౌరవుల స్వభావాలను గురించి తెలపండి.
- పాండవుల, కౌరవుల మధ్య యుద్ధ వాతావరణం నెలకొనడానికి కారణాలు ఏమై ఉంటాయి?
- మీరు చూపిన వివాహ ఘట్టాన్ని సొంతమాటల్లో రాయండి.
- వర విక్రయం నాటకంలోని లింగరాజు స్వభావాన్ని వర్ణించండి.
- "మనిషీ మనిషీ" కవిత ఆధారంగా మనిషి ఏవిధంగా ఉండాలని మీరు భావిస్తున్నారో వివరించండి.

- మీరు ఎవరిని ప్రత్యక్ష దైవాలుగా భావిస్తారు? ఎందుకు? సొంతమాటల్లో రాయండి.
- కన్న కూతురిలో సమానంగా ఓసెఫ్ కన్నన్‌ను చూడడానికి కారణం ఏమిటి?
- మూగజీవుల మీద ప్రేమను ఎందుకు చూపించాలి?

స్వీయరచనకు సంబంధించిన ప్రశ్నలు గమనించారు కదా! అవి ఏ ఏ సామర్థ్యాలు పెంపొందించడానికి ఉపయోగపడతాయో ఆలోచించండి.

**ప్రశ్నల స్వభావం :**

- విషయాన్ని కుదించి రాయడానికి వీలుగా ఉన్నాయి.
- ఔచిత్యాన్ని చర్చించి రాయడానికి వీలుగా ఉన్నాయి.
- సొంతమాటల్లో రాయడానికి వీలుగా ఉన్నాయి.
- సొంత అనుభవాలలో విషయాన్ని సమర్థించి చెప్పేలా ఉన్నాయి.
- అనుభవాలు పంచుకొనేలా ఉన్నాయి.
- కారణాలు చెప్పే విధంగా, పరిష్కారాలు ఊహించి చెప్పేలా ఉన్నాయి.
- సమర్థిస్తూ రాసేలా ఉన్నాయి.
- స్వభావాన్ని విశ్లేషించేలా ఉన్నాయి.
- సామ్యాలను చెప్పేలా ఉన్నాయి.
- ప్రకృతిని, పరిసరాలు, సమాజాన్ని గమనించి రాసేలా ఉన్నాయి.
- ఊహాత్మకంగా రాసేలా ఉన్నాయి.
- తార్కికమైన ఆలోచన రాసేలా ఉన్నాయి.

**తరగతి గది నిర్వహణ :**

- వ్యక్తీకరణ – సృజనాత్మకత అభ్యాసంలోని స్వీయరచన, వ్యాసరూప ప్రశ్నలను నల్లబల్లపై రాయాలి.
- ప్రశ్నలను విద్యార్థులు అవగాహన చేసుకొనేలా పూర్తి తరగతిలో చర్చ నిర్వహించాలి. విద్యార్థుల సందేహాలు నివృత్తి చేయాలి.
- స్వీయరచన ప్రశ్నలను విద్యార్థులందరిచేత వ్యక్తిగతంగా రాయించాలి. (అవసరమైతే జట్టులో చర్చింప చేయాలి)
- విద్యార్థులు రాసిన వాటిని ప్రదర్శింపజేయాలి. అనగా ఒక్కొక్కరు / జట్టులో రాసిన జవాబులను చదివించాలి.

**పిల్లలు రాసిన అంశాలను సవరించే విధానం :**

- పిల్లలు వ్యక్తిగతంగా రాసిన సమాధానాలలో ఒక దానిని నల్లబల్లపై రాయించాలి.
- పిల్లలు రాసిన అంశాల్ని తరగతిలో చర్చిస్తూ...
  - భావం సరిగా ఉందా? వరుసక్రమంలో విషయాన్ని రాశారా? (అన్వయ క్రమం సరిగా ఉందా?)
  - వాక్య నిర్మాణం సరిగా ఉందా?
  - వాక్యాలు సంపూర్ణ వాక్యాలుగా దోషరహితంగా ఉన్నాయా?
  - వాక్యాలలో ఉపయోగించిన పదాలు సరిగా ఉన్నాయా? ఇంకా ఏయే పదాలు ఉపయోగించవచ్చు?
  - అక్షర దోషాలు ఏమైనా ఉన్నాయా?

ఇలా ఒక్కొక్క ప్రశ్న పిల్లలను అడుగుతూ పిల్లలు రాసిన దాన్ని పిల్లలతో చర్చిస్తూ, సరిచేయాలి. కొంత అభ్యాసం జరిగిన తర్వాత ఒకరు రాసినవి ఇంకొకరితో సరిచేయించవచ్చు.

- వ్యాసరూప ప్రశ్నలు ఎక్కువగా ఉంటే కొన్ని ప్రశ్నలు ఇంటి పనిగా ఇవ్వవచ్చు.

**(బి) సృజనాత్మకత :**

పిల్లలు బట్టీపట్టి రాయడంవల్ల భాషలోని ఏ ప్రక్రియను తాను స్వయంగా సృజించలేకపోతున్నారు. ఈ లోటును పూడ్చాలని SCF-2011 భావించింది. సృజనాత్మకతను వెలికి తీయగలిగేలా అభ్యాసాల నిర్వహణ ఉండాలని నిర్దేశించింది.

సృజనాత్మకత అనేది ఊహ తెలిసిన పిల్లల దగ్గర నుండి మొదలుకొని పెద్దవారి వరకు ప్రతి వారిలో ఉంటుంది. దాన్ని వెలికితీసే ప్రయత్నం చేయకుంటే స్తబ్దత నెలకొంటుంది. అలా కాకూడదనే వివిధ స్థాయిలో సృజనాత్మకత కింద అభ్యాసాలు పొందుపరచడం జరిగింది.

పాఠాలలో ఇచ్చిన సృజనాత్మకత ప్రశ్నలను పరిశీలిద్దాం.

**ప్రథమ భాష తెలుగు :**

- 'ధన్యుడు' పాఠాన్ని చిన్న నాటికగా మలచండి.
- 'మాతృభావన' పాఠాన్ని 'ఏకాంకిక' రూపంలో రాసి, ప్రదర్శించండి.
- మీరు చూసిన పల్లెటూరులోని మనుషుల మధ్య సంబంధాలు, అక్కడి ప్రకృతి దృశ్యాలను వర్ణిస్తూ మీ మిత్రునికి లేఖ రాయండి.
- పాఠశాలలో జరిగే భాషోత్సవాన్ని తిలకించడానికి ప్రముఖ శతక కవులు వచ్చారు. వారి ద్వారా శతకాల గురించి, వారి రచనల గురించి, తెలుసుకోవడానికి పిల్లలు ఇంటర్వ్యూ చేయాలనుకున్నారు. మీరైతే ఏమని ఇంటర్వ్యూచేస్తారు. ఇంటర్వ్యూకు అవసరమైన ప్రశ్నావళిని రూపొందించండి.

- "నేనెరిగిన బూర్గుల" పాఠంలోని పదజాలం, విశిష్ట లక్షణాల ఆధారంగా ఒక కవిత రాయండి.
- ప్రశాంతతకు, పచ్చదనానికి నిలయమైన పల్లెల గొప్పదనాన్ని వర్ణిస్తూ ఒక వచన కవిత రాయండి.
- "యక్షుడి అప్పు" నాటికను కథారూపంలో రాయండి.
- ద్విపద రూపంలో ఉన్న బసవేశ్వర పరిణయం పాఠాన్ని గేయంగా గాని వచన కవితగా రాయండి.
- మహిళల పట్ల చూపుతున్న వివక్షలను, వారి మీద జరుగుతున్న దాడులను ఖండిస్తూ, మహిళలందరూ ధైర్యంతో మెలగాలని తెలియజేసేలా ఒక కరపత్రం తయారుచేయండి.
- నీ చుట్టూ ఉన్న పరిసరాల్లో, మానవ జీవితంలో కలిగిన మార్పులను, అభివృద్ధిని వర్ణిస్తూ, పది పంక్తులకు తక్కువ కాకుండా ఒక కవిత రాయండి.
- "గోరంత దీపం" పాఠంలో వృద్ధుడి రైలు ప్రయాణంలోని వార్త పత్రిక పఠనం విషయం ఆధారంగా వృద్ధుడు, పెద్దమనిషి మధ్య హాస్య సంభాషణ రాయండి.
- భిక్ష, రక్ష, పరీక్ష, సమీక్ష, వివక్ష... వంటి పదాలతో ఒక చక్కని భావాన్ని ప్రకటించేకవిత రాయండి.
- ఈమధ్య కాలంలో సెల్‌ఫోన్ టవర్ల నుండి వచ్చే వేడిమికి కొన్ని పక్షిజాతులు అంతరించిపోతున్నాయి. అలాగే ఎండాకాలంలో తీవ్రమైన వేడికి తాళలేక తాగడానికి నీరు అందక మృత్యువాత పడుతున్నాయి పక్షులు ఇందుకోసం తమను కాపాడడానికి తగిన చర్యలు చేపట్టమని తమ తోటకు వచ్చిన పిల్లలతో సంభాషించాయి అనుకోండి. ఆ పిల్లలకు, పక్షులకు మధ్య జరిగే సంభాషణను ఊహించి రాయండి.

**ద్వితీయ భాష తెలుగు :**

- "భాగవతరత్నాలు" పాఠంలోని మొదటి పద్యం చదువు ప్రాధాన్యాన్ని తెలిపేలా ఉందికదా! దీని ఆధారంగా ఒక కథను రాయండి.
- "ఒక రంగంలో రాణించలేని వాళ్ళు వేరేరంగంలో రాణించవచ్చు" దీనిపై మీ అభిప్రాయాలతో ఒక వ్యాసం రాయండి.
- 'నవోదయం' పాఠంలోని నాలుగు, ఐదు, ఆరు ఖండికలను చదవండి. వీటి ఆధారంగా సూర్యోదయాన్ని వర్ణిస్తూ తెలిపేలా కవిత / గేయాన్ని రాయండి.
- 'సంజయ రాయబారం' ఘట్టాన్ని సంభాషణల రూపంలో రాసి ప్రదర్శించండి.
- 'యుద్ధ కాంక్ష' మంచిది కాదని, దీనివల్ల కలిగే నష్టాలను వివరిస్తూ శాంతిని కాంక్షించాలని తెలిపేలా దినపత్రికకు ఒకలేఖ రాయండి.
- 'కల్యాణం' పాఠం ద్విపదలో ఉంది కదా! ఈ పాఠ్యాంశ భావాన్ని తీసుకొని కథా రూపంలో రాయండి.
- వర విక్రయం పాఠ్యభాగాన్ని మీ పాఠశాల వార్షికోత్సవంనాడు నాటకంగా ప్రదర్శించండి.

- వరకట్న దురాచార నిర్మూలన కోరుతూ ప్రజలలో ఆలోచనలు రేకెత్తించి చైతన్య పరిచేలా ఒక కరపత్రం తయారుచేయండి.
- జానపద కళలను ఆదరించడం, గౌరవించడం అంటే మన సంస్కృతిని మనం కాపాడుకొన్నట్టే! ఇందుకోసం మనం ఏం చేయాలో తెలిపేలా ఒక ప్రసంగ వ్యాసాన్ని తయారుచేయండి.
- 'శతక మాధురి' పాఠంలోని పద్యాల ఆధారంగా సూక్తులు తయారుచేయండి.
- "మూగ జీవులకు నోరొస్తే..." ఊహాత్మకంగా కథ రాయండి.

> సృజనాత్మతకు సంబంధించిన ప్రశ్నలు పరిశీలించారు కదా!
>
> - ఎన్ని రకాల ప్రక్రియలున్నాయి?
> - వీటివల్ల పిల్లలకు ఏ ఏ సామర్థ్యాలు పెంపొందుతాయి?
> - వీటిని సాధించడం ఎలా?

**ప్రశ్నల స్వభావం :**

- ఒక వ్యవహార రూపంలో ఉన్న వాటిని వేరొక వ్యవహార రూపంలో మార్చేవిగా ఉన్నాయి.
- వ్యవహార రూపాలపై పట్టు సాధించడానికి వీలుగా ఉన్నాయి.
- పాఠంలోని విషయాల ఆధారంగా కవితలు, గేయాలు, కథలు రాయడానికి వీలుగా ఉన్నాయి.
- ఆలోచనల్ని, అభిప్రాయాల్ని వ్యవహార రూపంలో రాయడానికి అవకాశం ఉండేలా ఉన్నాయి.
- అవగాహన కలిగితేనే రాసేలా ఉన్నాయి.
- సృజనాత్మకతను వెలికితీసేలా ఉన్నాయి.
- ఊహాశక్తి పెంపొందేలా ఉన్నాయి.
- నాటకీకరణకు అవకాశం ఇచ్చేలా ఉన్నాయి.

**తరగతి గది నిర్వహణ :**

- వ్యక్తీకరణ సృజనాత్మకత అభ్యాసంలో సృజనాత్మకత ప్రశ్నలు గుర్తించాలి.
- ప్రశ్నల్ని నల్లబల్లపై రాయించాలి.
- ప్రక్రియకు సంబంధించి మాదిరి రూపాలు చూయించి, చర్చ ద్వారా ప్రక్రియను పరిచయం చేయాలి. అవగాహన కలిగించాలి.
- ఇచ్చిన ప్రశ్న అవగాహన కలిగేలా చర్చ నిర్వహించాలి.
- ఇద్దరు లేదా ముగ్గురు విద్యార్థుల చొప్పున జట్టుగా విభజించి రాయించాలి.

- వారు రాసిన వాటిని జట్టువారీగా ప్రదర్శింపజేయాలి.
- పిల్లలు రాసిన అంశాన్ని తరగతి గదిలో చర్చిస్తూ కింది విధంగా సరిచేయాలి.
- పిల్లలు జట్లలో రాసిన దాంట్లో ఒక దానిని నల్లబల్లపై రాయించాలి.
- భావం సరిగా ఉందా? వరుస క్రమంలో విషయాన్ని రాశారా?
- వాక్య నిర్మాణం సరిగా ఉందా?
- వాక్యాలు సంపూర్ణ వాక్యాలుగా దోషరహితంగా ఉన్నాయా?
- వాక్యాల్లో ఉపయోగించిన పదాలు సరిగా ఉన్నాయా? ఇంకే పదాలు ఉపయోగించవచ్చు?
- అక్షర దోషాలు ఏమైనా ఉన్నాయా?

ఇలా ప్రశ్నల ద్వారా పిల్లలలో చర్చ చేసి సరిచేయించాలి. కొంత అభ్యాసం జరిగిన తర్వాత ఒక జట్టువారు రాసినది ఇంకొకరికి ఇచ్చి సరిచేయించవచ్చు.

పరిచయం అయిన ప్రక్రియ వస్తే, తరగతిలో దాని పరిచయం మళ్ళీ చేయవలసిన అవసరంలేదు. అప్పుడు జట్లలో కాకుండా వ్యక్తిగతంగా కూడా రాయించవచ్చు.

**(సి) ప్రశంస :**

ప్రశంస అనేది కుల, మత, వర్గ, లింగ భాషా భేదాలు చుట్టూ తిరగడంవల్ల దేశంలో నైతిక విలువలు తగ్గిపోయి ఈర్ష్య అసూయా ద్వేషాలు పెచ్చుమీరుతున్నాయి. సంకుచిత ధోరణులు ప్రబలుతున్నాయి. మేథ అడుగంటి దుర్బుద్ధి రాజ్యం చేస్తుంది. ప్రశంస అనేది ఒక వ్యక్తికి, ఒక వ్యవస్థకు, ఒక దేశానికి, ఒక గ్రామానికి, ఒక మేథకు లేదా మరోదానికి కావచ్చు. ఇవి సార్వజనీనంగా, సార్వత్రికంగా ఉండాలి. పిల్లల్లో ఎదుటివారిలోని / వర్గంలోని / వ్యవస్థలోని గొప్పదనాన్ని గుర్తించి ప్రశంసించే వైఖరి పెంపొందించాలి. ఇది ఉత్తమ వ్యక్తిత్వానికి ప్రతీక.

పై లక్ష్యాలు సాధించడానికి పాఠ్యపుస్తకాలలో ఈ సామర్థ్యానికి సంబంధించిన ప్రశ్నలున్నాయి. వాటిని పరిశీలిద్దాం.

**ప్రథమ భాష తెలుగు :**

- వెన్నెల పాఠం ఆధారంగా ఎఱ్ఱన రచనాశైలిని గురించి 10 వాక్యాలు రాయండి.
- ధన్యుడు పాఠంలోని కథా విధానాన్ని, రచయిత రచనా విధాన్ని ప్రశంసిస్తూ రాయండి.
- ఎదుటి వారిలో తప్పులు వెతకటం కన్నా వారి నుండి మంచిని స్వీకరించటం మేలు అని తెలియజేస్తూ మిత్రునికి లేఖ రాయండి.
- 'నేనెరిగి బూర్గుల' పాఠం ఓ అభినందన పత్రంగా ఉంది కదా! దీని ఆధారంగా మీకు నచ్చిన ఉపాధ్యాయుడిని ప్రశంసిస్తూ సన్మాన పత్రం రాయండి. ప్రదర్శించండి.

- నగర గీతం కవితకు మరో పార్శ్వంగా నగర జీవనంలోని అనుకూల అంశాలపై ఒక వ్యాసం రాయండి.
- మాణిక్య వీణ పాఠంలో విద్వాన్ విశ్వం కవితా శిల్పాన్ని ప్రశంసిస్తూ మిత్రునికి లేఖ రాయండి.
- 'కోపం తగ్గించుకోవడం మంచిది' అనే అంశాన్ని బోధిస్తూ మిత్రునికి లేఖ రాయండి.

**ద్వితీయ భాష తెలుగు :**

- చదువులో వెనుకబడిన మిత్రుణ్ణి నిరుత్సాహపడగూడదని ప్రోత్సహిస్తూ ఒక లేఖ రాయండి.
- పెళ్ళిళ్ళ సంస్కృతి ఎందుకు గొప్పదో తెలుపుతూ వివాహ సంస్కృతిని ప్రశంసిస్తూ వ్యాసం రాయండి.
- వరకట్న దురాచారాన్ని రూపుమాపిన సంస్కర్తల్లో మీకు తెలిసిన ఒకరిని అభినందిస్తూ మీ మిత్రునికి లేఖ రాయండి.
- మనిషీ మనిషీ కవిత రాసిన కవి ఇస్మాయిల్‌ను ప్రశంసిస్తూ మీ మిత్రునికి లేఖ రాయండి.
- 'శతక మాధురి' పాఠంలోని పద్యాల ఆధారంగా మనం అలవరుచుకోవలసిన మంచి గుణాల జాబితా తయారుచేయండి.

> పై ప్రశ్నలు పరిశీలించారు కదా!
>
> - ప్రశంసలో ఏ ఏ అంశాలు ఉన్నాయో చెప్పండి.
> - ప్రశంస ఏ ఏ రూపంలో ఉందో గమనించండి.

**ప్రశ్నల స్వభావం :**

- కవి, రచయిత శైలిని, ప్రశంసించేలా ప్రశ్నలున్నాయి.
- పాఠంలోని, వ్యక్తులలోని, వ్యవస్థలోని మంచిని ప్రశంసించేలా ప్రశ్నలున్నాయి.
- ప్రశంసించే వైఖరిని పెంపొందించేలా ఉన్నాయి.
- ఏ ఏ సందర్భాలలో ప్రశంసించవచ్చో తెలిపేలా ఉన్నాయి.
- సంస్కృతి, సంప్రదాయాలు ప్రశంసించేలా ఉన్నాయి.
- గొప్ప వారిని, వారికృషిని కుల, మత, ప్రాంతాలకతీతంగా ప్రశంసించేలా ఉన్నాయి.

**తరగతి గది నిర్వహణ :**

- "వ్యక్తీకరణ – సృజనాత్మకత" అభ్యాసంలో ప్రశంస ప్రశ్నలు గుర్తించాలి.
- పూర్తి తరగతి కృత్యంలో సూచనలు ఇవ్వాలి.
- వ్యక్తిగతంగా రాయించాలి.
- రాసిన వాటిని ప్రదర్శింపజేయాలి.

ఈ సామర్థ్యం ద్వారా విద్యార్థుల్లో ప్రశంసించే తత్వాన్ని విధానాన్ని తెలియజేయాలి. ప్రశంసలోని మధురానుభూతిని వర్ణింపజేయాలి. ఇతరులు రాసిన విషయాన్ని పరిశీలించి అంగీకారయోగ్యంకాని భావనలున్నట్లైతే చర్చ ద్వారా సరిదిద్దాలి.

## III. భాషాంశాలు

ఈ అభ్యాసంలో పదజాలం, వ్యాకరణాంశాలు సామర్థ్యాలకు సంబంధించిన ప్రశ్నలుంటాయి.

### (ఎ) పదజాలం :

పదాలను అర్థవంతంగా భాషా నియమాలకు లోబడి వినియోగించిననాడు భావవినిమయం సరిగా జరుగుతుంది. దీనిలో ముఖ్యమైన భాగం పదజాలం. విద్యార్థులు పదజాలాన్ని ఎంత ఎక్కువగా సంపాదిస్తే భాషమీద అంతపట్టు పెరుగుతుంది. సందర్భాన్ని బట్టి, సమయోచితంగా మాట్లాడాలంటే, రాయాలంటే పదజాల వినియోగం గురించి సరైన అవగాహన ఉండాలి.

ఉన్నత స్థాయిలో విద్యార్థులు జాతీయాలు, సామెతలు, నానార్థాలు, పర్యాయపదాలు, ప్రకృతి – వికృతులు లాంటి వాటిని గురించి వివరంగా తెలుసుకొనే అవకాశం ఉంది. ప్రాచీన, ఆధునిక భాషా పాఠ్యాంశాల్లోని పద ప్రయోగాలను తెలుసుకోవాలి. ఆయా పదాల ప్రయోగాలను అవగాహన చేసుకొని తాను వినియోగించాలంటే 'పదజాలం' అనే సామర్థ్యాన్ని సాధించాలి.

పాఠ్యపుస్తకంలోని 'పదజాలం' సామర్థ్యానికి సంబంధించిన ప్రశ్నల్ని పరిశీలిద్దాం.

**ప్రథమ భాష తెలుగు :**

- కింది వాక్యాల్లో గీత గీసిన మాటల అర్థాన్ని గ్రహించి, వాటిని అర్థవంతంగా సొంతవాక్యాల్లో ఉపయోగించండి.

  (అ) భరతమాత మంద<u>స్మితకాంతి</u> అందరినీ ఆకట్టుకున్నది.

  (ఆ) మేఘం <u>దివి</u> నుండి భువికి రాల్చిన చినుకులపేరే ఈ వర్షం.

- నిఘంటువు సాయంతో కింది పదాలకు నానార్థాలు వెతికి రాయండి.

  (అ) వెల్లి : ____________ ____________ ____________

  (ఆ) కుండలి : ____________ ____________ ____________

- కింది వాక్యాలకు అర్థాన్ని మీ సొంత పదాల్లో రాయండి.

  (అ) బుద్ధిహీనత వలన సమస్త కార్యములు నిదాఘ నదీపూరములట్లు వినాశంనొందును.

  (ఆ) ధనమును బాసిన క్షణముననే లాతివాడగును.

- కింది పదాలకు ప్రకృతి – వికృతులను పాఠం నుండి వెతికి ఆ వాక్యాలను రాయండి.

  (అ) బోనం (ఆ) శబ్దం (ఇ) కర్జం (ఈ) గీము (ఉ) గారవం

- కింది వాక్యాలు చదవండి. వ్యుత్పత్త్యులకు తగిన పదాలు రాయండి.

  (అ) పున్నామ నరకము నుంచి రక్షించువాడు ______________________

  (ఆ) దేహాన్ని ధరించినవాడు ______________________

  (ఇ) ఐశ్వర్యం ఉన్నవాడు ______________________

- కింది పర్యాయ పదాలకు సంబంధించిన పదాన్ని పాఠంలో గుర్తించి ఖాళీలో రాయండి.

  (అ) ______________ – ఆదేశము, ఆన, ఉత్తరువు, నిర్దేశము.

  (ఆ) ______________ – అక్షి, చక్షువు, నేత్రము, నయనము.

- కింది పదాల్లోని ప్రకృతి – వికృతి పదాలను వేరు చేసి రాయండి.

| | | | | | |
|---|---|---|---|---|---|
| గౌరవము | బమ్మ | పుణ్యము | బ్రహ్మ | జోతి | పున్నెం |
| రాసి | గీము | జ్యోతి | దోషము | గృహం | అంబ |
| అమ్మ | భాగ్యము | దోసము | గారవము | రాశి | బాగ్గెము |

- కింది పదాలను ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.

  (అ) పొద్దస్తమానం (ఆ) చమత్కారం (ఇ) సాన్నిధ్యం (ఈ) కష్టఫలం

- కింది పదాలకు వ్యుత్పత్తి అర్థాలు రాయండి.

  (అ) విశ్వనాథుడు (ఆ) శివుడు (ఇ) శ్రియః పతి

- కింది వాక్యాలను గమనించండి. ఆయా వాక్యాల్లోని ప్రకృతి – వికృతుల్ని గుర్తించండి. పట్టికగా కూర్చండి.

  (అ) భారతీయ ధర్మం సర్వోత్కృష్టమైంది. బుద్ధుడు దమ్మాన్ని బోధించాడు.

  (ఆ) ఓసామి! కుడివైపుగా వెళ్తే స్వామి వారి గుడి వస్తుందా?

- అన్నమాట, విన్నమాట, మాటతప్పడం, మాటమీద నిలబడం... ఇలా 'మాట'ను రకరకాలుగా వాడుతుంటాం కదా! ఇంకా ఏయే రకాలుగా వాడుతున్నాయో రాయండి. ఉదా:– మాటల్లేవు.

- కింది వాక్యాన్ని చదవండి. గీతగీసిన పదాలను ఉపయోగించి మరికొన్ని వాక్యాలు రాయండి.

  (అ) అతడు <u>ఎంత</u> తిండిపోతో <u>అంతటి</u> మహాతెలివిగలవాడు.

- కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు పర్యాయపదాలు రాయండి.

  (అ) సామాన్యంగా చరిత్ర నిర్మాతలుగా <u>స్త్రీ</u>లకు గుర్తింపు దొరకదు

  __________, __________, __________

- మా ప్రయత్నం పాఠం ఆధారంగా కింది జాతీయాలు ఏ సందర్భాలలో వాడతారో వివరించండి.

 (అ) గండెబరువెక్కడం (ఆ) నీరుకారిపోవడం (సి) కనువిప్పు

- "మాణిక్యవీణ" పాఠం ఆధారంగా కింది వాక్యాలకు సమానమైన పదాల్ని వెతికి రాయండి.

| | |
|---|---|
| ఒకరిని చూసి మరొకరు చేయడం | |
| పనిచేయడానికి సిద్ధమవడం | |
| అద్భుతంగా నాట్యమాడడం | |
| పనిని మొదలుపెట్టడం | |

- కింది వాటిని చదవండి. వాటికి సంబంధించిన పదాన్ని రాయండి.

 (అ) హాస్య సంఘటన చూసినప్పుడు ____________ వస్తుంది.

 (ఆ) చదువువల్ల ____________ వస్తుంది.

 (ఇ) బాధ వల్ల ____________ వస్తుంది.

 (ఈ) శ్రమ వల్ల ____________ వస్తుంది.

- కింది వాక్యాలలో నానార్థాలను గుర్తించి రాయండి.

 (అ) వీడు ఏ వీడు వాడోగాని దుష్కార్యములను వీడుచున్నాడు.

 (ఆ) దేశభాషలందు తెలుగులెస్సయని రాయలు లెస్సగా పలికెను.

- కింది ప్రకృతి పదాలకు సరైన వికృతి పదాలను ఎంపిక చేయండి.

 (అ) విద్య ( )

 (క) విదియ (ఖ) విజ్జ (గ) విద్దె (ఘ) విద్య

 (ఆ) భిక్షము ( )

 (క) బత్తెము (ఖ) బచ్చ (గ) బిచ్చ (ఘ) బిచ్చము

**ద్వితీయ భాష తెలుగు :**

- కింది ప్రకృతి, వికృతి పదాలను జతపరచండి.

 (అ) ఆర్య ( ) (i) అయ్య

 (ఆ) ధర్మం ( ) (ii) కీరితి

 (ఇ) కీర్తి ( ) (iii) దమ్మం

 (iv) దయ్యం

♦ 'సంజయ రాయబారం' పాఠం ఆధారంగా కింది పదాలకు వ్యతిరేక పదాలు రాయండి. వాటితో సొంతవాక్యాలు రాయండి.

(అ) శాశ్వతం (ఆ) అపకీర్తి (ఇ) పుణ్యకర్మలు (ఈ) అనుచితం

♦ కింది వాక్యాల్లోని గీత గీసిన పదాలకు అర్థాలను రాసి, వాటిని సొంతవాక్యాల్లో రాయండి.

(అ) స్త్రీలకు <u>ఆభరణాలు</u> అంటే చాలా ఇష్టం.

(ఆ) <u>ప్రాలు</u> ఉడికితే అన్నం అవుతుంది.

(ఇ) హరి <u>సతి</u> పేరు రమ.

♦ కింది గీతగీసిన పదాలకు అర్థం తెలిపి సొంతవాక్యంలో ప్రయోగించండి.

(అ) మేఘన <u>సత్కథలు</u> వింటుంది.

| | | | | |
|---|---|---|---|---|
| కా | దా | న | రీ | శ |
| సు | భా | కు | శ | ర |
| వే | శ్రీ | స్క | త | శ్వ |
| సిం | మా | తి | మ | థి |
| స్త్రీ | ము | హ | క | ✡ |

కింది గళ్ళలో దాగిన శతకాల పేర్లు రాయండి.

శతకాలు :

1. వేమనశతకం
2. ________
3. ________
4. ________
5. ________
6. ________
7. ________
8. ________

పై ప్రశ్నలు గమనించారు కదా!

♦ పదజాల వినియోగానికి ఈ ప్రశ్నలు ఎలా ఉపయోగపడతాయి?

♦ ఈ సామర్థ్యం భాషపై పట్టు సాధించడానికి ఎలా ఉపయోగపడుతుందో చెప్పండి.

**ప్రశ్నల స్వభావం :**

♦ వాక్యాల రూపంలో పదాల అర్థాలు గ్రహించేలా ఉన్నాయి.

♦ నిఘంటువు సహాయంలో అర్థాలు, నానార్థాలు, పర్యాయపదాలు తెలుసుకొనేలా ఉన్నాయి.

♦ ప్రాచీన వాక్యాలు సొంతమాటలలో రాసేలా ఉన్నాయి.

- ప్రకృతి – వికృతులు అవగాహనతో గుర్తించేలా ఉన్నాయి.
- పాఠంలోని పదాలను అవగాహన పొందేలా ఉన్నాయి.
- పదాలను వివిధ సందర్భాలలో ఎలా వాడాలో తెలిసేలా ఉన్నాయి.
- పదజాలంపై పట్టు సాధించేలా ఉన్నాయి.
- వాక్యాల ఆధారంగా పదాలపై అవగాహన కలిగించేలా ఉన్నాయి.
- కొత్త పదాలు అవగాహనలో వినియోగించుకునేలా ఉన్నాయి.

**తరగతి గది నిర్వహణ :**

- భాషాంశాలలో పదజాలం ప్రశ్నలను విద్యార్థులందరిచే చదివించాలి.
- కఠిన ప్రశ్నలుంటే చర్చ ద్వారా అవగాహన కలిగించాలి.
- వ్యక్తిగతంగా ప్రతి విద్యార్థితో రాయించాలి.
- రాసిన వాటిని ప్రదర్శింపజేయాలి.
- తప్పుడు సమాధానాలుంటే వెనువెంటనే సవరించాలి.
- ఎక్కువ అంశాలుంటే ఇంటిపనిగా ఇవ్వవచ్చు.

**(బి) వ్యాకరణాంశాలు :**

పాఠ్యపుస్తకంలో వచ్చే వివిధ రకాల వాక్య, శైలీ, ఛందో మార్పులను, సౌందర్యాన్ని, వివిధ నియమాలను తెలియజెప్పడానికి వ్యాకరణాంశాలు అవసరం. ఇందులో సంధులు, సమాసాలు, వాక్యభేదాలు, అలంకారాలు, ఛందస్సు మొదలైన అంశాలుంటాయి. ప్రాథమిక స్థాయిలో భాషాభాగాలతో మొదలై ఉన్నతస్థాయికి చేరేసరికి వాక్యాలు నిర్మాణాల్లో ఉండే తేడాతోపాటు భాషకు సంబంధించిన వివిధ నియమాలను విద్యార్థులు అవగాహన చేసుకుంటారు.

పాఠ్యపుస్తకాలలో పాఠాలలో ఇచ్చిన వ్యాకరణాంశాలకు సంబంధించిన ప్రశ్నలు పరిశీలిద్దాం.

**ప్రథమ భాష తెలుగు :**

- కింది సంధులకు సంబంధించిన పదాలు ఈ పాఠంలో గుర్తించి, వాటిని విడదీసి సూత్రాలు రాయండి.

  (అ) సవర్ణ దీర్ఘ సంధి (ఆ) గుణ సంధి (ఇ) ఉత్వ సంధి

- కింది పదాలు విడదీసి, సంధులను గుర్తించి సూత్రాలు రాయండి.

  (అ) అత్యంత = ____________ + ____________

  (ఆ) వంటాముదము = ____________ + ____________

- కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి, అవి ఏ సమాసాలో గుర్తించండి.

  (అ) నలుదెసెలు (ఆ) సూర్యచంద్రులు

- కింది వాక్యాల్లోని సంధి పదాలను గుర్తించి, వాటిని విడదీయండి. అవి ఏ సంధులో సూత్రయుక్తంగా తెల్పండి.

  (అ) అందుఁ జూడాకర్ణుఁడను పరివ్రాజకుఁడు గలడు.

  (ఆ) తడవులఁ బట్టి ఈ యెలుక విడువక వాసము చేయుచున్నది.

- కింది పదాల్లోని అలంకారాన్ని గుర్తించండి. లక్షణాలను సరి చూసుకోండి.

  (అ) అనుచున్ జీవుఖు మీఖు కన్నుఁగవతో, నాస్పంద దోష్టంబుతో ఘన హుంకారముతో నటద్భ్రుకుటితో, గర్జి నాభోన్సలేశుని జూడన్...

- కింది పద్య పాదాలకు గురులఘువులను గుర్తించి, గణవిభజనచేసి, అవి ఏ పద్యాలకు సంబంధించినవో నిర్ణయించండి. లక్షణాలు చర్చించండి.

  (అ) అనల జ్యోతుల నీ పతివ్రతలఁ బాపాచారులైడాయుభూ.

- కింది వాక్యాలను సంశ్లిష్ట వాక్యాలుగా మార్చండి.

  (అ) రాము పాఠం చదివాడు. రాము పాఠం అర్థం చేసుకున్నాడు

- కింది వాక్యాలను సంయుక్త వాక్యాలుగా మార్చండి.

  (అ) రామకృష్ణుడు గురువు. వివేకానందుడు శిష్యుడు.

  (ఆ) ఆయన కవి. ఆయన గాయకుడు. ఆయన విద్యావేత్త.

- కింది సందర్భాలలో పునరుక్తమయిన హల్లులను పరిశీలించండి. అవి వృత్త్యానుప్రాస అలంకారాలవునో కాదో చర్చించండి.

  (అ) నీ కరుణాకటాక్ష వీక్షణములకై నిరీక్షించుచున్నారము.

  (ఆ) మకరంద బిందు బృంద రసస్యందన మందరమగు మాతృభాషయే.

- కింది పదాలను కలిసి, మార్పులు గమనించండి.

  (అ) అంతః + ఆత్మ = అంతరాత్మ

  (ఆ) దుః + అభిమానం = ____________

- కింది సమాస పదాల్లోని తత్పురుష భేదాలను గుర్తించి, విగ్రహ వాక్యాలు రాయండి. సమాస నిర్ణయం చేయండి.

(అ) వాదనా పటిమ ________________

(ఆ) అసాధ్యం ________________

(ఇ) దొంగభయం ________________

- కింది కవితా భాగాల్లోని అలంకారాన్ని గుర్తించండి.

  (అ) కొందరికి రెండు కాళ్ళు

  రిక్షా వాళ్ళకి మూడు కాళ్ళు

  ఉన్న వారికి నాలుగు కాళ్ళు

- కింది వాటిని పూరించండి.

  (అ) ఆ + మహాత్ములు = ________

  (ఆ) ________ + ________ = పురాతనాపాదిత

  (ఇ) వేద + ఉక్తము = ________

  (ఈ) ________ + ________ = పలుచగాఁబూసి

- కింది అలంకార లక్షణాలు రాయండి.

  (అ) శ్లేష (ఆ) అర్థాంతరన్యాసం

- కింది ఛందోరీతుల లక్షణాలు రాయండి.

  (అ) సీసం (ఆ) ఆటవెలది

- కింది పాదాలను, వాటి గణ విభజనను పరిశీలించండి. ఏం గమనించారో చెప్పండి.

| I III | U I U | U I I | U I |
|---|---|---|---|
| అ విరళ | నవ్యపు | ష్పాంజలు | నిల్చి |

| I III | U I U | U I I | U I |
|---|---|---|---|
| ప్ర విమల | ధూపదీ | పంబు లొ | నర్చి |

**ద్వితీయ భాష తెలుగు :**

- కింది వాక్యాల్లో గీత గీసిన పదాలు ఏ భాషా భాగాలో గుర్తించండి.

  (అ) <u>ప్రహ్లాదుణ్ణి</u>, <u>గురువు</u>ల దగ్గర <u>చదవ</u>మని తండ్రి చెప్పాడు.

  (ఆ) <u>ఆహా!</u> <u>క్షమ</u> కలిగి ఉండడం <u>ఎంత</u> <u>గొప్పతనం</u>.

- కింది ఖాళీలను విభక్తుల ప్రత్యయాలతో పూరించండి.

  (అ) సీత డబ్బు ____________ బ్యాంక్ ____________ దాచుకుంది.

  (ఆ) సమయాన్ని మంచి పనుల ____________ వినియోగించి, మంచి పేరు ____________ పొందాలి.

- కింది వాక్యాలకు కర్తరి / కర్మణి రూపాలు రాయండి.

  (అ) రేష్మ ప్రార్థన చదివింది.

  (ఆ) వంట నలుని చేత చేయబడింది.

- కింది పదాల్లోని గుణసంధి, త్రికసంధి పదాలను గుర్తించి, విడదీసి రాయండి.

  (అ) అచ్చోట (ఆ) పురుషోత్తముడు (ఇ) ఎవ్వారు (ఈ) మహర్షి

- కింది వాక్యాల్లోని అలంకారాన్ని గుర్తించి రాయండి.

  (అ) నల్ల పిల్లి మెల్లగా బల్లకిందికి వెళ్ళి చల్లని చల్ల తాగింది.

  (ఆ) కుర్రవాడు గుర్రం మీద ఎక్కి విర్ర వీగుతుండగా జర్రున జారి కిందపడ్డాడు.

- కింది పదాలకు గురు లఘువులు గుర్తించి, అవి ఏ గణాలో రాయండి.

  (అ) అఖిలం, కందులు, మాయావి, జలజ, వారేరీ, తక్షణం, సురూపం, కలాపి

- కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి, అవి ఏ సమాసాలో గుర్తించండి.

  (అ) నాయిల్లు (ఆ) బంగారపుతునక (ఇ) వేలంపాట

- కింది పంక్తుల్లో అతిశయోక్తి అలంకారాన్ని వివరించండి.

  ఎత్తుగా ఆకాశంలో
  ఎగిరే డేగని చూడు
  భూచక్రాన్ని గుండ్రంగా
  చుంచు కాగ్రంపై తిప్పుతుంది

- కింది పద్య పాదాలను గణ విభజన చేసి యతి ప్రాసలను గుర్తించండి.

  (అ) కొంకని వాడె దాత, మిముఁగొల్చి భజించినవాడె పోనిరాతంక మనస్కుడెౕన్నగను దాశరథీ కరుణాపయోనిధీ

> పై వ్యాకరణాంశాలు గమనించారు కదా!
>
> - వాటి స్వభావం ఎలా ఉంది?
> - వీటిని ఎలా నిర్వహించాలి? పిల్లలకు అవగాహన ఎలా కల్పించాలి?

**ప్రశ్నల స్వభావం :**

- సంధులపై అవగాహణ కలిగించి సూత్రీకరించుట వీలుగా ఉన్నాయి.
- సమాసాల, విగ్రహరూపాలు అవగాహన కలిగించేలా ఉన్నాయి.
- ఉదాహరణతో ఛందస్సును అవగాహన చేసుకునే ఉన్నాయి.
- అలంకార స్వభావ స్వరూపాలు తెలుసుకునేలా ఉన్నాయి.
- వాక్య భేదాలను, అవగాహనతో చేసేలా ఉన్నాయి.
- సంధులు, సమాసాలు, వాక్యభేదాలు, అలంకారాలు, ఛందస్సు మొదలైన అంశాలు విద్యార్థులే స్వయంగా నేర్చుకునేలా ఉన్నాయి.
- సూత్రాలు బట్టీ పట్టకుండా అవగాహనతో నేర్చుకునేలా ఉన్నాయి.

**తరగతి గది నిర్వహణ :**

- ఈ సామర్థ్యాన్ని పూర్తి తరగతి కృత్యంగా, వ్యక్తిగత కృత్యంగా నిర్వహించాలి.
- సంధులు, సమాసాలు, ఛందస్సు, అలంకారాలు, వాక్యభేదాలు మొదలైనవి కొత్తవి పరిచయం చేసేటప్పుడు పూర్తి తరగతిలో విద్యార్థులతో చర్చిస్తూ, ఉదాహరణలతో సూత్రీకరిస్తూ అవగాహన కలిగించాలి. సూచనలు ఇవ్వాలి.
- ఇంతకు ముందు నేర్చుకొన్నవే వచ్చినప్పుడు విద్యార్థులందరిచేత వ్యక్తిగతంగా చేయించాలి.
- విద్యార్థులు చేసినవి తరగతిలో చదివించాలి.
- తప్పులు దొర్లితే వెనువెంటనే చర్చల ద్వారా సరిచేయాలి.

విద్యార్థులకు వ్యాకరణాంశాలను ఉదాహరణల సహాయంతో వారి భాగస్వామ్యంతో అవగాహన చేయించాలి. స్వయంగా అభ్యాసాలు చేసేలా ప్రోత్సహించాలి.

**ప్రాజెక్టు పనులు :**

తరగతి గదుల్లో భాషా నైపుణ్యాల సాధనకు అభ్యాసం కల్పించినా, సందర్భోచితంగా వీటిని వినియోగించే సమర్థత, కలిసి పనిచేయడం, ఆలోచించడం, నిర్ణయాలు గైకొనడం, వాటికి కట్టుబడడం, నివేదికలు రాయడం. వాటిని చక్కగా ఎదుటి వారికి వివరించగలగడం వంటి అనేక సామర్థ్యాలు సాధించబడడానికి భాషలో కూడా ప్రాజెక్టుపనులు నిర్వహించాల్సి ఉంది. అభ్యసనం పాఠ్యపుస్తక పరిధి దాటాలి. అదనపు పఠన సామగ్రిని పిల్లలు చదవాలి. పిల్లల్లో భాషాభిమానం, భాషాభిరుచి పెరగాలి. పఠనాశక్తి పెరిగి స్వతంత్ర పాఠకులుగా ఎదగాలి. ఇందుకోసం అనేక కృత్యాల, సామర్థ్యాల సమాహారమైన ప్రాజెక్టు పనులను నిర్వహించాలి. నూతన భాషా వాచకాలల్లో ప్రతి పాఠంలో ఒక ప్రాజెక్టుపనిని ఇచ్చారు. వీటిని పిల్లలతో చేయించాలి. నివేదికలు రాయించాలి. వీటి ఆధారంగా పిల్లల ప్రగతిని అంచనావేసి నమోదుచేయాలి. పాఠ్యపుస్తకాలలో ఏ ఏ ప్రాజెక్టు పనులు ఉన్నాయో తెలుసుకోవాలి. ఇందుకోసం ప్రథమ భాష తెలుగు, ద్వితీయ భాష తెలుగు పాఠ్య పుస్తకాలలో పాఠాల వారీగా ప్రాజెక్టుపనుల వివరాలు ఉన్నాయి. పరిశీలించండి.

## 10వ తరగతి - ప్రథమభాష

### పాఠాలవారీ ప్రాజెక్టు పనులు

| క్ర.సం. | పాఠం పేరు | ప్రాజెక్టుపని |
| --- | --- | --- |
| 1. | వెన్నెల | "నరసింహస్వామి కథ" నేపథ్యంతో వచ్చిన గ్రంథాలు, వివరాలను పట్టిక రూపంలో రాయుట. |
| 2. | ధన్యుడు | పాఠశాల గ్రంథాలయంలో పంచతంత్ర కథల పుస్తకంలోని కథలను చదువుట. విద్యార్థికి నచ్చిన కథను సొంతమాటల్లో రాసి ప్రదర్శించుట. |
| 3. | మాతృభావన | స్త్రీల అభ్యున్నతికి కృషిచేసిన సంస్కర్తల వివరాలు సేకరించి ప్రదర్శించుట. ( లేదా ) వివిధ రంగాలలో ప్రసిద్ధిగాంచిన స్త్రీల వివరాలు సేకరించి ప్రదర్శించుట. |
| 4. | జానపదుని జాబు | అందమైన పల్లెటూరు ఏ విధంగా ఉంటుందో ఊహించుట. ప్రకృతి శోభలతో అలరారే అలాంటి గ్రామసీమ చిత్రాన్ని సేకరించుట. దాన్ని వర్ణిస్తూ వివరాలను రాసి ప్రదర్శించుట. తోటి విద్యార్థులు రాసిన వాటిని కూడా సేకరించి "అందమైన గ్రామసీమలు" అనే పుస్తక సంకలనం చేయుట. దానికి ముఖచిత్రం గీయుట. విషయసూచిక ముందుమాట రాసి ప్రదర్శించుట. |
| 5. | శతక మధురిమ | పాఠశాల గ్రంథాలయంలో శతక పద్యాలున్న పుస్తకాలు తీసుకొని చదువుట, వాటితో ఏవైనా ఐదు శతక పద్యాలను, వాటి భావాలను రాసి ప్రదర్శించుట. |
| 6. | నేనెరిగిన బూర్గుల | మహోన్నత వ్యక్తిత్వంతో, పరిపాలనా దక్షతతో సేవచేసినవారి వివరాలు సేకరించుట, ఒక సంకలనాన్ని రూపొందించుట. తరగతిలో ప్రదర్శించుట. |
| 7. | నగర గీతం | భారతదేశంలోని ప్రధాన నగరాల వివరాలు వాటి ప్రత్యేకతలు, జీవన విధానాల వైవిధ్యాన్ని సేకరించి ఒక పట్టికగా రూపొందించుట. భిన్నత్వంలో ఏకత్వాన్ని' నిరూపించేలా ప్రదర్శించుట. |
| 8. | యక్షుడి అప్పు | తెలుగు భాషలో గురజాడ అప్పారావు రాసిన 'కన్యాశుల్కం' ప్రసిద్ధ నాటకం గురించిగాని లేదా ఇతర నాటకం / నాటికను గాని సేకరించుట. చదువుట, దాంట్లోని విషయం తెలుపుట. |

| క్ర.సం. | పాఠం పేరు | ప్రాజెక్టుపని |
|---|---|---|
| 9. | బసవేశ్వర పరిణయం | ద్విపద రూపంలో ఉన్న ఏవైనా రచనలు / పుస్తకంలోని కొంత భాగాన్ని సేకరించుట. దాన్ని రాసి చదివి వినిపించుట. (ఉదా॥ సుభద్రాకల్యాణం, రమాపరిణయం, పల్నాటి వీరచరిత్ర, రంగనాథ రామాయణం మొదలైనవి.) |
| 10. | మా ప్రయత్నం | వివిధ రంగాలలో ప్రసిద్ధులైన మహిళల ఫోటోలు, జీవిత విశేషాలను సేకరించుట, ఒక మోడల్ మహిళా వరణం పుస్తకాన్ని తయారుచేయుట. ప్రదర్శించుట. |
| 11. | మాణిక్య వీణ | దిన, వార పత్రికల ఆధారంగా విద్యార్థికి నచ్చిన రెండు వచన కవితల్ని సేకరించి అంశాల ఆధారంగా పట్టిక తయారుచేయుట. |
| 12. | గోరంత దీపాలు | పాఠశాల గ్రంథాలయంలోని ఏదైనా కథల పుస్తకం నుండి గాని లేదా ఏదైనా పత్రిక నుండి గాని సామాజిక సేవ, మానవ సంబంధాలు, గురు, శిష్య సంబంధం మొదలైన విషయాలకు సంబంధించిన మంచి కథను చదివి ఎంపికచేయుట. దాన్ని ప్రదర్శించుట. అది ఎందుకు నచ్చిందో, దాంట్లోని గొప్పతనమేమిటో నివేదిక రాయుట. |
| 13. | భిక్ష | శ్రీనాథుడు సీసపద్యరచనకు ప్రసిద్ధి. శ్రీనాథుడు రచించిన ఏవైనా 5 పద్యాలు వేర్వేరు గ్రంథాల నుండి సేకరించుట. వాటిని రాయుట. తరగతిలో చదివి వినిపించుట. గోడపత్రికలో ప్రదర్శించుట. |
| 14. | చిత్రగ్రీవం | 1. "ధనగోపాల్ ముఖర్జీ" రాసిన "చిత్రగ్రీవం ఓ పావురం కథ" అనే పుస్తకాన్ని లేదా పక్షుల గురించి తెలిపే ఏదైనా ఒక పుస్తకాన్ని గ్రంథాలయం నుండి సేకరించి చదువుట. విద్యార్థి తెలుసుకొని వివరాలు రాసి ప్రదర్శించుట. లేదా అంతర్జాలం ద్వారా ఏవైనా రెండు పక్షుల వివరాలు, వాటి చిత్రాలు సేకరంచి రాసి ప్రదర్శించుట.<br>2. "చిత్రగ్రీవం" అనే పక్షిపేరు పంచతంత్ర కథల్లో కూడా ఉంది. పంచతంత్రం కథల పుస్తకం చదువుట. విద్యార్థి చదివిన కథ గురించి రాసి ప్రదర్శించుట. |

# 10వ తరగతి - ద్వితీయభాష

## పాఠాలవారీ ప్రాజెక్టు పనులు

| క్ర.సం. | పాఠం పేరు | ప్రాజెక్టుపని |
|---|---|---|
| 1. | భాగవత రత్నాలు | చదువు, సత్యం గొప్పదనాన్ని తెలిపే పద్యాలను సేకరించుట, సంకలనంగా తయారుచేసి ప్రదర్శించుట. |
| 2. | మొద్దబ్బాయిలూ మహా మేధావులే | చిన్నప్పుడు సరిగా చదువకపోయినా, తర్వాత కష్టపడి పైకి వచ్చిన ప్రముఖుల వివరాలు సేకరించుట. వారి జీవితాల నుండి గ్రహించాల్సిన విషయాల గురించి నివేదిక రాసి ప్రదర్శించుట. |
| 3. | నవోదయం | పాఠశాల గ్రంథాలయం నుండి కొన్ని బాలగేయాలను సేకరంచి సంకలనంగా తయారుచేయుట. |
| 4. | సంజయ రాయబారం | (అ) "మహాభారతం"లోని పాఠ్యాంశం ఆధారంగా పాఠశాల గ్రంథాలయం నుండి పిల్లల కోసం రాసిన మహాభారతం చదువుట. దాంట్లో విద్యార్థికి నచ్చిన పాత్ర గురించి నివేదిక రాసి ప్రదర్శించుట.<br>(ఆ) "సంజయ రాయబారం" పాఠాన్ని నాటకీకరణ చేయుట. |
| 5. | కల్యాణం | కుటుంబాల్లో జరిగే పెళ్ళి విధాన్ని పెద్దల ద్వారా తెలుసుకొని రాయుట. |
| 6. | పిసినారి | వరకట్న దురాచారాలపై దినపత్రికలలో వచ్చిన వార్తలను సేకరించుట. వీటి ఆధారంగా ఒక నివేదికను తయారుచేసి ప్రదర్శించుట. |
| 7. | మనిషీ! మనిషీ! | మనిషి లేదా మానవత్వం లేదా మానవీయ సంబంధాలు ప్రధానాంశంగా తీసుకొని రాసిన కవితలను సేకరించి సంకలనం చేయుట. |
| 8. | జానపద నృత్య సంగీతాలు | విద్యార్థి ప్రాంతంలోని లేదా జిల్లాలోని పేరుపొందిన ఏదైనా ఒక జానపద కళ గురించి వివరాలు / జానపద పాటలు సేకరించి నివేదిక రాయుట. దాన్ని ప్రదర్శించుట. |
| 9. | శతక మాధురి | పాఠశాల గ్రంథాలయం నుండి వివిధ రకాల నీతిపద్యాలు సేకరించి సంకలనంగా తయారుచేయుట. |
| 10. | మాట్లాడేనాగలి | యజమానుల నిర్బంధంలో పెంపుడు జంతువులు పడేబాధలు సంభాషణ రూపంలో రాసి ఆయా జంతువుల మాస్కులతో కొరియోగ్రఫీ రూపొందించి ప్రదర్శించుట. |

## 9వ తరగతి - ప్రథమభాష

### పాఠాలవారీ ప్రాజెక్టు పనులు

| క్ర.సం. | పాఠం పేరు | ప్రాజెక్టుపని |
|---|---|---|
| 1. | శాంతి కాంక్ష | ప్రపంచ శాంతి కోసం కృషి చేసిన వారి వివరాలు సేకరించడం. వారి గురించి ఒక నివేదిక తయారుచేసి ప్రదర్శించండి. |
| 2. | స్వభాష | తెలుగుభాష గొప్పదనాన్ని వివరించే వ్యాసాలను, పద్యాలను సేకరించండి. వాటి గురించి తరగతిలో చర్చించండి. |
| 3. | శివతాండవం | మీ గ్రామంలో / పట్టణంలో రకరకాల కళాకారులుంటారు ఒగ్గు కథ చెప్పేవాళ్ళు, బుర్రకథలు చెప్పేవాళ్ళు, చిందుభాగవతులు, హరికథలు చెప్పేవారు... ఇలాంటి వారి వివరాలు సేకరించండి. వారి ప్రదర్శనల గురించి వివరాలు అడిగి తెలుసుకొని రాయండి. |
| 4. | ప్రేరణ | మీకు నచ్చిన శాస్త్రవేత్తను గురించి వారెలా ప్రేరణ పొందారో, ఏ కొత్త విషయాలు కనుకున్నారో వివరాలు సేకరించి వ్యాసం రాయండి.<br>( లేదా )<br>శాస్త్రవేత్తల గురించి పత్రికల్లో వచ్చిన అంశాలను సేకరించండి. |
| 5. | పద్యరత్నాలు | ఒకటో తరగతి నుండి తొమ్మిదో తరగతి వరకు అన్ని తెలుగు పాఠ్యపుస్తకాల్లోని నీతి పద్యాలను సేకరించి, ఒక పుస్తకంలా తయారుచేయండి. మీ తరగతిలో ప్రదర్శించండి. |
| 6. | ప్రబోధం | వివిధ రంగాలలో ప్రసిద్ధులైన స్త్రీల పేర్లు సేకరించి వారు ఏ రంగంలో పేరు పొందారో పట్టికను రాసి, ప్రదర్శించండి.<br>ఉదా॥ క్రీడలకు సంబంధించిన వారు, రచయిత్రులు మొదలయినవారు. |
| 7. | ససేమిరా | పాఠంలోని పద్య భావాలకు సరిపోయే నినాదాలను, సామెతలను సేకరించి పట్టిక తయారుచేసి ప్రదర్శించండి.<br>( లేదా )<br>మీకు తెలిసిన జంతువులు మానవులకు ఎలా ఉపయోగపడతాయో రాసి ప్రదర్శించండి. |

| క్ర.సం. | పాఠం పేరు | ప్రాజెక్టుపని |
|---|---|---|
| 8. | సీతక్క పెండ్లి | మీ ప్రాంతంలో జరిగే వివిధ మతాల వివాహ కార్యక్రమాలను గురించిన సమాచారాన్ని సేకరించండి. తరగతిలో చర్చించి నివేదిక తయారుచేయండి. |
| 9. | రుబాయిలు | ఉర్దూ నుంచి తెలుగులోకి అనువాదం చేసిన రచయితలను, గ్రంథాలను, వివిధ ప్రక్రియలను గురించి తెలుసుకోండి. పట్టికను తయారుచేయండి. |
| 10. | చూడడమనేకళ | మనచుట్టూ ఉండే ప్రతి ప్రాణిలో ఏదో ఒక గొప్పదనం ఉంటుంది. మీరు చూసిన పక్షులు, జంతువుల లక్షణాలను, ప్రత్యేకతలను పట్టిక రూపంలో రాసి ప్రదర్శించండి. |
| 11. | ఈప్స | కాళోజీ 'నాగొడవ' కవితా సంపుటిని సేకరించి, నీకు నచ్చిన రెండు కవితలను రాసి, గోడపత్రికలో ప్రదర్శించండి. |
| 12. | బతుకు పుస్తకం | మీ పాఠశాల గ్రంథాలయంలోని రెండు మూడు పుస్తకాల్లోని ముందు మాటలు చదవండి. ఆ పుస్తకాల గురించి మీరు తెలుసుకున్న విషయాలను రాసి ప్రదర్శించండి.<br>( లేదా )<br>సావిత్రి 'బందిపోట్లు' కవితను సేకరించండి. దీనిపై మీ అభిప్రాయం రాసి ప్రదర్శించండి. |
| 13. | భూమి పుత్రుడు | మీ గ్రామంలో మీకు తెలిసిన ఒక ఆదర్శరైతు వద్దకు లేదా వ్యవసాయ అధికారి వద్దకు వెళ్ళి ఆధునిక పద్ధతుల ద్వారా అధికోత్పత్తిని ఎలా సాధించవచ్చో వివరాలు సేకరించండి. తరగతి గదిలో చదివి ప్రదర్శించండి. |
| 14. | ధర్మదీక్ష | పక్షులు, జంతువుల గొప్పదనాన్ని వివరించే గేయాలను / కథలను సేకరించి తరగతి గదిలో చదివి వినిపించండి. |

## 9వ తరగతి - ద్వితీయభాష

### పాఠాలవారీ ప్రాజెక్టు పనులు

| క్ర.సం. | పాఠం పేరు | ప్రాజెక్టుపని |
|---|---|---|
| 1. | దేశమంటే | మీకు తెలిసిన ఇతర భాషల్లోని దేశభక్తి గేయాలను, వాటి రచయితల పేర్లను సేకరించి పట్టిక రూపంలో రాయండి. |
| 2. | లకుముకి పిట్ట | పాఠశాల గ్రంథాలయంలో పంచతంత్ర కథల పుస్తకంలోని కథలను చదువుట. విద్యార్థికి నచ్చిన కథను సొంతమాటల్లో రాసి ప్రదర్శించుట. |
| 3. | ఉడత సాయం | (అ) స్నేహాన్ని తెలిపే కథలను, చిత్రాలను సేకరించి, ఒక ఆల్బమ్ తయారుచేయండి.<br>( లేదా )<br>(ఆ) స్నేహాన్ని తెలిపే నినాదాలు, సూక్తులు, గొప్పవారు చెప్పిన నిర్వచనాలు, సేకరించండి. వాటిపై మీ మిత్రులతో చర్చించండి. |
| 4. | ప్రకృతి | చెట్లు వాటి ప్రయోజనాలు, చెట్లు నరికివేయడం వల్ల నష్టాలను తెలిపే పాటలను, కవితలను సేకరించండి. ప్రదర్శించండి. |
| 5. | మెట్లు | బాపిరాజు రచించిన ఇతర కవితలను పాటను సేకరించండి. వాటిపై మీ అభిప్రాయాలను రాసి పట్టికపై ప్రదర్శిచండి.<br>( లేదా )<br>మీ ప్రాంతంలోని గేయకవులు – వారి రచనలు సేకరించండి. ప్రదర్శించండి. |
| 6. | జాబిల్లి | వివిధ భాషా పత్రికల పట్టికను తయారుచేయండి. వాటిలో వచ్చే భాషాక్రీడలు, కథలు, గేయాలు సేకరించి ప్రదర్శించండి. |
| 7. | ముత్యాలమూట | 1. నీతి పద్యాలు సేకరించి ప్రార్థన సమయంలో చెప్పండి.<br>2. శతక కవులు చెప్పిన సూక్తులు సేకరించండి. గోడపత్రికలో ఉంచండి. |

| క్ర.సం. | పాఠం పేరు | ప్రాజెక్టుపని |
|---|---|---|
| 8. | పట్టణ సమస్యలు | 1. ట్రాఫిక్ సమస్యలను నివారించే మార్గాలను తెలిపే బొమ్మలను గీయండి. నమూనాను తయారుచేయండి.<br>2. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తక్కువ ఖర్చుతో తయారయ్యే చెత్తకుండీలను తయారుచేయండి. |
| 9. | తెలుగునేల | హిందీ, ఉర్దూ మొదలైన భాషలకు సేవచేసిన గొప్పవారి చిత్రాలు, వారి సేవలను వివరిస్తూ ఒక ఆల్బమ్ తయారుచేసి ప్రదర్శించండి. |
| 10. | నేను... చిందుల ఎల్లమ్మను | చిందు భాగోతం అనే కళను తెలుసుకున్నారు కదా! మీ ప్రాంతంలో ఏ కళలు ఉన్నాయి. వాటి పేర్లు కళాకారుల వివరాలను ఒక పట్టికలో ప్రదర్శించండి. |
| 11. | గాలిబ్ గీతాలు | రవీంద్రనాథ్ ఠాగూర్ 'గీతాంజలి'కి మీ భాషలో చేసిన అనువాదాన్ని సేకరించండి. మీకు నచ్చిన ఒక ఖండికను గోడ పత్రికపై ప్రదర్శించండి. |
| 12. | శీతాకాలం | మీ నగరం / గ్రామంలో ఉండే సమస్యలను గురించి వాటి పరిష్కార మార్గాలను మీరు ఎలా ఊహిస్తున్నారో తెలిపే పట్టికను తయారుచేసి మీ తరగతిలో ప్రదర్శించండి. |

**స్వభావం :** ప్రాజెక్టుపనులు కింది స్వభావం కల్గి ఉంటాయి.

- ఇంటర్వ్యూ ద్వారా సమాచారాన్ని సేకరించడం.
- పుస్తక పఠనం ద్వారా సమాచారాన్ని సేకరించడం.
- సన్నివేశాలు / సంఘటనలు / కార్యక్రమాలు పరిశీలించి రాయడం.
- సొంతంగా కథలు / గీతాలు / పజిల్స్ / సమీక్షలు రాయడం మొదలగునవి.

**నిర్వహణ :**

- పాఠ్య ప్రణాళికలోని 5వ పీరియడ్‌లో ఇంటిపనిగా ప్రాజెక్టుపనిని ఇవ్వాలి.
- ప్రాజెక్టుపని గురించి పిల్లలందరి చేత చదివించాలి.
- ఎలా చేయాలో అవగాహన కలిగించాలి.
- సమాచార సేకరణ, వనరులు ఎక్కడ ఉంటాయి? ఎవరివద్ద ఉంటాయో మొదలైన విషయాలపై సూచనలు, సలహాలు ఇవ్వాలి.

- సమాచార సేకరణకు అవసరమైన ప్రశ్నావళి రూపొందించేలా చూడాలి.
- ఒకవేళ జట్టు వారీగా ప్రాజెక్టుపనిని ఇస్తే ఎవరెవరు ఏ ఏ పనులు చేయాలో కేటాయించాలి.
- నిర్దిష్టంగా వారికి కేటాయించిన పనులు చేసేలా చూడాలి.
- సేకరించిన సమాచారాన్ని నివేదిక రాసే విధానం గురించి సూచనలివ్వాలి.
- 10వ పీరియడ్ రోజు ప్రాజెక్టు పనుల నివేదికలు ప్రదర్శింపజేయాలి.

  అనగా జట్టు వారీగా / వ్యక్తిగతంగా గాని రాసిననటువంటి నివేదికలు ప్రతి ఒక్కరిచేత చదివించాలి.
- చదివిన అంశం గురించి చర్చ నిర్వహించాలి.
- భావం సరిగా ఉందా? వరుసక్రమంలో విషయాన్ని రాశారా?
- వాక్య నిర్మాణం సరిగా ఉందా?
- వాక్యాలు సంపూర్ణ వాక్యాలుగా దోషరహితంగా ఉన్నాయా?
- వాక్యాలలో ఉపయోగించిన పదాలు సరిగా ఉన్నాయా? ఇంకే పదాలు ఉపయోగించవచ్చు.
- అక్షర దోషాలు ఏమైనా ఉన్నాయా? ఇలా పిల్లల్ని ప్రశ్నిస్తూ, చర్చిస్తూ నివేదికను సరిచేయించాలి.
- చివరకు ఉపాధ్యాయుడు ఈ ప్రాజెక్టు పని ద్వారా ఏమి నేర్చుకున్నారో అడగాలి.
- వీటి ఆధారంగా పిల్లలకు మార్కులు కేటాయించాలి.

మార్కులు కేటాయించే పద్ధతి :

- సమాచార సేకరణకు – 20% మార్కులు
- నివేదిక రాయడానికి – 50% మార్కులు
- ప్రదర్శించడం – ప్రతిస్పందించడానికి – 30% మార్కులు

**సమాచార సేకరణ :**

ప్రాజెక్టుపని ఏ రోజు చేశారు. ఎక్కడి నుండి ఎవరి వద్ద నుండి, సేకరించారు? ఏ ఏ పుస్తకాలు చదివారు? ఇందుకోసం ప్రశ్నావళి, కృత్య పత్రాలు మొదలైన వాటి వివరాలు కూడా ఉండాలి.

**నివేదిక రాయడం :**

నివేదిక రాయడం అంటే సేకరించిన / చదివిన / తెలుసుకున్న విషయాలను గురించి క్రమపద్ధతిలో వివరిస్తూ రాయడం. ప్రతి విద్యార్థికి సమీక్ష / నివేదిక రాయడంపై అవగాహన కల్పించాలి. మాదిరి నివేదికల / సమీక్షల గురించి చర్చించాలి. ప్రదర్శింప చేయాలి.

ప్రాజెక్టు ద్వారా నేర్చుకున్న అంశాలు / ముగింపు : ____________ అని నివేదికలో చివరగా రాయాలి.

## రమ, ప్రాజెక్టుపనిని ఎలా చేసిందో చూద్దాం

**ప్రాజెక్టు పని :**

పాఠశాల గ్రంథాలయంలో పంచతంత్ర కథల పుస్తకంలోని కథను చదువుట. విద్యార్థికి నచ్చిన కథను సొంతమాటల్లో రాసి ప్రదర్శించుట.

**సమాచార సేకరణ :**

| | | |
|---|---|---|
| (ఎ) సమాచారం సేకరించిన తేది | : | 10-07-2014 |
| (బి) సమాచారం వనరు | : | పాఠశాల గ్రంథాలయం |
| (సి) చదివిన పుస్తకాలు | : | పంచతంత్ర కథలు |

**సమాచారం సేకరించిన విధం :**

నేను మా పాఠశాల గ్రంథాలయంలోనికి వెళ్ళి మా తెలుగు ఉపాధ్యాయుణ్ణి కలిసి, నాకు పంచతంత్ర కథల పుస్తకం కావాలని అడిగాను. ఆయన ఒక ర్యాక్ చూయించి, వెతకమని చెప్పారు. కొంతసేపు వెతకగా, పంచతంత్ర కథల పుస్తకం దొరికింది. దానిని తీసుకొని మా తెలుగు ఉపాధ్యాయుడి దగ్గరకు వెళ్ళి చూపించాను. ఆయన పుస్తకం పేరు, దాని క్రమ సంఖ్య, నా పేరు రాసి, సంతకం తీసుకొని నాకు పంచతంత్ర కథల పుస్తకం ఇచ్చారు.

నేను బడి వదిలిన వెంటనే ఇంటికి వెళ్ళి, అమ్మకు ఇంటి పనిలో సహాయం చేశాను. రాత్రి 7.30 గం॥లకు భోజనంచేసి కొంత సమయం గడిచిన తర్వాత, పంచతంత్ర పుస్తకం తీసుకొని కూర్చున్నాను. అందులో మిత్రలాభం, మిత్రభేదం సంబంధించిన కథలు చదివాను. అన్ని కథలు చాలా బాగున్నాయి. అందులో మిత్రలాభంలోని "స్నేహబంధం"కథ నాకు బాగా నచ్చింది. స్నేహితులు ఎలా ఉండాలో, ఆపదల్లో ఎలాంటి సమయస్ఫూర్తి ప్రదర్శించాలో చక్కగా చెప్పబడింది.

అందుకే నేను చదివిన పంచతంత్ర కథలలో "స్నేహబంధం" కథను నా సొంతమాటల్లో రాశాను.

**నా సొంతమాటల్లో స్నేహబంధం కథ : (నివేదిక రాయడం)**

ఒక అడవిలో కాకి, ఎలుక, తాబేలు ఒకరి కష్ట సుఖాల్లో ఒకరు పాలు పంచుకుంటూ, మంచి స్నేహితులుగా ఉండేవి. చెట్టుపై కాకి, చెట్టు కింద కన్నంలో ఎలుక, పక్కనే ఉన్న మడుగులో తాబేలు నివసిస్తుండేది.

ఇలా ఉండగా ఒక రోజు ఒక జింక చాలా వేగంగా పరుగెత్తుకుంటూ, కాకి, ఎలుక, తాబేలు ఉన్న ప్రాంతానికి వచ్చింది. ఎలుక భయపడి కన్నంలోకి, తాబేలు మడుగులోకి వెళ్ళాయి. జింక అక్కడే నిలబడి పోయింది. "ఎవరు నీవు? ఎక్కడి నుండి వచ్చావు? ఎందుకు పరుగెత్తుకుంటు వస్తున్నావు? అని కాకి జింకను విచారించింది.

"వేటగాడు వేటాడుకుంటూ వస్తుంటే తప్పించుకోవడానికి భయంతో పరుగెత్తుకుంటూ ఇక్కడికి వచ్చాను" అని జింక చెప్పింది. కాకి భయపడవలసిన అవసరం లేదని చెప్పడంతో ఎలుక, తాబేలు బయటికి వచ్చాయి. జింక వృత్తాంతాన్ని తెలుసుకొని దానితో స్నేహం చేశాయి.

కాలం గడుస్తున్నది. ఒక రోజు జింక కనిపించకుండా పోయింది. ఎలుక, తాబేలు కంగారు పడసాగాయి. కాకి ఆ పరిసర ప్రాంతం అంతా గాలించింది. కొంత సేపటికి ఒక చోట జింక వలలో చిక్కుకొని పడి ఉంది. కాకి వెంటనే ఈ విషయాన్ని ఎలుకకు, తాబేలుకు చెప్పింది. తాబేలును ఇక్కడే ఉండమని చెప్పి, కాకి, ఎలుక జింక దగ్గరకు వెళ్ళాయి. ఎలుక వలను కొరికి జింకను రక్షించింది. గండం గడిచిందని ఆనందంగా తిరిగి వస్తుండగా వేటగాడు అక్కడికి వచ్చాడు. కాకి, జింక, ఎలుక అక్కడి నుండి వేగంగా వెళ్ళిపోయాయి. తాబేలు జింకకు ఏమైనదో ఆత్రుతతో ఉండలేక అక్కడికి వచ్చింది. పరుగెత్తలేని తాబేలును వేటగాడు తాడుతో కట్టి భుజాన వేసుకుపోసాగాడు. ఆపద తప్పిందని అనుకుంటున్నప్పుడే తాబేలు వేటగాడికి దొరకటంతో కాకి, ఎలుక, జింక మరోసారి కంగారుపడ్డాయి.

కంగారులో ఉన్నప్పటికీ వెంటనే వాటికి ఒక ఉపాయం తట్టింది. జింక వేటగాడు వెళ్ళె మార్గంలో చనిపోయినట్లు పడిపోయింది. కాకి జింకపై నిలబడి కన్నును పొడుస్తున్నట్లు నటించింది. వేటగాడు ఆ దృశ్యం చూసి, నా అదృష్టం పండిందని తాబేలును నేలపై పెట్టి జింక వైపు నడిచాడు. ఎలుక వెంటనే తాబేలు తాడును కొరికి వేసింది. తాబేలు వేగంగా నడుస్తూ మడుగును చేరింది. వేటగాడు జింక దగ్గరకు రాగానే కాకి "కావు - కావు - కావు" అంటూ ఎగిరిపోయింది. జింక వెంటనే లేచి పరుగుతీసింది. ఇలా సమయస్ఫూర్తితో అవి ఆపద నుండి బయటపడ్డాయి.


**ప్రాజెక్టుపని ద్వారా నేను నేర్చుకొన్న విషయాలు :**

నాకు పంచతంత్ర కథల గురించి తెలిసింది. మొత్తం పుస్తకం చదవాలనిపించింది. ఈ కథలవల్ల సమాజంలోని మనుషుల గురించి, వారి స్వభావం గురించి కూడా అర్థమైంది. ఖాళీ సమయాల్లో ఇలాంటి పుస్తకాలు చదవడం మంచి అలవాటని నేను గ్రహించాను. పుస్తకపఠనం వల్ల మన జ్ఞానం కూడా పెరుగుతుంది.

- *నిర్మాణాత్మక మూల్యాంకనంలో ప్రాజెక్టు పనులు ఒక అంశం. కావున వీటిని చేయడానికి ప్రత్యేకంగా ఒక నోటు పుస్తకం (నోటు బుక్కు) పెట్టాలి. ఎవరైనా పరిశీలకులు, అధికారులు వచ్చినప్పుడు ప్రాజెక్టు పనులు చేసిన నోటు బుక్కు చూపించాలి.*

**ముగింపు :**

భాషాబోధనలో ఉపయోగపడే వ్యూహాలను, సామర్థ్యాలవారీగా పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలను అర్థం చేసుకొని సరైన వ్యూహాలతో నిర్వహించాలి. ఇందుకోసం వాటి స్వభావాలను, నిర్వహణ విధానాలను తెల్సుకొన్నాం కాబట్టి, వీటిని నిర్వహించడం ద్వారా సామర్థ్యాలు సాధించాలి.



# V. ఉపాధ్యాయుల తయారీ - ప్రణాళికలు

ఏ పని అయినా ఫలవంతం కావడానికి, లక్ష్యం నెరవేరడానికి ఒక ప్రణాళిక అవసరం. ఉపాధ్యాయుడు భాషాబోధన లక్ష్యాలు సాధించడానికి, పిల్లల్లో సామర్థ్యాలను పెంపొందించడానికి, అనుసరించవలసిన వ్యూహాలతో, కార్యక్రమాలతో రెండు రకాల ప్రణాళికలు రాయాలి.

అవి : 1. వార్షిక ప్రణాళిక, 2. పాఠ్య ప్రణాళిక

## వార్షిక ప్రణాళిక

సంవత్సరం మొత్తానికి రాసేది వార్షిక ప్రణాళిక. గతంలో వార్షిక ప్రణాళికలో పాఠంపేరు, పాఠం పూర్తి అయిందా? లేదా? ఉపాధ్యాయుని సంతకం, ప్రధానోపాధ్యాయుని సంతకం మొదలగు వాటిని రాయడం జరిగింది. NCF-2005లో పేర్కొన్న విధంగా జ్ఞాన నిర్మాణానికి అనుగుణంగా మన ప్రణాళికలు వాటిలోని సోపానాలు ఉండాలి.

ప్రస్తుత వార్షిక ప్రణాళికలో ఒక తరగతికి సంబంధించి, ఆయా సబ్జక్టులలో సంవత్సరాంతానికి విద్యార్థులు ఏయే సామర్థ్యాలు సాధించాలి? ఒక్కొక్క పాఠానికి ఎన్ని పీరియళ్ళు అవసరమవుతాయి? అభ్యసన ప్రక్రియ వేగవంతంగా జరగడానికి అవసరమైన అదనపు సామాగ్రి ఏమి ఉపయోగించాలి? ప్రతి నెలలో సామర్థ్యాలను పెంపొందించడానికి అదనముగా నిర్వహించే కార్యక్రమాలు ఏమిటి? CCE కి సంబంధించి ఏమి నమోదు చేయాలి? మొదలైనవాటిని వార్షిక ప్రణాళికలో పొందుపరచాలి. ఈ కింది సోపానాల ద్వారా వార్షిక ప్రణాళిక రాయాలి. అవి I. తరగతి, II. విషయం, III.అవసరమైన పీరియళ్ళ సంఖ్య, IV. సంవత్సరం పూర్తయ్యేసరికి పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలు, V. మాసవారీగా పాఠాల విభజన, VI. ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు, VII. ప్రధానోపాధ్యాయుని సలహాలు, సూచనలు.

## అ) వార్షిక ప్రణాళిక - నమూనా

**I. తరగతి :**

**II. సబ్జక్టు :**

**III. అవసరమైన పీరియళ్ళ సంఖ్య :**

అ) మొత్తం పీరియళ్ళు :

ఆ) బోధనాభ్యసనకు అవసరమైన పీరియళ్ళు :

**IV. సంవత్సరం పూర్తయ్యేసరికి పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలు :**

**I. అవగాహన - ప్రతిస్పందన**

(a) వినడం - ఆలోచించి మాట్లాడటం

(b) ధారాళంగా చదవుట - వ్యక్తీకరించుట

**II. వ్యక్తీకరణ - సృజనాత్మకత**

(a) స్వీయరచన

(b) సృజనాత్మకత / ప్రశంస

**III. భాషాంశాలు**

(a) పదజాలం

(b) వ్యాకరణాంశాలు

**V. మాసవారీగా పాఠాల విభజన :**

| మాసం | బోధించాల్సిన పాఠం పేరు | అవసరమైన పీరియళ్ళ సంఖ్య | బోధనా వనరులు, సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు మరియు CCE |
|---|---|---|---|---|
| | | | | |

**VI. ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు :**

**VII. ప్రధానోపాధ్యాయుని సలహాలు, సూచనలు :**

# ఆ) వార్షిక ప్రణాళిక సోపాన వివరణ

**I. తరగతి** : తరగతి పేరు రాయాలి

**II. విషయం** : సబ్జక్టు 'తెలుగు' రాయాలి

**III. అవసరమైన పీరియళ్ళ సంఖ్య** : అ) మొత్తం పీరియళ్ళు : అకడమిక్ క్యాలండర్ ప్రకారం కేటాయించిన పీరియళ్ళు రాయాలి.

ఆ) బోధనకు అవసరమైన పీరియళ్ళు : పాఠ్యపుస్తకం పూర్తిచేయడానికి అవసరమైన పీరియళ్ళ సంఖ్య రాయాలి.

**IV. సంవత్సరం పూర్తయ్యేసరికి పిల్లలు సాధించాల్సిన సామర్థ్యాలు :**
విద్యాసంవత్సరం పూర్తికాగానే పిల్లలు ఆ తరగతికి సంబంధించిన ఆయా సామర్థ్యాలలో ఏమేమి సాధించాలో రాయాలి. ఇవి మొత్తం పాఠ్యపుస్తకాన్ని దృష్టిలో పెట్టుకొని రాయాలి.

**(అ) అవగాహన – ప్రతిస్పందన :**

- వినడం – మాట్లాడడం : (పిల్లలు వేటి గూర్చి ఎలా మాట్లాడాలి అనేది రాయాలి)
- చదవడం – అవగాహన చేసుకోవడం : (వేటిని చదివి అర్థం చేసుకొని ప్రతిస్పందిచాలో రాయాలి)

**(ఆ) వ్యక్తీకరణ – సృజనాత్మకత**

- స్వీయరచన : (వేటిని గూర్చి సొంతమాట్లో రాయాలో రాయాలి)
- పదజాలం : (పదజాలాన్ని ఉపయోగించి ఏమేమి చేయాలో రాయాలి)
- సృజనాత్మకత : (సృజనాత్మకంగా ఏ వ్యవహారరూపాల్లో వ్యక్తీకరించాలో రాయలి)
- ప్రశంస : (వేటిని ప్రశంసించగలగాలో రాయాలి)

**(ఇ)** భాషాంశాలు : పదజాలం, వ్యాకరణాంశాల గురించి రాయాలి.

**(ఈ)** ప్రాజెక్టుపని : పాఠాల ఆధారంగా ఏ విధమైన ప్రాజెక్టు పనులు పిల్లలు చేయాలో రాయాలి.

ఇలా ప్రతి సామర్థ్యంలో సంవత్సరాంతానికి పిల్లలు ఏమేమి చేయగలగాలి అనే విషయాలు ఆయా సామర్థ్యాల కింద రాయాలి. పదవతరగతి పాఠ్యపుస్తకంలో దీనికి సంబంధించిన ఒక పేజీ ఉంది.

**V. మాస వారీగా పాఠాల విభజన – ప్రణాళిక:**

ఏ నెలలో, ఏ పాఠం బోధించాలి? ఆ పాఠం పూర్తికావడానికి అవసరమైన పీరియళ్ళ సంఖ్య ఎంత? ఇక్కడ పాఠ్యబోధన అంటే ఉన్ముఖీకరణ చిత్రం నుండి సూక్తి వరకు పాఠమే. ఇది ఉపాధ్యాయులు గ్రహించి ప్రతిదానికీ పిరియడు కేటాయించుకోవాలి. అలాగే పాఠ్యబోధనకు అవసరమైన అదనపు సామగ్రి ఏమి ఉపయోగించాలో రాయాలి. ఆయా సామర్థ్యాల అభివృద్ధికై ఏ నెలలో ఏ అదనపు కార్యక్రమాలు నిర్వహించాలో రాయాలి. ఉదా: వ్యాసరచన, వక్తృత్వం, పద్యపఠనం, నాటకం మొ॥నవి అట్లే ఆ మాసంలో సి.సి.ఇ. / పరీక్షల గురించి చేపట్టాల్సిన కార్యక్రమాల వివరాలు రాయాలి. ఈ కార్యక్రమాలవల్ల పిల్లల్లో భాషాభివృద్ధి జరగాలి.

పట్టికను కింది విధంగా రాయాలి.

| మాసం | పాఠంపేరు | అవసరమైన పీరియళ్ళ సంఖ్య | బోధనా వనరులు, సామగ్రి | నిర్వహించే కార్యక్రమాలు మరియు CCE |
|---|---|---|---|---|
| జూన్ | వెన్నెల | 12 | ఎర్రన నృసింహపురాణం వెన్నెలను వర్ణించిన పద్యాలు, వెన్నెల సూర్యచంద్రుల ప్రకృతి చిత్రాలు | ప్రకృతి దృశాల్య ఆధారంగా రాసిన రచనల ప్రదర్శన |

పాఠానికి అవసరమైన పీరియళ్ళ సంఖ్య : ఒక పాఠానికి సగటున 12 పీరియళ్ళు అవసరమైతాయి. ఇలా మొత్తం అన్ని పాఠాలకు రాయాలి. తప్పనిసరిగా ఒక్కొక్క సామర్థ్యపు అభ్యాసానికి ఒక్కొక్క పీరియడు కేటాయించుకోవాలి. ఉన్ముఖీకరణ, అర్థసంగ్రహణం, పాఠ్యాంశబోధనకు పీరియళ్ళు కేటాయించుకోవాలి. ఉన్ముఖీకరణకు ఒక పీరియడ్, విద్యార్థులకు సూచనలు, ప్రవేశికకు ఒక పీరియడ్ పాఠ్యాంశం గురించి చర్చ అవగాహనకు 3 పీరియళ్ళు అవసరమైతాయి. అభ్యాసాలకు 7 పీరియళ్ళు అవసరమైతాయి.

**బోధనా వనరులు మరియు సామగ్రి :**

ప్రతి ఉపాధ్యాయుడు ఆ సంవత్సరంలో బోధించాల్సిన పాఠాలకు అనుగుణంగా వనరులను ముందే సిద్ధం చేసుకోవాలి. వనరులు అనగా ఉపయుక్త గ్రంథావళి, ఉపాధ్యాయుల కరదీపికలు, బోధనలో ఉపయోగించే సామాగ్రి, నిఘంటువులు, సి.డి.లు / వీడియోలు, మ్యాగజైన్స్, దినపత్రికల క్లిప్పింగ్స్, టీచింగ్ నోట్స్ మొదలగునవి. ఉపాధ్యాయులు ఇంకనూ ఆలోచించి బోధించే విషయాన్ని అనుసరించి తగిన బోధనా వనరులను సొంతంగా తయారుచేసుకోవాలి. బోధన ఆసక్తికరంగా ఉండాలంటే పిల్లలు అభ్యసనంలో పాల్గొనాలంటే ఉపాధ్యాయుడు ముందే ఆలోచించి తగిన వనరులు ఉపయోగించి ఆసక్తికరంగా బోధించుటకు ప్రయత్నించాలి.

**నిర్వహించాల్సిన కార్యక్రమాలు, సి.సి.ఇ. :**

ఆశించే సామర్థ్యాల సాధన కోసం ఆయా సబ్జక్టుల వారీగా పలు కార్యక్రమాలు కేవలం తరగతి గదుల్లో కాకుండా బయట, నిర్వహణ చేయాలి. వీటిలో క్షేత్ర సందర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, విజ్ఞాన యాత్రలు, సామాజిక సంస్థల సందర్శన, సమాజసేవ, క్విజ్, సెమినార్లు, వివిధ రకాలైన కవితలు, కథలు, కరపత్రాలు పోస్టర్లు మొదలగు వాటిని తయారుచేయుటకు కార్యశాలలు, దినపత్రికలకు వ్యాసాలు రాయటం, కవి సమ్మేళనం, విషయ నిపుణులచే ఉపన్యాసాలు, పద్య పఠనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, చిత్రలేఖనం, కవితలు రాయటం, కథలు రాయటం మొదలగు సృజనాత్మక అంశాలలో కార్యక్రమాలను నిర్వహించాలి. వీటిని కూడా వార్షిక ప్రణాళికలో చూపాలి మరియు అమలు చేయాలి. ఈ కార్యక్రమాల వల్ల విద్యార్థులలో వివిధ సామర్థ్యాలు, అభిరుచులు పెంపొందుతాయి మరియు పాఠశాల ఒక ఆహ్లాదకరమైన ప్రదేశంగా మారుతుంది. దీనికి ప్రతి ఉపాధ్యాయుడు, ప్రధానోపాధ్యాయుడు వృత్తి పరంగా ఆలోచించి వృత్తికి న్యాయం చేయాలి. అలాగే సి.సి.ఇ.కి సంబంధించి ఏ నెలలో నిర్మాణాత్మక మూల్యాంకనం నమోదు చేయాలో, ఏ నెలలో సంగ్రణాత్మక మూల్యాంకనం నిర్వహిస్తారో ప్రణాళికలో పొందుపరచాలి.

**VI. ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు :**

సంవత్సరం పూర్తయ్యేసరికి సామర్థ్యాల సాధనకై ఉపాధ్యాయుడు అదనంగా ఏమేమి నిర్వహించాడు? విద్యార్థుల భాగస్వామ్యం ఎలా ఉంది? ఏయే సామర్థ్యాలలో పిల్లలు ప్రగతిని సాధించారు? వేటిలో వెనుకబడి ఉన్నారు? సృజనాత్మకత, ప్రశంసా పూర్వక పనులు, ప్రాజెక్టుపనులు ఎలా చేసారు? సామర్థ్యాల సాధనకై ఉపాధ్యాయుడు ఇంకా తానేమి చేయగలడో అనే వాటిపై ఉపాధ్యాయుడు తన ప్రతిస్పందనలు రాయాలి. దీనికి కొన్ని పేజీలు వదిలి పెట్టాలి. ఎందుకంటే వార్షిక ప్రణాళిక సోపానాలలో I నుండి V వరకు పెద్దగా మార్పు ఉండదు. కాని ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు ప్రతి పాఠానికి మారుతుంటాయి. అందుకని నెలవారిగా ప్రతిస్పందనలు రాయాలి. ప్రధానోపాధ్యాయుని సలహాలు సూచనలు కూడా నెలవారీగా VIIవ సోపానంలో ఉంటాయి. ఇలా సంవత్సరం మొత్తానికి ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు, ప్రధానోపాధ్యాయుని సలహాలు, సూచనలు రాయడంకాగానే మరొక సంవత్సరానికి సంబంధించి ఇంకొక పేజీలో రాయాలి. అందువల్ల వార్షిక ప్రణాళిక ఈ రెండు సోపానాలకు పేజీలు వదిలి పెట్టాలి.

**VII. ప్రధానోపాధ్యాయుని సలహాలు, సూచనలు :**

మాసవారీగా ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులతో సమీక్ష, సమావేశం నిర్వహించాలి. ఉపాధ్యాయుల బోధన, పిల్లల ప్రగతి గురించి ప్రధానోపాధ్యాయుడు లక్ష్యాలు నిర్వహించాలి. ప్రధానోపాధ్యాయుడు మాస వారీగా తన సలహాలు, సూచనలు తెలియజేయాలి. వీటిని మాసవారీగా వార్షిక ప్రణాళికలో రాయాలి.

## వార్షిక ప్రణాళిక సోపాన వివరణ

| | | |
|---|---|---|
| **I. తరగతి** | : | 10వ |
| **II. విషయం** | : | తెలుగు (ప్రథమభాష) |
| **III. అవసరమైన పీరియళ్ళ సంఖ్య** | : | అ) మొత్తం పీరియళ్ళు : 220 |
| | | ఆ) బోధనకు అవసరమైన పీరియళ్ళు : 180 |
| | | (పాఠాలకి 168, ఉపవాచకానికి 12 పీరియళ్ళు) |

**IV. విద్యా సంవత్సరం పూర్తయే సరికి సాధించాల్సిన సామర్థ్యాలు :**

**అ) అవగాహన - ప్రతిస్పందన :**

దీనిలో “వినడం - మాట్లాడడం, ధారాళంగా చదివి అర్థం చేసుకొని, వ్యక్తీకరించడం” అనే సామర్థ్యాలుంటాయి. వీటిలో పిల్లలు కింది అంశాలను చేయగలగాలి.

- విన్న, చదివిన అంశాలు అర్థం చేసుకోవాలి. తమ అభిప్రాయాలు వ్యక్తపరచాలి.
- సమర్థిస్తూ లేదా విభేదిస్తూ మాట్లాడగలగాలి, కారణాలు వివరించగలగాలి.
- నచ్చిన సందర్భాన్ని అనుభూతులను వర్ణించగలగాలి.

- పద్య భావాలు, పాఠ్యభాగ సారాంశాలు, కథలు, కథానికలను సొంతమాటల్లో చెప్పగలగాలి.
- వక్తృత్వ పోటీల్లో పాల్గొని మాట్లాడగలగాలి, సద్యోభాషణం చేయగలగాలి (ఇచ్చిన అంశం గురించి అప్పటికప్పుడే మాట్లాడడం).
- పాఠం చదివి జాతీయాలు, సామెతలు గుర్తించగలగాలి.
- ఎవరు ఎవరితో అన్నారు? ఏ సందర్భంలో అన్నారు? గుర్తించగలగాలి.
- పాత్రల స్వభావాన్ని పట్టిక రూపంలో తయారుచేయగలగాలి.
- భావాలకు తగిన పద్య పాదాలను, గేయపాదాలను గుర్తించాలి.
- వివరాల కనుగుణంగా పట్టికలు తయారుచేయగలగాలి.
- చదివిన అంశంలోని కీలకాంశాలు, కీలక పదాలు రాయగలగాలి.
- పేరాలకు శీర్షికలు పెట్టడం, శీర్షికలకనుగుణంగా పేరాలను గుర్తించడం చేయగలగాలి.
- అపరిచిత గద్యం లేదా పద్యాలు చదివి ప్రశ్నలకు జవాబులు రాయాలి. ప్రశ్నలు కూడా తయారుచేయగలగాలి.
- పాఠంలో చుక్క గుర్తున్న పద్యాలను చదివి, అర్థం చేసుకొని ప్రతి పదార్థం - రాయగలగాలి.

### ఆ) వ్యక్తీకరణ - సృజనాత్మకత

ఇందులో "స్వీయరచన, సృజనాత్మకత, ప్రశంస" అనే సామర్థ్యాలుంటాయి. వీటిలో పిల్లలు ఈ కిందివి చేయగలగాలి.

- కారణాలు రాయగలగాలి. వివరిస్తూ రాయగలగాలి.
- అభిప్రాయాలు రాయగలగాలి. వివరిస్తూ రాయగలగాలి.
- రచయిత అభిప్రాయాన్ని గ్రహించి వివరించగలగాలి.
- సమర్థిస్తూ లేదా విభేదిస్తూ రాయగలగాలి.
- ప్రకృతి దృశ్యాలను వర్ణించి రాయగలగాలి.
- రచనాశైలిని అభినందిస్తూ రాయటం, అభినందన వ్యాసం, కరపత్రాలు తయారుచేయటం, ఇంటర్వ్యూ కోసం ప్రశ్నావళి తయారుచేయటం, కవితలు రాయగలగటం, సన్మానపత్రం తయారుచేయగలగటం, పత్రికలకు లేఖ లేదా సాహిత్య వ్యాసాలు రాయటం, సంభాషణలు రాయటం వంటివి చేయగలగాలి, సృజనాత్మకత సంభాషణలు, కథనాలు రాయగలగాలి.

### ఇ) భాషాంశాలు

ఇందులో "పదజాలం, వ్యాకరణాంశాల"కు సంబంధించినది. కింది తరగతుల్లో నేర్చుకున్న వాటితో పాటు పిల్లలు కిందివి చేయగలగాలి.

- పదాలకు అర్థాలు, వ్యుత్పత్తులు, నానార్థాలు, పర్యాయపదాలు రాయగలగాలి.
- ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలు రాయగలగాలి. జాతీయాలను సమర్థవంతంగా వాక్యాల్లో ఉపయోగించగల్గాలి.
- ప్రకృతికి వికృతి, వికృతికి ప్రకృతి పదాలు రాయగలగాలి.
- దైనందిన జీవితంలో సందర్భోచితంగా సరైన పదాలు జాతీయాలు, సామెతలు వినియోగించగలగాలి.

- ఆటవెలది, సీసం, ద్విపద లక్షణాలు అర్థం చేసుకోవాలి. ఆయా ఛందాలను గుర్తించగలగాలి.
- పుంప్వాదేశ సంధి, విసర్గ సంధి, నుగాగమ సంధి, ప్రాతాదిసంధి, శ్చుత్వ సంధులను అర్థం చేసుకొని ఆయా సంధుల గురించి వివరించి రాయగలగాలి.
- అవ్యయీభావ సమాసాన్ని అవగాహన చేసుకొని ఉదాహరణలు ఇవ్వగలగాలి.
- ముక్త పదగ్రస్తం, లాటానుప్రాస, అతిశయోక్తి, అర్థాంతరన్యాసాలంకారాలు అవగాహన చేసుకొని గుర్తించగలగాలి.

**ఈ) ప్రాజెక్టుపనులు**

ఇవి వివిధ సామర్థ్యాల సమాహారం, వివిధ సామర్థ్యాలను సందర్భోచితంగా వినియోగించే శక్తిని పిల్లలకు కలిగిస్తాయి. కథలు, కవితలు, రచయితల వివరాలు, సమాజసేవలో పాల్గొన్న వారి వివరాలు, జీవన విధానాల వివరాలు, సమీక్ష వ్యాసాలు మొదలైనవి సేకరించి నివేదికలు రాసి ప్రదర్శించాలి.

## V. మాసాల వారీగా పాఠాల విభజన - ప్రణాళిక

| నెల | బోధించాల్సిన పాఠం | పీరియడ్ల సంఖ్య | బోధనా వనరులు మరియు సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు, సి.సి.ఇ. |
|---|---|---|---|---|
| జూన్ | 1. వెన్నెల | 12 | • ఎఱ్ఱన రచించిన నృసింహ పురాణం, ప్రకృతివర్ణన గురించి తెలిపే ఇతర పుస్తకాలు, చిత్రాలు | • ప్రకృతి వర్ణన గురించి వ్యాసరచన పోటీ<br>• నరసింహస్వామి కథ నేపథ్యంలో వచ్చిన గ్రంథాల వివరాల పట్టిక రాయించడం, ప్రదర్శన |
| జూలై | 2. ధన్యుడు | 12 | • పోతన భాగవతం పాఠ్యపుస్తకం, చిన్నయసూరి నీతి చంద్రిక, విలువలను తెలిపే ఇతర కథల పుస్తకాలు | • కథల పోటీ |
| | 3. మాతృభావన<br><br>* బాలకాండం (ఉపవాచకం) | 12<br><br>2 | • 'శివభారతం' పుస్తకం. మాతృసేవకు సంబంధించిన ఇతర పుస్తకాలు | • ఏకాంకిక ప్రదర్శన<br>• నినాదాలు, సూక్తులు రాసి ప్రదర్శించుట<br>• మొదటి నిర్మాణాత్మక మూల్యాంకనం నిర్వహణ, నమోదు |
| ఆగస్టు | 4. జానపదుని జాబు | 12 | • బోయి భీమన్న లేఖా సాహిత్యం, శారదలేఖలు, నెహ్రూగారు రాసిన లేఖలు | • లేఖా రచన<br>• లేఖా సంకలనం |
| | 5. శతక మధురిమ | 12 | • ఆయాకవులు రచించిన శతకాలు | • పద్య పఠనపోటీ<br>• పద్యతోరణం<br>• రెండవ నిర్మాణాత్మక మూల్యాకంనం నిర్వహణ, నమోదు |

| నెల | బోధించాల్సిన పాఠం | పీరియడ్ల సంఖ్య | బోధనా వనరులు మరియు సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు, సి.సి.ఇ. |
|---|---|---|---|---|
| సెప్టెంబరు | 6. నేనెరిగిన బూర్గుల<br>* అయోధ్యకాండం (ఉపవాచకం) | 12<br>2 | • కొన్ని అభినందన వ్యాసాలు, 1972 డిసెంబరు నాటి 'ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక' | • విద్యార్థుల కవితా సంకలనం<br>• కవితల పోటి<br>• ఉపాధ్యాయుల దినోత్సవం- వ్యాసరచన పోటీ |
| | 7. నగర గీతం | 12 | • సామాజిక సేవకు సంబంధించిన వ్యాసాలు, సిటీలైఫ్ మినీ కవితల పుస్తకం | • వచన కవిత<br>• వ్యాసరచన పోటీ<br>• మొదటి సంగ్రహణాత్మక మూల్యాంకనం గురించి తల్లిదండ్రులతో సమావేశం |
| అక్టోబరు | 8. యక్షుడి అప్పు<br>* అరణ్యకాండం (ఉపవాచకం) | 12<br>2 | • విశ్వనాథ సత్యనారాయణగారు రచించిన అసంకలిత సాహిత్యం - రూపకాలు - సంపాదకీయాలు అనే గ్రంథం | • నాటకీకరణ<br>• హాస్యనాటక ప్రదర్శన<br>• మొదటి సంగ్రహణాత్మక మూల్యాకనం నిర్వహణ |
| నవంబర్ | 9. బసవేశ్వరపరిణయం | 12 | • 'బసవ పురాణం' గ్రంథం, వివాహ సంస్కృతి గ్రంథాలు | • ద్విపద కావ్యాల సంకలనం<br>• బాలల దినోత్సవం సందర్భంగా సృజనాత్మక పోటీల నిర్వహణ |
| | 10. మా ప్రయత్నం | 12 | • 'మహిళావరణం' అనే పుస్తకం, పేరు గడించినవారు రాసిన ముందు మాటలు | • కరపత్రాల తయారీ ప్రదర్శన<br>• ఉపన్యాస పోటీల నిర్వహణ<br>• 3వ నిర్మాణాత్మక మూల్యాంకనం నిర్వహణ, నమోదు |
| డిసెంబరు | 11. మాణిక్యవీణ | 12 | • విద్వాన్ విశ్వం గారి వచన రచనా సంపుటి మరికొన్ని వచన కవితలు | • వచన కవితా సంకలనం,<br>• సృజనాత్మక రచనాపోటీలు |
| | 12. గోరంతదీపాలు<br>* కిష్కింధాకాండం (ఉపవాచకం) | 12<br>2 | • పులికంటి కృష్ణారెడ్డిగారి 'కథావాహిని' పుస్తకం. సామాజిక అంశాలను ప్రతిబింబించే మరికొన్ని కథలు | • చిత్ర ప్రదర్శన<br>• హాస్య సంభాషణ<br>• 2వ సంగ్రహనాత్మక మూల్యాంకనం గురించి తల్లిదండ్రుల సమావేశం |

| నెల | బోధించాల్సిన పాఠం | పీరియడ్ల సంఖ్య | బోధనా వనరులు మరియు సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు, సి.సి.ఇ. |
|---|---|---|---|---|
| జనవరి | 13. భిక్ష<br><br>* సుందరకాండం (ఉపవాచకం) | 12<br><br>2 | • శ్రీనాథుడు రచించిన 'కాశీఖండము' అనే గ్రంథం, భిక్షావ్రతంతో జీవించిన మహాపురుషుల చరిత్ర పుస్తకాలు | • దర్శనీయ స్థలాల బ్రోచర్ల తయారీ ప్రదర్శన<br>• 2వ సంగ్రహణాత్మక మూల్యాంకనం నిర్వహణ, వివరాల నమోదు |
| ఫిబ్రవరి | 14. చిత్రగ్రీవం<br><br>* యుద్ధకాండం (ఉపవాచకం) | 12<br><br>2 | • ధనగోపాల్ ముఖర్జీ రాసిన 'చిత్రగ్రీవం' ఓ పావురం కథ పుస్తకం. మరికొన్ని శాస్త్రీయ విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు | • పోస్టరు తయారీ ప్రదర్శన<br>• పాఠశాల మ్యాగజైన్ తయారీ<br>• 4వ నిర్మాణాత్మక మూల్యాంకనం నమోదు<br>• నిర్మాణాత్మక మూల్యాకనం వివరాలు, నమోదు |
| మార్చి | పునశ్చరణ | | • పరీక్షలకు తయారీ | • నమూనా ప్రశ్నల ద్వారా పిల్లలకు అభ్యాసాలు |
| మొత్తం | | 180 | • నిఘంటువులు, పురాతన నామకోశం, విద్యార్థి కల్పతరువు, కవులు, రచయితలకు సంబంధించిన దృశ్యశ్రవణ సామాగ్రి, అంతర్జాలం | |

**VI. ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు**

**VII. ప్రధానోపాధ్యాయుడి సలహాలు, సూచనలు**

# పాఠ్య ప్రణాళిక

ఒక పాఠాన్ని ప్రాతిపదికగా తీసుకొని ఎన్ని పీరియళ్ళు అవసరమో విభజించుకొని మొత్తం పాఠం కోసం రూపొందించుకొనే ప్రణాళికను పాఠ్యప్రణాళిక అంటారు. దీన్నే భాషేతర సబ్జక్టులలో యూనిట్ ప్రణాళిక అని కూడా అంటారు. కాబట్టి తెలుగులో పాఠ్యప్రణాళిక అన్నా, యూనిట్ ప్రణాళిక అన్నా ఒకటే! ఐతే గతంలో పాఠ్యప్రణాళికను ఒక పీరియడ్‌ను దృష్టిలో పెట్టుకొని రాసేవారు. ఇలా ఒక పీరియడ్‌ను దృష్టిలో పెట్టుకొని రాసే ప్రణాళికను కాలాంశ ప్రణాళిక లేదా పీరియడ్ ప్రణాళిక అంటాం. దీని గురించి తెలుసుకొందాం. సగటున ఒక పాఠం పూర్తి చేయడానికి అంటే ఉన్ముఖీకరణ నుండి నేనివి చేయగలనా? వరకు ఐదు విభాగాలను పూర్తిచేయడానికి సగటున 12 పీరియళ్ళు అవసరమని తెలుసుకొన్నాము కదా! ఒక పాఠం ద్వారా ఏమి సాధించాలి? ఏ ఏ వ్యూహాలు అమలుచేయాలి? ఏ సామగ్రి వినియోగించాలి? మొదలగు వివరాలు పాఠ్య ప్రణాళికలో ఉంటాయి. వీటితోపాటు ఉపాధ్యాయుడు పాఠ్యబోధనకు అవసరమైన రీతిలో సిద్ధం కావాల్సి ఉంటుంది. దీనికోసం పాఠ్యపుస్తకంతోపాటు అదనపు గ్రంథాలు, పుస్తకాల నుండి సమాచారాన్ని విశేషాంశాలను, కృత్యాలు మొదలగు వాటిని సేకరించాల్సి ఉంటుంది. వీటిని కూడా పాఠ్య ప్రణాళికలో పొందుపరచాల్సి ఉంటుంది. అంటే ఒక పాఠానికి సంబంధించిన బోధనా వ్యూహాలు సమయ విభజన, వనరులు, సంసిద్ధత, ప్రతిస్పందనలు ఇలాంటి వివరాలతో పాఠ్యప్రణాళిక రాయాల్సి ఉంటుంది. దీనికొక నమూనాను తెలుసుకొందాం.

## అ) పాఠ్య ప్రణాళిక - సోపానాలు

**I. పాఠం పేరు :**

**II. పాఠానికి అవసరమైన పీరియళ్ళ సంఖ్య :**

**III. పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు :**

- **I. అవగాహన - ప్రతిస్పందన**
  - (a) వినటం - ఆలోచించి మాట్లాడటం
  - (b) ధారాళంగా చదవుట - వ్యక్తీకరించుట
- **II. వ్యక్తీకరణ - సృజనాత్మకత**
  - (a) స్వీయరచన
  - (b) సృజనాత్మకత / ప్రశంస
- **III. భాషాంశాలు**
  - (a) పదజాలం
  - (b) వ్యాకరణాంశాలు

**IV. పీరియడ్ వారిగా విభజన - ప్రణాళిక :**

| పీరియడు సంఖ్య | బోధనాంశం | బోధనా వ్యూహం, అభ్యసనానుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | | | |

**V. ఉపాధ్యాయుల తయారీ, అదనపు సమాచార సేకరణ (టీచింగ్ నోట్సు) :**

**VI. ఉపాధ్యాయుడి ప్రతిస్పందనలు :**

# ఆ) తెలుగు పాఠ్య ప్రణాళిక

## సోపానాల వివరణ

| | | |
|---|---|---|
| I. | పాఠం పేరు | : ఏ పాఠానికి సంబంధించి పాఠ్య ప్రణాళిక తయారు చేస్తున్నామో ఆ పాఠం పేరు రాయాలి. |
| II. | పీరియళ్ళ సంఖ్య | : వార్షిక ప్రణాళికలో ఆ పాఠానికి ఎన్ని పీరియళ్ళు అవసరమని రాసుకున్నామో ఆ సంఖ్య ఇక్కడ రాయాలి. |
| III. | సాధించాల్సిన సామర్థ్యాలు | : ఆయా సామర్థ్యాలలో పాఠం పూర్తయ్యే సరికి పిల్లలు ఏమేమి సాధించాలో ఇక్కడ రాయాలి. ప్రతి పాఠంలో కూడా "ఇవి చేయండి" పేరుతో సామర్థ్యాల ఆధారంగా అభ్యాసాలు ఉన్నాయి. వాటిని పరిశీలించాలి. వాటి ఆధారంగా ఏ సామర్థ్యంలో పిల్లలు ఏమేమి సాధించాలో రాయాలి. |

**అ) అవగాహన - ప్రతిస్పందన**

దీనిలో "వినడం - మాట్లాడడం, ధారాళంగా చదివి అర్థం చేసుకొని, వ్యక్తీకరించడం" అనే సామర్థ్యాలుంటాయి. ఈ పాఠం ద్వారా ఈ సామర్థ్యంలో పిల్లలు వేటిని గురించి ఆలోచించి మాట్లాడగలగాలి, వేటిని చదివి అర్థం చేసుకొని ప్రతిస్పందించగలగాలి అనేది రాయాలి. ఇందుకోసం అవగాహన-ప్రతిస్పందనలోని ప్రశ్నలు చూడాలి.

**ఆ) వ్యక్తీకరణ సృజనాత్మకత**

దీనిలో "స్వీయరచన, సృజనాత్మకత, ప్రశంస" అనే సామర్థ్యాలు ఉంటాయి.

- ఈ పాఠం ద్వారా విద్యార్థులు తమ సొంత మాటల్లో వేటిని గురించి రాయాలో ఇక్కడ రాయాలి. స్వీయరచనలోని ప్రశ్నలు చదివి రాయాలి.
- సృజనాత్మక వ్యక్తీకరణను కరపత్రం గేయం, కవిత, సంభాషణలు మొదలైన వ్యవహారరూపంలో పిల్లలు చేయగలగాలి. ఈ పాఠాన్ని అనుసరించి దేనిని చేయాలో, వేటిని ప్రశంసించాలో ఇక్కడ రాయాలి. ఇందుకోసం వ్యక్తీకరణ - సృజనాత్మకతలోని సృజనాత్మకత ప్రశ్నలను చదివి పిల్లలు ఏం చేయాలో రాయాలి.

**ఇ) భాషాంశాలు**

దీనిలో "పదజాలం, వ్యాకరణాంశాలు" అనే సామర్థ్యాలు ఉంటాయి.

- ఈ పాఠంలోని అభ్యాసాలలోని పదజాలంలో పిల్లలు ఏమేమి చేయాలనేది, వ్యారణాంశాలలో వేటిని సాధించాలనేది ఇక్కడ రాయాలి.

  (అర్థాలు, నానార్థాలు, పర్యాయ పదాలు, సొంత వాక్యాలు, సంధి, సమాసాలు, అలంకారాలు, ఛందస్సు)

  పైన పేర్కొన్న సామర్థ్యాలన్నీ ఆ పాఠం ద్వారా పిల్లలు సాధించగలగాలి.

## IV. పీరియడ్ వారీగా విభజన ప్రణాళిక :

మొత్తం పాఠానికి అవసరమైన పీరియళ్ళ సంఖ్యను బట్టి ఏ బోధనాంశానికి ఎన్ని పీరియళ్ళు ఇచ్చారు? ఆ పీరియడ్ సంఖ్యను రాసి, బోధనాంశం, బోధనా వ్యూహాలు, సామగ్రి మూల్యాంకనం వివరాలను రాయాలి.

| పీరియడు సంఖ్య | బోధనాంశం | బోధనా వ్యూహం | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 1 | ఉన్ముఖీకరణ | ఒక్కొక్కరినీ ప్రశ్నిస్తూ పూర్తి తరగతి కృత్యం నిర్వహించటం | అదనపు సామగ్రి | ఆ పీరియడ్‌లో జరిగిన బోధనాంశం మూల్యాంకనం |

ఇప్పుడు పట్టికలో రాసిన వాటిని గూర్చి తెలుసుకుందాం.

**పీరియడు సంఖ్య :**

ఏ పీరియడు నిర్వహిస్తున్నామో దాని సంఖ్య వేయాలి.

**బోధనాంశం :**

పాఠంలో ఉన్ముఖీకరణ నుండి నేనివి చివరి అభ్యాసం, సూక్తి వరకు అన్ని అంశాలు బోధనాంశాలే. ఏ పీరియడులో దేన్ని గురించి బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహిస్తామో ఆ అంశాన్ని ఇక్కడ రాయాలి.

(ఉదా : ఉన్ముఖీకరణ, పఠన కృత్యాలు – అర్థ సంగ్రహణ, పాఠ్యాంశం గురించి చర్చ అవగాహన, ఇవిచేయండి మొదలగునవి)

**బోధనా వ్యూహాలు :**

గతంలో విద్యాబోధన ఉపాధ్యాయ కేంద్రితమై ఉండేది. ప్రస్తుత బోధన విద్యార్థి కేంద్రితంగా మారింది. అందువల్ల విద్యార్థుల భాగస్వామ్యం, స్వయం అధ్యయనానికి అవకాశం కలిగింది. దానికి అనుగుణంగా బోధన వ్యూహాలు ఉండాలి. అంటే బోధనాంశం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాల కోసం ఎటువంటి వ్యూహాన్ని అనుసరించాలో రాయాలి.

ఉదా : వ్యక్తిగత కృత్యం, జట్టు కృత్యం, పూర్తి తరగతి కృత్యం, వ్యక్తిగత పఠనం, అభిప్రాయాలు చెప్పటం, సంభాషించటం, చిత్రాల గురించి మాట్లాడటం మొదలగు కృత్యాలు / వ్యూహాలు రాయాలి.

భాషా బోధనలో కింది వ్యూహాలను అమలుపరుస్తారు. అవి

- మేథోమథనం
- భావనా చిత్రాల తయారి
- జట్టుపనులు
- వ్యక్తిగత, పూర్తి తరగతి కృత్యాలు
- చర్చలు నిర్వహించడం

- చదివి ప్రతిస్పందించడం / నివేదిక రాసి చదవడం
- KWL కృత్యం
- ఏకపాత్రాభినయం
- నృత్యాభినయం
- మూకాభినయం
- నాటకీకరణ మొదలగునవి.

ప్రతి పాఠంలో నాలుగు విభాగాలు ఉంటాయి. అవి 1) ఉన్ముఖీకరణ, కవిపరిచయం, ఉద్దేశం / నేపథ్యం, పాఠ్యభాగవివరాలు, 2) విద్యార్థులకు సూచనలు, ప్రవేశిక, 3) పాఠ్యాంశం, 4) 'ఇవిచేయండి' అభ్యాసాలు. వీటిని బోధించడానికి అనగా ఒక్కొక్క విభాగానికి పీరియళ్ళు కటాయించుకోవాలి.

ఆయా పీరియళ్ళలో కింది సోపానాల ప్రకారం బోధన జరగాలి. అవి

| క్ర.సంఖ్య | సోపానం | ఏఏ పీరియళ్ళకు సోపానం ఆవశ్యకత ఉంటుంది | వివరణ |
|---|---|---|---|
| 1 | పలకరింపు | ప్రతి పీరియడ్‌లో ఉంటుంది. | పిల్లలను పలకరించడం |
| 2 | ఉన్ముఖీకరణ చిత్రం గురించి మాట్లాడించడం | 1వ పీరియడ్‌లో మాత్రమే ఉంటుంది. | పాఠం చిత్రంలోని చిత్రం గురించి మాట్లాడించడం |
| 3 | పునశ్చరణ | 2 నుంచి 10 పీరియళ్ళలో ఉంటుంది. | ముందురోజు జరిగిన అంశం గురించి చర్చించడం |
| 4 | శీర్షికా ప్రకటన | 1వ పీరియడ్‌లో మాత్రమే ఉంటుంది. | పాఠం పేరు / శీర్షికను ప్రకటించి నల్లబల్లపై రాయడం |
| 5 | కవిపరిచయం | 1వ పీరియడ్‌లో మాత్రమే ఉంటుంది. | పాఠం రాసిన కవి గురించి పరిచయం చేయడం |
| 6 | నేపథ్యం / ఉద్దేశం | 1వ పీరియడ్‌లో మాత్రమే ఉంటుంది. | పాఠం ఉద్దేశం/నేపథ్యం గ్రహించేలా చేయడం |
| 7 | పాఠం చిత్రం గురించి మాట్లాడించడం | 2వ పీరియడ్‌లో మాత్రమే ఉంటుంది. | పాఠంలోని చిత్రాల గురించి చర్చ నిర్వహణ |
| 8 | గేయం/పద్యం/పాట ఉపాధ్యాయుడు పాడడం | 1 నుండి 5 పీరియళ్ళలో ఉంటుంది. | పద్యాలకు / గేయాలకు ప్రాధాన్యత, రాగంతో పాడడం, ఎలా పాడాలో తెల్పడం అభ్యాసం చేసి చూపడం |
| 9 | గేయం/పద్యం/పాట పిల్లలు పాడడం | 1 నుండి 5 పీరియళ్ళలో ఉంటుంది. | పద్యాలు/గేయాలు/పాటలను పిల్లలతో పాడించడం, అభినయం చేయించడం |
| 10 | పిల్లలచే బాహ్యపఠనం | 2 నుండి 5 పీరియళ్ళలో ఉంటుంది. | తరగతిలోని నలుగురైదుగురు పిల్లలతో ప్రకాశపఠనం చేయించాలి. దోషాలను గుర్తించాలి. |

| క్ర.సంఖ్య | సోపానం | ఏఏ పీరియళ్ళకు సోపానం ఆవశ్యకత ఉంటుంది | వివరణ |
|---|---|---|---|
| 11 | ఉపాధ్యాయుని ఆదర్శపఠనం | 2 నుండి 5 పీరియళ్ళలో ఉంటుంది. | స్పష్టోచ్చారణతో చదవాలి. పిల్లలను గమనించమనాలి. |
| 12 | పిల్లల మౌనపఠనం – అర్థ సంగ్రహణ | 2 నుండి 5 పీరియళ్ళలో ఉంటుంది. | పిల్లలు మౌనంగా చదవాలి. తెలియని పదాలనుగుర్తించి, గీతగీయాలి. చర్చలో పాల్గొనాలి. తెల్సుకోవాలి. |
| 13 | పాఠం చిత్రం గురించి చర్చ | 2వ పీరియడ్‌లో ఉంటుంది. | పాఠంలోని చిత్రాన్ని పరిశీలింపజేయాలి. చర్చ నిర్వహించి, భావాన్ని ఊహింపచేయాలి. |
| 14 | పాఠ్యాంశంపై చర్చ, అవగాహన | 3 నుండి 5 పీరియళ్ళు | ఆలోచింపజేసే ప్రశ్నల ద్వారా కీలక పదాలు / వాక్యాలు / సంఘటనలపై చర్చ |
| 15 | సామర్థ్యాల వారీగా అభ్యాసాల నిర్వహణ | 6 నుండి 10 పీరియళ్ళ వరకు ఉంటుంది. | వినడం, మాట్లాడడం, ధారాళంగా చదవడం ఒక పీరియడ్‌లో, స్వీయరచన ఒక పీరియడ్, పదజాలకృత్యాలు, ప్రాజెక్టు, ప్రశంస పనులు ఒక పీరియడ్, సృజనాత్మకతకు ఒక పీరియడ్, భాషను గురించి తెలుసుకోవడం, నేనివిచేయగలనా చివరి పీరియడ్‌లో నిర్వహించాలి. |
| 16 | సరిదిద్దడం (భావం / వాక్యం / పదాలు / అక్షర దోషాలు) | స్వీయరచన, సృజనాత్మకత, ప్రశంస నిర్వహించే పీరియళ్ళలో అలాగే పిల్లలు రాసిన అంశాలు ఏవైనా ప్రదర్శించినప్పుడు. ఉదా।। ప్రాజెక్టు పనులు నివేదికలు సమర్పించినప్పుడు. | భావం సరిగా ఉందా? వాక్య నిర్మాణం, పదజాలం, అక్షరదోషాలపై చర్చ నిర్వహించి సరిదిద్దాలి. |
| 17 | స్వీయ మూల్యాంకనం | 10వ పీరియడ్‌లో మాత్రమే ఉంటుంది. | చివరి పీరియడ్‌లో 'నేనివిచేయగలనా?'లోని అంశాలకు ఏమేమి చేయగలరో గుర్తింపచేయాలి. పునరభ్యాసం కల్పించాలి. |
| 18 | రాసిన అంశాలను ప్రదర్శించడం, సంకలనం చేయడం | 6 నుండి 10 పీరియళ్ళలో ఉంటుంది. | ప్రశంస, సృజనాత్మకత, ప్రాజెక్టు పనుల నివేదికలను సంకలనాలుగా తయారుచేసి భద్రపరచడం |
| 19 | పిల్లల అవగాహన – పరిశీలన | ప్రతి పీరియడ్‌లో ఉంటుంది. | ప్రతీ పీరియడ్‌లో ఆ రోజు బోధించిన, నిర్వహించిన అంశాల ఆధారంగా సామర్థ్యాల వారీగా పిల్లల అవగాహనను పరిశీలించాలి. |
| 20 | పునరభ్యాసం | చివరి పీరియడ్‌లో ఉంటుంది. అవసరమైతే అదనపు పీరియడ్‌లో ఉంటుంది. | స్వీయ మూల్యాంకనం ద్వారా పిల్లలు ఏఏ సామర్థ్యాలలో వెనుకబడ్డారో గుర్తించి, ఆయా సామర్థ్యాల కోసం అదనపు పీరియళ్ళలో పునరభ్యాసం కల్పించాలి. |

- **సామగ్రి :** బోధనాంశంపై పూర్తి అవగాహనను కల్పించడానికి, బలోపేతం చేయడానికి పాఠానికి సంబంధించి, అభ్యాసాలకు సంబంధించి ఎటువంటి అదనపు సామగ్రిని ఉపయోగిస్తామో రాయాలి.

(ఉదా : కవి చిత్రం, నిఘంటువు, ఇంటర్నెట్, పరామర్శ గ్రంథాలు, నమూనాలు మొదలగునవి)

- **మూల్యాంకనం :** బోధనాంశం ఆధారంగా పిల్లల్లో ఆయా సామర్థ్యాలపై పట్టు సాధించుటకై, వారు ఆలోచించి సొంతంగా రాసేటట్లుగా, ఉపాధ్యాయుల తయారీ మాట్లాడేటట్లుగా ఉండే ప్రశ్నలు ఇవ్వాలి. అభ్యాసాలలోని ప్రశ్నలు కూడా ఇవ్వవచ్చు.

## V. ఉపాధ్యాయుల తయారీ, అదనపు సమాచార సేకరణ :

పాఠ్య బోధనకు అవసరమైన అదనపు సమాచారం, విశేషాంశాల వివరాలు, కృత్యాల సేకరణ గురించి ఉపాధ్యాయులు పరామర్శ గ్రంథాలు, గ్రంథాలయ పుస్తకాలు చదివి అదనపు సమాచారం సేకరించి రాసుకోవాలి. ప్రధానంగా పాఠంలోని విషయం గురించి చర్చించడానికి అవసరమైన, ఆలోచింపచేసే ప్రశ్నలను పాఠం చదివి రాసుకోవాలి. పాఠంలోని విశేషాంశాల గురించి విద్యార్థి కల్పతరువు, పురాతన నామ కోశం వంటి గ్రంథాల ఆధారంగా వివరాలు రాసుకోవాలి. కవి / రచయిత భాషాశైలిని పిల్లలకు అవగాహన కల్పించడానికి తగినన్ని ఉదాహరణలు సేకరించాలి. వాటిని వివరించాలి. కవి / రచయితకు సంబంధించిన అదనపు వివరాలు, వారు చేసిన భాషా సేవ గురించి వివరాలు సేకరించాలి. పాఠంలోని ప్రాజెక్టుపనులు, ప్రశంస వంటి కృత్యాల నిర్వహణకు అవసరమైన మూల గ్రంథాలు, అదనపు వనరులను కూడా సేకరించవచ్చు. ఉపాధ్యాయుల తయారీ అనేది వారికి వృత్తిపట్ల ఉండే గౌరవాన్ని అభిమానాన్ని తెలియజేస్తుంది.

## VI. ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు :

పాఠం పూర్తయ్యాక తన అనుభవాలు, అనుభూతులు, ప్రతిస్పందనలు రాయాలి. పిల్లల అభ్యసనం గురించి రాయాలి. అంటే ఏ ఏ కృత్యాలు బాగా నిర్వహించారు? పిల్లల భాగస్వామ్యం, ప్రతస్పందనలు ఎలా ఉన్నాయి? పిల్లల ప్రగతి ఎలా ఉంది? ఏ ఏ అంశాలు సంతృప్తికలిగించాయి? ఏ ఏ అంశాలపై మరింత శ్రద్ధపెట్టాల్సిన అవసరం ఉంది? వంటి వివరాలను పాఠం పూర్తయ్యాక రాసుకోవాలి.

# మాదిరి పాఠ్య ప్రణాళిక - 1 (పదవ తరగతి)

**I. పాఠం పేరు** : వెన్నెల

**II. పాఠానికి అవసరమైన పీరియళ్ళ సంఖ్య** : 12

**III. పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు :**

**అ) అవగాహన - ప్రతిస్పందన :**

1) **వినడం - ఆలోచించి మాట్లాడడం :** ప్రకృతిలోని వివిధ సందర్భాలను నచ్చిన సందర్భం గురించి వర్ణించి చెప్పగలుగుతారు.

2) **చదవడం - అవగాహన చేసుకోవడం :**

- ఎఱ్ఱన, పోతన పద్యాలను చదివి అవగాహన చేసుకొని పోల్చగల్గుతారు.
- చుక్క గుర్తున్న పద్యాలను ధారాళంగా చదివి ప్రతి పదార్థం రాయగల్గుతారు.

**ఆ) వ్యక్తీకరణ సృజనాత్మకత**

**అ) స్వీయరచన :**

- ఇచ్చిన వాక్యాన్ని కవి ఏ సందర్భంలో పేర్కొన్నాడో వివరించగల్గుతారు.
- పాఠ్యభాగ సారాంశాన్ని సొంతమాటల్లో రాయగల్గుతారు.

**ఆ) సృజనాత్మక వ్యక్తీకరణ :**

- ఒక ప్రకృతి దృశ్యాన్ని గాని, సన్నివేశాన్ని గాని వర్ణిస్తూ రాయగల్గుతారు.

**ఇ) ప్రశంస :**

- ఎఱ్ఱన రచనాశైలిని ప్రశంసిస్తూ రాయగల్గుతారు.

**ఇ) భాషాంశాలు**

**అ) పదజాలం :**

- పర్యాయపదాలు, నానార్థాలు, ప్రకృతి, వికృతి పదాలను గ్రహించి వినియోగిస్తారు.
- వాక్యాలలో గీత గీసిన పదాలకు అర్థాలను గ్రహించి సొంతవాక్యాలలో ఉపయోగించగల్గుతారు.

**ఆ) వ్యాకరణాంశాలు :**

- సవర్ణదీర్ఘ సంధి, గుణ సంధి, ఉత్వ సంధి, పదాలను గుర్తించి సూత్రీకరణ చేయగల్గుతారు.
- ద్విగు, ద్వంద్వ సమాస పదాలను గుర్తించి విగ్రహ వాక్యాలు రాయగల్గుతారు.
- తేటగీతి, ఆటవెలది పద్య లక్షణాలను గుర్తించగల్గుతారు.
- పద్య పాదాలకు గణవిభజన చేయగల్గుతారు.

**IV. పీరియడ్ వారీగా విభజన - ప్రణాళిక** :

(పక్కపేజీలోని పట్టికలో పీరియడ్ వారీగా వివరాలు ఉన్నాయి.)

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 1వ పీరియడ్ | 1వ పేజీ<br>• చదవండి – ఆలోచించి చెప్పండి<br>• ఉద్దేశం / నేపథ్యం పాఠ్యభాగ వివరాలు | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు<br>• 1వ పేజీలోని చదవండి – ఆలోచించి చెప్పండి గురించి పూర్తి తరగతిలో మాట్లాడించడం<br>• శీర్షిక ప్రకటన<br>**II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• పాఠ్యభాగవివరాలు గురించి చర్చ<br>• ఉద్దేశం / నేపథ్యం పిల్లలచే చదివించాలి. | ప్రకృతి వర్ణనను తెలిపే చిత్రాలు | • వెన్నెల పాఠం యొక్క ఉద్దేశం ఏమిటి?<br>• ఈ పాఠం దుని నుండి స్వీకరించారు? ఎవరు రచించారు? |
| 2వ పీరియడ్ | 2వ పేజీ<br>• కవి పరిచయం<br>• విద్యార్థులకు సూచనలు<br>• ప్రవేశిక | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు<br>• పునశ్చరణ – ముందురోజు మూల్యాంకనం ఉన్నాయి.<br>• కవి పరిచయం : 2వ పేజీలోని కవి పరిచయాన్ని పిల్లలు చదవడం – చర్చ.<br>• అర్థసంగ్రహణ కృత్యాలు<br>• పేజీ 2లో ఉన్న విద్యార్థులకు సూచనలు పిల్లలచే చదివించాలి. అర్థాలు గ్రహించాలి.<br>• ప్రవేశిక చదవండం – చర్చ – విషయాన్ని ఊహించి చెప్పమనడం | ఎఱ్ఱన ఊహాచిత్రం | <u>చదవడం – అవగాహన చేసుకోవడం</u><br>ఎఱ్ఱన గురించి సొంత మాటల్లో రాయండి |
| 3వ పీరియడ్ | 3వ పేజీలోని 1, 2, 3 పద్యాలు I-వ భాగం | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు. పునశ్చరణ (ప్రకృతి వర్ణన గురించి, కవి గురించి పునశ్చరన చేయడం)<br>**II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• పిల్లల బాహ్యపఠనం | కొలనులో కమలాలు విచ్చుకుంటున్నటు వంటి సూర్యోదయ చిత్రం | <u>పదజాలం</u><br>పాఠం ద్వారా మీరు తెలుసుకున్న నూతన పదాలతో సొంతవాక్యాలు రాయండి. |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | • ఉపాధ్యాయుడి ఆదర్శ పఠనం ఇనునసమానతేజు... మమరె (పిల్లలచే చదివించిన పద్యాలను స్పష్టోచ్చారణతో రాగ భావ యుక్తంగా ఉపాధ్యాయుడు చదవడం) | | 1) సత్యమున<br>2) సురుచిర<br>3) పొదలి<br>4) అమరె |
| | | • పిల్లలచే మౌనపఠనం చేయించడం.<br>• అర్థ సంగ్రహణం (కీలక పదాలను అడుగుతూ పాఠాన్ని వివరించడం)<br>ఉదా।। భృంగతారకా, వనజాతలోచనము మొదలగు పదాలపై చర్చ.<br>• ఆలోచింపజేసే ప్రశ్నలద్వారా పూర్తి తరగతి కృత్యం, చర్చ.<br>ప్రశ్నలు :<br>1) సూర్యుడికి కమలాలకు ఉన్న అనుబంధాన్ని భార్యాభర్తల బంధంతో పోల్చాడు కదా! ఇదే విధంగా ప్రకృతిలోని వాటిలో ఇంకా వేటిని వేటితో పోల్చవచ్చు?<br>2) రెండో పద్యంలో కవి దేనిని దేనితో పోల్చాడు? ఎందుకు?<br>3) కవి ఆకాశాన్ని ఏమని వర్ణించాడు? రాత్రివేళ చుక్కలతో కూడిన ఆకాశాన్ని చూస్తే మీకెలా అన్పిస్తుంది? | | <u>చదవడం, అవగాహన</u><br>రెండవ ప్యాన్ని కంఠస్థం చేయండి, తప్పులు లేకుండా రాయండి.<br><br><u>స్వీయ రచన</u><br>"కాలుకగ్రుక్కినట్టి కరవటంబన జగదండఖండ మమరె" ఈ మాటలు కవి ఏ సందర్భంలో అన్నాడో వివరించండి. |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 4వ పీరియడ్ | 3వ పేజీ పాఠంలోని II-వ భాగంలోనని 5, 6 పద్యాలు | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు. పునశ్చరణ<br>**II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• పిల్లల బాహ్యపఠనం<br>• ఉపాధ్యాయుడి ఆదర్శ పఠనం (పిల్లలు చదివిన పద్యాలను ఉపాధ్యాయుడు చదవడం)<br>• పిల్లల మౌనపఠనం<br>• పాఠ్యాంశంపై చర్చ (ఆలోచింపజేసే ప్రశ్నల ద్వారా పూర్తి తరగతి కృత్యం)<br>ప్రశ్నలు :<br>1) "చంద్రోదయాన్ని" చూస్తున్నప్పుడు ఎలా అనిపిస్తుంది?<br>2) నిండు పున్నమినాడు చంద్రబింబాన్ని చూస్తే ఏమేమి ఉన్నట్లుగా అనుభూతి చెందుతాము?<br>3) పౌర్ణమినాటి కలువలను చూస్తుంటే కలిగే ఆనందం ఎలా ఉంటుంది?<br>4) "రజనీకర బింబం" అని కవి దేని గురించి అన్నాడు? | రాత్రి నల్లని ఆకాశంలో చుక్కలు, చంద్రుడు ఉన్నటువంటి చిత్రం | <u>స్వీయరచన</u><br>1) చంద్రుడు విజృంభించిన విధానాన్ని తెలుపండి.<br>2) 6వ పద్యం ద్వారా కవి భావనావిస్తృతి గురించి తెలియజేయండి.<br>3) కవి వెన్నెలను వర్ణించడానికి ఏ ఏ అంశాలను ఎన్నుకొన్నాడో వివరించండి. |
| 5వ పీరియడ్ | 5వ పేజీలోని పద్యాలు | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు. పునశ్చరణ (ముందు రోజు ఇచ్చిన ప్రశ్నల గురించి పునశ్చరణ) | | |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | **II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• పిల్లల బాహ్యపఠనం (వెన్నెల పాఠం పేజి.5 లోని పాఠాన్ని పిల్లలచే చదివించాలి)<br>• ఉపాధ్యాయుడి ఆదర్శ పఠనం (పిల్లలు చదివిన పాఠాన్నే ఉపాధ్యాయుడు చదవడం)<br>• పిల్లల మౌనపఠనం<br>• పాఠ్యాంశంపై చర్చ (ఆలోచింపజేసే ప్రశ్నల ద్వారా పూర్తి తరగతి కృత్యం)<br>ప్రశ్నలు :<br>1) వెన్నెలను చూసిన కలువలు ఎలా ప్రతిస్పందించాయి?<br>2) చంద్రుడు తన వెన్నెలతో ప్రపంచానికి ఆహ్లాదాన్ని ఎలా కలిగించాడు?<br>3) "పొదలి పొదలి చదలఁబొంగారి పొంగారి మంచి మంచి దిశలు ముంచి ముంచి" అనే పాదంలోని పదసౌందర్యం గురించి చెప్పండి.<br>4) మనోహర గంభీర ధీరంబైన సుధాకర కాంతి పూరంబు" దీని భావం ఏమిటి?<br>• ప్రాజెక్టు పని గురించి సూచనలు ఇవ్వడం. | కొలనులో కలువలతో నిండు పౌర్ణమి నాడు ఆకాశంలో వెలుగొందుతున్న చంద్రుని చిత్రం | <u>స్వీయరచన</u><br>1) పరిసరాలను కలువలు సంతోషభరితం చేసిన విధానాన్ని వర్ణించండి.<br>2) ప్రశంసమానుడైన చంద్రుడు ఏవిధంగా ఆవిర్భవించాడో వర్ణించండి.<br>3) పాఠం ఆధారంగా ఆకాశంలోని రంగులు ఏ ఏ సమయాల్లో ఎట్లా మార్పుచెందాయో తెల్పండి.<br>కిందతెల్పిన ప్రాజెక్టుపనిని 3 రోజుల్లోగా చేయాలి. 'నరసింహస్వామికథ' నేపథ్యంతో వచ్చిన గ్రంథాలు, వివరాలు సేకరించి, పట్టికలో రాయండి.<br>సూచన : ఇందుకోసం పాఠశాల గ్రంథాలయంలో సేకరించండి. |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 6వ పీరియడ్ | వినడం, మాట్లాడడం గురించి అభ్యాసం 'ఇవిచేయండి'లోని అవగాహన – ప్రతిస్పందనలోని 1, 2 ప్రశ్నలు | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు. పునశ్చరణ<br>(ముందురోజు ప్రశ్నల గురించి పునశ్చరణ)<br>**II. సామర్థ్యాల సాధన – అభ్యాసం**<br>• అవగాహన – ప్రతిస్పందనలోని కింది ప్రశ్నలను నల్లబల్లపై రాయడం.<br>• ప్రకృతి దృశ్యాలను వర్ణించండి.<br>• మీకు నచ్చిన సందర్భాన్ని వర్ణించండి.<br>• పూర్తి తరగతిలో ఒక్కొక్కరితో మాట్లాడించడం, చర్చించడం.<br>• విద్యార్థులు చెప్పిన సమాధానాలను క్రోఢీకరించడం.<br>• ప్రశంస అభ్యాసం గురించి సూచనలు ఇవ్వడం. | | <u>ప్రశంస</u><br>పాఠం ఆధారంగా ఎఱ్ఱన రచనాశైలిని ప్రశంసిస్తూ 10 వాక్యాలు రాయండి (ఇంటపని) (మూడు రోజుల్లోగా పూర్తిచేయాలి) |
| 7వ పీరియడ్ | ధారాళంగా చదవడం, అర్థం చేసుకోవడం సామర్థ్యం గురించి అభ్యాసం<br>అవగాహన ప్రతిస్పందన 3, 4 ప్రశ్నలు | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు. పునశ్చరణ<br>**II. సామర్థ్యాల సాధన – అభ్యాసం**<br>• ఎఱ్ఱన రాసిన పద్యం నల్లబల్లపై రాసి చదివించడం. ప్రశ్నల ఆధారంగా చర్చ నిర్వహించడం. | | <u>ధారాళంగా చదవడం, అర్థం చేసుకోవడం</u><br>పాఠంలోని 2, 5,, 7 పద్యాలు చూడకుండా తప్పులు లేకుండా రాయండి. |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | • పోతన రాసిన పద్యం నల్లబల్లపై రాసి చదివించడం.<br>• ప్రశ్నల ద్వారా చర్చ నిర్వహణ<br>• రెండు పద్యాలలో పోలికలు గల్గింపజేయడం.<br>• 2, 5, 7 పద్యాలను భావంతో చదవండి. పిల్లల బాహ్యాపఠనం, పిల్లల ప్రకాశ పఠనం. | | |
| 8వ పీరియడ్ | అవగాహన ప్రతిస్పందన 5వ ప్రశ్న ప్రతిపదార్థం రాయడం, నేర్పడం | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు. పునశ్చరణ<br>(2, 5, 7 పద్యాలు చదవండి.)<br>**II. సామర్థ్యాల సాధన - అభ్యాసం**<br>• రెండవ పద్యానికి రాసి ఉన్న ప్రతిపదార్థాన్ని అవగాహన చేసుకొని 7 సంఖ్యగల పద్యానికి ప్రతిపదార్థాన్ని రాయడం.<br>• రెండవ పద్యం చదవండి.<br>జట్టుపని :-<br>దీనిలోని పదాలు రాయండి. వాటి అర్థాలు రాయండి.<br>• 8వ పేజీలోని ప్రతిపదార్థంతో పోల్చి సరిచూసుకోండి. | నిఘంటువు | అవగాహన - ప్రతిస్పందన అభ్యాసంలోని 5వ పద్యానికి ప్రతిపదార్థం రాయడం |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
| --- | --- | --- | --- | --- |
| 9వ పీరియడ్ | <u>వ్యక్తీకరణ – సృజనాత్మకత</u><br>స్వీయరచన గురించి అభ్యాసం | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు. పునశ్చరణ<br>**II. సామర్థ్యాల సాధన – అభ్యాసం**<br>• స్వీయరచనలోని వ్యాసరూప సమాధాన ప్రశ్నను నల్లబల్లపై రాయడం.<br>• ఉదా: పద్య భావాలను ఆధారంగా చేసుకొని పాఠ్యభాగ సారాంశాన్ని రాయండి.<br>• పూర్తి తరగతిలో ఒక్కొక్క ప్రశ్నపై చర్చింపజేయడం (ఒక్కొక్కరు ఒక్కొక్క వాక్యం చెప్పాలి)<br>• పిల్లలు చెప్పిన వాటిని క్రోఢీకరణ చేయడం.<br>• వ్యక్తిగతంగా జవాబులు రాయించడం లేదా జట్లలో జవాబులు రాయించడం,<br>• రాసినది జవాబును సరిదిద్దడం.<br>• భావం, వాక్యాలు, పదాలు, అక్షరదోషాలు సరిదిద్దడం. | పిల్లలు జవాబురాసిన చార్టు | <u>స్వీయరచన</u><br>• పాఠ్యభాగ సారాంశాన్ని సొంతమాటల్లో రాయండి. |
| 10వ పీరియడ్ | <u>వ్యక్తీకరణ – సృజనాత్మకత</u><br>సృజనాత్మకత గురించి అభ్యాసం | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు. పునశ్చరణ (సారాంశం గురించి మాట్లాడించడం)<br>**II. సామర్థ్యాల సాధన – అభ్యాసం**<br>• 'సృజనాత్మకత' అభ్యాసంలోని ప్రశ్నలు నల్లబల్లపై రాయడం.<br>• సూచనలు ఇవ్వడం.<br>• జట్లలో రాయించడం.<br>• ప్రదర్శన – చర్చ<br>• సరిదిద్దడం | సూర్యాస్తమయం, సూర్యోదయం, ప్రకృతి దృశ్యాలను వర్ణించిన కవితలు / వ్యాసాలు | <u>సృజనాత్మకత</u><br>ప్రకృతినివ వర్ణిస్తూ కవిత రాయడం.<br>ఉదా॥ సూర్యోదయం, సూర్యాస్తమయం |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 11వ పీరియడ్ | ప్రాజెక్టుపని, ప్రశంస గురించి ప్రదర్శన, పదజాలం | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు. పునశ్చరణ<br>• ప్రాజెక్టువని, ప్రశంస నివేదికలను చదివించడం సరిదిద్దడం.<br>**II. సామర్థ్యాల సాధన - అభ్యాసం**<br>• పదజాల కృత్యాలను చదివించడం అర్థం చేయించడం.<br>• సొంతవాక్య ప్రయోగం చేయించడం, వ్యక్తిగతంగా రాయించడం.<br>• నానార్థాలను, పర్యాయపదాలను రాయించడం.<br>• సరిదిద్దడం. | నిఘంటువు | <u>పదజాలం</u><br>ప్రకృతి పదాలకు వికృతి పదాలను రాయండి.<br>1) సంధ్య -<br>2) దిశ -<br>3) ధర్మము -<br>4) నిశ -<br>• ప్రాజెక్టుపని నివేదిక రాయండి. |
| 12వ పీరియడ్ | వ్యాకరణాంశాలు | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు. పునశ్చరణ (వికృతి పదాలకు ప్రకృతి పదాలను చెప్పించుట)<br>**II. సామర్థ్యాల సాధన - అభ్యాసం**<br>• పూర్తి తరగతి కృత్యం - చదివించడం, అర్థం చేయించడం, సరిదిద్దడం<br>• ఉదాహరణలు చెప్పించడం<br>• చర్చ - అవగాహన - సూత్రీకరణ<br>• గురు - లఘువులను గుర్తింపజేసి పద్య లక్షణాలను అర్థం చేయించుట.<br>• వ్యక్తిగతంగా రాయించడం. | నిఘంటువు | <u>వ్యాకరణం</u><br>1) అత్యంత పదాన్ని విడదీసి సంధి సూత్రాన్ని రాయండి.<br>2) నలుదెసలు విగ్రహవాక్యం రాసి ఏ సమాసమో గుర్తించండి. |

**V. ఉపాధ్యాయుల తయారీ, అదనపు సమాచార సేకరణ (టీచింగ్ నోట్సు) :** పాఠానికి అవసరమైన అదనపు సమాచార సేకరణ చేసి రాయాలి. రిఫరెన్సు పుస్తకాలు, అంతర్జాలం ఆధారంగా సేకరించాలి.

**VI. ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు :** పాఠం పూర్తయిన తర్వాత ప్రతిస్పందనలు నమోదుచేయాలి.

# పదవ తరగతి - మాదిరి పాఠ్య ప్రణాళిక - 2

**I.** పాఠం పేరు : ధన్యుడు

**II.** పాఠానికి అవసరమైన పీరియళ్ళ సంఖ్య : 12

**III.** పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు :

**అ) అవగాహన - ప్రతిస్పందన :**

**1) వినడం - ఆలోచించి మాట్లాడడం :**

- చూడాకర్ణుని మాటల గురించి అభిప్రాయాలు చెప్పగలరు.
- ధనలోభం ఆపదలకు మూలమనే అంశం గురించి సమర్థిస్తూ లేదా వ్యతిరేకిస్తూ మాట్లాడగలగడం.

**2) చదవడం - అవగాహన చేసుకోవడం :**

- పాఠం చదివి చూడాకర్ణునికి, వీణాకర్ణునికి మధ్య జరిగిన సంభాషణలను రాయగల్గును.
- పాఠంలోని వాక్యాలను ఎవరు ఎవరితో అన్నారో చెప్పగలరు.
- అపరిచిత పద్యాన్ని చదివి భావాన్ని పూర్తిచేస్తారు.

**ఆ) వ్యక్తీకరణ సృజనాత్మకత**

**1) స్వీయరచన :**

- పాఠంలోని పదాల గురించి సొంతమాటల్లో వివరించిరాయగలరు.
- మంధరుని మాటలను గురించి అభిప్రాయాలు రాస్తారు.
- వివేక హీనుడైన ప్రభువును సేవించడంలోని ఔచిత్యం గురించి రాయగలరు.

**2) సృజనాత్మక వ్యక్తీకరణ :** 1) ఈ కథను నాటికగా రాయగలుగుతారు.

**3) ప్రశంస :** 2) రచయిత రచనా విధానాన్ని ప్రశంసించగలుగుతారు

**ఇ) భాషాంశాలు**

**అ) పదజాలం :** అర్థాలు, పర్యాయపదాలు, ప్రకృతి వికృతి వ్యుత్పత్తి అర్థాలు మొ॥ పదాలను గ్రహించి వినియోగిస్తారు. వాక్యాలకు అర్థాన్ని సొంతపదాల్లో రాయగలుగుతారు.

**ఆ) వ్యాకరణాంశాలు :**

- సరళాదేశ, గసడదవాదేశ సంధి పదాలు గుర్తించి సంధిసూత్రాలు రాయగలరు.
- కర్మధారయ సమాసపదాలు, ఒతర పదాలకు విగ్రహవాక్యాలు రాసి, సమాసాలను తెల్పుతారు.
- 'పుంప్వాదేశసంధి' గురించి అవగాహన చేసుకొని, ఉదాహరణలు ఇస్తారు.
- వచనంలోని శైలి భేదాన్ని గుర్తిస్తారు.

## IV. పీరియళ్ళ వారీగా విభజన - ప్రణాళిక :

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 1వ పీరియడ్ | 22, 23 పేజీలలోని<br>• చదవండి - ఆలోచించి చెప్పండి<br>• ఉద్దేశం /నేపథ్యం<br>• పాఠ్యభాగ వివరాలు | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు<br>• 13వ పేజీలోని చదవండి - ఆలోచించి చెప్పండిలోని పద్యం చదవడం, ప్రశ్నల ఆధారంగా చర్చ నిర్వహించడం.<br>• శీర్షిక ప్రకటన (నల్లబల్లపై రాయాలి)<br>**II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• ఉద్దేశం / నేపథ్యం పిల్లలచే చదివించడం, చర్చ.<br>• పాఠ్యభాగ వివరాలు పిల్లలచే చదివించడం, చర్చ. | | <u>స్వీయరచన</u><br>• ధన్యుడు పాఠాన్ని ఎందుకు చదవాలి?<br>• ఈ పాఠ్యభాగం వివరాలు రాయండి. |
| 2వ పీరియడ్ | • కవి పరిచయం<br>• విద్యార్థులకు సూచనలు<br>• ప్రవేశిక | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు, పునశ్చరణ : (చిత్రం ఆధారంగా రాసిన పదాలు పేరా గురించి పునశ్చరణ చేయడం)<br>**II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• కవి పరిచయం : (14వ పేజీలోని కవి పరిచయం పిల్లలు చదవడం)<br>• ప్రవేశిక చదవండి - పాఠంలోని విషయం గురించి ఊహించి చెప్పండి.<br>• 14వ పేజీలో ఉన్న విద్యార్థులకు సూచనలు పిల్లలచే చదివించడం.<br>• అర్థసంగ్రహణం - పిల్లల బాహ్యపఠనం, ఉపాధ్యాయుడి ఆదర్శపఠనం, పిల్లల మౌనపఠనం. | పరవస్తు చిన్నయసూరి చిత్రపటం<br><br>నిఘంటువు | <u>చదవడం - అవగాహన చేసుకోవడం</u><br>• చిన్నయసూరి రాసిన రచనల గురించి సొంత మాటల్లో రాయండి.<br><u>పదజాలం :</u><br>• కింది పదాలకు అర్థాలు రాసి, సొంతవాక్యాలలో రాయండి.<br>- మనస్తాపం,<br>- వంచన. |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 3వ పీరియడ్ | హిరణ్యకుని పూర్వ వృత్తాంతం I-వ భాగం | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు. పునశ్చరణ (కవి యొక్క వివరాల గురించి పునశ్చరణ చేయడం)<br>**II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• పిల్లల బాహ్యపఠనం (15, 16 పేజిలలోని పాఠ్యాంశాన్ని పద్యాలను పిల్లలచే చదివించడం)<br>• ఉపాధ్యాయుని బాహ్యపఠనం (పిల్లలు చదివిన పాఠ్యాంశాన్నే ఉపాధ్యాయుడు స్పష్టోచ్చారణతో, భావస్ఫోరకంగా చదవడం)<br>• పిల్లలచే మౌనపఠనం చేయించడం.<br>• అర్థసంగ్రహణం. (కీలకపదాలు అడుగుతూ, వాక్య ప్రయోగం ద్వారా పాఠాన్ని వివరించడం.<br>ఉదా: పెక్కండ్రు, భక్షించుట, ఉపార్జితము, సర్వశ్రేయములు మొ॥లగు పదాలపై చర్చ.<br>• ఆలోచింపజేసే ప్రశ్నల ద్వారా పూర్తి తరగతి కృత్యం చర్చ.<br>ప్రశ్నలు :<br>1) ఎక్కడి ఎలుక, ఎక్కడి చిలుక కొయ్య? అనడంలో అంతరార్థం ఏమై ఉంటుంది?<br>2) 'ధనము సర్వశ్రేయములకు నిదానము' మీ అభిప్రాయం చెప్పండి.<br>3) 'దారిద్ర్యము సర్వశూన్యము' అనే మాటను బట్టి మీకేమర్థమయింది? | | <u>పదజాలం</u><br>పాఠం ద్వారా మీరు తెలుసుకున్న నూతన పదాలతో సొంతవాక్యాలు రాయండి.<br>ఉదా :<br>1) సద్దుచేయక<br>2) గిలుకకఱ్ఱ<br>3) వెఱపించుచు<br>4) నిమిత్తము<br><u>స్వీయరచన</u><br>• "సంసార విషవృక్షమునకు రెండు ఫలములు అమృతతుల్యములు" పాఠం ఆధారంగా దీని గురించి వివరించండి.<br>• మనస్తాపం, వంచన... ఈ పదాల గురించి మీకేమి అర్థమైంది? సొంతమాటల్లో రాయండి. |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 4వ పీరియడ్ | పాఠంలోని II-వ భాగం పేజీ 16, 17లలోని విషయం | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు. పునశ్చరణ (పదజాలంపై పునశ్చరణ)<br>**II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• పిల్లల బాహ్యపఠనం (16, 17 పేజీలలోని పాఠాన్ని పిల్లలచే చదివించడం)<br>• ఉపాధ్యాయుడి ఆదర్శ పఠనం (పిల్లలు చదివిన పాఠాన్ని ఉపాధ్యాయుడు చదవడం)<br>• పిల్లల మౌనపఠనం<br>• పాఠ్యాంశంపై చర్చ (ఆలోచింపజేసే ప్రశ్నల ద్వారా పూర్తి తరగతి కృత్యం)<br>ప్రశ్నలు :<br>1) ఆశదిగనాడినవాడే సత్పురుషుడు ఎట్లు?<br>2) ధనహీనుడై నలుగురిలో నుండరాదు ఎందుకు?<br>3) 'మనసుగట్టి పరచుకోవటం' అంటే ఏమిటి?<br>4) 'చచ్చిన తరివెంటరాబోదు' అనడంలో మీకేమర్థమైంది?<br>• ప్రాజెక్టు పనిని గురించి సూచనలు ఇవ్వడం. | ఎలుక, కాకి, తాబేలు మొదలగువాటి బొమ్మలు | <u>స్వీయరచన</u><br>• "వివేకహీనుడైన ప్రభువులను సేవించుట కంటె వనవాస ముత్తమమం" దీని ఔచిత్యాన్ని గురించి తెల్పండి.<br><u>ప్రాజెక్టుపని</u><br>• పాఠశాల గ్రంథాలయంలో పంచతంత్ర కథల పుస్తకంలోని కథలను చదవండి. నచ్చిన కథను సొంతమాటల్లో రాయండి. ప్రదర్శించండి. |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 5వ పీరియడ్ | వినడం, మాట్లాడడం సామర్థ్యాలపై అభ్యాసనం 'ఇవిచేయండి'లోని అవగాహన – ప్రతిస్పందనలోని 1, 2, 3 ప్రశ్నలు | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు. పునశ్చరణ (నిన్నటి ప్రశ్నలను పునశ్చరణ)<br>**II. సామర్థ్యాల సాధన – అభ్యాసం**<br>• 1, 2, 3 ప్రశ్నలను నల్లబల్లపై రాయడం. (పేజీ 17 లోనివి)<br>• పూర్తి తరగతిలో ఒక్కొక్కరితో మాట్లాడించడం, చర్చించడం.<br>• క్రోఢీకరించడం.<br>• ప్రశంస అభ్యాసం గురించి సూచనలు ఇవ్వడం. | | <u>ప్రశంస</u><br>ఈ పాఠంలోని కథను ఓ చిన్న నాటికగా మలచండి.<br>(ఇంటపని)<br>మూడు రోజుల్లోగా రాయాలి. |
| 6వ పీరియడ్ | చదవడం, అవగాహన చేసుకోవడం, సామర్థ్యం గురించి అభ్యాసం.<br>అవగాహన ప్రతిస్పందన 4, 5, 6 ప్రశ్నలు | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు. పునశ్చరణ<br>**II. సామర్థ్యాల సాధన – అభ్యాసం**<br>• అపరిచిత పద్యం.<br>• నల్లబల్లపై రాయాలి.<br>• చదివించాలి, చర్చించాలి.<br>• వ్యక్తిగతంగా నోటు బుక్కులో భావాన్ని పూరించి రాయమనాలి. చెప్పించాలి.<br>• సరిదిద్దాలి.<br>• పద్యాన్ని చదివి భావాన్ని పూరించడం.<br>• 4వ ప్రశ్న – ప్రశ్నలు నల్లబల్లపై రాసి – చర్చ. | పద్యం రాసిన చార్టు | <u>అవగాహన – ప్రతిస్పందన</u><br>• 4వ ప్రశ్నకు జవాబులు రాయండి.<br>• 5వ ప్రశ్న పద్యం రాసి భావాన్ని పూరించండి. |
| 7వ పీరియడ్ | <u>వ్యక్తికకరణ సృజనాత్మకత</u><br>• స్వీయరచన సామర్థ్యం గురించి అభ్యాసం | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు. పునశ్చరణ (చూడాకర్ణుడు, వీణాకర్ణునికి మధ్య జరిగిన సంభాషణపై పునశ్చరణ) | పిల్లలు జవాబు రాసినచార్టు | |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | **II. సామర్థ్యాల సాధన - అభ్యాసం**<br>• 'వ్యక్తీకరణ - సృజనాత్మకత' అభ్యాసంలోని 2వ ప్రశ్నను నల్లబల్లపై రాయడం.<br>• పూర్తి తరగతిలో ఒక్కొక్క ప్రశ్నపై చర్చింపజేయడం (ఒక్కొక్కరు ఒక్కొక్క వాక్యం)<br>• పిల్లలు చెప్పిన వాటిని క్రోడీకరణ చేయడం.<br>• వ్యక్తిగతంగా జవాబులు రాయించడం లేదా జట్లలో జవాబులు రాయించడం, రాసినది చదివించడం.<br>• అక్షరదోషాలు, పదాలు, వాక్యాలు, భావం సరిదిద్దడం. | | <u>స్వీయరచన</u><br>మంధరుడి మాటలను విశ్లేషించండి. దీన్ని సమర్థిస్తారా? ఎందుకు? |
| 8వ పీరియడ్ | <u>వ్యక్తీకరణ</u><br><u>సృజనాత్మకత</u><br>ప్రాజెక్టుపని<br>ప్రశంసపనులు<br>ప్రదర్శన | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు. పునశ్చరణ<br>(ముందురోజు మూల్యాంకనంగా ఇచ్చిన ప్రశ్న గురించి పునశ్చరణ<br>**II. సామర్థ్యాల సాధన - అభ్యాసం**<br>• 4, 6 'వ్యక్తీకరణ-సృజనాత్మకత' అభ్యాసంలోని ప్రశ్నలు నల్లబల్లపై రాయండి.<br>• సూచనలు ఇవ్వడం.<br>• జట్లలో రాయించడం.<br>• ప్రదర్శన - చర్చ<br>• సరిదిద్దడం | కథలు, నాటికలు, లేఖలు, చిత్రాలు | <u>సృజనాత్మకత</u><br>• కథను నాటికగా రాయండి. |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం / సామర్థ్యం మొదటి 45 ని॥లు | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | పిల్లలకు రెండవ 45 ని॥లలో కల్పించే అభ్యాసం/మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 9వ పీరియడ్ | ప్రాజెక్టుపనుల ప్రదర్శన | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు. పునశ్చరణ<br>**II. సామర్థ్యాల సాధన – అభ్యాసం**<br>• ప్రాజెక్టుపని నివేదికను చదివించాలి – చర్చ – సరిదిద్దడం, క్రోఢీకరణ.<br>• ప్రశంస జవాబును ప్రదర్శించడం – చర్చ – అవగాహన. | నిఘంటువు | <u>పదజాలం</u><br>• ప్రాజెక్టు పని నివేదిక రాయండి.<br>• రచయితను ప్రశంసిస్తూ రాయండి. |
| 10వ పీరియడ్ | భాషాంశాలు, పదజాలం | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు. పునశ్చరణ (నిన్నటి ప్రశ్నలు)<br>**II. సామర్థ్యాల సాధన – అభ్యాసం**<br>• పదజాల కృత్యాలను చదివించడం అర్థం చేయించడం.<br>• వాక్యాలను వ్యుత్పత్త్యర్థాలను, ప్రకృతి–వికృతులను అర్థాలను వ్యక్తిగతంగా రాయించడం.<br>• సరిదిద్దడం. | నిఘంటువు | <u>పదజాలం</u><br>1) దేహాన్ని ధరించిన వాడు.<br>2) ఐశ్వర్యం ఉన్నవాడు పై వానికి వ్యుత్పత్త్యర్థాలను రాయండి. |
| 11వ పీరియడ్ | భాషాంశాలు, వ్యాకరణాంశాలు | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు. పునశ్చరణ<br>**II. సామర్థ్యాల సాధన – అభ్యాసం**<br>• సంధి పదాలను గుర్తింపజేయుట.<br>• ఉదాహరణల ద్వారా వివరించుట. | నిఘంటువు | <u>వ్యాకరణం</u><br>కింది పదాలను విడదీసి సూత్రాన్ని సరిచూడండి.<br>1) ముత్యపుచిప్ప<br>2) కొంచెపునరుడు |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం / సామర్థ్యం మొదటి 45 ని॥లు | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | పిల్లలకు రెండవ 45 ని॥లలో కల్పించే అభ్యాసం/మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | • చర్చ - అవగాహన - సూత్రీకరణ.<br>ఉదా॥ పుంప్వాదేశ సంధి.<br>• సంధి సూత్రాన్ని వివరించుట.<br>• అభ్యాసం వ్యక్తిగతంగా రాయించడం | | • పాఠంలో సంధి పదాలు గుర్తించండి, వాటి విగ్రహవాక్యాలు రాసి సమ ఆసం పేరు రాయండి. |
| 12వ పీరియడ్ | వ్యాకరణాంశాలు | I. **ఉపోద్ఘాతం**<br>• పలకరింపు. పునశ్చరణ<br>II. **సామర్థ్యాల సాధన - అభ్యాసం**<br>• పాఠంలోని ఒక పేరా రాయాలి. చదవాలి.<br>• పూర్తి తరగతి కృత్యం<br>• చర్చ - అవగాహన - సరిదిద్దడం.<br>• 20వ పేజీలోని '4'వ అభ్యాసంలోని వాక్యాలను నల్లబల్లపై రాయుట<br>• ఉదాహరణల ద్వారా, చర్చద్వారా వాక్యాలను గుర్తింపజేయుట.<br>• అభ్యాసం వ్యక్తిగతంగా రాయించటం | | <u>వ్యాకరణాంశాలు</u><br>1) ఎలుక ప్రతిదినము చిలుకకొయ్య మీదికెగిరి పాత్రము నందున్న యన్నము భక్షించి పోవుచున్నది.<br>పై వాక్యాన్ని ఆధునిక వ్యవహారశైలిలోకి, స్థానిక మాండలిక శైలిలోకి మార్చండి. |

**V. ఉపాధ్యాయుల తయారీ, అదనపు సమాచార సేకరణ**

**VI. ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు**

# తెలుగు - ద్వితీయ భాష - 10వ తరగతి - వార్షిక ప్రణాళిక

**I. తరగతి** : 10వ

**II. విషయం** : తెలుగు (ద్వితీయ భాష)

**III. అవసరమైన పీరియళ్ళ సంఖ్య** : అ) మొత్తం పీరియళ్ళు : 220

ఆ) బోధనకు అవసరమైన పీరియళ్ళు : 105

**IV. విద్యా సంవత్సరం పూర్తయే సరికి సాధించాల్సిన సామర్థ్యాలు :**

అ) **అవగాహన – ప్రతిస్పందన :** దీంట్లో రెండు సామర్థ్యాలు ఉంటాయి. అవి వినడం అర్థం చేసుకొని ప్రతిస్పందించడం, ఆలోచించి మాట్లాడడం, ధారాళంగా చదవడం అర్థం చేసుకొని వ్యక్తీకరించడం. వీటిలో పిల్లలు కింది అంశాలను చేయగలగాలి.

- వినడం – మాట్లాడడం, ధారాళంగా చదివి, అర్థం చేసుకొని, వ్యక్తీకరించడం
- విన్న, చదివిన అంశాలు అర్థం చేసుకోవాలి. తమ అభిప్రాయాలు వ్యక్తపరచగలగాలి.
- సమర్థిస్తూ లేదా విభేదిస్తూ మాట్లాడగలగాలి, కారణాలు వివరించగలగాలి.
- పద్య భావాలు, పాఠ్యభాగ సారాంశాలు, కథలు, కథానికలను సొంతమాటల్లో చెప్పగలగాలి.
- ఎవరు ఎవరితో అన్నారు? ఏ సందర్భంలో అన్నారు? వంటివి పాఠంలో గుర్తించగలగాలి.
- పాత్రల స్వభావాన్ని పట్టిక రూపంలో తయారుచేయగలగాలి.
- భావాలకు తగిన పద్య పాదాలను, గేయపాదాలను గుర్తించగలగాలి.
- చదివిన అంశంలోని కీలకాంశాలు, కీలక పదాలు రాయగలగాలి.
- అపరిచిత గద్యం లేదా పద్యాలు చదివి ప్రశ్నలకు జవాబులు రాయాలి. ప్రశ్నలు కూడా తయారుచేయగలగాలి.
- పాఠంలో చుక్క గుర్తున్న పద్యాలను చదివి, అర్థం చేసుకొని భావాలు రాయగలగాలి.

ఆ) **వ్యక్తీకరణ సృజనాత్మకత :** దీంట్లో స్వీయరచన, సృజనాత్మకత, ప్రశంస అనే సామర్థ్యాలు ఉంటాయి. వీటిలో పిల్లలు కిందివి చేయగలగాలి.

- స్వీయరచన
- సృజనాత్మకత
- ప్రశంస

పిల్లలు ఈ కిందివి చేయగలగాలి.

**స్వీయరచన :**

- కారణాలు రాయగలగాలి. వివరిస్తూ రాయగలగాలి.
- అభిప్రాయాలు రాయగలగాలి. నచ్చినవి, నచ్చనివి రాయగలగాలి.
- రచయిత అభిప్రాయాన్ని గ్రహించి వివరించగలగాలి.
- సమర్థిస్తూ లేదా విభేదిస్తూ రాయగలగాలి.

**సృజనాత్మకత, ప్రశంస :**

- అభినందిస్తూ రాయటం, కరపత్రాలు తయారుచేయడం, లేఖలు రాయడం, సంభాషణలు రాయడం వంటివి చేయగలగాలి.

**ఇ) భాషాంశాలు**

- పదజాలం
- వ్యాకరణాంశాలు

వీటిలో పిల్లలు కిందివి చేయగలగాలి.

**పదజాలం :**

- పదాలకు అర్థాలు, నానార్థాలు, వ్యుత్పత్తులు, పర్యాయపదాలు రాయగలగాలి.
- ఇచ్చిన పదాలతో సొంతవాక్యాలు రాయగలగాలి.
- ప్రకృతికి వికృతులను, వికృతికి ప్రకృతి పదాలు రాయగలగాలి.
- దైనందిన జీవితంలో సందర్భోచితంగా సరైన పదాలను వినియోగించగలగాలి.

**వ్యాకరణాంశాలు :**

- భాషాభాగాలు, కర్తరి కర్మణి వాక్యాలు, వాక్యభేదాలను గుర్తించగలగాలి.
- త్రికసంధి, యణాదేశ సంధులను గుర్తించగలగాలి.
- అవ్యయీభావం, విశేషణ పూర్వపద కర్మధారయ సమాసాలను గుర్తించగలగాలి.
- అతిశయోక్తి అలంకారం గుర్తించగలగాలి.
- గురు లఘువులను గుర్తించగలిగి, ఉత్పలమాల లక్షణాల్ని తెలపగలగాలి.

**ఈ) ప్రాజెక్టుపనులు**

- ఇవి వివిధ సామర్థ్యాల సమాహారం.
- వివిధ సామర్థ్యాలను సందర్భోచితంగా వినియోగించే శక్తిని పిల్లలకు కలిగిస్తాయి.
- కథలు, కవితలు, రచయితల వివరాలు, సమాజసేవలో పాల్గొన్న వారి వివరాలు మొదలైనవి సేకరించి నివేదికలు రాసి ప్రదర్శించాలి.

## V. మాసాల వారీగా పాఠాల విభజన - ప్రణాళిక

| నెల | బోధించాల్సిన పాఠం | పీరియడ్ల సంఖ్య | బోధనా వనరులు మరియు సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు, సి.సి.ఇ. |
|---|---|---|---|---|
| జూన్ | 1.భాగవత రత్నాలు | 10 | • పోతన గారి 'ఆంధ్ర మహా భాగవతం'.<br>• భాషామాధుర్యాన్ని వ్యక్తీకరించే పుస్తకాలు.<br>• చిత్రాలు. | • 'చదువు', 'సత్యం' గొప్పదనాన్ని తెలిపే పద్యాల సంకలనం, ప్రదర్శన.<br>• పద్యతోరణం.<br>• పద్య పఠన పోటీ. |
| జూలై | 2. మొద్దబ్బాయిలూ మహామేధావులే<br><br>* యం.యస్.సుబ్బలక్ష్మి (ఉపవాచకం) | 10<br><br>1 | • డా॥తిరుమల రామచంద్ర గారి "హంపి నుండి హరప్పాదాకా" గ్రంథం.<br>• గొప్ప వ్యక్తుల 'ఆత్మ కథలు" పుస్తకాలు. | • వ్యాసరచన పోటీ.<br>• నిర్మాణాత్మక మూల్యాంకనం నిర్వహణ, నమోదు. |
| ఆగస్టు | 3. నవోదయం<br><br>* భక్తరామదాసు (ఉపవాచకం) | 10<br><br>1 | • పల్లా దుర్గయ్యగారి 'పాలవెల్లి' పుస్తకం.<br>• వచన కవిత్వాల పుస్తకాలు.<br>• చైతన్యాన్ని కలిగించే (వచన) కవిత్వాలు ఇతర రచనలు.<br>• చిత్రాలు. | • బాలగేయాల సేకరణ, సంకలనం, ప్రదర్శన.<br>• స్వాతంత్ర్యదినోత్సవ సందర్భంగా 'చైతన్య గేయాల' పోటీ.<br>• కవితల పోటీ.<br>• రెండవ నిర్మాణాత్మక మూల్యాంకనం నిర్వహణ, నమోదు. |

| నెల | బోధించాల్సిన పాఠం | పీరియడ్ల సంఖ్య | బోధనా వనరులు మరియు సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు, సి.సి.ఇ. |
|---|---|---|---|---|
| సెప్టెంబర్ | 4. సంజయ రాయబారం | 10 | • ఉషశ్రీ తెలుగులో రాసిన 'భారతం'.<br>• ప్రముఖ ఇతిహాస గ్రంథాలు.<br>• చిత్రాలు. | • 'సంజయరాయబారం' పాఠాన్ని నాటకీకరణ.<br>• బాల సభ నిర్వహణ. |
| అక్టోబరు | 5. కల్యాణం | 10 | • తరిగొండ వెంగమాంబ రాసిన 'రమాపరిణయం' గ్రంథం.<br>• ద్విపద ప్రక్రియలో ఉన్న కొన్ని కావ్యాలు.<br>• వివిధ రకాల పెళ్ళి కార్డులలోని చిత్రాలు.<br>• వేంకటేశ్వర మహాత్యం తెలిపే ఇతర గ్రంథాలు. | • పెళ్ళి జరిగే విధానాన్ని రాసి, ప్రదర్శించడం.<br>• గాంధీ జయంతి సందర్భంగా 'వివాహ సంస్కృతి – ప్రశంస' వ్యాసరచన పోటీ.<br>• 'పెళ్ళి పత్రిక తయారీ' చిత్రలేఖన పోటీ.<br>• మొదటి సంగ్రహణాత్మక మూల్యాంకనం నిర్వహణ. |
| నవంబర్ | 6. పిసినారి | 10 | • కాళ్ళకూరి నారాయణరావు గారి 'వర విక్రయం' నాటకం<br>• కొన్ని నాటక పుస్తకాలు.<br>• సాంఘిక దురాచారాల్ని తెలిపే గ్రంథాలు.<br>• చిత్రాలు. | • 'వరకట్న దురాచార నిర్మూలన' కరపత్రాల తయారీ, ప్రదర్శన.<br>• బాలల దినోత్సవ సందర్భంగా సృజనాత్మక పోటీల నిర్వహణ.<br>• 'వరవిక్రయ' నాటక ప్రదర్శన. |
| | 7. పిసినారి | 10 | • 'ఇస్మాయిల్ కథలు' పుస్తకం<br>• వచన కవితల పుస్తకాలు<br>• చిత్రాలు. | • 3వ నిర్మాణాత్మక మూల్యాకనం నిర్వహణ, నమోదు. |

| నెల | బోధించాల్సిన పాఠం | పీరియడ్ల సంఖ్య | బోధనా వనరులు మరియు సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు, సి.సి.ఇ. |
|---|---|---|---|---|
| డిసెంబర్ | 8. జానపద నృత్య సంగీతాలు<br><br>* షహనాయ్ షహెన్‌షా (ఉపవాచకం) | 10<br><br>1 | • యువభారతివారు ప్రచురించిన 'జ్ఞానపదులు – జానపదులు' పుస్తకం.<br>• జానపద నృత్య సంగీతాలను తెలిపే వివిధ పుస్తకాలు.<br>• చిత్రాలు. | • మీ ప్రాంతంలోని పేరుపొందిన ఒక 'జానపదకళ' గురించి వివరాలు / పాటల సేకరణ నివేదిక.<br>• జానపదకళల ఔన్నత్యంపై వ్యాసరచన పోటీ. |
| జనవరి | 9. శతక మాధురి | 10 | • ముఖ్యమైన కొన్ని శతక పుస్తకాలు.<br>• చిత్రాలు. | • పాఠశాల గ్రంథాలయం నుండి వివిధ రకాల నీతి పద్యాల సేకరణ, సంకలన తయారీ, ప్రదర్శన.<br>• మనం అలవరచుకోవలసిన మంచి గుణాల కరపత్ర తయారీ, నోటీసుబోర్డులో ప్రదర్శన.<br>• 2వ సంగ్రహణాత్మక మూల్యాంకనం నిర్వహణ, నమోదు. |
| ఫిబ్రవరి | 10. మాట్లాడే నాగలి<br><br>* గౌతమబుద్ధుడు (ఉపవాచకం) | 10<br><br>1 | • కొన్ని అనువాద కథలు కలిగిన పుస్తకాలు.<br>• జీవకారుణ్యాన్ని తెలిపే వివిధ పుస్తకాలు.<br>• చిత్రాలు. | • పెంపుడు జంతువుల బాధల సంభాషణ ప్రదర్శన.<br>• 'జంతువులు మాట్లాడితే?' ... ఊహాత్మక కథల పోటీ.<br>• పాఠశాల మాగజైన్ తయారీ.<br>• 4వ నిర్మాణాత్మక మూల్యాంకనం నిర్వహణ, నమోదు. |

| నెల | బోధించాల్సిన పాఠం | పీరియడ్ల సంఖ్య | బోధనా వనరులు మరియు సామగ్రి | నిర్వహించాల్సిన కార్యక్రమాలు, సి.సి.ఇ. |
|---|---|---|---|---|
| మార్చి | పునశ్చరణ | | • పరీక్షలకు తయారీ. | • వార్షికోత్సవం నిర్వహణ.<br>• పాఠశాల మ్యాగజైన్ తయారీ. |
| మొత్తం | | 105 | • నిఘంటువులు, పురాతన నామకోశం.<br>• విద్యార్థి కల్పతరువు.<br>• కవులు, రచయితలకు సంబంధించిన దృశ్య శ్రవణ సామాగ్రి.<br>• అంతర్జాలం. | |

## VI) ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు :

మాసవారీగా పూర్తి చేసిన పాఠాలు, నిర్వహించిన కార్యక్రమాల ఆధారంగా ఉపాధ్యాయులు తమ ప్రతిస్పందనలను రాయాలి.

## VII) ప్రధానోపాధ్యాయుని సలహాలు, సూచనలు :

మాసవారీగా ప్రధానోపాధ్యాయుడు నిర్వహించే సమీక్షా సమావేశంలో చర్చించిన అంశాలు, ఇచ్చిన సూచనలను నమోదు చేసుకోవాలి.

# మాదిరి పాఠ్య ప్రణాళిక - 1 - తెలుగు (ద్వితీయ భాష)

**I. పాఠం పేరు** : భాగవత రత్నాలు (పద్యం)

**II. పాఠానికి అవసరమైన పీరియళ్ళ సంఖ్య** : 10

**III. పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు :**

**అ) అవగాహన - ప్రతిస్పందన :**

**1) వినడం - ఆలోచించి మాట్లాడడం :** శాశ్వత కీర్తిమంతుల గురించి చెప్పగలుగుతారు. పాఠంలోని పద్యాల భావాలను సొంతమాట్లో చెప్పగలుగుతారు.

**2) చదవడం - అవగాహన చేసుకోవడం :**

- అపరిచిత గద్యం చదివి అవగాహన చేసుకొని, దీని ఆధారంగా ఇచ్చిన వాక్యాల్లో సరైన వాటిని గుర్తించగలుగుతారు.
- పాఠంలోని చదువు గురించి చెప్పిన విషయాలను, పరహితం యొక్క గొప్పదనం గురించి, ధనవంతులను కూడా దరిద్రులుగా భావించడం గురించి రాయగలుగుతారు.

**ఆ) వ్యక్తీకరణ సృజనాత్మకత**

**అ) స్వీయరచన :**

- పద్యం చదివి సొంత అభిప్రాయాన్ని వ్యక్తీకరించగలుగుతారు.
- పరహితునికి ఎందుకు ఎదురు లేదో తెలియజేయగలుగుతారు.
- 'అతిథిదేవోభవ' దీన్ని సమర్థిస్తూ సొంతమాటల్లో రాయగలరు.
- శాశ్వత కీర్తిగలవారని ఎవరిని, ఎందుకంటారో తగు కారణాలతో రాయగలరు.

**ఆ) సృజనాత్మక వ్యక్తీకరణ :**

- పాఠంలోని 'చదువు' ప్రాధాన్యతను తెలిపే పద్యం ఆధారంగా కథను రాయగలుగుతారు

**ఇ) ప్రశంస :**

- ఇతరుల మేలు కోరడం యొక్క ఆవశ్యకతను వివరిస్తూ మిత్రునికి లేఖ రాయగలుగుతారు.

**ఇ) భాషాంశాలు**

**అ) పదజాలం :**

- ప్రకృతి, వికృతి పదాలను జతపరచగలుగుతారు.
- పదాలకు అర్థాలను రాసి, సొంత వాక్యాల్లో ఉపయోగించగలుగుతారు.

ఉ) వ్యాకరణాంశాలు :

- వాక్యాల్లోని గీత గీసిన పదాలు, ఏ భాషాభాగాలో గుర్తించగలుగుతారు.
- ఖాళీలను విభక్తి ప్రత్యయాలతో పూరించగలుగుతారు.
- వాక్యాలకు కర్తరి / కర్మణి రూపాలు రాయగలుగుతారు.

**ఊ) ప్రాజెక్టుపని :** చదువు, సత్యం గొప్పదనాన్ని తెలిపే పద్యాలను సేకరించి సంకలనం తయారుచేసి ప్రదర్శిస్తారు.

## IV. పీరియడ్ వారీగా విభజన ప్రణాళిక :

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 1వ పీరియడ్ | 1వ పేజీ, 2వ పేజీ<br>• చదవండి – ఆలోచించి చెప్పండి<br>• ఉద్దేశం / నేపథ్యం<br>• పాఠ్యభాగ వివరాలు | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు<br>• చదవండి – ఆలోచించి చెప్పండి గురించి పూర్తి తరగతిలో మాట్లాడించడం<br>• శీర్షిక ప్రకటన (నల్లబల్లపై రాయాలి)<br>**II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• ఉద్దేశం / నేపథ్యం పిల్లలచే చదివించడం, చర్చ.<br>• పాఠ్యభాగ వివరాల గురించి చర్చ. | పలికెడిది భాగవతమట ..... పద్యంరాసిన చార్టు, భాగవతం పుస్తకం | <u>స్వీయరచన</u><br>• 3 పుటలోని చిత్రాల ఆధారంగా పదాలు, పేరా రాయడం<br>• భాగవతరత్నాలు పాఠాన్ని ఎందుకు చదవాలి? |
| 2వ పీరియడ్ | 2వ పేజీ<br>• విద్యార్థులకు సూచనలు<br>• కవి పరిచయం | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు, పునశ్చరణ<br>**II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• 'విద్యార్థులకు సూచనల'ను పిల్లలచే చదివించడం.<br>• పాఠ్యాంశంలోని చిత్రాల గురించి మాట్లాడించడం.<br>• 'కవి పరిచయం' పిల్లలచే చదివించడం, చర్చించడం. | పోతన ఊహాచిత్రం, నిఘంటువు | <u>స్వీయరచన</u><br>పోతన గురించి సొంతమాటల్లో రాయండి |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 3వ పీరియడ్ | పేజీ '3' లోని భాగం-Iలోని 1, 2, పద్యాలు<br>• పాఠం చదవడం, అర్థ సంగ్రహణం సారాంశంపై చర్చ | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు, పునశ్చరణ (కవి పోతన గురించి పునశ్చరణ చేయడం)<br>**II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• పిల్లల బాహ్యపఠనం (3వ పేజీలోని 1, 2 పద్యాలను విద్యార్థులచే చదివించడం)<br>• ఉపాధ్యాయుడు ఆదర్శ పఠనం చేయడం.<br>• పిల్లలచే మౌనపఠనం.<br>• అర్థ సంగ్రహణ (కీలక పదాలను అడుగుతూ పాఠాన్ని వివరించడం)<br>ఉదా॥ ఆర్యులు, విభుదు మొ॥న పదాలపై చర్చ.<br>• ఆలోచింప చేసే ప్రశ్నల ద్వారా పూర్తి తరగతి కృత్యం, చర్చ.<br>ఉదా॥ చదువుకోకుంటే ఏం జరుగుతుంది! అజ్ఞాని అని ఎవరిని అంటారు.<br>ఉదా॥ • బలవంతులని ఎవరిని అంటారు;<br>• బలహీనులని ఎవరిని అంటారు?<br>• అన్ని ప్రాణులకూ దేవుడే బలమని ఎందుకంటారు? నీ అభిప్రాయం ఏమిటి? | • పోతన గారి భాగవతం<br>• చిత్రపటాలు<br>• నిఘంటువు<br>• "చదువని వాడు", బలయుతులకు పద్యాలు రాసిన చార్టు. | <u>పదజాలం</u><br>పాఠం ద్వారా మీరు తెలుసుకొన్న నూతన పదజాలంతో సొంతవాక్యాలు రాయండి.<br>• స్వీయరచన - చదువు గొప్పదనం గురించి తెల్పండి.<br>• రెండవ పద్యం సారాంశం రాయండి. |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 4వ పీరియడ్ | పేజీ '3' లోని Iవ భాగం 3, 4 పద్యాలు<br>• పాఠం చదవడం, అర్థ సంగ్రహణం, సారాంశంపై చర్చ | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు, పునశ్చరణ (పాఠంలోని 1, 2 పద్యాలు చదవడం)<br>**II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• పిల్లల బాహ్యపఠనం (3వ పేజీలోని 3, 4 పద్యాలను చదవడం)<br>• ఉపాధ్యాయుని ఆదర్శపఠనం.<br>• పిల్లలచే మౌనపఠనం.<br>• అర్థసంగ్రహణం.<br>• సారాంశంపై చర్చ (ఆలోచింప చేసే ప్రశ్నల ద్వారా పూర్తి తరగతి కృత్యం)<br>• పరహితం అంటే ఏమిటి?<br>• ఇతరులకు మేలు ఎందుకు చేయాలి?<br>• మాటతప్పటడం అంటే ఏమిటి?<br>• మనం ఎందుకు మాట తప్పకూడదు? | • పోతన గారి భాగవతం<br>• చిత్రపటాలు<br>• నిఘంటువు | <u>స్వీయరచన</u><br>• పరహితమే, తన హితంగా, భావించే ఒక వ్యక్తిని గురించి సొంతమాటల్లో రాయండి.<br>• ధారాళంగా చదవడం, అర్థంచేసుకోవడం.<br>• పాఠంలోని 1, 2, 3, 4 పదాలను తప్పులు లేకుండా రాయండి. భావాలు సరిగా రాయండి. |
| 5వ పీరియడ్ | పేజీ '4' లోని IIIవ భాగం 5, 6 పద్యాలు<br>• పాఠం చదవడం, అర్థ సంగ్రహణం సారాంశంపై చర్చ | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు, పునశ్చరణ (3, 4 పద్యాలు, భావాలు)<br>**II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• పిల్లల బాహ్యపఠనం (పాఠంలోని 5, 6 పద్యాలను పిల్లలచే చదివించడం)<br>• ఉపాధ్యాయుని ఆదర్శపఠనం. | • నిఘంటువు<br>• చిత్రపటాలు<br>• అన్నమైన, అతిథి భోనంబులకు పద్యాలు రాసిన చార్టు. | <u>ప్రాజెక్టుపని</u><br>చదువు, సత్యం గొప్పదనాన్ని తెలిపే పద్యాలను సేకరించండి. సంకలనంచేసి ప్రదర్శించండి. |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | • పిల్లల మౌనపఠనం.<br>• పాఠ్యాంశంపై చర్చ (ఆలోచింప చేసే ప్రశ్నల ద్వారా పూర్తి తరగతి కృత్యం)<br>• ధనవంతులంటే ఎవరు?<br>• దరిద్రులంటే ఎవరు?<br>• అతిథులకు లేదనకుండా ఎందుకుపెట్టాలి.<br>• శాశ్వత కీర్తి అంటే ఏమిటి?<br>• ప్రాజెక్టు పని గురించి సూచనలు ఇవ్వడం. (3 రోజుల్లోగా చేయాలి.) | | <u>స్వీయరచన</u><br>• శాశ్విత కీర్తిమంతులను ధరిణితో ఎందుకు పోల్చారు?<br>• అతిథులు అంటే ఎవరు? వీరికి లేదనకుండా ఎందుకు పెట్టాలి?<br>• ధనవంతులను కూడా దరిద్రులని ఎందుకు అంటారు? |
| 6వ పీరియడ్ | వినడం, మాట్లాడడం, ధారాళంగా చదవడం<br>• సామర్థ్యాల సాధనపై అభ్యాసం. "అవగాహన - ప్రతిస్పందనలోని 1, 2, 3 ప్రశ్నలు | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు, పునశ్చరణ (పద్యాలు, చదివించడం)<br>**II. సామర్థ్యాల సాధన, చర్చ, అభ్యాసం**<br>• అవగాహన ప్రతిస్పందనలోని 1, 2 లలోని ప్రశ్నలను నల్లబల్లపై రాయడం.<br>• పూర్తి తరగతిలో ఒక్కొక్కరితో మాట్లాడించడం, చర్చించడం.<br>• అవగాహన ప్రతిస్పందనలోని 2, 3లోని ప్రశ్నలను నల్లబల్లపై రాయడం.<br>• పూర్తి తరగతిలో ఒక్కొక్కరితో మాట్లాడించడం, చర్చించడం.<br>• వ్యక్తిగతంగా రాయించడం.<br>• సరిదిద్దడం. | | <u>ధారాళంగా చదవడం - అర్థంచేసుకోవడం</u><br>• కింది ప్రశ్నలకకు పాఠం ఆధారంగా జవాబులు రాయండి.<br>- చదువును గురించి చెప్పిన విషయాలు ఏవి?<br>- పరహితం గొప్పదనం ఏమిటి?<br>- 5, 6 పద్యాలు తప్పులు లేకుండా రాయండి, చదవండి. |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 7వ పీరియడ్ | • వ్యక్తీకరణ – సృజనాత్మకతలోని స్వీయరచన ప్రశ్నలు | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు, పునశ్చరణ (పద్యాలు – భావాలు)<br>**II. సామర్థ్యాల సాధన, చర్చ, అభ్యాసం**<br>• వ్యక్తీకరణ – సృజనాత్మకతలోని 2 లోని ప్రశ్నలను నల్లబల్లపై రాయడం. (వ్యాసరూప ప్రశ్నలు)<br>• 'అతిథిదేవోభవ' గురించి ఒక్కొక్కరితో మాట్లాడించాలి.<br>• వ్యక్తిగతంగా లేదా జట్లలో జవాబులు రాయించడం, వాటిని చదివించడం.<br>• భావం, పదాలు, వాక్యాలు, అక్షరదోషాలు సరిదిద్దడం. | | <u>స్వీయరచన</u><br>• 'అతిథిదేవోభవ'ను సమర్థిస్తూ సొంతమాటల్లో 10 వాక్యాల్లో జవాబు రాయండి.<br>• శాశ్వత కీర్తిగలవారని ఎవరిని, ఎందుకు అంటారు? |
| 8వ పీరియడ్ | • 'వ్యక్తీకరణ – సృజనాత్మకత' సృజనాత్మకత | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు, పునశ్చరణ (స్వీయరచన ప్రశ్నలు)<br>**II. సామర్థ్యాల సాధన, చర్చ, అభ్యాసం**<br>• వ్యక్తీకరణ – సృజనాత్మకతలోని 3 లోని (అ) ప్రశ్నను నల్లబల్లపై రాయడం.<br>• సూచనలు ఇవ్వడం, కథను చెప్పడం.<br>• జట్లలో రాయించడం – చదువు గురించి కథ రాయడం.<br>• ప్రదర్శన – చర్చ. జట్లలో రాసిన వాటి గురించి ప్రదర్శించడం.<br>• భావం, విషయం క్రమం, వాక్యాలు, పదాలు, అక్షరదోషాలు సరిదిద్దడం. | • చదువు గురించి తెలిపే కథలు / కథల పుస్తకాలు | <u>సృజనాత్మకత</u><br>• చదువు ప్రాధాన్యం తెలిపేలా కథను రాయండి. |
| 9వ పీరియడ్ | <u>'వ్యక్తీకరణ – సృజనాత్మకత'</u><br>• ప్రశంస అభ్యాసం '3' లోని 'ఆ' ప్రశ్న | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు<br>• ప్రాజెక్టుపని, ప్రదర్శన, చర్చ<br>**II. సామర్థ్యాల సాధన, అభ్యాసం, చర్చ**<br>• ప్రశంస ప్రశ్న '3'లోని 'ఆ'ను నల్లబల్లపై రాయాలి. | • నిఘంటువు | <u>పదజాలం</u><br>పాఠంలోని ప్రకృతి, వికృతి పదాలను గుర్తించి రాయండి. |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | • మిత్రుడికి రాసిన మారిది లేఖలు చదివించాలి, దేని గురించి రాశారో చర్చ.<br>• పరహితం గురించి మిత్రుడికి లేఖ ఎలా రాయాలో సూచనలు.<br>• వ్యక్తిగతంగా లేఖ రాయించడం.<br>• ప్రదర్శన, చర్చ.<br>• సరిదిద్దడం. | | |
| 10వ పీరియడ్ | • భాషాంశాలు<br>పదజాలం, వ్యాకరణాంశాలు, అభ్యాసాలు. | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు, పునశ్చరణ (లేఖలు చదివించడం)<br>**II. సామర్థ్యాల సాధన, చర్చ, అభ్యాసం**<br>• పదజాలంలోని ప్రశ్నలను చదివించడం, అర్థం చేయించడం.<br>• వ్యక్తిగతంగా ప్రకృతి, వికృతి పదాలను జతపరచేట్లు చేయడం.<br>• ఇచ్చిన పదాలకు అర్థాలను రాయించి సొంత వాక్యాల్లో ప్రయోగింపచేయడం.<br>• పదాల భాషాభాగాలను గుర్తింపచేయడం.<br>• విభక్తి ప్రత్యయాలతో ఖాళీలు పూరింపచేయడం.<br>• కర్తరి / కర్మణి రూపాలు రాయించడం. | • నిఘంటువు | పదజాలం<br>• పాఠంలోని ప్రకృతి, వికృతి పదాలను గుర్తించి రాయండి.<br>• కింది పదాలతో సొంత వాక్యాలు రాయండి. చతురత, లేమి, పరహితం, మానధనులు.<br>వ్యాకరణాంశాలు<br>• పాఠ్యపుస్తకంలోని పేజిసంఖ్య '7' లోని 1, 2, 3 అభ్యాసాలను రాయండి.<br>• భాషాభాగాలు గుర్తిచడం, ఖాళీలలో విభక్తి ప్రత్యయాలు రాయడం, వాక్యాలను కర్తరి, కర్మణి రూపాలు రాయించడం. |

**V. ఉపాధ్యాయుల తయారీ, అదనపు సమాచార సేకరణ (టీచింగ్ నోట్సు) :** పాఠ్యభాగంలోని పద్యాలు చదవాలి. వాటి భావాలు తెల్సుకొని రాయాలి. అట్లే పాత్రకు సంబంధించిన అదనపు వివరాలు సేకరించి తెల్సుకొనిరాయాలి.

**VI. ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు :** పాఠం పూర్తయిన తర్వాత తన ప్రతిస్పందనలు రాసుకోవాలి.

# మాదిరి పాఠ్య ప్రణాళిక - 2 - తెలుగు (ద్వితీయ భాష)

**I. పాఠం పేరు** : మాట్లాడే నాగలి (వచనం)

**II. పాఠానికి అవసరమైన పీరియళ్ళ సంఖ్య** : 10

**III. పాఠం ద్వారా సాధించాల్సిన సామర్థ్యాలు :**

**అ) అవగాహన - ప్రతిస్పందన :**

**1) వినడం - ఆలోచించి మాట్లాడడం :**

- 'మాట్లాడే నాగలి' కథను సొంతమాటల్లో చెప్పగలుగుతారు.
- 'మాట్లాడే నాగలి' అనే పేరు సరైనదా? కాదా? కారణాలతో చెప్పగలుగుతారు.

**2) చదవడం - అవగాహన చేసుకోవడం :**

- ఇచ్చిన వాక్యాలు పాఠంలోని ఏ పేరాలో ఉన్నాయో గుర్తించగలరు.
- ఇచ్చిన అపరిచిత గద్యాన్ని చదివి, ఖాళీలను పూరించగలుగుతారు.
- పాఠాన్ని చదివి "వేటిని తాకి పాడుచేయడం ఘోరమైన పని" అని కన్నన్ అనుకుందో తెలియచేయగలుగుతారు.
- పాఠాన్ని చదివి, పశువుల విషయంలో ఓసెఫ్‌కున్న నమ్మకం ఏమిటో తెల్పగలుగుతారు.
- పాఠాన్ని చదివి, పచన్ పాట పాడుతుంటే ఏం జరిగిందో తెలియచేయగలుగుతారు.

**ఆ) వ్యక్తీకరణ సృజనాత్మకత**

**1) స్వీయరచన :**

- కన్నన్ స్థానంలో వారుంటే ఏం చేస్తారో, తెలియజేయగలుగుతారు.
- క్రయ పత్రం అంటే ఏమిటో, దాన్ని ఏ సందర్భాల్లో ఉపయోగిస్తారో తెలియజేయగలుగుతారు.
- మూగజీవాల మీద ఎందుకు ప్రేమచూపాలో సొంతమాటల్లో రాయగలరు.
- కన్న కూతురితో సమానంగా జోసెఫ్ కన్నన్‌ను చూడడానికి కారణాలను సొంతమాటల్లో రాయగలరు.
- కథను కొనసాగించగలరు, కొత్త ముగింపు నివ్వగలుగుతారు.

**2) సృజనాత్మక వ్యక్తీకరణ :**

- "మూగజీవులకు నోరొస్తే ....." అవి ఏం మాట్లాడుకుంటాయో తెలిపేలా ఊహాత్మకంగా కథ రాస్తారు.

**3) ప్రశంస :**

- మూగజీవులపట్ల దయతో, సానుభూతితో ప్రవర్తించాలని తెలిపేలా నినాదాలు రాస్తారు.

ఇ) **భాషాంశాలు**

1) **పదజాలం :**

- వాక్యాలలోని గీత గీసిన పదాలకు అర్థాలు రాసి, ఆ పదాలను సొంతవాక్యాలలో రాయగలుగుతారు.
- పదాలకు అర్థాలను రాసి, వాటికి సొంత వాక్యాలను రాయగలుగుతారు.

2) **వ్యాకరణాంశాలు :**

- సమాసాలకు ఉదాహరణలు ఇవ్వగలుగుతారు. విగ్రహవాక్యాన్ని రాయగలుగుతారు.
- పద్యపాదాలకు గణవిభజన చేసి, యతి ప్రాసలను గుర్తించగలుగుతారు.

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 1వ పీరియడ్ | • పేజీ 84లోని అంశాలు<br>• చదవండి – ఆలోచించి చెప్పండి<br>• ఉద్దేశం / నేపథ్యం<br>• పాఠ్యభాగ వివరాలు | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు<br>• చదవండి – ఆలోచించి చెప్పండి గురించి పూర్తి తరగతిలో మాట్లాడించడం<br>**II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• శీర్షిక ప్రకటన (నల్లబల్లపై రాయాలి)<br>• ఉద్దేశం / నేపథ్యం పిల్లలచే చదివించడం, చర్చ.<br>• పాఠ్యభాగ వివరాలను పిల్లలచే చదివించడం, చర్చ. | జీవవైవిధ్యాన్ని తెలిపే చిత్రం; పత్రికలలోని చిత్రాలు | <u>స్వీయరచన</u><br>• 87వ పేజీలోని చిత్రం ఆధారంగా పేరా రాయడం.<br>• అనువాదం అంటే ఏమిటి? దీనివల్ల ఎవరికి ప్రయోజనం కల్గుతుంది? ఎలా? |
| 2వ పీరియడ్ | • పేజీ 85లోని అంశాలు<br>• విద్యార్థులకు సూచనలు<br>• కవి పరిచయం<br>• అర్థసంగ్రహణం | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు, పునశ్చరణ (ముందురోజు ప్రశ్నలు)<br>**II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• విద్యార్థులకు సూచనలు చదివించడం.<br>• అర్థసంగ్రహణం : అర్థంకాని పదాలు గుర్తించడం.<br>• కవి పరిచయాన్ని పిల్లలచే చదివించడం.<br>• మేథోమథనం (విభిన్న ప్రశ్నల ద్వారా జీవకారుణ్యాన్ని గురించి పిల్లలచే చర్చింప చేయడం)<br>• చిత్రం ఆధారంగా పాఠంలోని విషయం గురించి ఊహించడం | • రచయిత చిత్రం<br>• నిఘంటువు | <u>చదవడం – అవగాహన చేసుకోవడం</u><br>• "ఫోన్‌కున్నం వర్కెయ్" గురించి సొంత మాటల్లో చెప్పండి<br>• 'మాట్లాడేనాగలి' అని పేరు గురించి మీరు ఏమనుకుంటున్నారు? |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 3వ పీరియడ్ | • పాఠంలోని విషయం గురించి చర్చ, అవగాహన పేజీ 86లోని I-వ భాగం | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు, పునశ్చరణ (జీవకారుణ్యాన్ని గురించి, కవి గురించి పునశ్చరణ చేయడం)<br>**II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• పిల్లల బాహ్యపఠనం (86వ పుటలోని పేరాలను విద్యార్థులు చదవడం)<br>• ఉపాధ్యాయుడి ఆదర్శ పఠనం<br>• పిల్లలచే మౌనపఠనం చేయించడం.<br>• ఆలోచింపజేసే ప్రశ్నల ద్వారా చర్చ, అవగాహన.<br>ఉదా: కన్నన్ అంటే ఎవరు? అది ఎలా ఉండేది?<br>• కన్నన్‌తో జోసెఫ్ ఎలా ఉండేవాడు?<br>• పశువులను పెంచే యజమాలును కన్నన్‌లాగా ఉంటారా? | • జంతువులపై ప్రేమను ఆప్యాయతను చూపే చిత్రాలు | <u>పదజాలం</u><br>• ఘోరం<br>• ప్రేమానురాగాలు<br>• చిర్రెత్తడం పదాలతో సొంతవాక్యాలు రాయండి.<br><u>స్వీయరచన</u><br>• పశువులను రక్షించడం అంటే ఏమిటి? మీరైతే ఏంచేస్తారు?<br>• జోసెఫ్‌కు పశువులపట్ల ప్రేమానురాగాలు కలవాడనడాన్ని మీరు భావిస్తున్నారా? ఎందుకు? |
| 4వ పీరియడ్ | • పాఠంలోని II-వ భాగం పేజి 87, 88లోని విషయం. | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు, పునశ్చరణ<br>**II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• పిల్లల బాహ్యపఠనం<br>(పుట 87, 88లలోని (II) విభిన్న పేరాలను పిల్లలు చదవడం)<br>• ఉపాధ్యాయుని ఆదర్శపఠనం.<br>• పిల్లలచే మౌనపఠనం.<br>• ఆలోచింపజేసే ప్రశ్నల ద్వారా చర్చ, అవగాహన. | | <u>స్వీయరచన</u><br>• కన్నన్ స్థానంలో నువ్వుంటే ఏంచేస్తావు?<br>• జోసెఫ్‌కు ఎందుకు చిర్రెత్తేది? |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| | | • వ్యవసాయపనుల్లోకి వెళ్ళేవారు పాటలు ఎందుకు పాడతారు?<br>• "ప్రేమకు ఎప్పుడూ మాటలు, ప్రదర్శనలు అవసరంలేదు" అంటే ఏమిటి? | | • క్రయ పత్రం అంటే ఏమిటి? దీన్ని ఏ సందర్భంలో ఉపయోగిస్తారు. |
| 5వ పీరియడ్ | • పేజీ సంఖ్య 88, 89లలోని III-వ భాగంలోని విషయంపై చర్చ, అవగాహన | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు, పునశ్చరణ (ముందు రోజు ప్రశ్నలు)<br>**II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• పిల్లల బాహ్యపఠనం<br>(పుట 88, 89లలోని (III)వ భాగం పేరాలను పిల్లలు చదవడం)<br>• ఉపాధ్యాయుని ఆదర్శపఠనం.<br>• పిల్లలచే మౌనపఠనం చేయించడం.<br>• ఆలోచింపజేసే ప్రశ్నల ద్వారా చర్చ, అవగాహన.<br>ఉదా: నాగలిని చూసిన జెసెఫ్‌కు బాధ ఎందుకు కలిగేది?<br>• ప్రేమతో స్పందిస్తున్న హృదయం అంటే ఏమిటి? అప్పుడు ఏం చేస్తారు?<br>• జెసెఫ్ గురించి భార్య ఏమనుకొనేది? | • పెంపుడు జంతువుల చిత్రాలు<br>• జంతువులను విక్రయించే చిత్రాలు. | <u>పదజాలం</u><br>దుర్భరమైన రోజులు, మందలించడం – పదాలతో సొంతవాక్యాలు రాయండి.<br><u>ధారాళంగా చదవడం, అర్థంచేసుకోవడం</u><br>అబ్బో ఎంత ధరో! పేరా చదవండి. దీని ఆధారంగా 5 ముఖ్యమైన విషయాలు రాయండి.<br><u>స్వీయరచన</u><br>జోసెఫ్ ఎందుకు తీవ్రంగా బాధపడ్డాడు? |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 6వ పీరియడ్ | • పాఠంలోని IV-వ భాగం - పేజీ 90, 91లోని విషయం గురించి చర్చ అవగాహన | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు, పునశ్చరణ<br>**II. పాఠ్యాంశ బోధన, చర్చ, అవగాహన**<br>• పిల్లల బాహ్యపఠనం<br>(పుట 90, 91లలోని (IV) విభిన్న పేరాలను పిల్లలు చదవడం)<br>• ఉపాధ్యాయుని ఆదర్శపఠనం.<br>• పిల్లలచే మౌనపఠనం.<br>• ఆలోచింపజేసే ప్రశ్నల ద్వారా చర్చ, అవగాహన.<br>ఉదా: పెంపుడు పశువులకు కూడా తమ యజమానంటే ప్రేమ చూపుతాడా? దీని గురించి మీ అభిప్రాయం తెల్పండి.<br>• చివరకు ఏం జరిగి ఉంటుంది?<br>• జెసెఫ్ చేసింది సరైందేనా?<br>• ప్రాజెక్టు పని గురించి సూచనలు. | • వార్తా పత్రికలలోని జీవ కారుణ్యానికి సంబంధించిన క్లిప్పింగ్స్ | <u>స్వీయరచన</u><br>• మాట్లాడేనాగలి కథ గురించి మీ అభిప్రాయాలు రాయండి.<br>• ఈ కథ ఆధారంగా పొనకున్నం వర్కెయ్ ఎలాంటి వాడని అర్థమైంది.<br><u>ప్రాజెక్టుపని</u><br>• పెంపుడు జంతువుల సంభాషణలను రాసి ప్రదర్శించండి. |
| 7వ పీరియడ్ | • సామర్థ్యాల సాధనపై అభ్యసనం ఇవి చేయండిలోని "అవగాహన - ప్రతిస్పందనలోని 1, 2, 3, 4 ప్రశ్నలు | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు, పునశ్చరణ<br>**II. సామర్థ్యాల సాధన, చర్చ, అభ్యాసం**<br>• అవగాహన ప్రతిస్పందనలోని 1, 2, 3, 4 లలోని ప్రశ్నలను నల్లబల్లపై రాయడం.<br>• పూర్తి తరగతిలో ఒక్కొక్కరితో మాట్లాడించడం, చర్చించడం.<br>• సరిదిద్దడం. | | <u>ప్రశంస</u><br>• మూగజీవాలపై ప్రేమానురాగాలు కల్గిఉండాలని తెలిపేలా నినాదాలు రాయండి.<br>• అవగాహన, ప్రతిస్పందనలోని 2, 3, 4 అభ్యాసాలలోని ప్రశ్నలకు జవాబులు రాయండి.<br><u>స్వీయరచన</u><br>• కథను పొడిగించి రాయండి. |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 8వ పీరియడ్ | • సామర్థ్యాల సాధనపై అభ్యాసం వ్యక్తీకరణ – సృజనాత్మకతలోని స్వీయరచన (వ్యాసరూప) ప్రశ్నలు | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు, పునశ్చరణ (ముందు రోజు ప్రశ్నలు)<br>**II. సామర్థ్యాల సాధన, చర్చ, అభ్యాసం**<br>• స్వీయరచనలోని వ్యాసరూప ప్రశ్నలను నల్లబల్లపై రాయడం.<br>• పూర్తి తరగతిలో ఒక్కొక్కరితో మాట్లాడించడం, చర్చించడం.<br>• వ్యక్తిగతంగా రాయించడం.<br>• సరిదిద్దడం – భావం, వాక్యాలు, పదాలు, అక్షరదోషాలు. | | <u>స్వీయరచన</u><br>• జోసెఫ్ కన్నన్‌ను కన్నకూతురుగా చూడడానికి కారణాలేమిటి? సొంతవాక్యాల్లో రాయండి.<br>• మూగజీవాల మీద ఎందుకు ప్రేమచూపాలి? సొంతమాటల్లో రాయండి. |
| 9వ పీరియడ్ | • వ్యక్తీకరణ – సృజనాత్మకత<br>• సృజనాత్మకత ప్రశ్న | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు, పునశ్చరణ<br>**II. సామర్థ్యాల సాధన, చర్చ, అభ్యాసం**<br>• వ్యక్తీకరణ – సృజనాత్మకతలోని సృజనాత్మకత ప్రశ్న నల్లబల్లపై రాయడం.<br>• సూచనలు ఇవ్వడం.<br>• వ్యక్తిగతంగా / జట్లలో ఊహాత్మకథ కథ రాయించి దానిని చదివించడం.<br>• భావం, వాక్యాలు, పద్యాలు, అక్షర దోషాలు సరిదిద్దడం. | • నిఘంటువు | <u>సృజనాత్మకత</u><br>• మూగజీవులకు నోరువస్తే... దీని ఆధారంగా ఊహాత్మక కథ రాయండి. |

| పీరియడ్ సంఖ్య | బోధనాంశం | బోధనావ్యూహాలు/ అభ్యసన అనుభవాలు | సామగ్రి | మూల్యాంకనం |
|---|---|---|---|---|
| 10వ పీరియడ్ | • భాషాంశాలు :<br>– పదజాలం<br>– వ్యాకరణాంశాలు<br>– ప్రాజెక్టుపని ప్రదర్శన | **I. ఉపోద్ఘాతం**<br>• పలకరింపు, పునశ్చరణ<br>• ప్రాజెక్టుపని ప్రదర్శన, చర్చ, సరిదిద్దడం.<br>**II. సామర్థ్యాల సాధన, చర్చ, అభ్యాసం**<br>• పదజాల కృత్యాలను చదివించడం, అర్థం చేయించడం.<br>• సొంతవాక్య ప్రయోగం చేయించడం, వ్యక్తిగతంగా రాయించడం.<br>• పద్యపాదాలను గణవిభజన చేయించి యతి, ప్రాసలను గుర్తింపచేయడం, చర్చ.<br>• రాయించడం, సరిద్దిడం. | • గణవిభజన తెలిపేలా చార్టు | • ప్రాజెక్టుపని నివేదిక రాయండి.<br>భాషాంశాలు<br>• '93' పేజీలోని అభ్యాసాలను రాయండి. |

**V. ఉపాధ్యాయుల తయారీ, అదనపు సమాచార సేకరణ (టీచింగ్ నోట్సు) :** పాఠంలోని విశేషాంశాలు, కీలక పదాలు, అంశాల గురించి అదనపు సమాచారాన్ని సేకరించాలి. రాసుకోవాలి.

**VI. ఉపాధ్యాయుని ప్రతిస్పందనలు :** పాఠం పూర్తయిన తర్వాత తన అనుభవాలు, అనుభూతులు, పిల్లల అభ్యసనం గురించి రాసుకోవాలి.



# VI. పదవ తరగతి పరీక్షలు - సంస్కరణలు

**జి.వొ.యం.స్.నం.17, తేది : 14-05-2014న ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం 9వ, 10వ తరగతుల పరీక్షా సంస్కరణల గురించిన వివరాలు**

## A. ఆవశ్యకత

- ప్రధానంగా పాఠశాల అంటే కేవలం పరీక్షలకు సిద్ధం చేసే సంస్థగా పాఠ్యపుస్తకాలకే పరిమితమై పిల్లలను యాంత్రికంగా సిద్ధం చేయడం ఆందోళన కలిగించే అంశం. పుస్తకాలలోని విషయాలను బట్టీ పట్టించడం, యాంత్రికంగా సిలబస్‌ను పూర్తి చేయడం విద్యా లక్ష్యాల సాధనకు ఏమాత్రం దోహదపడదు. పాఠశాల అంటే పిల్లల్లో అన్వేషించడం, చర్చించడం, రిఫరెన్స్ పుస్తకాలు చదివేలా చేయడం, విచక్షణా జ్ఞానాన్ని పెంపొందించేలా విశ్లేషణా నైపుణ్యాలు అలవడేలా చేయడం జరగాలి. వీటిని దృష్టిలో పెట్టుకున్నప్పుడు ఇప్పుడున్న పరీక్షల విధానం మార్చాల్సివచ్చింది.
- పాఠశాల విద్యలో కేవలం 10వ తరగతి మాత్రమే అతి ముఖ్యమైనదిగా భావించి ఏదో రకంగా ఫలితాలు సాధించాలనే ధోరణి నెలకొన్నది. దీనివల్ల యాంత్రికంగా సిలబస్‌ను నిర్ధారించిన సమయం కంటే ముందే తూతూమంత్రంగా పూర్తి చేస్తున్నారు. పిల్లలకు ఆలోచించేలా, విశ్లేషించేలా, అన్వయించేలా అభ్యాసం కల్పించడం లేదు. దీనికి బదులుగా పిల్లలు గైడ్లు, ప్రశ్నల బ్యాంకులు, స్టడీ మెటీరియళ్ళను ఆశ్రయించి అర్థమైనా కాకున్నా బట్టీపడుతున్నారు. మార్కుల కోసం, ర్యాంకుల కోసం అదేపనిగా అనాలోచితంగా గంటల తరబడి గైడ్లతో కుస్తీపట్టడం జరుగుతున్నది. 10వ తరగతి పరీక్షలకు విద్యార్థులను తయారు చేయడమనే ప్రక్రియ ఉపాధ్యాయులలో మరియు విద్యార్థులలో తీవ్ర

మానసిక ఒత్తిడి, ఆందోళనలకు గురిచేసే ప్రక్రియగా తయారైంది. దీనివల్ల పిల్లల్లో స్తబ్ధత నెలకొని మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. పాఠశాలలు జ్ఞానార్జన కేంద్రాలకు బదులుగా కోచింగ్ సెంటర్ల పాత్రకు పరిమితమవుతున్నాయి. దీన్ని నివారించడం అత్యంత ఆవశ్యకమైంది.

- బట్టీ విధానాల ద్వారా పిల్లలు మార్కులు పొందినప్పటికీ వారి వాస్తవ శక్తి సామర్థ్యాలు బహిర్గతం కావడం లేదు. పిల్లల మార్కులను వాస్తవ జ్ఞానంగా, శక్తి సామర్థ్యాలుగా పరిగణించి వారిపైన అధిక భారాన్ని మోపడం, వారి నుండి అతిగా ఆశించడం వల్ల పై తరగతుల్లో పిల్లలు ఈ అంచనాలను అందుకోలేక వైఫల్యాలకు గురవుతున్నారు. కొన్ని సందర్భాలలో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడుతున్నారు. దీన్ని నివారించి పరీక్షలు పిల్లల యొక్క వాస్తవ శక్తి సామర్థ్యాలను, విశ్లేషణ, అన్వయించే శక్తులను బహర్గతపరిచేవిగా సంస్కరణలు చేపట్టారు.

- పాఠశాల – పిల్లల సమగ్ర అభివృద్ధికి తోడ్పడాలి. సమగ్ర అభివృద్ధి జరగాలంటే పిల్లలు శారీరకంగా, మానసికంగా, సాంఘికంగా, భావోద్వేగపరంగా, నైతికపరంగా వివిధ కృత్యాలలో, కార్యకలాపాలలో పాల్గొనాల్సి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితులలో కేవలం భాషలు, విజ్ఞానశాస్త్రం, గణితం, సాంఘికశాస్త్రం వంటి పాఠ్య విషయాలకే పరిమితమై బోధనాభ్యసన జరుగుతున్నది. వీటినే మూల్యాంకనం చేస్తున్నాం. సహపాఠ్య కార్యక్రమాలుగా భావిస్తున్న వ్యాయామ ఆరోగ్య విద్య, కళలు–సాంస్కృతిక విద్య, కంప్యూటర్– పని విద్య, విలువలు–జీవన నైపుణ్యాలు వంటి అంశాలను కూడా పాఠ్య విషయాలుగానే పరిగణించి బోధనాభ్యసన జరగాలి. వీటిని కూడా మూల్యాంకనం చేయాల్సిన అవసరం ఉన్నది.

- పాఠశాల విద్యలో అతి ముఖ్యమైన వ్యక్తి ఉపాధ్యాయుడు. ఉపాధ్యాయుడు నిర్వహించే వివిధ కార్యకలాపాలపైననే విద్యార్థుల అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. కానీ దురదృష్టవశాత్తు ప్రతి అంశాన్ని పరీక్షలతో ముడిపెట్టి అభివృద్ధికి సంబంధించిన కార్యలాపాలను వెనుకకు నెట్టివేయడం జరుగుతున్నది. ఇది ఒక రకంగా ఉపాధ్యాయులను నమ్మకపోవడమే. ఉపాధ్యాయులను నమ్మి బాధ్యతలు అప్పగించి లక్ష్యాలను నిర్ధారిస్తే ఇప్పుడున్న పరిస్థితి కంటే మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. కాబట్టి, మూల్యాంకన విధానాలను కూడా ఈ కోణంలో సంస్కరించాల్సిన అవసరం ఉంది. అనగా కేవలం పబ్లిక్ పరీక్షలకే పూర్తి భారత్వాన్ని కేటాయించకుండా పాఠశాల స్థాయిలో కూడా ఉపాధ్యాయుడిని పరిగణనలోకి తీసుకొని కొంత భారత్వాన్ని అంతర్గత మూల్యాంకనానికి లేదా నిర్మాణాత్మక మూల్యాంకనానికి కేటాయించాల్సి ఉంటుంది.

- ప్రస్తుత పరిస్థితులలో పిల్లల ప్రగతిని మూల్యాంకనం చేయడానికి కేవలం పరీక్షలకే పరిమితం కావడం వల్ల పిల్లలు ఆందోళనకు, ఒత్తిడికి గురవుతున్నారు. వీటిని నివారించడానికి ప్రత్యామ్నాయ అంశాలను చేర్చాల్సి ఉంటుంది. ప్రాజెక్టు పనులు, ప్రయోగాలు, అసైన్‌మెంట్లు, పిల్లల నోట్‌బుక్స్, పిల్లల భాగస్వామ్యం మొదలగు అంశాలను కూడా మూల్యాంకనంలో వినియోగించుకోవాల్సి ఉంటుంది.

## B. నేపథ్యం

- నిర్బంధ ఉచిత విద్యాహక్కు చట్టం-2009, జాతీయ విద్యాప్రణాళికా చట్రం-2005 ప్రకారం రాష్ట్ర విద్యాప్రణాళిక పరిధి పత్రం-2011ను రూపొందించారు. దీని ప్రకారం 1 నుండి 10వ తగరతి వరకు పాఠ్యపుస్తకాలను ఆధునీకరించారు.
- ఈ నూతన పాఠ్యపుస్తకాలు తరగతి వారీగా, సబ్జక్టువారీగా నిర్ధారించిన సామర్థ్యాల సాధన కోసం, పిల్లల్లో బహుముఖ మూర్తిమత్వాన్ని పెంపొందించడానికి, ఆలోచింపజేయడానికి, వ్యక్తీకరించడానికి, విశ్లేషణా సామర్థ్యాలు మొదలగు వాటిని పెంపొందించడానికి ఉద్దేశించినవి.
- రాష్ట్రంలోని పాఠశాల విద్యాశాఖలో రావలసిన మార్పుచేర్పుల గురించి ఒక్కొక్క సబ్జక్టుకు సంబంధించిన ఆధారపత్రాలను రూపొందించుకున్నాం. అట్లే బట్టీ విధానాలకు స్వస్తి చెపుతూ పరీక్షల సంస్కరణల గురించి కూడా ఆధారపత్రాన్ని రూపొందించారు.
- 2010 ఏప్రిల్ మాసం నుండి రాష్ట్రంలో 1 నుండి 8వ తరగతి వరకు నిరంతర సమగ్ర మూల్యాంకనం అమలు జరుగుతున్నది. దీనివల్ల ప్రశ్నించే విధానంలో మార్పు జరిగింది. ప్రాజెక్టు పనులకు, స్వయం వ్యక్తీకరణకు ప్రాముఖ్యత ఇచ్చారు.
- కృత్యాలు, సంభాషణలు, చర్చలు, ప్రాజెక్టుపనులు, ప్రయోగాల ద్వారా తరగతిగదిలో బోధనాభ్యసన ప్రక్రియలో పిల్లలు పాల్గొనే విధానాలలో పూర్తి మార్పులు తీసుకురావడం జరిగింది. దీనివల్ల విద్యార్థుల్లో జ్ఞాన నిర్మాణం జరిగే విధానాలలో మార్పు వచ్చింది. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకున్నప్పుడు 9, 10వ తరగతి పరీక్షలలో కూడా సంస్కరణల ఆవశ్యకత ఏర్పడింది.

పాఠశాల ప్రణాళికలో పై మార్పులకు అనుగుణంగా పాఠ్యపుస్తకాల్లో, బోధనాభ్యసన ప్రక్రియల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. కాబట్టి, మూల్యాంకన విధానంలో కూడా మార్పు అనివార్యమైనది. ఇందులో ఏ అంశాలను మూల్యాంకనం చేయాలి? ఎలా మూల్యాంకనం చేయాలి? అభ్యసనం మెరుగుపరుచుకోవడానికి ఎటువంటి సూచనలు ఇవ్వాలి? అనేవి ప్రాధాన్యమైనవి.

# C. మార్గదర్శకాలు

## SSC సంస్కరణల ప్రతిపాదలనకు ఎస్.సి.ఇ.ఆర్.టి. చేపట్టిన చర్యలు

- 10వ తరగతి పరీక్షలలో సంస్కరణల ఆవశ్యకత గురించి పాఠ్యపుస్తక రచయితలు, విషయనిపుణులతో సెప్టెంబర్ 2013 మాసంలో సమావేశం నిర్వహించి చర్చించారు.
- ప్రస్తుత CBSE పరీక్షా విధానాలను దృష్టిలో ఉంచుకొని సంస్కరణలకు సంబంధించిన నేపథ్యాన్ని, అవసరమైన అంశాలను నిర్ధారించారు.
- మాసంలో ప్రాథమికంగా రూపొందించిన ప్రతిపాదనల గురించి చర్చించడానికి సబ్జక్టువారీగా ఉపాధ్యాయులు, కొంతమంది ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, రెసిడెన్షియల్ పాఠశాలల అధికారులు, ప్రైవేట్ పాఠశాలల సంఘ ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాథమిక ప్రతిపాదనలు తయారు చేశారు.
- 2014 మార్చి, ఏప్రిల్ మాసాలలో అన్ని జిల్లాల్లో జిల్లా విద్యాధికారుల ఆధ్వర్యంలో డి.సి.ఇ.బి ద్వారా 10వ తరగతి పరీక్షల సంస్కరణల గురించి ఎస్.సి.ఇ.ఆర్.టి. రూపొందించిన ప్రాథమిక ప్రతిపాదనలను చర్చించి అభిప్రాయాలు, సలహాలు, సూచనలతో నివేదిక రూపొందించి సమర్పించాలని కోరారు. ఇందుకనుగుణంగా అన్ని జిల్లాల్లో జిల్లా విద్యాధికారులు సమావేశాలు నిర్వహించి నివేదికలు సమర్పించారు.
- అట్లే రాష్ట్రంలోని అన్ని ఉపాధ్యాయ సంఘాలకు కూడా ప్రాథమిక ప్రతిపాదనలను పంపించి అధ్యయనం చేయమని కోరారు. వారు అధ్యయనం చేసిన అంశాలను చర్చించడానికి తేది. 26.04.2014 రోజు ఎస్.సి.ఇ.ఆర్.టి. సమావేశ మందిరంలో రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘ బాధ్యులతో సమావేశాన్ని నిర్వహించారు.
- తేది 3-5-14 రోజు పాఠశాల విద్య ముఖ్యకార్యదర్శి అదనపు సంచాలకులు, SCERT అధికారులతో సమావేశంలో వివిధ ప్రతిపాదనలగురించి చర్చించి సంస్కరణలను ఆమోదించారు.
- పైన తెలిపిన అంశాల ఆధారంగా ఒక్కొక్క అంశాన్ని నిశితంగా పరిశీలించి, విషయాలను క్రోడీకరించి, విశ్లేషించి ఎస్.సి.ఇ.ఆర్.టి ప్రతిపాదనల ఆధారంగా సంస్కరణలు చేపట్టారు.

## సంస్కరణలు

### ఎ) పరిమాణాత్మక అంశాలు:

**1. ఒకొక్క సబ్జక్టుకు నిర్ధారించిన పేపర్ల సంఖ్య**

- ప్రస్తుతం 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో ద్వితీయ భాష (తెలుగు/ హిందీ) మినహాయించి మిగతా అన్ని సబ్జక్టులకు రెండేసి పేపర్ల చొప్పున పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలా కాకుండా తెలుగు, హిందీ, ఆంగ్లం సబ్జక్టులకు ఒకే పేపర్‌ను పబ్లిక్ పరీక్షలో నిర్వహిస్తారు.

- భాషేతర విషయాలైన విజ్ఞానశాస్త్రం, సాంఘికశాస్త్రం మరియు గణితాలలో రెండేసి పేపర్లు ఉండాలి. విజ్ఞానశాస్త్రంలో జీవశాస్త్రానికి, భౌతిక రసాయన శాస్త్రాలకు వేర్వేరు పేపర్లు ఉండాలి. సాంఘికశాస్త్రంలో భూగోళశాస్త్రం, అర్థశాస్త్రం మొదటి పేపర్‌గా, పౌరశాస్త్రం, చరిత్ర రెండవ పేపర్‌గా; గణితంలో సంఖ్యలు, సమితులు, బీజగణితం, ప్రోగ్రెషన్, కోఆర్డినేట్ జామెట్రీ మొదటి పేపర్‌గా, జామెట్రీ, త్రికోణమితి, మెన్సురేషన్, సాంఖ్యకశాస్త్రం, సంభావ్యత, రెండవ పేపర్‌గా ఉంటాయి. అయితే, మొదటి పేపర్, రెండవ పేపర్‌ను 40 మార్కుల చొప్పున నిర్వహించినా కాని ఒక్కొక్క పేపర్‌లో ఉత్తీర్ణులు కావడానికి 14 మార్కులు పొందాల్సి ఉంటుంది.

## 2. పరీక్షలు - మార్కులు

*పాఠ్య విషయాలు*

| సబ్జక్టు | మొత్తం మార్కులు | పబ్లిక్ పరీక్ష మార్కులు | నిర్మాణాత్మక మూల్యాంకనం మార్కులు |
|---|---|---|---|
| ప్రథమ భాష (తెలుగు/ హిందీ/ ఉర్దూ మొ॥వి) | 100 మార్కులు | 80 | 20 |
| ద్వితీయ భాష (తెలుగు/ హిందీ) | 100 మార్కులు | 80 | 20 |
| తృతీయ భాష (ఆంగ్లం) | 100 మార్కులు | 80 | 20 |
| గణితం పేపర్ 1 | 50 మార్కులు | 40 | 10 |
| గణితం పేపర్ 2 | 50 మార్కులు | 40 | 10 |
| భౌతిక రసాయనశాస్త్రం | 50 మార్కులు | 40 | 10 |
| జీవశాస్త్రం | 50 మార్కులు | 40 | 10 |
| సాంఘికశాస్త్రం పేపర్ 1 | 50 మార్కులు | 40 | 10 |
| సాంఘికశాస్త్రం పేపర్ 2 | 50 మార్కులు | 40 | 10 |
| **మొత్తం మార్కులు** | **600 మార్కులు** | **480** | **120** |

## 3. మార్కులు - భారత్వం

- ప్రతి సబ్జక్టులో 80% మార్కులకు పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారు. మిగతా 20% మార్కులను నిర్మాణాత్మక మూల్యాంకనం (Formative Assessment) ద్వారా కేటాయిస్తారు.
- 20% మార్కులను ఒక విద్యా సంవత్సరంలో నిర్వహించే నాలుగు నిర్మాణాత్మక మూల్యాంకనాల సగటును లెక్కించి జమ చేస్తారు.

- పిల్లలకు పబ్లిక్ పరీక్షలలో రాయడానికి అవసరమైన శిక్షణ పొందేలా మొదటి, రెండవ సంగ్రహణాత్మక మూల్యాంకనాలను (Summative Assessment) కూడా 80% మార్కులకే ప్రశ్నాపత్రాలు రూపొందించి పరీక్షలు నిర్వహిస్తారు. మిగతా 20% మార్కులను అంతకుముందు నిర్వహించిన నిర్మాణాత్మక మూల్యాంకనం ఆధారంగా కేటాయిస్తారు.

  మొదటి సంగ్రహణాత్మక మూల్యాంకనం – 20% (FA) + 80% ప్రశ్నాపత్రాలు.

  రెండవ సంగ్రహణాత్మక మూల్యాంకనం – 20% (FA) + 80% ప్రశ్నాపత్రాలు.

- ప్రతి నిర్మాణాత్మక మూల్యాంకనంలో మార్కులను కిందివిధంగా కేటాయిస్తారు. అవి:

| వ.సం. | నిర్మాణాత్మక మూల్యాంకన అంశం | మార్కులు |
|---|---|---|
| 1 | భాషా విషయాలలో గ్రంథాలయ మరియు ఇతర పుస్తకాలు అంటే – కథా సాహిత్యం, బాలసాహిత్యం, వార్తా పత్రికలు – మ్యాగజైన్లు ఇతర పుస్తకాలు చదివి నివేదికలు, సమీక్షలు రాసి ప్రదర్శించడం. విజ్ఞానశాస్త్రంలో ప్రయోగాలు చేయగలగడం; సాంఘికశాస్త్రంలో చదవడం, విశ్లేషించడం మరియు ప్రస్తుత సామాజిక సమస్యలపై ప్రతిస్పందించడం; గణితంలో వివిధ భావనలకు సంబంధించిన గణిత సమస్యల తయారీ. | 5 |
| 2 | పిల్లలు నోట్ పుస్తకాలలో సొంతంగా రాసిన అంశాలు (పాఠంలోని అభ్యాసాలకు స్వయంగా రాయడం). | 5 |
| 3 | ప్రాజెక్టు పనులు | 5 |
| 4 | లఘు పరీక్ష (స్లిప్ టెస్ట్) | 5 |

- 10వ తరగతిలో వచ్చే పరీక్షల సంస్కరణలను 9వ తరగతిలో అమలుపరుస్తారు. దీనివల్ల పిల్లలకు 9వ తరగతి నుండే అభ్యాసం లభిస్తుంది.
- పిల్లలు తప్పనిసరిగా నాలుగు నిర్మాణాత్మక మూల్యాంకనాలకు హాజరుకావాల్సి ఉంటుంది. ఒకవేళ పిల్లలు ఎవరైనా ఏదైనా సందర్భంగా నిర్మాణాత్మక మూల్యాంకనాలకు గైర్హాజరయితే ఉపాధ్యాయులు తప్పనిసరిగా వారికి వెంటనే మళ్ళీ నిర్వహించి మార్కులు కేటాయించాల్సి ఉంటుంది.
- 4వ నిర్మాణాత్మక మూల్యాంకనం ఫిబ్రవరి మాసంలో నిర్వహించిన తరవాత రికార్డులను పరిశీలించి సరిచూసి ఈ వివరాలను ఆన్‌లైన్ ద్వారా ప్రధానోపాధ్యాయుడు నిర్ధారించిన ఫార్మాట్‌లో పరీక్షల బోర్డుకు వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. దీనికి సంబంధించిన కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌ను కమీషనర్, ప్రభుత్వ పరీక్షల విభాగం వారు చేపడతారు.

- నిర్మాణాత్మక (అంతర్గత) మూల్యాంకనం సక్రమంగా నిర్వహించేలా చూసే బాధ్యత ప్రధానోపాధ్యాయుడిదే. జిల్లా విద్యాశాఖాధికారి రెండు లేదా 3 మండలాలకు ఒక మాడరేషన్ కమిటీని ఏర్పాటు చేస్తారు. ఈ కమిటీని సభ్యులు పిల్లలకు కేటాయించిన మార్కులను అందుబాటులో ఉన్న రికార్డులు, పిల్లల ప్రాజెక్టు పనులు, పిల్లల రాత అంశాలతో పోల్చి చూస్తారు. ఈ కమిటీలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతోపాటు ఎయిడెడ్/ రికగ్నైజ్డ్ పాఠశాలలకు చెందిన అనుభవజ్ఞులైన ప్రధానోపాధ్యాయులను కూడా సభ్యులుగా వీరు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను పరిశీలిస్తారు. ఉప విద్యాశాఖాధికారి మరియు జిల్లా విద్యా శిక్షణా సంస్థల ఉపన్యాసకులు మండల స్థాయిలో ఏర్పాటు చేసి మాడరేషన్ కమిటీ పరిశీలించిన వాటిలో కొన్నింటిని ర్యాండమ్‌గా పరిశీలించి తమ పరిశీలనలను ప్రభుత్వ పరీక్షా విభాగానికి మరియు ప్రతిని జిల్లా విద్యాధిశాఖాధికారులకు పంపిస్తారు. ఇదేవిధంగా రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ ప్రతి జిల్లాలో కొన్ని పాఠశాలలను సందర్శించి అంతర్గత మూల్యాంకనాన్ని పరిశీలించి CGE కు ప్రతిని DEO లకు, RJD SE లకు పంపుతుంది.
- పైన తెలిపిన విధంగా మానిటరింగ్ చేయడానికి రెండు లేక మూడు మండలాలను ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. ఒక కమిటీ కనీసం 10 నుండి 15 పాఠశాలల వివరాలను పరిశీలించాల్సి ఉంటుంది.

**4. ఉత్తీర్ణతా మార్కులు**

- నిర్మాణాత్మక మూల్యాంకనానికి 20% మార్కులు కేటాయించినప్పటికీ పిల్లలు తప్పనిసరిగా పబ్లిక్ పరీక్షకు హాజరుకావాల్సి ఉంటుంది. పబ్లిక్ పరీక్షలలోని ఒక్కొక్క సబ్జక్టుకు సంబంధించిన 80% మార్కులకు అనగా 80 మార్కులకు కనీసం 28 మార్కులు పొందినపుడే ఉత్తీర్ణత పొందినట్లుగా భావిస్తారు.
- భాషేతర విషయాలలో ప్రతి సబ్జక్టుకు 2 పేపర్లు ఉంటాయి. ప్రతి పేపర్‌ను 40 మార్కులకు నిర్వహిస్తారు. కనుక ఒక్కొక్క పేపర్‌లో 14 మార్కులు పొందితేనే ఉత్తీర్ణులైనట్లు. ఒకవేళ ఏదైనా ఒక పేపర్‌లో 14 మార్కులు రాకుంటే ఆ పేపర్‌కు మళ్ళీ పబ్లిక్ పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది.
- అయితే, ఒక్కొక్క సబ్జక్టులో నిర్మాణాత్మక మూల్యాంకనం, పబ్లిక్ పరీక్షలో పొందిన మార్కులను కూడినప్పుడు తప్పనిసరిగా పిల్లలు కనీసం 35% మార్కులు పొందాలి. అనగా 35 మార్కులు పొందినప్పుడే ఉత్తీర్ణులు అయినట్లు. పబ్లిక్ పరీక్షల్లో 28 మార్కులు, ఇంటర్నల్ పరీక్షలలో 7 మార్కులు పొందాలి. అయితే, నిర్మాణాత్మక మూల్యాంకనంలో పూర్తి మార్కులు పొందినా, పబ్లిక్ పరీక్షలో 28 కంటే తక్కువ మార్కులు పొందితే అనుత్తీర్ణులుగానే భావిస్తారు. అందుకని విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో, ఇంటర్నల్ పరీక్షల్లో కూడా నిర్దేశించిన మార్కులు పొందాలి.
- ద్వితీయ భాషలో అనగా హిందీ, తెలుగు సబ్జక్టులలో గతంలో 20 మార్కులు పొందితే ఉత్తీర్ణులుగా భావించేవారు. అయితే, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల ప్రతిపాదనలను అనుసరించి 2015 మార్చి పబ్లిక్ పరీక్షల నుండి ఇతర సబ్జక్టులలాగానే వీటిలో తప్పనిసరిగా 35 మార్కులు పొందితేనే ఉత్తీర్ణులుగా భావిస్తారు.

**5. గ్రేడింగ్ విధానం**

- ప్రస్తుతం 10వ తరగతి పరీక్షలలో అమలుపరుస్తున్న గ్రేడింగ్ విధానం బాగున్నప్పటికీ గ్రేడింగ్ కోసం నిర్ధారించిన మార్కుల శ్రేణిని కిందివిధంగా మార్చారు.

| గ్రేడు | భాషా విషయాలలో మార్కులు (100) | భాషేతర విషయాలలో మార్కులు (50) | గ్రేడ్ పాయింట్లు |
|---|---|---|---|
| A1 | 91 నుండి 100 | 46 నుండి 50 మార్కులు | 10 |
| A2 | 81 నుండి 90 మార్కులు | 41 – 45 మార్కులు | 9 |
| B1 | 71 నుండి 80 మార్కులు | 36 – 40 మార్కులు | 8 |
| B2 | 61 నుండి 70 మార్కులు | 31 – 35 మార్కులు | 7 |
| C1 | 51 నుండి 60 మార్కులు | 26 – 30 మార్కులు | 6 |
| C2 | 41 నుండి 50 మార్కులు | 21 – 25 మార్కులు | 5 |
| D1 | 35 నుండి 40 మార్కులు | 18 – 20 మార్కులు | 4 |
| D2 | 0 నుండి 34 | 0 – 17 మార్కులు | 3 |

క్యుములేటివ్ గ్రేడ్ పాయింట్ల సగటును, సగటు గ్రేడు పాయింట్ల ఆధారంగా నిర్ధారిస్తారు.

**6. అదనపు పాఠ్య కార్యక్రమాలు (Other curricular subjects) – మూల్యాంకనం**

- రాష్ట్రంలో పాఠ్య ప్రణాళికా సంస్కరణలలో భాగంగా 1 నుండి 8వ తరగతి వరకు వ్యాయామ ఆరోగ్య విద్య, కళలు–సాంస్కృతిక విద్య, పని–కంప్యూటర్ విద్య, విలువలు–జీవన నైపుణ్యాలు అంశాలను కూడా పాఠ్య విషయాలుగానే భావించి వీటికి కూడా మూల్యాంకనం నిర్వహిస్తున్నారు. కాబట్టి 9, 10 తరగతులకు కూడా ఇదేవిధంగా మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. ఒక్కొక్క దానికి 50 మార్కులు ఉంటాయి. పిల్లల్లో సంపూర్ణ మూర్తిమత్వ అభివృద్ధి కోసం, సృజనాత్మక నైపుణ్యాలు, మంచి వైఖరులు, శీల నిర్మాణం, జీవ నైపుణ్యాలను పెంపొందించడం కోసం ఈ విషయాలను పాఠశాల ప్రణాళికలో చేర్చారు.
- ఇందుకోసం ఉపాధ్యాయుల కరదీపికలు రూపొందించి, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు.
- 10వ తరగతి మార్కుల మెమోరాండంలో ఈ అంశాలకు సంబంధించిన గ్రేడు వివరాలను పొందుపరుస్తారు.
- ఈ నాలుగు అంశాలలో పబ్లిక్ పరీక్షలు ఉండవు. మొదటి, రెండవ నిర్మాణాత్మక మూల్యాంకనాల సగటు మార్కుల ఆధారంగా ఉపాధ్యాయుడు పరిశీలించి గ్రేడులను కేటాయిస్తారు. ఈ వివరాలను ప్రధానోపాధ్యాయుడు ఆన్‌లైన్ ద్వారా పరీక్షల విభాగానికి పంపిస్తాడు.

- ఈ కార్యక్రమాలను పాఠశాలలో అమలు చేయుటకు ఉపాధ్యాయుల అభిరుచిని బట్టి ప్రధానోపాధ్యాయుడు వారికి బాధ్యతలను అప్పగించాలి. ఇది సాధ్యంకాని పక్షంలో కింది విధంగా బాధ్యతలను కేటాయించాలి. ఉదా:
  - విలువల విద్య-జీవన నైపుణ్యాలు: భాషోపాధ్యాయులకు/ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు.
  - కళలు-సాంస్కృతిక విద్య: భాషోపాధ్యాయులకు/ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులకు.
  - పని-కంప్యూటర్ విద్య: భౌతిక రసాయన/ జీవశాస్త్ర ఉపాధ్యాయులకు.
  - వ్యాయామ-ఆరోగ్య విద్య: వ్యాయామ ఉపాధ్యాయులకు (వ్యాయామ ఉపాధ్యాయులు లేని పక్షంలో జీవశాస్త్ర ఉపాధ్యాయునికి కేటాయించాలి).
- వీటికి పబ్లిక్ పరీక్షల నిర్వహణ ఉండదు. మొదటి సంగ్రహణాత్మక మూల్యాంకనం, రెండవ సంగ్రహణాత్మక మూల్యాంకనం సందర్భంగా మార్కులను పాఠశాలలో ఉపాధ్యాయులే కేటాయిస్తారు. వీటి సగటును లెక్కించి గ్రేడు వివరాలు ఆన్‌లైన్ ద్వారా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వివరాలను సమర్పించాల్సి ఉంటుంది.

**7. పరీక్షల నిర్వహణ రోజులు - సమయం**

- గతంలోలాగానే రోజుకొక పరీక్ష చొప్పున నిర్వహిస్తారు (సాధారణ సెలవులు మినహాయించి).
- భాషేతర పరీక్షకు 2.30 గంటల సమయం ఉంటుంది. అట్లే ప్రతి పరీక్షలో ప్రశ్నాపత్రాన్ని చదవడానికి, అర్థం చేసుకోవడానికి అదనంగా 15 నిమిషాల సమయాన్ని కేటాయిస్తారు. భాషా పరీక్షలకు 3 గం॥లు సమాధానాలు రాయటానికి అదనంగా 15 ని॥లు ప్రశ్నపత్రాన్ని చదవటానికి కేటాయిస్తారు.

## బి) గుణాత్మక అంశాలు

**1. ప్రశ్నాపత్రాలు - స్వభావం మరియు ప్రశ్నల స్వభావం**

- పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలలోని ప్రశ్నలు జ్ఞాపకముంచుకొని రాయడానికి, బట్టీపట్టి రాయడానికి వీలుగా ఉండవు. ఈ ప్రశ్నలు పిల్లలు ఆలోచించి రాసేలా ఉంటాయి. ప్రశ్నలు విశ్లేషణాత్మకంగా, అన్వయించి రాసేలా ఉంటాయి. ప్రశ్నలకు సమాధానాలు ఒకే రకంగా రాయడానికి బదులు బహుళ సమాధానాలు వచ్చేలా ప్రశ్నల స్వభావం ఉంటుంది. (open ended questions/ analytical questions/ thought provoking and application oriented questions).
- ఒకసారి పబ్లిక్ పరీక్షలో వచ్చిన ప్రశ్నలు మళ్ళీ పునరావృతం కావు. అనగా పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలలో ఇచ్చిన ప్రశ్నలు ఉన్నవి ఉన్నట్లుగా పబ్లిక్ పరీక్షలలో రావు. ఇలాంటి స్వభావం ఉన్న ఇతర ప్రశ్నలను రూపొందించి ఇవ్వాలి. ప్రశ్నలు తప్పనిసరిగా నిర్ణయించిన విద్యాప్రమాణాలకనుగుణంగా ఉంటే.

**2. విద్యాప్రమాణాలు/ సాధించాల్సిన సామర్థ్యాలు**

- పబ్లిక్ పరీక్షలలోని ప్రశ్నలు ఆయా సబ్జక్టులకు నిర్ధారించిన విద్యాప్రమాణాలు/ సాధించాల్సిన సామర్థ్యాలకు సంబంధించినవై ఉంటాయి.
- ఆయా సబ్జక్టులకు సంబంధించిన సామర్థ్యాలకు భారత్వాన్ని నిర్ధారించి వాటి ప్రకారం ప్రశ్నలను రూపొందిస్తారు. గతంలో మాదిరిగా పాఠాలవారీగా భారత్వం ఉండదు. ప్రశ్నలు ఏ పాఠం నుండైనా రావచ్చు.

### 3. ప్రశ్నల రకం

| భాషేతర పరీక్షలలో ప్రశ్నలు ఈ కింది రూపాల్లో ఉంటాయి. | భారతీయ భాషా పరీక్షల్లో |
|---|---|
| – వ్యాసరూప ప్రశ్నలు<br>– లఘు సమాధాన ప్రశ్నలు<br>– అతి లఘు సమాధాన ప్రశ్నలు<br>– ఏకవాక్య సమాధాన ప్రశ్నలు మరియు బహుళైచ్ఛిక ప్రశ్నలు | – పఠనావగాహన (అతి లఘు / బహుళైచ్ఛిక / ప్రతిపదార్థ / పద్యభావ ప్రశ్నలు)<br>– స్వీయరచన ప్రశ్నలు (లఘు సమాధాన, వ్యాసరూప ప్రశ్నలు)<br>– సృజనాత్మకత (లఘు / వ్యాసరూప ప్రశ్నలు)<br>– పదజాలం, వ్యాకరణం (అతి లఘు / బహుళైచ్ఛిక) |

- వ్యాసరూప సమాధాన ప్రశ్నలు (Essay type questions): వీటికి 10 నుండి 5 వాక్యాలు లేదా మూడు నుండి నాలుగు పేరాలలో సమాధానాలు రాయాల్సి ఉంటుంది.
- లఘు సమాధాన ప్రశ్నలు (Short Answer Questions): వీటికి 4 నుండి 5 వాక్యాలు లేదా ఒక పేరాలో సమాధానం రాయాల్సి ఉంటుంది.
- అతి లఘు సమాధాన ప్రశ్నలు (Very Short Answer Questions): వీటికి ఒకటి / రెండు వాక్యాలలో సమాధానాలు రాయాలి. లక్ష్యాత్మక ప్రశ్నలు (Objective types qurestions) / బహుళైచ్ఛిక ప్రశ్నలు (MCQs).

### 4. ప్రశ్నలు - అవకాశం (choice)

- ప్రతి ప్రశ్నాపత్రంలో వ్యాసరూప ప్రశ్నలకు అంతర్గతంగా ఎంపిక చేసుకొని (internal choice) రాసే అవకాశం ఉంటుంది. అనగా ఏదైనా ఒక వ్యాసరూప ప్రశ్నను ఇచ్చినపుడు అదనపు ప్రశ్నను అడగాలి. ఈ రెండింటిలో ఏదైనా ఒక ప్రశ్నను ఎంపిక చేసుకొని జవాబు రాయాల్సి ఉంటుంది.
- లఘు సమాధాన ప్రశ్నలకు ఎంపిక చేసుకొనిరాసే అవకాశం ఉండదు.

### 5. సమాధానాలు రాయడానికి ఒకే జవాబు పత్రం (single booklet)

- ప్రస్తుతం 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో జవాబులు రాయడానికి ప్రధాన జవాబుపత్రంతోపాటు అవసరమైతే అదనపు జవాబుపత్రాలను కూడా అందిస్తున్నారు. వీటికి పరిమితి లేదు. అన్ని సబ్జక్టులలో లక్ష్యాత్మక, లఘు సమాధాన, అతి లఘు సమాధాన ప్రశ్నలతోపాటు వ్యాసరూప సమాధాన ప్రశ్నలు ఉంటున్నాయి. ఒక్కొక్క వ్యాసరూప సమాధాన ప్రశ్నకు కూడా ఎన్ని వాక్యాల్లో జవాబు రాయాలో ప్రశ్నాపత్రంలోనే సూచనలిస్తున్నారు. అయితే, సూచించిన విధంగా జవాబులు రాయడానికి బదులు కొంతమంది పిల్లలు అపరిమితంగా అదనపు జవాబుపత్రాలను కూడా వినియోగిస్తున్నారు. కొన్ని సందర్భాలలో ఇవి అక్రమాలకు తావిస్తున్నాయి. వీటిని

నివారించడానికి సూచించినవిధంగా పిల్లలు జవాబులు రాసేవిధంగా ప్రధాన జవాబుపత్రంలోనే జవాబులు రాసేలా ఒకే జవాబుపత్రాన్ని తగినన్ని పేజీలతో (single booklet) ఇవ్వాలని నిర్ణయించారు.

**6. జవాబు పత్రాలను దిద్దడం**

- ప్రతి రోజు ఒక ఉపాధ్యాయుడు ఉదయం 20 జవాబు పత్రాలను, మధ్యాహ్నం 20 జవాబు పత్రాలను దిద్దాల్సి ఉంటుంది. అనగా ఒక రోజు 40 జవాబు పత్రాలు మాత్రమే దిద్దాలి. ఎందుకనగా ప్రశ్నలు ఆలోచింపజేసే రీతిలో, బహుళ సమాధానాలు వచ్చేలా ఉంటాయి కాబట్టి జాగ్రత్తగా పిల్లలు రాసిన జవాబులను దిద్దాల్సి ఉంటుంది.
- జవాబు పత్రాలను దిద్దడానికి ఉపాధ్యాయులకు మార్గదర్శకాలను SCERT రూపొందిస్తుంది. ఇందుకోసం ఒక్కొక్క రకమైన ప్రశ్నకు సమాధానాలను రాసే విధానాలను మూల్యాంకనం చేయడానికి సూచికలు రూపొందిస్తారు. గతంలో జవాబులను "కీ పేపర్" ప్రకారం పేపర్లు దిద్దేవారు. దీనికి బదులుగా పిల్లలు సొంతంగా రాయడాన్ని అర్థం చేసుకోవడం, వారి వ్యక్తీకరణ శక్తిని, విశ్లేషణాశక్తిని, స్వీయరచనాశక్తిని, అన్వయించేశక్తిని, వివరించే శక్తిని సరిగ్గా మూల్యాంకనం చేసి మార్కులు కేటాయించేలా సబ్జక్టు వారీగా సూచికలను మార్గదర్శకాలో పొందుపరుస్తారు.

**7. S.S.C. మార్కుల మెమో**

కింద సూచించిన విధంగా S.S.C. మార్కుల ధృవపత్రాలు ఉంటాయి.

PART-I. – విద్యార్థి సాధారణ సమాచారం.

PART-II. – ఆయా విషయాలకు గ్రేడ్లు (భాష, భాషేతరాలకు నిర్మాణాత్మక & సంగ్రహణాత్మక పరీక్షలకు గ్రేడ్లు)

PART-III. – సహపాఠ్య ప్రణాళిక కార్యక్రమాలకు ఫలితాల వివరణ. మెమో వెనుక భాగంలో గ్రేడ్లు, వాటికి సంబంధించిన పాయింట్ల వివరాలను పొందుపరుస్తారు.

**8. శిక్షణా కార్యక్రమాలు**

- నూతన పాఠ్యపుస్తకాలపైన, వాటిని వినియోగించాల్సిన తీరుపైన ఉపాధ్యాయులకు సమగ్రంగా శిక్షణ నిర్వహిస్తారు. అట్లే సామర్థ్యాల వారీగా పిల్లలకు అభ్యాసం కల్పించేలా శిక్షణ ఉంటుంది.
- 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలోని ప్రశ్నాపత్రాల స్వభావం, వాటిని మూల్యాంకనం చేసే విధానాల గురించి ఉపాధ్యాయులకు, అధికారులకు శిక్షణ నిర్వహిస్తారు.
- నిర్మాణాత్మక మూల్యాంకనం నిర్వహణ, అదనపు పాఠ్య కార్యక్రమాల నిర్వహణ, వీటిని మూల్యాంకనం చేయడం, ఆ వివరాలను ఆన్‌లైన్ ద్వారా సమర్పించే విధానాల గురించి విద్యాశాఖలోని అధికారులతో మొదలుకొని ఉపాధ్యాయుల వరకు అందరికీ శిక్షణ ఉంటుంది.
- 10వ తరగతి పరీక్షలలో సంస్కరణలు 2015 మార్చిలో నిర్వహించే పబ్లిక్ పరీక్షల నుండి అమలులోకి వస్తున్నందున 2014 జూన్ మాసం నుండే శిక్షణా కార్యక్రమాలపై దృష్టిపెడతారు. ఒకేసారి అన్ని అంశాలపై శిక్షణ ఇవ్వకుండా

శిక్షణాంశాలను విభజించి జూన్ నుండి డిసెంబర్‌లోగా శిక్షణా కార్యక్రమాలను రెండు మూడు విడతలుగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తారు.

- నెలకొకసారి టెలికాన్ఫరెన్స్ ద్వారా ఉపాధ్యాయులందరికీ 10వ తరగతి నూతన పాఠ్యపుస్తకాలు, పరీక్షల నిర్వహణ, మూల్యాంకన విధానాలు, పిల్లల అభ్యసనా సమస్యలు మొదలగు అంశాలపైన శిక్షణ ఇవ్వడంతోపాటు సందేహాలను నివృత్తి చేస్తారు.
- 1వ, 2వ సంగ్రహణాత్మక మూల్యాంకనం ప్రశ్నాపత్రాలు కూడా పబ్లిక్ పరీక్షల్లో మాదిరిగానే రూపొందించి పరీక్షలు నిర్వహిస్తారు. 1వ సంగ్రహణాత్మక మూల్యాంకనానికి సంబంధించిన జవాబు పత్రాలను ఉపాధ్యాయులు దిద్దిన తరవాత పరిశీలించి వీటిలోని లోటుపాట్లను విశ్లేషించి ఉపాధ్యాయులు మార్గదర్శకాల ప్రకారం పబ్లిక్ పరీక్షలలో జవాబు పత్రాలను దిద్దేలా సూచనలివ్వడం లేదా శిక్షణ ఇవ్వడం చేస్తారు.
- 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో వచ్చే ప్రశ్నల స్వభావం గురించి అందరికి అర్థమయ్యేలా చేయడానికి ఎస్.సి.ఇ.ఆర్.టి. సబ్జక్టు వారీగా నమూనా ప్రశ్నాపత్రాలు రూపొందిస్తుంది, వీటిపైన శిక్షణ ఇస్తుంది. అట్లే పరీక్షల సంస్కరణల గురించి కరదీపిక తయారుచేసి పాఠశాలలకు అందిస్తారు.

## 9. డి.సి.ఇ.బి. బాధ్యతలు

- మంచి అనుభవం కల్గిన ఉపాధ్యాయులు మరియు విషయనిపుణులు, జిల్లాలోని పాఠ్యపుస్తక రచయితలు, SRG సభ్యులు, బోధనోపాధ్యాయులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులను కలుపుకొని 10–15 మందితో డి.సి.ఇ.బి.లో ఒక్కొక్క సబ్జక్టుకు ఒక కమిటీని ఏర్పాటుచేస్తారు. అకడమిక్ అంశాలపై పట్టు ఉన్న ఒక ప్రధానోపాధ్యాయుడిని డి.సి.ఇ.బి. ఇన్‌చార్జిగా నియమిస్తారు. డి.సి.ఇ.బి. లో ఉన్న విషయనిపుణులు మాడరేషన్ కమిటీలో కూడా సభ్యులుగా ఉండవచ్చు. ఈ సభ్యులు పాఠశాలలకు వెళ్ళి పరీక్షల సంస్కరణల అమలుతీరును పరిశీలిస్తారు. డి.సి.ఇ.బి. కార్యదర్శి, విషయనిపుణులకు రాష్ట్రస్థాయిలో ఎస్.సి.ఇ.ఆర్.టి. ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తారు.
- 9, 10వ తరగతులకు ప్రశ్నాపత్రాలను (పబ్లిక్ పరీక్షలు మినహాయించి) రూపొందించే బాధ్యతను డి.సి.ఇ.బి చేపట్టాలి. వీటిని పాఠశాలకు పంపే బాధ్యత కూడా డి.సి.ఇ.బి. ద్వారా జరగాలి.
- ప్రశ్నాపత్రాలను డి.సి.ఇ.బి. రూపొందించడానికి ఆయా జిల్లాలలో పాఠ్యపుస్తక రచయితలు, విషయనిపుణులు, ఉపాధ్యాయ విద్యా బోధకులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో సబ్జక్టు వారీగా ఏర్పడిన బృందాలు, ప్రశ్నపత్రాలను తయారుచేస్తాయి. జిల్లా స్థాయిలో జరిగే ఎంపిక డైట్స్, సి.టి.ఇ., ఐ.ఏ.ఎస్.ఇ. ల ద్వారా జిల్లా విద్యాశాఖాధికారి మరియు ఉప విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో జరగాలి.
- డి.సి.ఇ.బి. ప్రశ్నాపత్రాలను రూపొందించడానికి ముందు జిల్లాలోని వివిధ పాఠశాలల నుండి ఆసక్తి కలిగిన ఉపాధ్యాయులు సంగ్రహణాత్మక ప్రశ్నాపత్రాలను రూపొందించి డి.సి.ఇ.బి. కి పంపేలా చర్యలు చేపట్టాలి. ఇలా వచ్చిన ప్రశ్నాపత్రాలను సబ్జక్టువారీ బృందాలు పరిశీలించి మంచి ప్రశ్నలతో కూడిన ప్రశ్నాపత్రాలను రూపొందించి సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని నిర్వహించాలి.

## విధులు, బాధ్యతలు

### ఎస్.సి.ఇ.ఆర్.టి:

- ఎస్.సి.ఇ.ఆర్.టి సంచాలకులు పరీక్షా సంస్కరణలపై ప్రభుత్వ పరీక్షా సంచాలకులతో చర్చించి తగిన ప్రతిపాదనలు రూపొందించి పాఠశాల విద్యా కమీషనర్ ద్వారా ప్రభుత్వానికి సమర్పించడం.
- ఈ పరీక్షా సంస్కరణలపై ఉపాధ్యాయులకు మరియు విద్యాశాఖ అధికారులకు, పర్యవేక్షణ సిబ్బందికి సబ్జక్టు వారీగా కరదీపికలు మరియు తగిన సూచనలు రూపొందించడం.
- జవాబు పత్రాలను దిద్దడానికి తగిన మార్గదర్శకాలను రూపొందించి ఉపాధ్యాయ కరదీపికలో పొందుపరచడం.
- ఈ పరీక్షా సంస్కరణల అమలుకు అవసరమయ్యే వనరులు మరియు సామగ్రిని పాఠశాలలకు సరఫరా చేయడం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించడం
- అంతర్గత మూల్యాంకనం (ఇంటర్నల్స్)కు తగిన మార్గదర్శకాలను రూపొందించడం.
- ఈ పరీక్ష సంస్కరణల అమలు పర్యవేక్షణ గురించి ఎస్.సి.ఇ.ఆర్.టి. తగిన పరిశోధనలు చేపట్టి తగిన చర్యలు తీసుకోవడం.

### ప్రభుత్వ పరీక్షా విభాగ సంచాలకులు (Commissioner for Government Exams):

- పాఠశాలు అంతర్గత మార్కులను ఆన్‌లైన్ ద్వారా పంపడానికి అవసరమైన కంప్యూటర్ ప్రోగ్రామింగ్ రూపొందించి, మార్గదర్శకాలతో సహా పాఠశాలలకు పంపించడం. దీనిపై అవగాహన కల్పించడం, మార్కుల మెమో మరియు సర్టిఫికెట్‌లను రూపొందించడం.
- అంతర్గత మూల్యాంకనం మార్కులను మరియు నామినల్ రోల్స్‌ను పాఠశాలలు తగు సమయంలో పంపించేవిధంగా చర్యలు చేపట్టడం.
- జవాబుపత్రాలను మూల్యాంకనం చేయించి ఫలితాలను విడుదల చేయడం.
- పరీక్షా అనంతర పనులు మరియు పున:మూల్యాంకనం (రీ వ్యాల్యుయేషన్) కోసం తగిన ఏర్పాట్లుచేయడం.

### పాఠశాల విద్య ప్రాంతీయ సంచలకులు, జిల్లా విద్యాధికారులు (RJD SEs and DEOs):

- ఉపాధ్యాయులకు మరియు పర్యవేక్షణాధికారులకు పరీక్షా సంస్కరణలు, విధానాలపై శిక్షణలు ఏర్పాటు చేయడం. ఈ శిక్షణలు కేవలం ప్రభుత్వ ఉపాధ్యాయులకే కాకుండా ప్రైవేట్ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులకు కూడా ఇవ్వడం.
- డి.సి.ఇ.బి. ని పునర్నిర్మాణంలో భాగంగా ఒక మంచి ప్రధానోపాధ్యాయుని ఇన్‌చార్జిగా నియమించి ప్రతి సబ్జక్టులో 10 నుండి 15 మంది సబ్జక్టు నిపుణులను నియమించడం. ఈవిధంగా ప్రతి సబ్జక్టుకు ఒక మంచి రిసోర్స్ గ్రూప్‌ను ఏర్పరచడం.
- అంతర్గత మూల్యాంకనం మార్కులను పరిశీలించడానికి మాడరేషన్ కమిటీలను ఏర్పరచడం. ఇద్దరు సభ్యులు గల మాడరేషన్ కమిటీలను రెండు లేదా మూడు మండలాలకు ఒకటి చొప్పున ఏర్పరచడం, వీరు 10 నుండి 15 పాఠశాలలకు వెళ్ళి పరిశీలించేలా ప్రణాళిక రూపొందించి అమలుపర్చడం.

- 9, 10వ తరగతి పరీక్షలకు సంగ్రహణాత్మక మూల్యాకనం కోసం DCEB ద్వారా ప్రశ్నపత్రాలను రూపొందించి సరఫరాచేయడం (10వ తరగతి పబ్లిక్ పరీక్ష పేపర్లు మినహాయించి).
- గైడ్లు మరియు స్టడీ మెటీరియళ్ళ వాడకాన్ని నిషేధించి పిల్లలు సొంతంగా ఆలోచించి జవాబులు రాసే విధానాన్ని ప్రోత్సహించడం మరియు దీన్ని పర్యవేక్షించడం.
- జవాబులను సొంతంగా ఆలోచించి రాసే విధానాన్ని కేవలం 10వ తరగతిలోనే కాకుండా 1వ తరగతి నుండే పిల్లలతో ప్రాక్టీస్ చేయించాలి మరియు ప్రోత్సహించాలి. ఈ విధానంలో పిల్లలు చక్కగా తమ సొంత భాషలో ఆలోచించి వ్యక్తీకరించడానికి ప్రయత్నిస్తారు మరియు నైపుణ్యాలను పొందుతారు. పాఠ్యపుస్తకాల్లో ఇవ్వబడిన విధంగా కృత్యాల ద్వారా, చర్చల ద్వారా, జట్టుపనుల ద్వారా నేర్చుకోవడాన్ని ప్రోత్సహించాలి.

## డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్:

- తమ ఆధీనంలో ఉన్న పాఠశాలల్లో ఈ పరీక్షా సంస్కరణల 100% అమలుకు డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ బాధ్యత వహించాలి. అంతర్గత మూల్యాంకనంపై పర్యవేక్షణ చేయాలి. అంతర్గత మూల్యాకనంలో కేటాయించిన మార్కులను సరిపోల్చి చూడాలి. ఈ సంస్కరణలు కేవలం ప్రభుత్వ పాఠశాలలే కాక ప్రైవేట్ పాఠశాలల్లో కూడా అమలు జరిపేలా చూడాలి.
- తమ ఆధీనంలో ఉన్న పాఠశాలల్లో పనిచేసే మంచి నిపుణులైన ఉపాధ్యాయులను గుర్తించి డి.సి.ఇ.బి. బోర్డులో సబ్జక్టు గ్రూపులలో నియామకానికి తగిన ప్రతిపాదనలు జిల్లా విద్యాశాఖాధికారికి పంపించాలి.
- పాఠ్య, సహపాఠ్య కార్యక్రమాలను మరియు పరీక్షల సంస్కరణలకు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ఏవిధంగా పర్యవేక్షిస్తున్నారో గమనించాలి. తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలి, తగు చర్యలు చేపట్టాలి.
- నూతన పాఠ్యపుస్తకాల అమలు, బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ, పరీక్షా సంస్కరణల అమలును పరీక్షించి వాటిలోని చిత్రాలు, బలహీనతలను అభివృద్ధి చెందాల్సిన అంశాలను తప్పనిసరిగా అకడమిక్ గైడెన్స్ రిజిష్టర్‌లో రాయాలి. ఇలా రాసిన అంశాల అమలును తదుపరి సందర్శనలో చూడాలి.
- బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ, పాఠ్యపుస్తకాల గురించి, పరీక్షా సంస్కరణల గురించి SCERT రూపొందించిన కరదీపికలను, ఇచ్చిన సూచనలను ఏ రకంగా పాఠశాలలో అమలవుతున్నాయో పరిశీలించడానికి తగిన దృక్పథాన్ని మరియు జ్ఞానాన్ని ఏర్పరచుకోవాలి. వీటిని ఇంకా మెరుగుపరచుకోవడానికి ఇతర ఆధార గ్రంథాలను చదవడం లేదా అంతర్జాలాన్ని ఉపయోగించుకోవాలి. ఇవి తెలియకుండా పర్యవేక్షణ అనేది కేవలం అధికారికమే అవుతుంది కానీ ఏవిధంగా కూడా నాణ్యతా వృద్ధికి మరియు ఉపాధ్యాయుల పనితీరు మెరుగుదలకు ఉపయోగపడదు.

## ప్రధానోపాధ్యాయుడు:

- పాఠశాలలో నాణ్యమైన బోధన, పాఠ్య ప్రణాళికల రూపకల్పన, ఉపాధ్యాయుల తయారీ, తరగతి గదిలో బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ, పరీక్షల నిర్వహణ, మొదలగు వాటిపై బాధ్యత వహించాల్సింది

ప్రధానోపాధ్యాయుడే. ఇతనే మొట్టమొదటి పర్యవేక్షకుడు. పాఠశాలల్లో పాఠ్య, సహపాఠ్య కార్యక్రమాల అమలు సక్రమంగా అమలు జరిగేలా చూడాలి. బాధ్యత వహించాలి.

- ♦ అత్యున్న ప్రతిభగల్గిన పిల్లలు, ఉపాధ్యాయులను గుర్తించి వారిని ప్రోత్సహించాలి. వీరి గురించి ఉన్నతాధికారులకు, SCERT కి తెలియజేయాలి.
- ♦ ఉపాధ్యాయులందరూ నూతన పాఠ్యపుస్తకాలను చదివి అర్థం చేసుకొని అమలుపరిచేలా చూడాలి.
- ♦ పాఠశాలల్లో అంతర్గత మూల్యాంకనం నిర్వహణ అనగా నిర్మాణాత్మక మరియు సంగ్రహణాత్మక పరీక్షల నిర్వహణ, మార్కుల కేటాయింపు, విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల రాసిన రికార్డుల పరిశీలన మరియు వాటిపై ప్రతిస్పందన అనేది తప్పనిసరిగా ప్రధానోపాధ్యాయుడు పరిశీలించాలి. సక్రమంగా అమలుజరిగేలా చూడాలి.
- ♦ అంతర్గత మూల్యాంకనం మరియు పరీక్షల షెడ్యూల్‌ను అందరూ పాటించేలా ప్రధానోపాధ్యాయుడు చూడాలి. క్యుములేటివ్ రికార్డులను సరిగా నిర్వహించేలాచూడాలి.
- ♦ ఉపాధ్యాయులు వార్షిక ప్రణాళికలు, పాఠ్యప్రణాళికలు రాసి బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించేలా చూడాలి.
- ♦ పాఠశాలలో ఉన్న వివిధ వనరుల ఉపయోగం అనగా గ్రంథాలయం, ప్రయోగశాల పరికరాలు మొదలగు వాటిని ఉపయోగించడం ద్వారా నాణ్యమైన బోధనాభ్యసన విధానాలు అమలు జరిగేలా ప్రధానోపాధ్యాయుడు చూడాలి.
- ♦ ఉపాధ్యాయుల బాధ్యతల నిర్వహణ, బోధనాభ్యసన విధానాలు, విద్యార్థుల అభ్యసనా ఫలితాలు మొదలగు వాటిపై నెలకొకసారి ఉపాధ్యాయులచే సమావేశం ఏర్పరచి సమీక్షించాలి. ఉపాధ్యాయుని వారీగా సూచనలను ఇచ్చి వాటిని మినట్స్ పుస్తకంలో రాయాలి. ఇచ్చిన సూచనలు మరియు సలహాలను ఏవిధంగా పాటిస్తున్నారనేది ప్రధానోపాధ్యాయుడు పర్యవేక్షించాలి మరియు తగిన చర్యలు తీసుకోవాలి.
- ♦ పిల్లల అభ్యసన స్థాయిలపై మరియు వారు వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడంపై తల్లిదండ్రులకు తగిన సమాచారాన్ని ఇవ్వాలి.
- ♦ బోధనోపకరణాలను, బోధనాభ్యసన సామాగ్రిని గ్రంథాలయపుస్తకాలను వినియోగించి నాణ్యమైన బోధన జరిగేలా చూడాలి.
- ♦ ఉపాధ్యాయులు ఆచరించే బోధనాభ్యసన విధానాలను అవగాహన చేసుకొని సూచనలు ఇవ్వాలంటే వివిధ బోధనా పద్ధతులు మరియు సబ్జక్టు విషయంపై పట్టు ఉండాలి. దీనికై ప్రధానోపాధ్యాయుడు వివిధ రకాలైన పుస్తకాలను, కరదీపికలను చదవాలి. పాఠశాలకు సంబంధించి తగిన జ్ఞానాన్ని పొందటానికి నిరంతరం ప్రయత్నించాలి. గ్రంథాలయాలకు ఇచ్చిన ఉపాధ్యాయులకు ఉపకరించే గ్రంథాలను వారిచే చదివించి వాటిపై మాట్లాడించాలి. అప్పుడప్పుడు నిపుణులను పిలిపించి ఆయా విషయాలపై చర్చించాలి. జ్ఞానాన్వేషణను ఒక నిరంతర ప్రక్రియగా సాగించినప్పుడు మాత్రమే మనం ఈ ఉపాధ్యాయ వృత్తికి అర్హులవుతాము.

- ప్రధానోపాధ్యాయుడు FA మార్కులను, గ్రేడ్లను, సహపాఠ్య ప్రణాళిక విషయాల వివరాలను ప్రభుత్వ పరీక్షల విభాగ సంచాలకులకు నిర్ధారిత నమూనా ద్వారా ఆన్‌లైన్లో పంపాలి.
- పిల్లల అభ్యసన స్థాయిని, పాఠశాలలో జరుగుతున్న కార్యక్రమాల గురించి తల్లిదండ్రులకు వివరించాలి. వారి నుండి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు స్వీకరించాలి.
- పాఠశాలలోని ప్రతి ఉపాధ్యాయుడి తరగతి నిర్వహణను పరిశీలించాలి. సూచనలివ్వాలి. మెరుగుపరచుకొనుటలో తోడ్పడాలి.
- తన పాఠశాలలో గైడ్లు, స్టడీ మెటీరియల్స్ వాడకాన్ని నిరోధించాలి. దీంట్లో జవాబులు రాయడం, బట్టీపట్టడంవల్ల పిల్లల్లో స్వీయవ్యక్తీకరణ సామర్థ్యం, సృజనాత్మకత దెబ్బతింటుంది.
- పాఠ్య విషయాలతోపాటు సహపాఠ్య విషయాలను కూడా ఉపాధ్యాయులకు కేటాయించి, వాటికి బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించేలా చూడాలి.

**ఉపాధ్యాయులు :**

- నూతన పాఠ్యపుస్తకాలను చదివి అర్థంచేసుకొని సరిగా వినియోగించాలి. పాఠ్యపుస్తకాలలో పొందుపరిచిన వాటికనుగుణంగా అమలుపరచటం అనేది ప్రధాన బాధ్యత. ప్రాజెక్టుపనులు, కృత్యాలు, అన్వేషణ కృత్యాలు, జట్టుపనులు మొదలగువాటిని నిర్వహించాలి.
- పిల్లలు గైళ్ళు, స్టడీ మెటీరియల్స్‌ను వాడకుండా ఉపాధ్యాయులు చూడాలి. వాటిని నిషేధించాలి. పాఠాల్లో ఉన్న అభ్యాసాలను విధిగా చేయించాలి. చూసి రాసే విధానాన్ని నిరుత్సాహపరచాలి. పిల్లలు వారి వారి సొంతమాటలో, సృజనాత్మకంగా రాసే విధానాన్ని ప్రోత్సహించాలి.
- నూతన వాచకాలలో పొందుపరిచిన అభ్యాసాలు ఆలోచింపజేసేవి, విశ్లేషణాత్మకమైనవి. పిల్లలు వీటిని చదివి, ఆలోచించి సొంతంగా రాయాలి. వీటి జవాబులను గైడ్లు, స్టడీమెటీరియల్స్‌లో చూసి రాయకూడదు లేదా చివర పిల్లలు రాసిన నోటుబుక్కులు చూసి కూడా రాయకూడదు. కాబట్టి వీటిని వాడకుండా ఉపాధ్యాయులు బాధ్యతవహించాలి. పిల్లలే సొంతంగా రాసేలా చూడాలి. ప్రోత్సహించాలి.
- పాఠాల మధ్యలో బాక్స్‌ల్లో ఇచ్చిన ప్రశ్నల గురించి తరగతి గదిలో చర్చించాలి. పిల్లల అభిప్రాయ వ్యక్తీకరణకు స్వేచ్ఛా వాతావరణాన్ని కల్పించాలి. సమకాలీన అంశాల గురించి ప్రతిస్పందించేలా చూడాలి. దీనివల్ల వారి అనుభవాలు, భావాలు వెల్లడి అవుతాయి. దీనివల్ల పాఠ్యపుస్తకాలలోని అంశాలను పిల్లలు తమదైనందిన జీవితంలో వినియోగించే సామర్థ్యం వృద్ధిచెందుతుంది.
- పాఠ్య – సహపాఠ్య విషయాలను పిల్లల భాగస్వామ్యంతో బోధన నిర్వహించాలి. ఆధార గ్రంథాలను, ఇతర పుస్తకాలను చదవటానికి పూనుకోవాలి. అన్ని విషయాలపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి. పాఠ్యపుస్తకాన్ని కూడా ఒక ఆధార గ్రంథంగా పరిగణించుకోవాలి. సమగ్ర విషయ వివరణలతో టీచింగ్ నోట్స్ రాయాలి. పాఠ్య, సహపాఠ్య విషయాలను తగిన ప్రణాళికతో నిర్వహించాలి.

- సంగ్రహణాత్మక, నిర్మాణాత్మక మూల్యాంకనాలను నిర్వహించి విద్యార్థుల ప్రగతిని ప్రధానోపాధ్యాయులకు అందించాలి. నోట్‌బుక్స్‌ను సక్రమంగా దిద్దాలి. మాడరేషన్ కమిటీ చూడడానికి అన్ని ఆధారాలను సిద్ధం చేసి ఉంచుకోవాలి. ఇందుకు అవసరమైన నోటుబుక్కులు, పిల్లల ప్రాజెక్టు పనుల నివేదికలు వంటివి ఆధారాలుగా చూపాలి.
- ఉపాధ్యాయ కరదీపికలు, మాడ్యూల్స్‌ను తప్పనిసరిగా చదవాలి. భద్రపరచుకోవాలి. బోధన అనేది వృత్తి. బోధకుడు అనేవాడు వృత్తినిపుణుడు. కాబట్టి ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలుసుకుంటూ, కొత్త పోకడలను అవగాహన చేసుకుంటూ, ముందుకెళ్ళాలి. అందుకోసం మ్యాగజైనులు, ఆధార గ్రంథాలు చదవాలి. సంబంధిత సెమినార్‌లకు హాజరుకావాలి. శిక్షణలలో ఉత్సాహంగా పాల్గొనాలి. ఇతరుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలి. తాను ఎంతగా పురోభివృద్ధి చెందితే విద్యార్థులకు అంత న్యాయం జరుగుతుంది.
- వార్షిక / యూనిట్ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. పిల్లల్లో ఉండే సృజనాత్మకతను ప్రోత్సహించాలి. వారి అభిప్రాయాలను గౌరవించాలి. వారు చెప్పే విషయాలను వినాలి వారి అభివృద్ధికి కృషిచేయాలి.

  S.C.E.R.T. ద్వారా ప్రతిపాదించిన ప్రతిపాదనలనన్నింటినీ ప్రభుత్వం సునిశితంగా పరిశీలించిన పిమ్మట ప్రభుత్వం వాటిని ఆమోదించింది. కమీషనర్ & డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, డైరెక్టర్, S.C.E.R.T. వారు కలసి 9వ, 10వ తరగతులకు నిర్దేశించిన సంస్కరణలను ముందుకు తీసుకెళ్ళాలి. ప్రభుత్వ / పంచాయత్ రాజ్ / ప్రభుత్వ సహాయ / ప్రైవేట్ పాఠశాలలన్నింటికీ ఇవి వర్తిస్తాయి.

- కమీషనర్ & డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, వీటి నిర్వహణ, అమలు గురించి అవసరమైన మార్గదర్శకాలను S.C.E.R.T. సంచాలకులు జారీచేస్తారు.



# VII. నిర్మాణాత్మక మూల్యాంకనం నిర్వహణ విధానం

## నిర్మాణాత్మక మూల్యాంకనం - (Formative Assessment)

**పరిచయం :**

రాష్ట్రంలో విద్యాసంస్కరణల్లో భాగంగా 2012-13 విద్యా సంవత్సరం నుండి నిరంతర సమగ్రమూల్యాకనం అమలు జరుగుతున్న విషయం తెల్సిందే! ఈ విధానాలనే 9, 10 తరగతులకు విస్తరించారు.

విద్యార్థుల ప్రగతిని కేవలం పరీక్షల ద్వారానే అంచనావేయడం శాస్త్రీయమైందికాదని ప్రత్యామ్నాయ విధానాల ద్వారా కూడా మూల్యాంకనం చేయవచ్చని సి.సి.ఇ. అమలు ద్వారా గుర్తించాలి. పిల్లలు ఎలా నేర్చుకొంటున్నారు? ఎక్కడ ఇబ్బందిపడుతున్నారు? గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టడానికి ఉద్దేశించినదే నిర్మాణాత్మక మూల్యాకనం. వీటిని 10వ తరగతి వరకు కొనసాగించడం, ఉద్దేశించినదే నిర్మాణాత్మక మూల్యాంకనం. వీటిని 10వ తరగతి వరకు కొనసాగించడంలో భాగంగా సంగ్రహణాత్మక, నిర్మాణాత్మక మూల్యాంకనాలను కింది విధంగా నిర్వహిస్తారు.

సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని 80 మార్కులకు, మిగతా 20 మార్కులకు నిర్మాణాత్మక మూల్యాంకనాన్ని నిర్వహిస్తారు. సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని రాతపరీక్ష ద్వారా నిర్వహిస్తారు. నిర్మాణాత్మక మూల్యాంకనానికి కేటాయించిన 20 మార్కులను కింది విధంగా కేటాయిస్తారు.

| | |
|---|---|
| 1. పుస్తకపఠనం, సమీక్షారచన (Book Reading and Review) | 5 మార్కులు |
| 2. విద్యార్థులు రాసిన అంశాలు (Written Work) | 5 మార్కులు |
| 3. ప్రాజెక్టు పని (Project Work) | 5 మార్కులు |
| 4. లఘుపరీక్ష (Slip Test) | 5 మార్కులు |

విద్యార్థుల వివిధ నైపుణ్యాలను పరిగణలోకి తీసుకునే పై నాలుగు అంశాల గురించి విడివిడిగా వివరంగా పరిశీలిద్దాం.

## 1. పుస్తకపఠనం - సమీక్షా రచన - అంటే ఏమిటి?

పుస్తకపఠనం అంటే విద్యార్థి తాను అభ్యసించే పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా పాఠశాల గ్రంథాలయ పుస్తకాలు, బాలసాహిత్యం, ఇతర పుస్తకాలు చదవడం. అంతేకాకుండా దినపత్రికలకు చెందిన ఆదివారం అనుబంధాలు (మాగ్జిన్స్), వార్తాపత్రికల్లోని ప్రత్యేక కథనాలు, అవసరంమేరకు ఉపాధ్యాయుడే సమకూర్చినా సరే. కథలు, సైన్స్, చరిత్ర, గేయసంపుటాలు ఏదైతేనేం. ఆయా విద్యార్థులస్థాయికి అనుగుణమైన పుస్తకాల్ని పిల్లలు చదవాలి.

నెలకో పుస్తకాన్ని విద్యార్థులతో చదివించి ప్రతినెలా ఆయా పుస్తకం గురించి సమీక్ష/నివేదిక రాయించాలి. ప్రతి రెండు నెలల పుస్తకసమీక్షల ఆధారంగా ఆనెల నిర్మాణాత్మక మూల్యాంకనం (FA)కు చెందిన మార్కులు నమోదు చేసుకోవాలి.

## 2. ఇతరపుస్తకాల పఠనం - సమీక్షారచన ఎందుకు ?

విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలే చదవడంవల్ల తగినంత అదనపు జ్ఞానాన్ని పొందలేకపోతున్నారు. అదీగాక పాఠ్యపుస్తక అభ్యసనం ద్వారా పొందిన భాషా పరిజ్ఞానంతో బయటి పుస్తకాల్ని స్వయంగా అభ్యసించి అందులోని విషయాల్ని గ్రహించే స్థాయికి విద్యార్థి ఎదగాల్సిన అవసరం ఉంది. ఆ దృష్టితోనే ఉపవాచక పాఠ్యాంశాలను పాఠ్యపుస్తకాలలో చేర్చారు. అయినా విద్యార్థుల్లో స్వీయ అభ్యసన, విస్తార పఠనం పెంపొందడంలేదు. ఈ దృష్ట్యా విద్యార్థుల్లో అపరిమిత పుస్తక పఠనాభిలాషను పెంపొందించడం, స్వయంగా అదనపు సమాచారాన్ని గ్రహింపజేయడం విస్తారపఠనాన్ని పెంపొందించడం.. తదితర లక్ష్యాలు నెరవేరే అవకాశం ఉంది.

## 3. సమీక్షారచన - ప్రాధాన్యత :

కేవలం పాఠ్యపుస్తకాల పఠనం ఇప్పటివరకు అందరు విద్యార్థుల నుండి దాదాపు ఒకే రకమైన వ్యక్తీకరణకు అవకాశం కలిగిస్తూ వస్తున్నది. పాఠ్యపుస్తకాల్లోని సారాంశాల్లో, గైడ్‌లనుండి బట్టీపట్టినవో రాస్తున్న సందర్భాలు ఎక్కువగా ఉన్నాయి. విద్యార్థులకు ఇతర పుస్తకాలు అందించి సమీక్షలు, నివేదికలు రాయించడం ద్వారా తప్పనిసరిగా వారి స్వంత వ్యక్తీకరణ బయట పడుతుంది. ఆయా విద్యార్థులకు వేర్వేరు పుస్తకాలు అందించడంవల్ల ఒకరిది మరొకరు చూసిరాసే అవకాశం కూడా లేదు. ఒకే పుస్తకాన్ని వేరు వేరు విద్యార్థులు చదివినప్పటికీ సమీక్షలు-నివేదికలు ఖచ్చితంగా వేరు వేరుగానే ఉంటాయి. పిల్లల్లోని స్వీయవ్యక్తీకరణ నైపుణ్యాన్ని వెలికితీసే అవకాశం గల్గిన సమీక్షా రచన ఈ నిర్మాణాత్మక మూల్యాంకనంలో ఒక భాగమైంది.

## 4. తరగతిగదిలో ఎలా నిర్వహించాలి?

- ఎంచుకున్న తరగతికి సరిపడా పుస్తకాల్ని పాఠశాల గ్రంథాలయం నుండి వెలికితీసి ప్రదర్శనకు పెట్టాలి.
- పిల్లలకు తగిన పుస్తకాల్ని అవసరమైతే పిల్లల సంఖ్యకు మించికూడా ప్రదర్శనలో ఉంచొచ్చు.
- పాఠశాల వరండాలోనో, వీలైతే తరగతి గదిలోనో పుస్తకప్రదర్శన ఏర్పాటుచేసి ఆయా విద్యార్థుల్ని వరుసగా తమకు నచ్చిన పుస్తకాన్ని తీసుకొమ్మనవచ్చు.
- ఆయావిద్యార్థుల పేర్లు పుస్తకం పేరు నమోదుచేసుకొని, వారం పదిరోజుల వరకు వారికి సమయం ఇచ్చి సమీక్ష రాయమనాలి.

- సమీక్ష ఎలా రాయాలో తగినసూచనలు సలహాలు ఇవ్వాలి.
- అవసరమైతే ఆయా మ్యాగ్జైన్లలో ప్రచురితమైన పుస్తక పరిచయాల్ని చదివి వినిపించవచ్చు.
- సాధ్యమైనంత వరకు విద్యార్థులు అందరూ వేర్వేరు పుస్తకాలు స్వీకరించేలా చూడాలి. వేర్వేరు పుస్తకాలు కాబట్టి ఎవరిసమీక్ష వారు స్వంతంగా రాసే అవకాశం ఉంటుంది.
- పుస్తకసమీక్షకు ప్రత్యేకంగా ఒక నోటుపుస్తకం ఏర్పాటు చేయించి, ఆయా సమీక్షల్ని అందరిచేతా తరగతిగదిలో చదివించాలి.
- వాటి సమీక్షాస్థాయినిబట్టి 5 మార్కుల వరకు FAలో నమోదుచేసుకోవాలి.

**5. మాదిరి సమీక్షారచన :**

విద్యార్థులకు కేటాయించిన పుస్తకాలకు యా విద్యార్థులచే క్రింది విధంగా సమీక్ష రాయించవచ్చు.

అయితే పుస్తక సమీక్ష అనగానే పుస్తకమంతా చదివి రాయాలని ఏమీలేదు. అక్కడక్కడా చదివి అందులోని మంచి చెడుల్ని పరిచయంచేసేలా ఉంటే చాలు.

మానస అనే విద్యార్థిని రాసిన పుస్తక సమీక్షను మాదిరిసమీక్షగా ఇక్కడ పొందుపరచబడినది.

**పుస్తక సమీక్ష :**

పుస్తకం పేరు : నవ్వుతున్న నేలతల్లి ప్రక్రియ : కథాసంపుటి

పుస్తక రచయిత : కటుకొజ్వల మనోహరాచారి

పుస్తక సమీక్షకురాలు : ఎ. మానస తరగతి : 9వ

నవ్వుతున్న నేలతల్లి అనే పుస్తకం చూడగానే ఆకర్షణీయంగా కనిపించింది. పైన ముఖచిత్రంతోపాటు పుస్తకంపేరు కూడా ఎంతో ఆసక్తికరంగా, చదవాలనిపించేలా ఉంది.

ఇది 12 కథలలో కూడుకున్న కథలసంపుటి. కథలన్నీ దాదాపు ప్రధాన పత్రికల్లో ప్రచురితమైనవే. ఒక్కో కథ ఒక్కో ప్రత్యేకతను సంతరించుకొన్నది. దాదాపు అన్ని కథలు ఏదో ఒక సందేశాన్ని ఇస్తున్నట్లుగా ఉన్నాయి. అన్ని కథలూ సమాజనేపథ్యంలో సాగినవే.

'దూరపుకొండలు' అనే కథ.... దుబాయ్‌లో ఉండే ఒక వ్యక్తి ఆర్థికంగా తాను ఉన్నత స్థితిలో ఉన్నానని పొంగిపోతుండాడు. భారతదేశానికి వచ్చాక తోటి మిత్రులు సాధారణంగా బ్రతికేస్తున్న విధానం చూసి జాలిపడతాడు. అయితే ఒక మిత్రుని ఇంటికి భోజనానికి వెళ్ళి అక్కడ అతను పేదరికంలోనే భార్యాపిల్లల్తో కలిసి జీవించే అన్యోన్యతను చూసి జీవితంలో తనేం కోల్పోతున్నాడో గ్రహించడం ఇందులోని అంశం.

'నవ్వుతున్న నానేలతల్లి' అనే కథ రోడ్లనానుకొని ఉన్న వ్యవసాయభూములన్నీ ప్లాట్లుగా చేసి విక్రయించడం.. తర్వాత తరానికి అసలు వ్యవసాయభూమి మిగులుతుందా? తిండిపెట్టే రైతుపరిస్థితి ఏమిటి? అని ప్రశ్నించే కథ.

అట్లే కాకిగోల అనే కథలో రచయిత ప్రకృతిలో పశుపక్షాదులు, చెట్లు నశించిపోతున్నాయని, కాకులు కూడా కనుమరుగవుతున్నాయనీ, వీటంతటికీ మనీషే కారణమన్న ఆవేదనతో మిగిలిన ఒకే కాకి మనిషి చచ్చిపోతే పిండం ముట్టడానికి కూడా రాదు' అని చూపించారు. నశించిపోతున్న వనసంపద మీద రచయిత ఆవేదన ఇందులో కనిపిస్తుంది.

ఇలా 'కర్మసౌందర్యం' అనే కథ మనిషిగా పుట్టినవ్యక్తి ఏదో ఒక పని చేయాలని 'ముదురు'। అనేకథ సమాజంలో వ్యక్తులు పెళ్ళిచూపుల పేరుతో అమ్మాయిల్ని చూసే రకరకాలవంకలతో ఎలా తిరస్కరిస్తున్నారో చెబుతాయి. కన్నీటి కార్ఖానా అనే కథ గల్ఫ్ జీవితంలోని దుర్భలస్థితిని వ్యక్తం చేస్తుంది. అట్లే 'అరచేతిలో వైకుంఠం', ఓటరు నాడి వంటి కథలు సమాజంలోని ప్రస్తుత స్థితిని తెలుపుతాయి.

ఇట్లా ప్రతికథా ఏదో ఒక సందేశాన్ని ఇస్తూ మనల్ని మేల్కొలుపుతున్నట్లుగా తోస్తాయి. చదివినకొద్దీ చదవాలనిపించేలా ఆసక్తికరంగా సాగుతాయి. పుస్తకం వెల అందుబాటులో ఉండి ప్రచురణకూడా అందంగా ఉంది. ఈ పుస్తకాన్ని మిగతా మిత్రులు కూడా చదవాలని ఆశిస్తున్నాను.

## 6. మార్కుల కేటాయింపు :

నిర్మాణాత్మక మూల్యాంకనంలో పుస్తకపఠనం, సమీక్షారచనకు 5 మార్కులు కేటాయించడం జరిగింది.

విద్యార్థిస్వీకరించిన పుస్తకం గురించి రెండు పేజీలకు మించకుండా ఒక పేజికి తగ్గకుండా రాసిన విధానాన్ని అనుసరించి తగువిధంగా మార్కులు కేటాయించాలి. పుస్తకం చదవడం, నివేదిక, సమీక్ష రాయడానికి సగం మార్కులు, దాన్ని తరగతిలో చదివి విన్పించినందుకు సగం మార్కులు కేటాయించాలి. పది మార్కులకు మార్కులు కేటాయించి '5'కు లెక్కించి నమోదుచేయాలి. పుస్తకం పేరు, ప్రచురణకర్త లేదా రచయిత, సమీక్షకుడు వంటి వివరాలకు 1 మార్కు పుస్తక పరిచయ వాక్యాలకు 1 మార్కు అంశ వివరణకు 2 మార్కులు, ముగింపుకు ఒక మార్కు చొప్పున మొత్తం 5 మార్కులకు ఈ 'పుస్తక పఠనం సమీక్ష' అనే అంశాన్ని నిర్వహించి నమోదు చేయాలి.

ప్రతి సమీక్షారచనకు 5 మార్కులచొప్పున మొదటినెలలో నిర్వహించిన సమీక్షా రచనకు వచ్చిన మార్కులు, రెండవ నెలలో నిర్వహించిన సమీక్షా రచనకు వచ్చిన మార్కులు మొత్తం నుండి సగం మార్కుల్ని FAలోని ఈ అంశానికి చెందిన కాలంలో నమోదు చేయాలి. (మొదటి నెల సమీక్షామార్కులు + రెండవనెల సమీక్ష మార్కులు/2)

## 7. తీసుకోవాల్సిన జాగ్రత్తలు :

- ప్రతినెలా పుస్తకపఠనం – సమీక్షరాయించాలి.
- ఏనెలకు ఆనెల వేర్వేరు పుస్తకాలు కేటాయించాలి.
- పాఠశాల గ్రంథాలయ పుస్తకాల్ని సంపూర్ణంగా వినియోగించుకోవాలి.
- గ్రంథాలయ పుస్తకాలే కాకుండా వార్తాపత్రికల మాగ్జిన్లు, వార్తాకథనాలు, సంపాదకీయ వ్యాసాలు, ఉపాధ్యాయుడు సమకూర్చిన పుస్తకాలు ఇతరత్రా వినియోగించవచ్చు.
- సమీక్ష అనేది స్వీయవ్యక్తీకరణకు సంబంధించినది కాబట్టి ఒకే పుస్తకం లేదా వ్యాసం ఇరువురికి కేటాయించకుండా జాగ్రత్త వహించాలి.
- విద్యార్థుల్ని పుస్తకప్రదర్శన ఏర్పాటు చేయడం ద్వారా పుస్తకాల్ని ఎంపిక చేసుకునే అవకాశం కల్పించాలి.
- పుస్తకాల కేటాయింపు జరిగాక విద్యార్థులకి వారం రోజులకు తక్కువ కాకుండా సమీక్షారచనకు సమయం కేటాయించాలి.

- ప్రతి రెండు సమీక్షరచనల సగటు మార్కుల్ని FAకు చెందిన సంబంధితకాలంలో నమోదు చేయాలి.
- ముఖ్యంగా సమీక్షారచన అనగానే స్థాయికి మించిందిగా భావించి బయపడాల్సిన అవసరం లేదు.
- పుస్తకం పెద్దదైనప్పుడు ప్రధానాంశాల్ని చదివి కూడా అందులోని మంచీచెడుల్ని పరిచయం చేసేలా రాసినా సరిపోతుందని ఉపాధ్యాయులు గ్రహించాలి.

## 2. రాత అంశాలు

**రాత అంటే ?**

విద్యార్థి తన భావవ్యక్తీకరణకు ఉపయోగించే సాధనాల్లో వాగ్రూపం మొదటిదైతే లిఖితరూపం రెండవది. లిఖిత రూపంలో భావవ్యక్తీకరణ చేయడానికి ఉపయోగపడేది రాతపని. విద్యార్థి తన భావాలను సొంతమాటల్లో రాయడం, సృజనాత్మకతకంగా రాయడం, భాషాంశాలకు సంబంధించిన అంశాలు రాయడం అనేవి రాతపనిని ప్రత్యేకంగా సూచిస్తాయి.

**ఏమి రాయాలి?**

రాత అంశాల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసిన అవసరం ఉంది. పాఠ్యపుస్తకంలో పాఠ్యాంశం తర్వాత 'ఇవి చేయండి' శీర్షిక కింద ఇచ్చిన సామర్థ్యాల సాధనకు సంబంధించినవి రాత అంశాలు. ప్రతి విద్యార్థి ఒక ప్రత్యేక నోట్ పుస్తకంలో వీటిని రాయాల్సి ఉంటుంది. పిల్లలు వారి నోట్‌పుస్తకాల్లో రాయాల్సిన అంశాలు సామర్థ్యాల వారిగా చూద్దాం!

I. **అవగాహన – ప్రతిస్పందన**లోని రెండవ సామర్థ్యం – ధారాళంగా చదవడం – అవగాహనతో రాయడంలోని అంశాలు (కొన్ని అంశాలు పాఠ్యపుస్తకానికే పరిమితమై ఉంటాయి)

II. **వ్యక్తీకరణ – సృజనాత్మకత**లోని ప్రతి సామర్థ్యానికి సంబంధించిన అన్నీ ప్రశ్నల జవాబులను నోట్‌పుస్తకంలోనే రాయాల్సి ఉంటుంది. సృజనాత్మకత / ప్రశంసకు సంబంధించిన ప్రశ్నలు జవాబులను ప్రత్యేక పుటల్లో రాసేలా చూడాలి.

III. **భాషాంశాలు –** దీనిలో పదజాలం వ్యాకరణాంశాలకు సంబంధించిన సామర్థ్యాల్లో అవసరమైన వాటి కొరకు నోటుపుస్తకం వినియోగించుకోవాలి.

**ఏలా రాయాలి?**

విద్యార్థి నోటుపుస్తకాలను పరిశీలించడం ద్వారా ఈ రాత అంశాలస్థాయికి గుర్తించవచ్చు. పాఠ్యపుస్తకంలోని అభ్యాసాలను విద్యార్థి నోటు పుస్తకంలో రాస్తాడు. ఇందులో అవగాహనకు సంబంధించిన ప్రశ్నలు, స్వీయరచన, సృజనాత్మకతకు చెందిన ప్రశ్నకు స్వయంగా రాస్తాడు. స్వయంగా రాసేలా ఉపాధ్యాయుడు తగిన తర్ఫీదు నిస్తాడు. అలా రాసిన అంశాల్లోని రచనాశైలి, స్వీయభావనలు, భాష, వాక్యనిర్మాణ రూపము తదితరాలన్నీ ప్రాధాన్యత వహిస్తాయి. ముఖ్యంగా విద్యార్థి స్వంత వ్యక్తీకరణకు ప్రాధాన్యతనిచ్చి రాసిన అంశాలన్నీ ఈ రాతాంశాల కింద పరిశీలించాలి.

విస్తృత పరిధి గలిగిన ఈ రాత అంశాల్ని విద్యార్థుల్లో పరిశీలించడమంటే కేవలం సంగ్రహణాత్మక మూల్యాంకనం (FA) ద్వారా నిర్వహించే రాత పరీక్షాంశాలు పరిశీలించి విద్యార్థి రాతస్థాయిని అంచనా వేయలేము.

గతంలోలా గైడ్‌లను ఆశ్రయించి పాఠ్యపుస్తకంలోని ప్రశ్నలకు మక్కికి మక్కి సమాధానాలు నోటుపుస్తకంలో ఎక్కించడం వల్ల విద్యార్థిలో ఈ సామర్థ్యం ఏకోశానా పెంపొందదు అన్నది సుస్పష్టం. ఒక విద్యార్థి నోటుపుస్తకం మరొక విద్యార్థిచూసి రాయడం కూడా ప్రయోజనాన్ని చేకూర్చదు.

ఈ దృష్ట్యా విద్యార్థి స్వీయ అభిప్రాయాలు, భావనలకు ప్రాధాన్యతనిస్తూ వాటిని స్వయంగా వ్యక్తీకరించడం కోసం పాఠ్యపుస్తకాల్లోని అభ్యాసాలు నూతన విధానంలో కూర్చడం జరిగింది.

ప్రధానంగా 'వ్యక్తీకరణ-సృజనాత్మకత' అనే అభ్యాసం విద్యార్థిలోని స్వంత భావనల వ్యక్తీకరణకు అనువైనది. సొంతమాటల్లో రాయించడం, అభిప్రాయాలు చెప్పించడం, సమర్థిస్తూ రాయడం, విశ్లేషిస్తూరాయడం, ఊహించడం తదితరాలన్నీ విద్యార్థి ఆలోచనకు పదునుపెట్టేవి. తప్పనిసరిగా తను స్వయంగా అనుభవంలోకి తెచ్చుకుని ఊహిస్తే తప్ప సమాధానాలు రాయలేనిస్థితి.

కనుక పిల్లల్లో గత విధానాలకు భిన్నంగా అవగాహనా, భావనాశక్తి, ఊహాశక్తి, విశ్లేషణాశక్తి, స్వీయానుభూతులు వగైరా వెలికివచ్చే అవకాశం ఈ రాత అంశాలద్వారా గుర్తించగలుగుతాం..

కనుక రాత అంశాలకు ఈ కోణంలో తగు ప్రాధాన్యత నిచ్చి నిర్మాణాత్మక మూల్యాంకనం (FA)లో ఒక భాగంగా చేర్చడం జరిగింది.

**- ఎట్లా నిర్వహించాలి ?**

రాత అంశాలు పరిశీలించి తగిన మార్కులు నమోదు చేసుకోవాలంటే ముందుగా విద్యార్థులకు నోటుపుస్తకాలు రాయడంలో తగిన మార్గనిర్దేశనం చేయాలి.

- ♦ బోధనా సోపానాల్లో అభ్యాసాల నిర్వహణకు తగిన కాలాంశాలు కేటాయించడం జరిగింది. వాటిని సరిగా వినియోగించుకుని నోట్స్‌రాయడానికి పురిగొల్పాలి.
- ♦ తరగతి గదిలో పాఠ్యపుస్తకాల్లో రాయాల్సిన అభ్యాసాల్ని తరగతిగదిలోనే పూరించేలా చొరవచూపాలి.
- ♦ మిగతా స్వీయరచన కృత్యాల్ని పాఠ్యపథకాన్ని అనుసరించి 'తరగతిగదిలో నిర్వహణ' విధానానికి అనుగుణంగా నిర్వహించి ఆయా రచనాకృత్యాలు విద్యార్థులు స్వయంగా చేసేలా ప్రోత్సహించాలి.
- ♦ తరగతి గదిలో వ్యక్తిగత, జట్టుకృత్యాల నుండి గ్రహించిన అంశాలద్వారా స్వయంగా ఇంటివద్ద నోటుపుస్తకాలలో రాసేలా సూచించాలి.

**- మార్కులు కేటాయింపు :**

విద్యార్థుల నోటు పుస్తకాలు పరిశీలించి మార్కులు కేటాయించేముందు విద్యార్థి స్వీయరచనా భావనావ్యక్తీకరణ ఉందో లేదో చూడాలి. విద్యార్థి స్వయంగా రాసిన అంశాలకే నిర్దేశించిన 5 మార్కులు కేటాయించాలి. ఇక్కడొక ప్రధానవిషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. విద్యార్థి తాను సొంతంగా రాయకుండా ఇతరుల నోటుపుస్తకాలు, గైడ్‌లు, టెస్ట్‌పేపర్‌లను ఆశ్రయించి రాసిన నోటుపుస్తకాలను ఈ అంశం క్రింద పరిగణలోకి తీసుకోకూడదు. అవసరమైతే మళ్ళీ రాసేలా చూడాలి తప్ప సంబంధిత రాత అంశాలకు మార్కులు ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వకూడదు. సౌలభ్యం కోసం ఒక్కొక్క పాఠానికి 10 మార్కుల చొప్పున కేటాయించుకోవాలి. FA వరకు ఎన్ని పాఠాలు పూర్తయితే వాటి సగటు లెక్కించాలి. నమోదుచేసేటప్పుడు 5 మార్కులను లెక్కించి నమోదుచేయాలి.

ఉదా॥ మొదటి FA వరకు 3 పాఠాలు పూర్తయినవి. ఒక్కొక్క పాఠానికి 8, 9, 7 మార్కులు వచ్చాయి. వీటి మొత్తం 24 వాటి సగటు 8 మార్కులు. 10 మార్కులకు 8 కాబట్టి నమోదుచేసేటప్పుడు 5కు 4 మార్కులను నమోదుచేయాలి.

ఐతే రాతాంశాలు పరిశీలించేటప్పుడు మార్కులు ఇవ్వడంలో ఈ అంశాలు దృష్టిలో ఉంచుకోవాలి.

దోషరహితపు స్థాయిని బట్టి 1 మార్కు, వాక్యనిర్మాణపు విధానానికి 2 మార్కులు భావవ్యక్తీకరణకు 4 మార్కులు, అందమైన దస్తూరికి మరో 2 మార్కుల చొప్పున 10 మార్కులు ఇవ్వవచ్చు.

అయితే ఇవన్నీ విద్యార్థి స్వయంగా, తను స్వీయ వ్యక్తీకరణలో రాసిన అంశాలకు మాత్రమే వర్తిస్తాయన్నది ప్రధానంగా గుర్తుంచుకోవాలి. ఏ ఇద్దరు విద్యార్థులు ఒకరినొకరు చూసి రాశారనిపించినా ఆ ఇద్దరికీ మార్కులు ఇవ్వకుండా మళ్ళీరాయమని చెప్పాలి.

**– ఎట్లా నిర్వహించాలి ?**

- రాత అంశాలు పూర్తిచేయించే విషయంలో ఏ ఇద్దరినోటు పుస్తకాలు ఒకరికొకరు చూసి రాయకుండా జాగ్రత్తవహించాలి.
- తరగతి గదిలో పూరించాల్సినది తరగతి గదిలోనూ, ఇంటిపనిగా చేయాల్సినది ఇంటిపనిగానే రాసేలా చూడాలి.
- వ్యక్తీకరణలో ఆయా విద్యార్థుల స్థాయినిబట్టి మెరుగ్గా లేకున్నాసరే స్వంతంగానే రాసేలా చూడాలి. మరింత మెరుగుదలకు తగిన సూచనలూ, ప్రోత్సాహం ఇవ్వాలి.
- స్వీయరచన, సృజనాత్మక రచనాంశాల్లో ఆయా విద్యార్థుల్లో విభిన్నత కనిపిస్తుంది. ఆ విభిన్నతనే ప్రోత్సహించాలి.
- వేర్వేరు విద్యార్థుల సమాధానాలు వేర్వేరుగా, పలు తేడాలతో కనిపించడాన్ని స్వాగతించాలి.
- నోటుపుస్తకాల్ని ప్రతినెలవారిగా తప్పనిసరిగా పరిశీలించాలి.
- సాధ్యమైనంతమేర దోషపూరితంగా రాయకుండా తరగతిగదిలోనే ఆయా అభ్యాసాల నిర్వహణలో జాగ్రత్తలు వహించాలి.
- నోటు పుస్తకాల పరిశీలనలో కూడా విద్యార్థుల మెరుగైన వ్యక్తీకరణ కోసం తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలి.
- నోటుపుస్తకాలు పరిశీలించకుండా రాతాంశాలకు మార్కులు ఇవ్వరాదు.
- విద్యార్థుల నోటు పుస్తకాల్లో ప్రతిపాఠానికి మార్కులను వేయాలి.

**ప్రాజెక్టు పని అంటే ?**

విద్యార్థి చదవడం, రాయడం, వినడం, మాట్లాడడం సొంతమాటల్లో రాయడం మొదలగు అన్నీ సామార్థ్యాలను పాఠ్యపుస్తకం ద్వారా అభ్యాసం చేస్తున్నప్పటికి వీటన్నింటినీ కలిపి ఉపయోగించగలిగిన విధానమే ప్రాజెక్టుపని. ప్రాజెక్టుపనిలో విద్యార్థి రకరకాల వ్యక్తులతో కలుసుకోవాల్సి వస్తుంది. రకరకాల వివరణలు / వివరాలు సేకరించేప్రయత్నం చేయవచ్చు. నివేదికలు/సమీక్షలు రాయవల్సిరావచ్చు. ఇంటర్వ్యూ చేయడానికి సిద్ధంకావాల్సి రావచ్చు మొదలగునవన్నీ ప్రాజెక్టుపనిలో భాగమౌతాయి.

## 3. ప్రాజెక్టు పని

### - అంటే ఏమిటి?

అభ్యసించిన అన్నీ సామర్థ్యాలను అనుభవంలోకి తెచ్చుకొని వాటిని ప్రయోగాత్మకంగా వినియోగించి ఒక నిర్మాణాత్మక కృత్యాన్ని ఆవిష్కరించడం ప్రాజెక్టుపని.

### - ప్రాజెక్టుపనుల ప్రాధాన్యత

నిర్మాణాత్మక మూల్యాంకనంలో భాగంగా విద్యార్థిలోని సమగ్ర అంతర్గత శక్తుల్ని వెలికితీయడం, వాటిని పెంపొందించడం, వినియోగింపచేయడమే ఈ ప్రాజెక్టుపనులకీ ప్రాధాన్యత పెరిగింది.

నేర్చిన అంశాల్ని అనుభవంలోకి తెచ్చుకోవడం ద్వారా నిజజీవితంలో వివిధరూపాల్లో వినియోగించగల సమర్థతను ఈ ప్రాజెక్టు పనులు చేయించడం ద్వారా కలిగించవచ్చు.

నేర్చిన భాషాసామర్థ్యాలు, సాంఘిక జీవితంలో చైతన్యవంతంగా వినియోగించగలుగు నేర్పును కలిగిస్తాయి. కలిసిపనిచేయడం, ప్రశ్నించడం, సమాచారాన్ని సేకరించడం, క్రమపద్ధతిలో కూర్చడం, ప్రదర్శించడం... మొత్తంగా ఒక పని అనుభవం ఈ ప్రాజెక్టుపనులద్వారా సాధించవచ్చు.

విద్యార్థి మానసిక వికాసంతోపాటు ఒకరకమైన ఆత్మవిశ్వాసాన్ని, స్నేహభావాన్ని, సాంఘికపరమైన సర్దుబాటును పెంపొందించుకోగలుగుతాడు. కేవలం చదివింది కాగితమ్మీద వ్యక్తీకరించడంతోపాటు సామాజిక సర్దుబాటు సాధించడం అనేది ఈ ప్రాజెక్టు పనుల్లో దాగి ఉండడంవల్లే నిర్మాణాత్మక మూల్యాంకనంలో (FA) ఒక భాగమైంది. విద్యార్థి సర్వతోముఖాభివృద్ధి సాధించడమే ఈ FA ఉద్దేశం కాబట్టి ప్రాజెక్టుపనికి 5 మార్కులు కేటాయించడం జరిగింది.

### - ఎలా నిర్వహించాలి ?

- పాఠ్యపుస్తకంలో ప్రతిపాఠం చివర భాషాకార్యకలాపాలు / ప్రాజెక్టుపని పేరుతో అన్ని పాఠాలకు ఈ అంశాన్ని చేర్చడం జరిగింది.
- ఏ పాఠానికి చెందిన ప్రాజెక్టును ఆ పాఠ్యాంశం చివర పూర్తి చేయించాలి.
- తరగతిగదిలో పాఠ్యాంశబోధన పూర్తయ్యాక అభ్యాసాల నిర్వహణకు ముందుగా విద్యార్థులకు ప్రాజెక్టుపని అప్పగించాలి.
- ప్రాజెక్టును ఎలా పూర్తిచేయాలో విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించాలి.
- అభ్యాసాల నిర్వహణ అనంతరం...అంటే చివరి కాలాంశానికి ముందు కాలాంశంలో విద్యార్థులచేత వారివారి ప్రాజెక్టులను ప్రదర్శింపజేయాలి.
- ప్రాజెక్టుపూర్తిచేయడంలో విద్యార్థులు సమిష్టిసహకారం తీసుకున్నా, వ్యక్తిగతమైనవాటిని వ్యక్తిగతంగానే పూర్తిచేయించాలి.
- అవసరమైన ప్రాజెక్టులకు నివేదికలు రాయించి భద్రపరచాలి.

- వీటికోసం విద్యార్థులు ప్రత్యేకంగా ఒక నోటుపుస్తకాన్ని వినియోగించుకోవాలి.
- ప్రాజెక్టుపూర్తి చేయించడంలో ఉపాధ్యాయుడు తగుసలహాలు, సూచనలతోపాటు గ్రంథాలయ పుస్తకాలు, ఇతరములైనవి అందుబాటులోకి తెచ్చేలా సహకరించాలి.
- ప్రతిప్రాజెక్టు నిర్వహణా స్థాయినిబట్టి ఈ అంశానికి 5 మార్కుల వరకు ఇవ్వాలి.

**- మార్కుల కేటాయింపు**

నిర్మాణాత్మక మూల్యాంకనంలో ప్రాజెక్టు అంశాలకు 5 మార్కులు కేటాయించడం జరిగింది.

ప్రతిపాఠానికీ ఒక ప్రాజెక్టుచొప్పున ఒక FA నాటికి ఎన్ని పాఠ్యాంశాలు పూర్తవుతాయో అన్ని ప్రాజెక్టులకు 5 మార్కులచొప్పున కూడి మొత్తానికి సగటు మార్కులు నమోదు చేయాల్సి ఉంటుంది.

ఉదాహరణకి ఒక FA నాటికి నాలుగు ప్రాజెక్టు అంశాలు పూర్తిచేస్తే, ఆ నాలుగు ప్రాజెక్టు అంశాల మార్కుల మొత్తాన్ని నాలుగుతో భాగించి సగటుమార్కుల్ని వేయాలి.

సమాచార సేకరణకు 30% మార్కులు, నివేదిక రాయడానికి 50%, దాన్ని తరగతిలో ప్రదర్శించడానికి 40% మార్కులు కేటాయించాలి.

విద్యార్థి ప్రాజెక్టుకు చెందిన సమాచారసేకరణ నైపుణ్యానికి 3 మార్కులు, నమోదు చేసిన విధానానికి 5 మార్కులు, ప్రదర్శనా వివరణకు 2 మార్కుల చొప్పున ఇవ్వవచ్చు. ఇలా పది మార్కులకు ఒక ప్రాజెక్టుకు మార్కులు కేటాయించి 5 మార్కులను లెక్కించి మార్కులు ఇవ్వాలి.

**- ప్రాజెక్టు నివేదిక రాయండి**

ప్రాజెక్టు పేరు :

సమాచారాన్ని సేకరించిన విధానం :

నివేదిక :

ప్రాజెక్టు ద్వారా నేర్చుకొన్న అంశాలు :

ముగింపు :

**- తీసుకోవాల్సిన జాగ్రత్తలు ?**

- ప్రతి ప్రాజెక్టునూ పాఠ్యాంశబోధన తర్వాత అభ్యాసాల నిర్వహణకు ముందుగానే ఇవ్వాల్సి ఉంటుంది.
- చివరిసామర్థ్యం బోధన పూర్తయ్యాక విద్యార్థులందరి ప్రాజెక్టుఅంశాల ప్రదర్శన పరిశీలన జరపాలి.
- గతంలోలా గ్రూపువారిగా నిర్వహించిన ప్రాజెక్టులకు వ్యక్తిగతంగా మార్కులు కేటాయించడం కుదరదు కాబట్టి వ్యక్తిగతంగా ప్రాజెక్టుఅంశాన్ని పూర్తి చేయాలి.
- పాఠశాల పరిధిలో అవసరమైన పుస్తకాలు, ఇతర సామగ్రి అందుబాటులో ఉండేలా ఉపాధ్యాయులు చొరవచూపాలి.

- ప్రాజెక్టు నివేదికల్లో ఒకరికొకరు కాపీ కొట్టకుండా గట్టిచర్యలు చేపట్టాలి.
- నివేదికలు ఒకే రకంగా ఉన్నవాటికి మార్కులు ఇవ్వకుండా వారితో మళ్ళీ ఆ ప్రాజెక్టులు స్వంతంగా పూర్తిచేసేలా చూడాలి.

## 4. లఘుపరీక్ష

**- అంటే ఏమిటి?**

సాధారణ రాతపరీక్షలాగా కాకుండా ఒక నిర్ధిష్ట సమయంగానీ, ముందస్తు ప్రణాళికగానీ లేకుండా, పిల్లల్లో పరిశీలించాలనుకున్న సామర్థ్యం గురించి అప్పటికప్పుడు లిఖితరూపంలో పరీక్షించే విధానమే లఘుపరీక్ష. ఈ పరీక్షా విధానంలో విద్యార్థిలో పరీక్ష నిర్వహిస్తున్న భయాన్ని కల్పించకుండా ముందస్తుగా ఒక ప్రశ్నపత్ర రూపకల్పన కూడా లేకుండా అప్పటికప్పుడు ఏదో ఒక సామర్థ్యం మీద పరీక్షించి చూసుకునే అవకాశం ఉంది.

**- లఘు పరీక్ష - ప్రాధాన్యత :**

- విద్యార్థి రాత అంశాల, ప్రాజెక్టు అంశాలు వంటి స్వతంత్ర కృత్యాలు పరిశీలించినట్లే గ్రహించిన అంశాన్ని అప్పటికప్పుడు లిఖితరూపంలో పరీక్షించి చూసుకోవాల్సిన అవసరం ఉంది.
- పరీక్షలనే భయాన్ని రేకెత్తించకుండా, అసలు పరీక్షల భావనే లేకుండా ఒక విద్యార్థిస్థాయిని ఏ సామర్థ్యంలో అంచనా వేయాలనుకుంటామో ఆ సామర్థ్యంలో పరీక్షించి చూసుకోవాలి.
- ఆయా విద్యార్థుల ఆయా సామర్థ్యాల వెనుకబాటుతనాన్ని గుర్తించి తిరిగి అవగాహన కల్పించేందుకుగాను, బోధనావ్యూహాలను మార్చుకునేందుకుగానూ ఈ లఘుపరీక్ష ఉపయుక్తంగా ఉంటుంది.

తొలి మూడు అంశాల్ని పరిశీలించి FAలో నమోదు చేసుకున్నట్లే ఈ లఘుపరీక్ష అంశానికికూడా 5 మార్కులు కేటాయించి సంబంధిత సిసిఇ రిజిష్టర్‌లో నమోదు చేయాలి.

**- నిర్వహణ విధానం**

- ఒక ఫార్మేటివ్ కాలంలో పూర్తయిన పాఠం / పాఠాల లఘు పరీక్షను నిర్వహించాలి.
- ఫార్మేటివ్ కాలంలో 1 లేదా 2 లఘు పరీక్షలు నిర్వహించాలి.
- ఒకవేళ రెండు నిర్వహిస్తే సగటు లెక్కించాలి.
- ప్రతిపాఠానికి చివర ఆయావిద్యార్థులు ఏయే సామర్థ్యాల్లో వెనకబడ్డారో గుర్తించేందుకు అవసరమైన సామర్థ్యంలో ఆయా విద్యార్థులను ఈ లఘు పరీక్ష ద్వారా పరిక్షించాలి.
- ఒక పీరియడ్ సమయంలో నిర్వహించాలి. ముందుగా సమాచారం ఇవ్వకూడదు.
- 1, 2 సామర్థ్యాల ఆధారంగా 3, 4 ప్రశ్నలు మించకుండా లఘు పరీక్ష నిర్వహించాలి.

- ప్రతి లఘు పరీక్షను 20 మార్కులకు నిర్వహించాలి. ఐతే నమోదు చేసుకొనేటప్పుడు 5 మార్కులు లెక్కించి నమోదుచేయాలి.

**- మార్కుల కేటాయింపు**

- మిగతా మూడు అంశాలకు కేటాయించినట్లే నిర్మాణాత్మకమూల్యాంకనంలో ఈ లఘుపరీక్షకూ 5 మార్కులు కేటాయించబడ్డాయి.
- ప్రంతి లఘు పరీక్షను 20 మార్కులకు నిర్వహించాలి. వాటిని '5'కు లెక్కించి నమోదుచేయాలి.
- ఒక నిర్మాణాత్మక మూల్యాంకనం (FA) నాటికి ఎన్ని లఘుపరీక్షలు నిర్వహించారో అన్నిట్లో సాధించిన మొత్తం మార్కుల సగటు ఆనెల FA లోని లఘుపరీక్షాంశంలో నమోదు చేయాలి.
- ఉదాహరణకు ఒక FA నాటికి రెండు లఘుపరీక్షలు నిర్వహిస్తే వాటిలో పొందిన మొత్తం మార్కుల్ని 2తో భాగించి సగటును నిర్ణయించి నమోదు చేయాలి.

**- తీసుకోవాల్సిన జాగ్రత్తలు :**

- లఘుపరీక్షకు ఒక సమయం ముందుగానే ప్రకటించే అవసరం లేదు.
- లఘుపరీక్షకు హాజరుకాని విద్యార్థిని తర్వాత రోజైనా పరీక్షించాలి.
- అందరు విద్యార్థులకు లఘుపరీక్ష నిర్వహించాలి.
- ముందుగా ప్రశ్నపత్రాన్ని రూపొందించుకోవాల్సిన అవసరంలేదు.
- లఘుపరీక్షను ఖచ్చితంగా లిఖితరూపంలోనే ప్రశ్నించాలి.
- ఏ రెండు లేక మూడు సామర్థ్యాలలోనైనా లఘు పరీక్ష నిర్వహించాల్సి ఉన్నా, పిల్లలకు వేటిపైన అభ్యాసం ఎక్కువ అవసరమని భావిస్తే, ఆ సామర్థ్యాలలో లఘు పరీక్ష నిర్వహించాలి.

  ఉదా॥ స్వీయరచన, సృజనాత్మకత, పఠనావగాహన లేదా పదజాలం లేదా వ్యాకరణాంశాలు.

**ముగింపు :** నిర్మాణాత్మక మూల్యాంకనంవల్ల ఉపాధ్యాయుడి విచక్షణకు, పరిశీలనకు ప్రాధాన్యత లభిస్తుంది. సంగ్రహణాత్మక పరీక్ష / పబ్లిక్ పరీక్షలకు అభ్యాసం లభిస్తుంది. పాఠ్యపుస్తకాల అమలు సక్రమంగా ఉంటుంది. పిల్లల అభ్యసన స్థాయిలనుబట్టి ప్రత్యామ్నాయ బోధన నిర్వహించవచ్చు. పబ్లిక్ పరీక్షల్లో పరీక్షించలేని అంశాలను పరీక్షించవచ్చు.



# VIII. సంగ్రహణాత్మక మూల్యాంకనం (పబ్లిక్ పరీక్షల నిర్వహణ)

సంగ్రహణాత్మక మూల్యాంకనాన్ని సాధారణంగా పరీక్షల ద్వారా నిర్వహిస్తాం. ఒక విద్యా సంవత్సరంలో మూడు సార్లు నిర్వహించాలి. మొదటివి సెప్టెంబర్ / అక్టోబర్ మాసాల్లో, రెండవదాన్ని డిసెంబర్ / జనవరి మాసాల్లో, చివరిది మార్చి / ఏప్రిల్ మాసాల్లో నిర్వహిస్తారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షల మినహా మిగతా వాటికి D.C.E.B. ద్వారా సరఫరాచేసిన ప్రశ్నపత్రాలతో నిర్వహిస్తారు. కింది వివరాలను తెలుసుకుందాం. అవి:

ఇందులో ఉన్నవి :

- సామర్థ్యాల వారీగా భారత్వము
- ప్రశ్నల సంఖ్య
- ప్రశ్నల రకాలు – వాటి ప్రాముఖ్యత
- ప్రశ్నల స్వభావం
- మాదిరి ప్రశ్నపత్రాలు
- జవాబు పత్రాలు దిద్దడానికి సూచికలు – మార్గదర్శకాలు
- నమూనా ప్రశ్నలు

## A. సామర్థ్యాల వారీగా భారత్వం

### ప్రథమ భాష – తెలుగు & ద్వితీయ భాష – తెలుగు

| సామర్థ్యం | మార్కుల కేటాయింపు | మొత్తం |
|---|---|---|
| I. అవగాహన – ప్రతిస్పందన | 20 మార్కులు | 20 |
| II. వ్యక్తీకరణ – సృజనాత్మకత | | |
| అ) స్వీయరచన | 30 మార్కులు | 40 |
| ఆ) సృజనాత్మకత | 10 మార్కులు | |
| III. భాషాంశాలు | | |
| అ) పదజాలం | 10 మార్కులు | 20 |
| ఆ) వ్యాకరణం | 10 మార్కులు | |
| మొత్తం | 80 మార్కులు | 80 |

## ప్రథమ భాష - తెలుగు

## B. సామర్థ్యాల వారీగా ప్రశ్నల రకాలు, ప్రశ్నల సంఖ్య, మార్కులు, స్వభావాలు

| సామర్థ్యం | ప్రశ్నల రకం | మొత్తం ప్రశ్నల సంఖ్య | సాధించాల్సిన ప్రశ్నల సంఖ్య | ఒక్కొక్క ప్రశ్నకు ఇవ్వబడిన మార్కులు | మొత్తం మార్కులు | సామర్థ్యాల వారీగా మొత్తం మార్కులు | ప్రశ్నల స్వభావం |
|---|---|---|---|---|---|---|---|
| I. అవగాహన-ప్రతిస్పందన | అవగాహనను పరీక్షించడం | 4 | 4 | 5 మా. | 4×5=20 | 20 | అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉండాలి.<br>1. పరిచిత గద్యం (తప్పనిసరిగా ఉపవాచకం నుండి ఏదైనా ఒక పేరా ఇవ్వాలి.)<br>2. అపరిచిత గద్యం<br>3. అపరిచిత పద్యం / గేయం / కవిత<br>సూచికలు : పై మూడింటిని ఈ కింది విధంగా ఉన్న రూపాల నుండి ఏదో ఒక రూపంలో ఇవ్వాలి.<br>♦ ప్రశ్నలకు జవాబులు.<br>♦ తప్పొప్పులు గుర్తించుట.<br>♦ ఖాళీలు పూరించుట.<br>♦ ప్రశ్నల తయారీ. మొ॥నవి.<br>♦ గద్యభాగం / పద్య భాగం / (అపరిచితం)లలోని కీలక పదాల వివరణ.<br>4. పరిచిత పద్యం (పాఠ్య పుస్తకంలో * గుర్తుల పద్యాలు)<br>సూచిక : ఈ కింది రూపాలలో ఇవ్వాలి.<br>♦ ప్రతి పదార్థం (లేదా)<br>♦ పద్యం పూరించి భావం రాయడం. |

| సామర్థ్యం | ప్రశ్నల రకం | మొత్తం ప్రశ్నల సంఖ్య | సాధించాల్సిన ప్రశ్నల సంఖ్య | ఒక్కొక్క ప్రశ్నకు ఇవ్వబడిన మార్కులు | మొత్తం మార్కులు | సామర్థ్యాల వారీగా మొత్తం మార్కులు | ప్రశ్నల స్వభావం |
|---|---|---|---|---|---|---|---|
| II. వ్యక్తీకరణ – సృజనాత్మకత | | | | | | | |
| అ) స్వీయరచన | 1) లఘు ప్రశ్నలు (5–6 వాక్యాలు) | 4 | 4 | 3 మా. | 4×3=12 | 30 | పద్య భాగం నుండి 2 ప్రశ్నలు, గద్యభాగం నుండి 2 ప్రశ్నలు ఇవ్వాలి. (వీటిలో 1 ప్రశ్న తప్పనిసరిగా కవి / రచయితల శైలి / ఉద్దేశ్యం / భావనలకు సంబంధించి ఇవ్వాలి.) |
| | 2) వ్యాసరూప ప్రశ్నలు (12 నుండి 15 వాక్యాలు) | 6 | 3 | 6 మా. | 6×3=18 | – | విద్యార్థి తప్పనిసరిగా పద్య, గద్య, ఉపవాచకాలనుండి ఒక్కొక్క ప్రశ్నకు జవాబు రాయవలసి ఉంటుంది. అందుకొరకు ప్రతి భాగం నుండి 2 ప్రశ్నలు ఉంటాయి.<br>దీనిలోని ప్రశ్నల స్వభావం ఈ కింది విధంగా ఉండాలి. వీటికి ఆలోచించి సొంతంగా జవాబులు రాయాలి.<br>♦ విశ్లేషణాత్మకంగా.<br>♦ అభిప్రాయాన్ని తెలిపేదిగా.<br>♦ వ్యాఖ్యానించేలా.<br>♦ సారాంశాన్ని తెలిపేలా.<br>♦ తగిన కారణాలతో సమర్థిస్తూ, విభేదిస్తూ రాసే విధంగా<br>♦ తాను ప్రత్యక్ష భాగస్వామి అయినపుడు స్పందించే విధంగా<br>(పాఠాలలోని అభ్యాసాలలోని ప్రశ్నలు ఉన్నవి ఉన్నట్లుగా ఇవ్వరు. మార్పులు చేర్పులతో ఇవ్వవచ్చు..) |

| సామర్థ్యం | ప్రశ్నల రకం | మొత్తం ప్రశ్నల సంఖ్య | సాధించాల్సిన ప్రశ్నల సంఖ్య | ఒక్కొక్క ప్రశ్నకు ఇవ్వబడిన మార్కులు | మొత్తం మార్కులు | సామర్థ్యాల వారీగా మొత్తం మార్కులు | ప్రశ్నల స్వభావం |
|---|---|---|---|---|---|---|---|
| **ఆ) సృజనాత్మకత** | భాషా వ్యవహార రూపాలు | 3 | 2 | 5 | 2×5=10 | 10 | పాఠ్యపుస్తకంలో పొందుపరచిన సృజనాత్మక అంశాల ఆధారంగా ప్రశ్నలు ఇవ్వాలి.<br>(వర్ణన / కథ / నాటిక / ఏకాంకిక / లేఖ / వ్యాసం / సంభాషణ / గేయం / కవిత / సూక్తులు / నినాదాలు / సన్మానపత్రం / కరపత్రం / ఇంటర్వ్యూ ప్రశ్నావళి.) |
| **III. భాషాంశాలు**<br>**అ) పదజాలం** | లక్ష్యాత్మక ప్రశ్నలు | 10 | 10 | 1 | 10×1=10 | 10 | అర్థాలు / పర్యాయ పదాలు / నానార్థాలు / వ్యుత్పత్తి అర్థాలు / ప్రకృతి వికృతులు / సొంత వాక్యాలు / జాతీయాలు మొ॥ వాటిని వాక్య ప్రయోగాల ద్వారా కాని లేదా పదాలుగా గాని ఇవ్వాలి. పైవాటిలో ఏవైనా ఐదు అంశాలకు చెందిన ప్రశ్నలు ఇవ్వాలి.<br>సూచన : పాఠ్య పుస్తకంలోని పదజాలంలోని అంశాలను పరిశీలించి ఆయా విధానాలను ఎంచుకోవాలి. |
| **ఆ)వ్యాకరణాంశాలు** | లక్ష్యాత్మక ప్రశ్నలు | 10 | 10 | 1 | 10×1=10 | 10 | ♦ సంధులు, సమాసాలు, ఛందస్సు, వాక్యాలు (సంశ్లిష్ట / సంయుక్త , కర్తరీ / కర్మణీ, ప్రత్యక్ష / పరోక్ష, ఆధునిక వాక్యాలు), అలంకారాలు మొదలగువాటికి సంబంధించిన ప్రశ్నలు ఇవ్వాలి.<br>♦ వీటిలో సంధులు, సమాసాలు, ఛందస్సుకు సంబంధించిన ప్రశ్నలను బహుళైచ్ఛిక ప్రశ్నలుగా ఇవ్వవచ్చు.<br>♦ అలంకారాలకు సంబంధించి లక్షణాలు / లక్ష్య సమన్వయం / అలంకారాన్ని గుర్తించే ప్రశ్నలు ఇవ్వాలి. |

## ద్వితీయ భాష - తెలుగు

### సామర్థ్యాల వారీగా ప్రశ్నల రకాలు, ప్రశ్నల సంఖ్య, మార్కులు, స్వభావాలు

| సామర్థ్యం | ప్రశ్నల రకం | మొత్తం ప్రశ్నల సంఖ్య | సాధించాల్సిన ప్రశ్నల సంఖ్య | ఒక్కొక్క ప్రశ్నకు ఇవ్వబడిన మార్కులు | మొత్తం మార్కులు | సామర్థ్యాల వారీగా మొత్తం మార్కులు | ప్రశ్నల స్వభావం |
|---|---|---|---|---|---|---|---|
| I. అవగాహన-ప్రతిస్పందన | అవగాహనను పరీక్షించడం | 4 | 4 | 5 మా. | 4×5=20 | 20 | అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉండాలి.<br>1. పరిచిత గద్యం<br>(తప్పనిసరిగా ఉపవాచకం నుండి ఏదైనా ఒక పేరా ఇవ్వాలి.)<br>2. అపరిచిత గద్యం<br>3. అపరిచిత పద్యం / గేయం / కవిత<br>పై మూడింటిని ఈ కింది విధంగా ఉన్న రూపాల నుండి ఏదో ఒక రూపంలో ఇవ్వాలి.<br>♦ ప్రశ్నలు ఇచ్చి జవాబులు రాయమనడం.<br>♦ తప్పొప్పులు గుర్తించుట.<br>♦ ఖాళీల పూరణ.<br>♦ కీలక పదాలను గుర్తించడం. మొ॥నవి.<br>4. పరిచిత పద్యం (* గుర్తుకలవి మాత్రమే)<br>ఈ కింది వాటిలో ఏదో ఒక రూపంలో ఇవ్వాలి.<br>♦ పద్యపాదాలను తారుమారుగా ఇచ్చి, వరుసక్రమంలో రాయడం.<br>♦ పద్యానికి భావం రాయడం.<br>♦ ప్రశ్నలు ఇచ్చి జవాబులు రాయమనడం. |

| సామర్థ్యం | ప్రశ్నల రకం | మొత్తం ప్రశ్నల సంఖ్య | సాధించాల్సిన ప్రశ్నల సంఖ్య | ఒక్కొక్క ప్రశ్నకు ఇవ్వబడిన మార్కులు | మొత్తం మార్కులు | సామర్థ్యాల వారీగా మొత్తం మార్కులు | ప్రశ్నల స్వభావం |
|---|---|---|---|---|---|---|---|
| **II.** వ్యక్తీకరణ – సృజనాత్మకత | | | | | | | |
| అ) స్వీయరచన | లఘు ప్రశ్నలు (4–5 వాక్యాలు) | 4 | 4 | 3 మా. | 4×3=12 | 30 | పద్య భాగం నుండి 2 ప్రశ్నలు, గద్యభాగం నుండి 2 ప్రశ్నలు ఇవ్వాలి. (వీటి నుండి 1 ప్రశ్న తప్పనిసరిగా కవి / రచయితల శైలి / ఉద్దేశ్యం / భావనలకు సంబంధించి ఇవ్వాలి.) |
| | వ్యాసరూప ప్రశ్నలు (10–12 వాక్యాలు) | 6 | 3 | 6 మా. | 6×3=18 | – | విద్యార్థి తప్పనిసరిగా పద్య / గద్య / ఉపవాచకాలనుండి ఒక్కొక్క ప్రశ్నకు జవాబు రాయవలసి ఉంటుంది. అందుకొరకు ప్రతి భాగం నుండి 2 ప్రశ్నలు ఇవ్వబడ్డాయి.<br>దీనిలో ప్రశ్నల స్వభావం కింది విధంగా ఉండాలి. అవి ఆలోచించి, సొంతంగా రాసేలా ఉంటాయి.<br>♦ విశ్లేషణాత్మకంగా.<br>♦ అభిప్రాయాన్ని తెలిపేదిగా.<br>♦ వ్యాఖ్యానించేలా.<br>♦ సారాంశాన్ని తెలిపేలా.<br>♦ తగిన కారణాలతో సమర్థిస్తూ / విభేదిస్తూ రాసే విధంగా<br>♦ తాను ప్రత్యక్ష భాగస్వామి అయినప్పుడు స్పందించే విధంగా<br>(పాఠ్య పుస్తకాలలోని అభ్యాసాలలోని ప్రశ్నలను నేరుగా ఇవ్వకుండా కొంత మార్చి ఇవ్వవచ్చు.) |

| సామర్థ్యం | ప్రశ్నల రకం | మొత్తం ప్రశ్నల సంఖ్య | సాధించాల్సిన ప్రశ్నల సంఖ్య | ఒక్కొక్క ప్రశ్నకు ఇవ్వబడిన మార్కులు | మొత్తం మార్కులు | సామర్థ్యాల వారీగా మొత్తం మార్కులు | ప్రశ్నల స్వభావం |
|---|---|---|---|---|---|---|---|
| ఆ) సృజనాత్మకత | భాషా వ్యవహార రూపాలు | 3 | 2 | 5 | 2×5=10 | 10 | పాఠ్యపుస్తకంలో పొందుపరచిన సృజనాత్మక అంశాల ఆధారంగా ప్రశ్నలుండాలి. మొత్తం 3 ప్రశ్నలివ్వాలి.<br>♦ లేఖ తప్పనిసరిగా ఇవ్వాలి. (2 లేఖలు ఇవ్వాలి. 2 నుండి 1 తప్పనిసరిగా రాయాలి.)<br>♦ రెండవ ప్రశ్న కింది వాటిలో ఏవైనా రెండు ఇస్తే ఒక దానికి జవాబురాయాలి. కథ / వ్యాసం / గేయం / కవిత / సంభాషణ / కరపత్రం / సూక్తులు |
| III. భాషాంశాలు<br>అ) పదజాలం | లక్ష్యాత్మక ప్రశ్నలు | 10 | 10 | 1 | 10×1=10 | 10 | అర్థాలు / పర్యాయ పదాలు / ప్రకృతి వికృతులు / సొంత వాక్యాలు / జాతీయాలు మొ॥ వాటిని వాక్య ప్రయోగాల ద్వారా కాని లేదా పదాలుగా గాని ఇవ్వాలి. వీటిలో ఏదైనా ఐదు అంశాల ప్రశ్నలు ఇవ్వవచ్చు.<br>సూచన : పాఠ్య పుస్తకంలోని "పదజాలం" అభ్యాసాలను పరిశీలించి ఆయా విధానాలను ఎన్నుకోవాలి. |
| ఆ)వ్యాకరణాంశాలు | లక్ష్యాత్మక ప్రశ్నలు | 10 | 10 | 1 | 10×1=10 | 10 | భాషాభాగాలు / విభక్తి ప్రత్యయాలు / కర్తరీ , కర్మణీ / సంధులు / సమాసాలు / పురుషలు / చంధస్సు / అలంకారాలు / సామాన్య / సంశ్లిష్ట / సంయుక్త వాక్యాలు మొదలగువాటి నుండి ఇవ్వాలి.<br>వీటిలో సంధులు / సమాసాలు / ఛందస్సుకు సంబంధించిన ప్రశ్నలను బహుళైచ్ఛిక ప్రశ్నలు ఇవ్వవచ్చును. |

## కాంపోజిట్ కోర్సు (60 మార్కులు తెలుగు, 20 మార్కులు సంస్కృతం)

### సామర్థ్యాల వారీగా ప్రశ్నల రకాలు, ప్రశ్నల సంఖ్య, మార్కులు, స్వభావాలు

| సామర్థ్యం | ప్రశ్నల రకం | మొత్తం ప్రశ్నల సంఖ్య | సాధించాల్సిన ప్రశ్నల సంఖ్య | ఒక్కొక్క ప్రశ్నకు ఇవ్వబడిన మార్కులు | మొత్తం మార్కులు | సామర్థ్యాల వారీగా మొత్తం మార్కులు | ప్రశ్నల స్వభావం |
|---|---|---|---|---|---|---|---|
| I. అవగాహన-ప్రతిస్పందన | అవగాహనను పరీక్షించడం | 2 | 2 | 5 మా. | 2×5=10 | 10 | అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఈ కింది రకాలుగా ఉండాలి.<br>1. అపరిచిత గద్యం / పరిచితగద్యం (ఉపవాచకం నుండి)<br>♦ ప్రశ్నలు ఇచ్చి జవాబులు రాయడం.<br>♦ ప్రశ్నల తయారీ.<br>♦ తప్పొప్పులు గుర్తించుట.<br>♦ ఖాళీలను పూరించుట.<br>♦ కీలక పదాలను గుర్తించుట మొ॥నవి.<br>(పైన పేర్కొన్న ఏదో ఒక రూపంలో అపరిచిత గద్యానికి సంబంధించిన ప్రశ్నలు ఉండాలి.)<br>2. పరిచిత పద్యం<br>(ఇది పాఠ్యపుస్తకంలోని చుక్క గుర్తుగల పద్యం మాత్రమే ఇవ్వాలి. కింద చెప్పిన రెండు రకాలలో ఏదో ఒక రకం ఇవ్వాలి.)<br>♦ పద్యం ఇచ్చి ప్రతిపదార్థం రాయించడం.<br>♦ పద్య పూరణచేసి భావం రాయమనడం. |

| సామర్థ్యం | ప్రశ్నల రకం | మొత్తం ప్రశ్నల సంఖ్య | సాధించాల్సిన ప్రశ్నల సంఖ్య | ఒక్కొక్క ప్రశ్నకు ఇవ్వబడిన మార్కులు | మొత్తం మార్కులు | సామర్థ్యాల వారీగా మొత్తం మార్కులు | ప్రశ్నల స్వభావం |
|---|---|---|---|---|---|---|---|
| **II.** వ్యక్తీకరణ – సృజనాత్మకత | | | | | | | |
| అ) స్వీయరచన | లఘు ప్రశ్నలు (5–6 వాక్యాలు) | 4 | 4 | 3 మా. | 4×3=12 | 30 | పద్య భాగం నుండి 2 ప్రశ్నలు, గద్యభాగం నుండి 2 ప్రశ్నలు ఇవ్వాలి. (వీటిలో 1 ప్రశ్న తప్పనిసరిగా కవి / రచయితల శైలి / ఉద్దేశ్యం / భావనలకు సంబంధించి ఇవ్వాలి.) |
| | వ్యాసరూప ప్రశ్నలు (12 నుండి 15 వాక్యాలు) | 6 | 3 | 6 మా. | 6×3=18 | – | విద్యార్థి తప్పనిసరిగా పద్య / గద్య / ఉపవాచకాల నుండి ఒక్కొక్క ప్రశ్నకు జవాబు రాయవలసి ఉంటుంది. అందుకొరకు ప్రతి భాగం నుండి 2 ప్రశ్నలు ఇవ్వాలి. ప్రశ్నల స్వభావం ఈ కింది విధంగా ఉండాలి.<br>♦ ఆలోచించి, సొంతమాటల్లో రాసేవిగా ఉంటాయి.<br>♦ విశ్లేషణాత్మకంగా.<br>♦ అభిప్రాయాన్ని తెలిపేలా.<br>♦ వ్యాఖ్యానించేలా.<br>♦ సారాంశాన్ని తెలిపేలా.<br>♦ తగిన కారణాలతో సమర్థిస్తూ / విభేదిస్తూ రాసే విధంగా<br>♦ విద్యార్థి పాఠ్యపుస్తకంలోని సంఘటనలో తాను ప్రత్యక్ష భాగస్వామి అయినప్పుడు స్పందించే విధంగా.<br>సూచన : పాఠ్య పుస్తకాలలోని అభ్యాసాలలోని ప్రశ్నలను నేరుగా ఇవ్వకుండా కొంత మార్చి ఇవ్వవచ్చు. |

| సామర్థ్యం | ప్రశ్నల రకం | మొత్తం ప్రశ్నల సంఖ్య | సాధించాల్సిన ప్రశ్నల సంఖ్య | ఒక్కొక్క ప్రశ్నకు ఇవ్వబడిన మార్కులు | మొత్తం మార్కులు | సామర్థ్యాల వారీగా మొత్తం మార్కులు | ప్రశ్నల స్వభావం |
|---|---|---|---|---|---|---|---|
| ఆ) సృజనాత్మకత | భాషా వ్యవహార రూపాలు | 3 | 2 | 5 | 2×5=10 | 10 | పాఠ్యపుస్తకంలో పొందుపరచిన సృజనాత్మక అంశాల ఆధారంగా ప్రశ్నలు ఇవ్వాలి. అభ్యాసాలలో ఉన్నవి ఉన్నట్లుగా ఇవ్వకూడదు. వివిధ వ్యవహార రూపాలు మార్చి రాసే విధంగా ఉండాలి.<br>(వర్ణన / కథ / నాటిక / ఏకాంకిక / లేఖ / వ్యాసం / సంభాషణ / గేయం / కవిత / సూక్తులు / నినాదాలు / సన్మానపత్రం / కరపత్రం / ఇంటర్వ్యూ ప్రశ్నావళి) |
| III. భాషాంశాలు<br>అ) పదజాలం | లక్ష్యాత్మక ప్రశ్నలు | 5 | 5 | 1 | 5×1=5 | 5 | అర్థాలు / పర్యాయ పదాలు / నానార్థాలు / వ్యుత్పత్తి అర్థాలు / ప్రకృతి, వికృతులు / సొంతవాక్యాలు / జాతీయాలు మొ॥ వాటిని వాక్య ప్రయోగాల ద్వారా కాని లేదా పదాలుగా గాని ఇవ్వాలి. ఏవైనా ఐదు ప్రశ్నల ఆధారంగా ప్రశ్నలు ఇవ్వాలి.<br>సూచన : పాఠ్య పుస్తకంలోని పదజాలం అంశాలను పరిశీలించి ఆయా విధానాలను ఎన్నుకోవాలి. |
| ఆ)వ్యాకరణాంశాలు | లక్ష్యాత్మక ప్రశ్నలు | 5 | 5 | 1 | 5×1=5 | 5 | సంధులు / సమాసాలు / చంధస్సు / సామాన్య / సంశ్లిష్ట / సంయుక్త / కర్తరీ / కర్మణి / ప్రత్యక్ష / పరోక్ష ఆధునిక వాక్యాలు, అలంకారాలు మొదలగువాటికి సంబంధించిన ప్రశ్నలు ఇవ్వాలి.<br>♦ వీటిలో సంధులు / సమాసాలు / ఛందస్సులకు సంబంధించిన ప్రశ్నలను బహుళైచ్ఛిక ప్రశ్నలు ఇవ్వవచ్చు.<br>♦ అలంకారాకు సంబంధించి లక్షణాలు / లక్ష్య సమన్వయం / అలంకారాన్ని గుర్తించే ప్రశ్నలు ఇవ్వాలి. |

# ప్రశ్నల రకాలు - వాటి ప్రాముఖ్యత

నూతన పాఠ్య పుస్తకాలతోపాటు పరీక్షా విధానం కూడా నూతనంగా ఉంటున్న సందర్భంలో ప్రశ్నపత్రంలోని ప్రశ్నలు ఏయే రకంగా ఉంటాయి? అవే ఎందుకుండాలి? వాటివల్ల ఏం ప్రయోజనం? అనే ప్రశ్నలపై అవగాహన కలిగి ఉండటం చాలా అవసరం. ప్రశ్నపత్రాన్ని పాఠాలలోని విషయాధారిత ప్రశ్నల మాదిరిగా కాకుండా సామర్థ్యాల వారీగా ప్రశ్నలుంటాయి. అనేది మనం ప్రధానంగా గుర్తు పెట్టుకోవాల్సిన అంశం. మరి సామర్థ్యాల వారిగా ఉండే ప్రశ్నలు ఏయే రకాలుగా ఉంటాయో వాటి ప్రాముఖ్యత ఏంటో పరిశీలిద్దాం!

సామర్థ్యాల వారీగా ప్రశ్నలు :

**I. పఠనావగాహన ప్రశ్నలు**

**II. స్వీయరచన ప్రశ్నలు**

**III. సృజనాత్మక వ్యక్తీకరణ ప్రశ్నలు**

**IV. భాషాంశాల ప్రశ్నలు**

## I. పఠనావగాహన ప్రశ్నలు

దీనిలో ఉండే రకాలు

(i) పరిచిత గద్యం, పద్యం

(ii) అపరిచిత గద్యం, పద్యం

ఇవి విద్యార్థి పఠనావగాహనను తెల్సుకునేలా ఉంటాయి. విద్యార్థి తనకిచ్చిన పద్యాన్ని / గద్యాన్ని చదివి జవాబులు రాయగలగాలి. దీనివల్ల విద్యార్థులకు కలిగే ప్రయోజనాలు అధికంగా ఉంటాయి. ప్రాముఖ్యత / ప్రయోజనాలు :

- ధారాళంగా చదవడం.
- చదివిన అంశాలను అర్థం చేసుకోగల్గడం.
- చదివిన అంశాలను విశ్లేషించగల్గడం.
- గద్యం / పద్యం సారాంశాన్ని / భావాన్ని గ్రహించగలగడం.
- గద్యం / పద్యంలోని కీలక వాక్యాలు / పదాలను గ్రహించడం.
- సందర్భాన్నిబట్టి పదాల అర్థాలను గ్రహించడం.
- అవగాహన చేసుకొన్న అంశాలను వ్యక్తీకరించగలగడం.

ఇవి తెలుసుకోవటానికి పఠనావగాహన అనే ప్రశ్నలు ఉపయోగపడతాయి. ప్రశ్నల ద్వారా విభిన్న వ్యవహార రూపాలు చదవడం – వాటిపై అవగాహన పొందడం సమాధానాలు చెప్పడం / రాయడానికి ఉపయోగపడతాయి.

## II. స్వీయరచన ప్రశ్నలు

స్వీయరచన అనగా సొంతంగా, తార్కికంగా ఆలోచించి, అభిప్రాయాలను జోడించి, తనకు తెలిసిన పదజాలంతో స్పష్టమైన భావ వ్యక్తీకరణను లిఖిత రూపంలో వ్యక్తం చేయడం. ఈ రకమైన ప్రశ్నలు విద్యార్థిలో భాషా వ్యవహారాలను స్పష్టంగా తెలుపడానికి తోడ్పడుతాయి.

దీనిలో ఉండే ప్రశ్నలు :

(i) లఘు సమాధాన ప్రశ్నలు

(ii) వ్యాసరూప సమాధాన ప్రశ్నలు

### (i) లఘు సమాధాన ప్రశ్నలు

ఈ ప్రశ్నలకు జవాబులను ఐదు, ఆరు వాక్యాల్లో రాయాల్సి ఉంటుంది. ఈ ప్రశ్నలు పూర్తిగా విద్యార్థిని ఆలోచింపజేసే రకంగా ఉంటాయి.

**ప్రాముఖ్యత / ప్రయోజనం :**

- విద్యార్థి అంశం గురించి వివరించగలగడం.
- విషయాన్ని అర్థం చేసుకొని ఉదాహరణలివ్వగలగడం.
- సంక్షిప్త వ్యాఖ్యలు చేయగలగడం.
- ఒక విషయాన్ని సందర్భానికి అనుగుణంగా అన్వయించగలగడం.
- వాక్యాల్లోని కీలక భావాలు / కీలక వ్యాక్యాల్లోని భావాలు రాయగలగడం.
- వాక్యాల్లోని సందేశాలను / విలువలను గ్రహించగలగడం.
- సంక్షిప్తంగా విషయ వ్యక్తీకరణ సామర్థ్యం మొ॥నవి చేయుటకు ఉపయోగపడుతాయి.

### (ii) వ్యాసరూప సమాధాన ప్రశ్నలు

వీటిని పన్నెండు నుండి పదిహేను వాక్యాలు సమాధానంలో రాయాల్సి ఉంటుంది. ఇవి విద్యార్థిలోని వ్యక్తీకరణశక్తిని పూర్తిగా అంచనా వేయడానికి ఉపయోగపడతాయి.

**వీటి ప్రాముఖ్యత / ప్రయోజనాలు :**

- ఆలోచనా విధానం, మనోవైఖరులను వ్యక్తపరచగలగడం.
- వర్ణనా శక్తి, వివరించే శక్తి వృద్ధిచెందడం.
- హేతుబద్ధతగా ఆలోచించి, కారణాలు వివరించగలగడం.
- ఇష్టాయిష్టాలను తగిన కారణాలతో వ్యక్తపరచడం.
- ప్రతిస్పందిచడం, బహుకోణాల్లో విశ్లేషించడం, హేతుబద్ధంగా ఆలోచించడం వంటివి వ్యక్తపరచగలగడం.
- ఒక విషయాన్ని వివరంగా, తార్కికంగా, క్రమపద్ధతిలో వివరించగలగడం.

పైన తెల్పిన వ్యక్తీకరణ సామర్థ్యాలను అంచనావేయడం ద్వారా పిల్లల మనోవైఖరులను, ఆలోచనాశక్తిని, వ్యక్తీకరణశక్తిని, భాషావినియోగశక్తిని, పదజాలంపై ఉన్న పట్టును, సందర్భోచిత వినియోగశక్తిని అంచనావేయవచ్చు.

ఈ ప్రశ్నలకు సంబంధించిన మూల్యాంకన విషయంలో పిల్లల అభిప్రాయాలే ముఖ్య పాత్ర పోషించాలి. వారి అభిప్రాయాలకే విలువనివ్వాలి.

## III. సృజనాత్మక వ్యక్తీకరణ ప్రశ్నలు

ఈ సామర్థ్యం పిల్లల్లో ఉండే సృజనాత్మకతను వెలికితీసి భావి జీవితంలో భాషా ప్రయోజనాలను చేకూర్చడానికి ఉపయోగపడుతుంది. రకరకాల వ్యవహారాల రూపాల రచన చేయగలగాలి. ఒక వ్యవహార రూపాన్ని మరో వ్యవహార రూపంలోకి మార్చే శక్తి కలుగుతుంది.

**ప్రాముఖ్యత / ప్రయోజనం :**

- పిల్లల్లో ఉండే వ్యక్తీకరణల విభిన్నతలను తెలుసుకోవడానికి.
- వాళ్ళలో ఉండే సృజనాత్మకతను గుర్తించడానికి.
- రచనా విధానాన్ని గుర్తించి ప్రోత్సహించడానికి.
- తన దైనందిన జీవితంలో ఉపయోగించుకునేలా చేయడానికి.

సృజనాత్మక వ్యక్తీకరణ సామర్థ్యం కలిగిన పిల్లలు భవిష్యత్తులో స్వయం ఉపాధిమార్గాలను ఎన్నుకోగలుగుతారు. పిల్లల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడానికి అవకాశం లభిస్తుంది. కవులు, కళాకారులు, సాహితీ విమర్శకులుగా ఎదగడానికి అవకాశంగల పిల్లల్ని గుర్తించి ప్రోత్సహించవచ్చు.

ఈ సమాధానాలు చదువుతున్నప్పుడు విద్యార్థి స్థాయిని దృష్టిలో పెట్టుకోవాలి గాని, ఉపాధ్యాయుడ తన దృష్టి / స్థాయితో ఆలోచించి చూడకూడదు. విద్యార్థిని ఎదుగుతున కవి / రచయితగానే గుర్తించుకోవాలి. తప్పనిసరిగా వారి ఊహా, భావనాశక్తులను శైలులను గౌరవించి మూల్యాంకనం చేయాలి.

## IV. భాషాంశాలు

దీనిలో రెండు రకాల సామర్థ్యాలను పరీక్షిస్తాం.

(i) పదజాలం

(ii) వ్యాకరణాంశాలు

### (i) పదజాలం

భాషా వ్యక్తీకరణకు పదజాలం చాలా కీలకమైంది. ఈ పదజాలం వివిధ రూపాల్లో ఉంటుంది. ఏ రూపంలోని పదజాలాన్నైనా విద్యార్థి పొందాల్సి ఉంటుంది. అర్థాలు, నానార్థాలు, పర్యాయపదాలు, ప్రకృతి – వికృతులు, జాతీయాలు, సామెతలు మొ॥నవి ఇందులో భాగాలు.

**ప్రాముఖ్యత / ప్రయోజనం :**

- వివిధ సందర్భాలను బట్టి పదజాలాన్ని వినియోగించగలగాలి.
- పదాల స్థూల / రూఢి అర్థాలను తెలుసుకొని వినియోగించగలగాలి.
- జాతీయాలను వినియోగించగలగాలి.

### (ii) వ్యాకరణాంశాలు

ఇవి భాషా నిర్మాణంలో ఉన్న మెళకువలు, శైలులు, రీతులు మొ॥నవి తెలుసుకొని ప్రయోగించడానికి ఉపయోగించబడే రకంగా ప్రశ్నలుంటాయి. దీనిలో వాక్య భేదాలు, సంధులు, సమాసాలు, అలంకారాలు, ఛందస్సుకు సంబంధించినవి ఉంటాయి.

**ప్రాముఖ్యత / ప్రయోజనం :**

- వాక్య నిర్మాణ రకాలు తెలుసుకోవడానికి.
- భాషా నిర్మాణాన్ని గ్రహించడానికి.
- అలంకారిక శైలిని గుర్తించడానికి.
- పద్య ప్రక్రియా రచనలో ఉండే ఛందో వైవిధ్యాన్ని తెలుసుకోవడానికి.
- పద్యాల్లోని సంధులను, సమాసాలను గుర్తించగలగడం.

ఈ రకంగా ప్రశ్నల రకాలను – వాటి ప్రాముఖ్యత / ప్రయోజనాలపై పూర్తిగా అవగాహన కలిగిఉంటే తరగతిలో విద్యార్థులచే సామర్థ్యాల సాధన చేయించడం, మూల్యాంకనం సరిగా చేయడం మొదలగు విషయాలు ఉపాధ్యాయుడికి కరతలామలకం అవుతాయి.

సంస్కృతి సమిష్టి ఉత్పాదన అయితే, అనుభవాలు ప్రాతిపదిక కాలక్రమంలో సంచితమైనదైతే దాన్ని అర్థం చేసుకోగలం. దాన్నొక సంపదగా కూడా గుర్తించగలం. తప్పుడు ధోరణులు అందులో పాటమరించినా సర్దుకోగలం. సరిచేసుకోగలం.

కానీ సంస్కృతి పని గట్టుకొని కొందరు పుట్టించిందయితే, ప్రచారంలోకి తెచ్చిందయితే ఎలా ఉంటుంది? దానిని మింగడం సులభమా? అనే ప్రశ్నలు వస్తాయి. ఎలా ఉన్నా, సులభమైనా కష్టమైనా మనచేత మింగించడానికి సకల ఏర్పాట్లు దీన్ని పుట్టించినవారే చేస్తారు. అందుకోసం నానా హంగామా వారు సృష్టిస్తారు. ఆఖరికి మనం అందులోంచి బయట పడలేనంతగా ఇరుక్కుపోతాం. బయటపడితే చెడిపోతామని, నష్టపోతామని జంకిపోతాం. ఒళ్ళంతా దీన్ని పూసుకొని వీర తాండవానికి పూనుకొంటాం.

ఇలాంటి సంస్కృతే వినిమయ సంస్కృతి . ఇప్పుడీ వినిమయ సంస్కృతే రాజ్యమేలుతోంది. మన మెదళ్ళని శాసిస్తోంది. మన జీవితాల్ని నడిపిస్తోంది. ఒక్కక్షణం ఆలోచింప నివ్వకుండా, మనల్ని వస్తుమయ ప్రపంచపు ధగధగల్లోకి లాక్కుపోతోంది. కళ్ళు బైర్లు కమ్మిస్తోంది. కలల లోకంలో కాపురం చెయ్యమంటోంది.

దురదృష్టవశాత్తు మన విద్య చుట్టూ సైతం ఒక సంస్కృతి అల్లుకొనిపోయింది. విద్యారంగపు సకల పార్శ్వాలపైనా ఇది చూస్తుండగానే దాడికి పూనుకొంది. ఈ దాడిలో విద్యావిలువలు మారిపొయ్యాయి. విద్యా ప్రయోజనాలు తారుమారయ్యాయి. అసలు విద్యే తానేమిటో తెలియనంతగా వికృతరూపాన్ని సంతరించుకొనింది. తెలుసుకోడం అంటే గుర్తుంచుకోడంగా, ప్రావీణ్యం అంటే ర్యాంకుల సాధనగా, జ్ఞానార్జన అంటే మార్కుల సంపాదనగా మారిపొయ్యాయి. దీనికనుగుణంగా బోధనలోనూ, ఉపాధ్యాయుడిలోనూ కూడా మార్పులొచ్చేశాయి, మంచి టీచరంటే మంచి మార్కులు తెప్పించేవాడు మాత్రమేననే భాష్యం వచ్చేసింది.

ఈ సంస్కృతిపై యుద్ధం చిన్నదేమీ కాదు. పునాదుల్ని కదిలించకుండా ఒట్టి సంస్కృతిపై యుద్ధం చెయ్యడం సాధ్యమూ కాదు.

అయినా మనిషి ఆలోచనాశీలి, తార్కికవాది. స్వభావతః అతడు భౌతికవాది. అదొక్కటే అతన్ని ఎన్ని సవాళ్ళొచ్చినా కాపాడేది. సాంస్కృతిక సవాళ్ళ నుంచీ అతణ్ణదే రక్షించి తీరుతుంది.

కొంత ఆలస్యం కావచ్చు. ఈలోగా చాలా నష్టమూ జరగొచ్చు. అంతే తప్ప అంతిమ విజయం మాత్రం మానవ చైతన్యానిదే.

# సామర్థ్యాల వారీగా ప్రశ్నల నమూనాలు

## పఠనావగాహన (ఉపవాచకం) ప్రథమ భాష (పరిచిత గద్యం)

**I.** సరయూనదీ తీరంలో 'కోసల' అనే సుప్రసిద్ధ దేశముంది. అందులోనిదే 'అయోధ్యా' అనే మహానగరం. 'అయోధ్యా' అంటే యోధులకు జయించడానికి శక్యం కానిది. మనువు దీన్ని నిర్మించాడు. కోసల దేశాన్ని దశరథ మహారాజు పరిపాలిస్తున్నాడు. అతడు సూర్యవంశం వాడు. మహావీరుడు. దేవతల పక్షాన రాక్షసులతో ఎన్నోమార్లు యుద్ధం చేసినవాడు. ధర్మపరాయణుడు. ప్రజలను కన్నబిడ్డలవలె చూసుకునేవాడు. వశిష్ట, వామదేవులు అతని ప్రధాన పురోహితులు. సుమంత్రుడు మొదలుగాగల ఎనిమిది మంది మంత్రులు. ఇతని పాలనలో కోసల దేశం భోగభాగ్యాలతో విలసిల్లింది. ప్రజలు ధర్మవర్తునులై సుఖసంతోషాలతో ఉన్నారు. 'యథారాజా తథాప్రజాః'

* **కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

1. మనువు ఎటువంటి నగరాన్ని నిర్మించాడు?
2. సూర్యవంశం రాజు ఎలాంటి వాడు?
3. దశరథ మహారాజు ఎలా పరిపాలించాడు?
4. 'యథారాజా తథాప్రజాః' అంటే ఏమిటి?
5. పై పేరాకు శీర్షికను నిర్ణయించండి.

**II.** రథం వేదశ్రుతి, గోమతీ, సనందికా నదులను దాటింది. కోసల దేశపు పొలిమేరలకు చేరుకుంది. అక్కడి నుండి అయోధ్యవైపుగా తిరిగి శ్రీరాముడు నమస్కరించాడు. ముందుకు సాగుతూ గంగాతీరానికి చేరుకున్నాడు. ఆ తీరంలో శృంగిబేరపురమున్నది. 'గుహుడు' ఆ ప్రదేశానికి రాజు. అతడు శ్రీరామభక్తుడు. శ్రీరాముడు వచ్చాడన్న వార్తవిని తనవారితో శ్రీరాముని దగ్గరకు బయల్దేరాడు. గుహుణ్ణి చూసి రాముడు లక్ష్మణుడితోపాటు ఎదురువెళ్ళి కలుసుకున్నాడు. ఆ రాత్రి గుహుడి ఆతిథ్యం తీసుకున్నాడు.

**పై పేరా ఆధారంగా కింది వాక్యాలలో ఏవి సరైనవో (✓) ద్వారా గుర్తించండి.**

1. రథం అలకనంద, భాగీరథ, వేదశ్రుతి, గోమతీ నదులను దాటింది. (   )
2. శ్రీరాముడు గోదావరీ తీరానికి చేరుకున్నాడు. (   )
3. గుహుడు దాశరథి భక్తుడు. (   )
4. రాముడు లక్ష్మణుడి ఆతిథ్యం తీసుకున్నాడు. (   )
5. గంగానదీ తీరంలో శ్రీరంగపురం ఉన్నది. (   )

**III. కింది పేరా చదవండి. సరైన వివరణతో ఖాళీలు పూరించండి.**

దండకారణ్యంలోని మునుల ఆశ్రమాలను సందర్శిస్తూ పోతున్నారు సీతారామలక్ష్మణులు. అక్కడక్కడ కొంతకాలం ఉంటున్నారు. ఇలా పది సంవత్సరాలు గడిచింది. మళ్ళీ సుతీక్ష్ణ మహర్షిని దర్శించుకోవాలన్న తమ ఆకాంక్షను వెలిబుచ్చారు. సుతీక్ష్ణ మహర్షి మార్గాన్ని చెప్పాడు. తన ఆశ్రమానికి దక్షిణంగా నాల్గుయోజనాల దూరంలో అగస్త్య సోదరుని ఆశ్రమం, అక్కడికి యోజన దూరంలో అగస్త్యాశ్రమం ఉందని తెలిపాడు. మహర్షి వద్ద సెలవు తీసుకొని బయలుదేరారు సీతారామలక్ష్మణులు.

1. సీతారామ లక్ష్మణులు సుతీక్ష్ణ మహర్షి వద్దకు రావడానికి కారణం ____________________.
2. మహర్షి వద్ద సెలవుతీసుకొని సీతారాములు బయలుదేరిన ప్రదేశం ____________________.
3. సుతీక్ష్ణ మహర్షి తన ఆశ్రమానికి అగస్త్యాశ్రమం గురించి తెలపిన దూరం ____________________.

**IV.** సుగ్రీవుని ఆనతిమీద రామలక్ష్మణులున్న చోటికి ఒక్క గంతువేశాడు హనుమంతుడు. సన్యాసి రూపంలో వారి దగ్గరికి వెళ్ళాడు. వారి రూపాన్ని పొగిడాడు. వారి పరిచయం అడిగాడు రామలక్ష్మణులు మౌనముద్ర దాల్చారు. హనుమంతుడు వారితో వానరరాజు సుగ్రీవుడు ధర్మాత్ముడు, మహావీరుడు. అతణ్ణి ఆయన అన్న వాలి వంచించాడు. రక్షణకోసం జాగ్రత్తతో తిరుగుతున్నాడు. నేను సుగ్రీవుడి మంత్రిని. నన్ను హణుమంతుడంటారు. నేను వాయుపుత్రుణ్ణి. ఎక్కడికైనా వెళ్ళిరాగల శక్తిగలవాణ్ణి. సుగ్రీవుడు పంపగా ఈ రూపంలో మీ దగ్గరికి వచ్చాను. సుగ్రీవుడు మీతో స్నేహాన్ని కోపడుతున్నాడు అని చాకచక్యంగా మాట్లాడాడు. విషయాన్ని చెప్పే పద్ధతిలో ఎంతో నేర్పును ప్రదర్శించాడు. హనుమంతుని మాట తీరు శ్రీరాముణ్ణి ఆకట్టుకుంది. లక్ష్మణుడితో 'ఇతడు వేదాలను, వ్యాకరణాన్ని క్షుణ్ణంగా చదివాడన్నది నిశ్చయం. లేకపోతే మాటల్లో ఇంత స్పష్టత ఉండదు. తడబాటు, తొందరపాటు లేకుండా, తప్పులు పలకకుండా, సరైన స్వరంతో చెప్పదలచుకున్న విషయాన్ని మనసుకు హత్తుకునేట్లు చెప్పాడు. ఈయన మాట్లాడే తీరుచూస్తే చంపడానికి కత్తి ఎత్తిన శత్రువుకు కూడా చేతులు రావు! అని మెచ్చుకున్నాడు. మాటకున్న శక్తి అటువంటిది.

* పై పేరాలో వానరులకు సంబంధించిన పేర్లు ఎన్ని వచ్చాయో, ఎన్నిసార్లు పునరావృతమయ్యాయో పేరా చదివి ఆపదాలు రాయండి.

**V.** హనుమంతుడు మహేంద్రగిరి శిఖరంమీద అడుగుపెట్టాడు. వానరులంతా చుట్టూ చేరారు. పెద్దలకు నమస్కరించాడు హనుమంతుడు. 'చూశాను సీతమ్మ'ను అని ప్రకటించాడు. అందరూ ఆనందించారు. లంకా ప్రయాణ విశేషాలను వారికి వివరించాడు మారుతి. అంగదుడు ఓ వీరులారా! సీతాదేవి జాడ తెలిసిన తరువవాత కూడా ఆమె లేకుండా శ్రీరాముడి దగ్గరికి వెళ్ళడం సబబుకాదు. లంకకు వెళ్ళి రావణుని చంపి సీతను తీసుకొని శ్రీరాముని వద్దకు వెళదా'మని అన్నాడు. హనుమంతుడు అంగదుడి మాటలను ఖండించాడు. శ్రీరామ సుగ్రీవులు సీతను చూసి రమ్మన్నారే కాని తీసుకు రమ్మనలేదు. పైగా రావణున్ని సంహరిస్తానని శ్రీరాముడు ప్రతిజ్ఞచేసి ఉన్నాడు. దానికి భంగం కలుగనీయకూడదన్నాడు. అందరూ వెళ్ళి జరిగిన విషయాలను నివేదిద్దామన్నాడు.

* పై పేరా ఆధారంగా కింది పట్టికను పూరించండి.

| క్రమ సంఖ్య | వాక్యము | సంబంధించిన పదం |
|---|---|---|
| 1) | మహేంద్రగిరి శిఖరం | 1. |
| 2) | హనుమంతుడు ప్రకటించాడు | 2. |
| 3) | ఓ వీరులారా అని సంబోధించింది | 3. |
| 4) | రావణున్ని సంహరిస్తానని ప్రతిజ్ఞ చేసినది | 4. |
| 5) | అంగదుడి మాటలను ఖండించినది | 5. |

## VI. కింది పేరా చదివి ఐదు ప్రశ్నలు తయారుచేయండి.

విశ్వకర్మ కుమారుడైన 'నలుడు' శిల్పకళానిపుణుడు. ఉత్సాహం, శక్తి ఉన్నవాడు. సేతువు (వంతెన)ను నిర్మించడానికి అతడే యోగ్యుడని సముద్రుడు తెలిపాడు. ఆ సేతువును తాను భరిస్తానని మాట ఇచ్చాడు. సేతువు నిర్మాణానికి వానర నాయకులకు ఆజ్ఞ ఇచ్చాడు శ్రీరాముడు. అందరూ మహారణ్యం దారి పట్టారు. పెద్ద పెద్ద చెట్లను బండరాళ్ళను మోసుకువస్తున్నారు. సముద్రంలో పడేస్తున్నారు. వాటి దెబ్బకు సముద్రంలోని నీరు ఆకాశానికి ఎగిసిపడుతున్నది. నలుని సూచనలననుసరించి కొలతల ప్రకారం సేతువు నిర్మాణం జరుగుతూంది. వందయోజనాల పొడవు, పదియోజనాల సేతువును కట్టడం ఐదు రోజుల్లో పూర్తయింది.

## VII. కింది పేరా చదివి ఐదు జంటపదాలను రాయండి.

అంగరంగ వైభవంగా సీతారాముల పట్టాభిషేక మహోత్సవం జరిగింది. లక్ష్మణ, భరత శత్రుఘ్నులు మొదలుగాగల వారందరూ అక్కడ ఉన్నారు. యువరాజుగా ఉండాల్సిందిగా శ్రీరాముడు లక్ష్మణున్ని కోరాడుకాని అతడు ఎంత మాత్రం ఒప్పుకోలేదు. అప్పుడు భరతుణ్ణి యువరాజుగా చేసాడు. యజ్ఞయాగాది క్రతువులను నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నాడు శ్రీరాముడు. ప్రజలను కన్నబిడ్డలా చూసుకుంటున్నాడు. ఎలాంటి ఈతి బాధలూలేవు. అందరూ ధర్మబద్ధంగా నడుచుకొంటున్నారు. ఇలా పదకొండువేల సంవత్సరాల కాలం ప్రజానురంజకంగా పరిపాలించాడు శ్రీరాముడు. అందుకే 'రామరాజ్యం' అన్న మాట నాడు నేడూ ఆదర్శమై నిలిచింది.

## VIII. కింది పేరా చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.

శ్రీరాముడి ఆదేశం మేరకు లక్ష్మణుడు విభీషణుణ్ణి లంకా రాజుగా పట్టాభిషిక్తుణ్ణి చేశాడు. సీతతో తన విజయవార్తను తెలపమని హనుమంతుణ్ణి ఆదేశించాడు శ్రీరాముడు. హనుమంతుడు వెంటనే వెళ్ళి ఈ శుభవార్తను సీతమ్మకు చెప్పాడు. ఆమె ఆనందానికి అవధులులేవు. ఇంతకాలం చుట్టూ చేరి బాధించిన రాక్షసస్త్రీలను చంపడానికి అనుమతినిమ్మన్నాడు హనుమ. తగనిపని, వద్దని వారించింది సీత.

1) పై పేరాకు శీర్షికను పెట్టండి.
2) విభీషణుడు లంకకు రాజు ఎలా అయ్యాడు?
3) పై పేరాలో శుభవార్త ఏది?
4) "ఆనందానికి అవధుల్లేవు" అనే పదాన్ని వివరించండి.
5) పై పేరానుబట్టి సీత గుణం ఎలాంటిదని భావిస్తున్నారు?

# పఠనావగాహన - అపరిచిత గద్యం

**I. కింది పేరా చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.**

సరయూనదీ తీరంలో 'కోసల' అనే సుప్రసిద్ధ దేశముంది. అందులోనివే 'అయోధ్యా' అనే మహానగరం. 'అయోధ్యా' అంటే యోధులకు జయించడానికి శక్యం కానిది. మనువు దీన్ని నిర్మించాడు. కోసల దేశాన్ని దశరథ మహారాజు పరిపాలిస్తున్నాడు. అతడు సూర్యవంశం వాడు. మహావీరుడు. దేవతల పక్షాన రాక్షసులతో ఎన్నోమార్లు యుద్ధం చేసినవాడు. ధర్మపరాయణుడు. ప్రజలను కన్నబిడ్డలవలె చూసుకునేవాడు. వశిష్ట, వామదేవులు అతని ప్రధాన పురోహితులు. సుమంత్రుడు మొదలుగాగల ఎనిమిది మంది మంత్రుల. ఇతని పాలనలో కోసల దేశం భోగభాగ్యాలతో విలసిల్లింది. ప్రజలు ధర్మవర్తునులై సుఖసంతోషాలతో ఉన్నారు. 'యథారాజా తథాప్రజాః'

**ప్రశ్నలు :**

1. పై పేరా ఎవరి గురించి తెలుపుతున్నది?
2. అయోధ్య నగరం గొప్పతనం ఏమిటి?
3. దశరథ మహారాజు ఎలాంటి వాడు?
4. దశరథుని పాలన ఎందుకు గొప్పది?
5. యథారాజా తథాప్రజాః అంటే ఏమిటి?

**II. కింది పేరా చదివి దాని ఆధారంగా పట్టిక పూరించండి.**

ఆచార్యునకు మూడు అర్హతలుండాలి. విషయం బాగా తెలియాలి. 'ఆచినోతిహి' శాస్త్రార్థం తెలిసిన దానిని ఆచరణలో పెట్టాలి. స్వయం ఆచరణలే. విద్యార్థుల జీవితంలోనూ ఆచరించునట్లు చేయాలి; 'ఆచారే స్థాపయతి' విషయం తెలిస్తే విద్వాంసుడే అతనికి ఆచార్య స్థానం లేదు. శాస్త్రార్థాన్ని జీవితంలో అనుభవించేవాడు 'అనుభావి'. అయినా అతనికి ఆచార్య స్థానం దక్కదు. తన జీవితాన్ని ఇతరులకు ఆదర్శప్రాయంగా ఉండేటట్లు తనను తాను తీర్చిదిద్దుకోలేనివాడు వట్టి ప్రచారకుడేఅవుతాడు. కనుక ఆచార్యునిలో పై మూడు లక్షణాలు ఉంటాయి.

| | | |
|---|---|---|
| 1) | ఆచార్యునికి ఉండవలసిన లక్షణాలు | 1. |
| 2) | అనుభావి అంటే | 2. |
| 3) | ఆచార్యస్థానం ఎవరికి దక్కదు | 3. |
| 4) | వట్టి ప్రచారకుడే అయినవాడు | 4. |

**III.** ముందుగా వ్యక్తి బాగుపడవలెను. ఆ వెనుక సంఘము బాగుండును. ముందుగా సంఘమును సంస్కరించవలెననుట వెఱ్ఱిమాట. మాటలో, చేతలో, తుదకు భావనలో సంస్కారముట్టిపడవలెను. అట్టి వ్యక్తులు పెక్కుమంది ఉన్నచో తనంతట తానే సంఘము ఉద్ధరింపబడును. వ్యక్తిని, తుదకు జాతిని తీర్చిదిద్దుకునే ఈ సంస్కారములు. వాని ప్రణాళికను గమనించినచో తన పొట్టకు శ్రీరామరక్ష అనురీతిలో ఉండక వ్యక్తి శ్రేయస్సు, సమాజ కల్యాణము, పరస్పరము ముడివడియున్నదని విడివిడిగా లేదని తెలివిడి చేయును. ఉదాహరణకు ప్రతి గృహస్థు విధిగా చేయవలసిన పంచమహాయజ్ఞములను చూడుడు. దేవయజ్ఞ ముందు దేవతలను, ఋషి యజ్ఞమునందు ఋషులను, వారందించిన విజ్ఞానమును, పితృ యజ్ఞమునందు పితృదేవతలను కొలుచుచున్నాడు కదా! భూత యజ్ఞము నందు కుక్కలకు, కాకులకు బలివేయుచున్నాడు కదా! పొరగువానిని ప్రేమింపమని ఇతర మతములన్నచో, పొరుగు ప్రాణిని కూడా ప్రేమింపమని ఈ సనాతన ధర్మము చాటుచున్నది. తనకకుతాను వండుకొని తినువాడు కేవలము పాపమునే తినుచున్నాడని వేదము భాషించుట లేదా? ఇట్టి సూత్రములు సంస్కారములతో ముడివడియున్నవి.

* **పై పేరా ఆధారంగా కింది వాక్యములు సరైనవో కాదో (✓) (✗) గుర్తుల ద్వారా గుర్తించండి.**

1. వ్యక్తి బాగుపనినప్పుడే సంఘము బాగుపడుతుంది. ( )
2. మాటలు, చేతలు, భావనలతో సంస్కారముట్టిపడదు. ( )
3. ప్రతిగృహస్థు విధిగా పంచమహా యజ్ఞములను చేయవలెను. ( )
4. పొరుగు వానిని ప్రేమించమని, పొరుగు ప్రాణిని ద్వేషించమని సనాతన ధర్మము చెప్పుచున్నది. ( )
5. వ్యక్తి శ్రేయస్సు, సమాజ కళ్యాణము పరస్పరము ముడివడియున్నవి. ( )

**IV. కింది పేరా చదివి ఖాళీలు పూరించండి.**

వ్యవసాయ భూముల్ని ఎలా ఉపయోగించుకుంటామో, జీవనోపాధికోసం బీడు భూముల్ని కూడా ఒక పద్ధతి ప్రకారం ఉపయోగించుకోవచ్చు. అనేక సంక్షేమ కార్యక్రమాలు, ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలూ ఉన్నాయి. గుజరాత్‌లో అముల్ ప్రయోగం మన రాష్ట్రంలోనూ చేయవచ్చు. వృత్తికులాల వాళ్ళు అనేక మంది పరిస్థితులను బట్టి వృత్తులు మార్చుకుంటారు. చిత్రమేమంటే పేదవాళ్ళు ఎప్పుడూ విద్యా వైద్య సౌకర్యాల గురించి అడగరు. భూములు లీజుకు ఇస్తే పెత్తందారులకు, దళారులకు, కులపెద్దలకూ లాభం వస్తుంది. ఈ విషయంలో పేదలను చైతన్యపరచవలసిన ప్రభుత్వాలు కూడా చురుకైన పాత్ర నిర్వహించడపోవడం దురదృష్టకరం!

1. బీడు భూములంటే ____________________.
2. జీవనోపాధికోసం రైతులు ఆధారపడేది ____________________.
3. విద్యా, వైద్య సౌకర్యాల గురించి అడగని వాళ్ళు ____________________.
4. దళారులు చేసేపని ____________________.
5. ప్రభుత్వాలు చేయవలసిన పని ____________________.

## V. కింది పేరా చదివి ఖాళీలు పూరించండి.

ఆరుగాలం శ్రమించి పండించిన ఫలసాయం వర్షానికి తడిసిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. వరికోతలు ప్రారంభమైన వెంటనే వ్యాపారస్తులు, ప్రభుత్వం కొనుగోళ్ళు ప్రారంభిస్తే ఇంత నష్టం జరిగేదికాదని రైతులు వాపోతున్నారు. కొనుగోలు ఏర్పాటు చేసిన ప్రదేశాలు కూడా పల్లపు ప్రాంతాల్లో ఉండటం వల్ల వర్షపు నీరు ఆ కేంద్రాల్లో చేరి చెఱువులను తలపిస్తున్నది. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోకుండా, రైతుల ఆందోళనను చల్లబరచడానికి నష్టనివారణ చర్యలకు పూనుకోవడం వల్ల శాశ్వత పరిష్కారం లభించదు. 'దేశానికి వెన్నెముక రైతన్న' అని ఒక పక్క గొంతెత్తి పాడుతూనే – రైతుల సమస్యలను చిత్తశుద్ధితో పరిశీలించి. వాటి పరిష్కారానికి శ్రద్ధ చూపకపోవడం ఎంతమాత్రమూ క్షమార్హం కాదు.

1. ఆరుగాలం శ్రమించి పండించిన ఫలసాయ ____________

   a) ఎండిపోయింది b) తడిసిపోయింది c) కొట్టుకుపోయింది

2. దిక్కుతోచని స్థితిలో పడిపోయింది ____________

   a) ప్రభుత్వం b) రైతులు c) వ్యాపారస్తులు

3. చెఱువులను తలపించేవి ____________

   a) పల్లపు ప్రాంతాల్లోని ప్రదేశాలు b) రోడ్లు c) కుంటలు

4. దేశానికి వెన్నెముక ____________

   a) వైద్యుడు b) వ్యాపారస్తుడు c) రైతు

5. వాపోవడం అంటే ____________

   a) సంతోషపడడం b) బాధపడడం c) కిందపడడం

## VI. కింది పేరా చదవండి. పట్టికలో ఇచ్చిన వాక్యాలకు సంబంధించిన పదాలతో పూరించండి.

బడి పిల్లలకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తెలుగు పద్యాలను నేర్పించాలి. పద్యాలు నేర్చుకుంటే పిల్లలు బుద్ధిమంతులవుతారు. బంగారు భవిష్యత్తును సృష్టించుకోవడానికి అవి దోహదపడ్తాయి. జ్ఞాపకశక్తిని, సృజనాత్మకతను, భాషా నైపుణ్యాన్ని పెంచే శక్తి పద్యానికున్నది. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, చదువుపట్ల ఆసక్తిని పెంచే పద్యం విద్యార్థుల పాలిటి కల్పతరువు వంటిది. పిల్లలు గొప్పవాళ్ళు కావాలని కోరుకోవడంలో తప్పులేదు కాని, అంతకు మించి బుద్ధిమంతులు కావాలని ఆశించడం ఆరోగ్యదాయకం. మన సాహిత్యంలో ఆణిముత్యాల వంటి పద్యాలకు కొదువలేదు. సూక్తులు, సామెతలు, పొడుపు కథలను కూడా పద్యాల ద్వారా నేర్చుకొని ధారణచేసే మహదవకాశం పద్యం కల్పిస్తుంది. అందుకే ఉపాధ్యాయుడులు, విద్యావేత్తలు, పాలకులు, పిల్లల తల్లిదండ్రులు ఈ విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూయించడం ఎంతో శ్రేయోదాయకమని అత్యధికులు అభిప్రాయపడుతున్నారు.

| క్రమ సంఖ్య | వాక్యాలు | సంబంధించిన పదాలు |
|---|---|---|
| 1) | పద్యాలు నేర్చుకుంటే పిల్లలు | 1. |
| 2) | విద్యార్థుల పాలిటి కల్పతరువు | 2. |
| 3) | మనసాహజత్యంలో ఇటువంటి పద్యాలకు కొదువలేదు | 3. |
| 4) | పిల్లలు బుద్ధిమంతులు కావాలని ఆశించడం | 4. |
| 5) | బడి పిల్లలకు తెలుగు పద్యాలను నేర్పించేవారు | 5. |

**VII. కింది పేరా చదవండి. ఖాళీలు పూరించండి.**

మన సాహిత్యంలో కావ్య – ప్రబంధ – పద్య గద్య రచనలు చేయని గొప్ప ఉపదేశాన్ని – గొప్ప చైతన్యాన్ని ప్రసాదించిన ప్రక్రియల్లో ప్రప్రథమంగా పేర్కొనదగింది శతకం. నీతిని వ్యక్తుల తీరును గొప్పగా వర్ణించినట్టివి శతకాలే. అందువలన కవితాభ్యాస దశలో చిన్న చిన్న పద్యాలను ఆరంభించి శతకం దాకా వచ్చి దానిలో తమ ప్రతిభను నిరూపించుకున్న కవివర్యులున్నారు. శతకం వివిధ రీతులున్నట్లే శతకంలోని ఛందస్సు కూడా వైవిధ్యం కలిగియున్నది. కందం నుండి మధ్యాక్కరాలదాకా వ్యాప్తమైన ఛందం కవుల ప్రతిభవలన చక్కగా పొదిగింది. చిన్నవాడు బాలబాలికలకు శతక పద్యాలను నీతి పద్యాలు, కథలను చెప్పడం ఒకనాటి సంఘంలో ఉన్న నియమం.

1. గొప్ప చైతన్యాన్ని ప్రసాదించిన ప్రక్రియల్లో ప్రప్రథమంగా పేర్కొనదగింది ______________.
2. చిన్ననాడు బాలబాలికలకు నేర్పవలసినవి ______________.
3. శతకంలోని ఛందస్సు ______________ కలిగి యున్నది.
4. కందం నుండి మధ్యాక్కరాల దాకా వ్యాప్తమైంది ______________.

**VIII. కింది పేరా చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

సమాజానికి టీచర్లపట్ల ఉన్న దృక్పథం చాలా విచిత్రమైంది. ఒక్కో సందర్భంలో ఒక్కో రకంగా పరస్పర విరుద్ధంగా ఇది ఉంటుంది. సాంప్రదాయకంగా చూస్తే మన సమాజంలో టీచరంటే దేవుడి తర్వాత దేవుడంతటివాడు. నిస్వార్థ, నిరాడంబర ఆదర్శజీవి. జ్ఞాన ప్రసారం తప్ప ఆతనికి మరో వ్యాపకం ఉండదు. భిన్న సంస్కృతుల నుండి, వాతావరణాల నుండి, ఆర్థిక స్థితిగతుల నుండి వచ్చిన పిల్లలందర్నీ ఒకేస్థాయికి తీసుకొనిరావాలి.

1) సమాజం టీచరు గురించి ఏమనుకుంటుంది?
2) 'నిస్వార్థం' పదానికి వ్యతిరేక పదం ఏమిటి?
3) నిరాడంబరత అంటే ఏమిటి?
4) ఎలాంటి పిల్లలు బడికి వస్తారు?
5) టీచరు బాధ్యత ఏమిటి?

# నమూనా ప్రశ్నలు

## అపరిచిత పద్యం / కవిత / గేయం

**1)** చేతులారంగ శివుని పూజింపడేని
నోరునొవ్వంగ హరికీర్తి నడువడేని
దయయు సత్యంబు లోనుగా దలపడేని
కలుగనేటికి తల్లుల కడుపు చేటు

* **సరైన సమాధానాన్ని గుర్తించండి.**

1. 'కడుపుచేటు' అనే మాటకు అర్థం ______ ( )
   a) చెడ్డకడుపు b) పుట్టుక దండగ c) తల్లులకు బాధ
2. శివపూజ ఎలా చేయమంటున్నాడు - కవి ______ ( )
   a) ఆరుచేతులతో b) చేతులు నొప్పెట్టేటట్లు c) చేతులతో తృప్తికల్గేటట్లు
3. దయను, సత్యాన్ని ఎట్లా తలచాలి? ( )
   a) మనసులో b) లోపల c) బయట
4. నోరారా హరికీరిని ______ ( )
   a) పాడాలి b) పలకాలి c) అరవాలి
5. ఈ పద్యానికి శీర్షికను నిర్ణయించండి ______ ( )
   a) శివభక్తి b) హరికీర్తన c) తల్లికడుపుచేటు

**2) గేయం చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.**

తూరుపు తెలవారుతుంది ప్రతిదినం
కాలం గతి మారుతుంది ప్రతిక్షణం
మంచి మార్పులోకానికి మంగళదాయకం
అది వికటించిందా - అభ్యుదయ వినాశకం

1. గేయాన్ని అనుసరించి మారేది ఏది?
2. మంచి మార్పువల్ల లోకానికి ఏం ప్రయోజం కల్గుతుంది?
3. ప్రతి దినం జరిగేది ఏది?
4. అభ్యుదయానికి ఆటంకం ఎప్పుడు ఏర్పడుతుంది?
5. గేయానికి శీర్షిక నిర్ణయించండి.

**3) కవిత చదివి, తప్పొప్పులను గుర్తించండి.**

ఓ పిడుగా!
నాకు తెలుసు,
నీ శక్తి విద్యుచ్ఛక్తి కంటె గొప్పదని
కాని ఏం లాభం?
నీ ఆవేశమే నిన్ను నేలకు చేరుస్తుంది.
పాతాళానికి దిగజారుస్తుంది.

నీకంటె
నా గదిలో జీరోబల్బునయం
రాత్రంతా
చీకటితో పోరాడుతుంది

1. విద్యుచ్ఛక్తిని మించిన శక్తి లేనిది పిడుగు. ( )
2. ఆవేశం వల్ల పిడుగు నేలకు చేరుతుంది. ( )
3. కవిత ననుసరిఅంచి పిడుగు చాలా గొప్పది. ( )
4. చీకటితో పోరాడేది పిడుగు. ( )
5. పిడుగు కంటె జీరో బల్బే నయం. ( )

**4) పద్యం చదివి ఖాళీలు పూరించండి.**

కుక్క గోవు గాదు; కుందేలు పులి గాదు
దోమ గజము గాదు దొడ్డదైన;
లోభి దాతగాడు లోకంబు లోపల
విశ్వదాభి రామ! వినుర వేమ!

1. ఎంత పెద్దగా ఉన్నప్పటికీ దోమ ________________ మాత్రంకాదు.
2. ________________ ఎంత సాధులక్షణాలున్నా ఆవు కాజాలదు.
3. కుందేలు ఎన్నటికీ ________________ కాలేదు.
4. 'విశ్వదాభిరామ'లోని రెండు పదాలు 1.________________, 2.________________
5. ఈ పద్యం రచించిన కవి ________________.

**5) గేయ భాగం చదవండి. జవాబులు రాయండి.**

ఎంత చక్కనిదోయి ఈ తెలుగుతోట
ఎంత పరిమళమోయి ఈ తోట పూలు

ఏ నందనము నుండి
ఈ నారు తెచ్చిరో!
ఏ స్వర్నదీజలము
లీ మడులకెత్తిరో

ఇంత వింతలజాతు లీ తోటలో పెరుగు!
ఈ తోట యేపులో నింత నవకము విరియు!

1. ఏ తోట పూలు పరిమళాన్నిస్తున్నాయి?
2. నారు ఎక్కడి నుండి తెచ్చారు?
3. నీటిని ఏ నది నుంచి మళ్ళించారు?
4. ఏపుగా ఎదిగిన తోటలో ఏమి విరిసింది?
5. తోటలో ఎటువంటి జాతులు పెరుగుతున్నాయి?

**6) పద్యం చదివి సరైన జవాబును గుర్తించండి.**

వాని రెక్కల కష్టంబు లే నని నాడు
సస్యరమ పండి పులకింప సంశయించు
వాడు చెమ్మటోడ్చి ప్రపంచమునకు
భోజనము బెట్టు; వాడికి భుక్తిలేదు.

1. ఎవరికి భుక్తి కరువు? ( )

a) సస్యరముకు b) ప్రపంచానికి c) కష్టజీవికి

2. 'సస్యరమ' అంటే? ( )

a) పంట అనే లక్ష్మి b) లక్ష్మి అందం c) అందమైన పచ్చదనం

3. రైతు రెక్కల కష్టంతో పులకించేది ఏది? ( )

a) పంట b) భూమి c) చెట్టు

4. ప్రపంచానికి భోజనం పెట్టేది ఎవరు? ( )

a) రాజు b) రైతు c) ఉద్యోగి

5. ఈ పద్యానికి నప్పే (సరిపోయే) శీర్షిక ఏది? ( )

a) శ్రమజీవి గొప్పతనం b) పంట ప్రత్యేకత c) రైతే రాజు

**7) కవిత చదివి జవాబులు రాయండి.**

రాత్రివేళ ఆసుపత్రి కిటికీల్లోంచి నీ
కిరణాలను జాలుగా పంపించి
వ్యాధిగ్రస్తుల పాలిపోయిన కపోలాలను
జాలిగా స్పృశించడం మరచిపోకు.

1. కిటికీల్లోంచి జాలువారే కిరణాలు ఏవి?
2. పాలిపోయిన కపోలాలుగల వాళ్ళెక్కడున్నారు?

3. ఈ కవిత ఎవరినుద్దేశించి చెబుతున్నది?

4. కపోలాలను జాలిగా స్పృశించేది ఏది?

5. ఈ కవితకు శీర్షిక నిర్ణయించండి.

**8) గేయం చదివి జవాబును గుర్తించండి.**

పైన కఠినమనిపించును
లోన వెన్న కనిపించును
జీవమున్న మనిషికన్న
శిలలే నయమనిపించును
ఈ నల్లని రాలలో – ఏ కన్నులు దాగెనో
ఈ బండలమాటున – ఏ గుండెలు మ్రోగెనో

1. ఈ గేయంలో కనిపిస్తున్న అలంకారం – ( )

a) యమకం b) అంత్యానుప్రాస c) రూపక

2. మనిషికన్నా నయమనిపించేవి – ( )

a) రాళ్ళు b) శిల్పాలు c) గుండెలు

3. బండల మాటున ఏమున్నాయంటున్నాడు కవి? ( )

a) వెన్న b) గుండెలు c) జీవం

4. పైకి కఠినంగా కనిపించేది – ( )

a) రాళ్ళు b) మనిషి c) నలుపు

5. ఈ గేయ ఖండికకు పేరు పెడితే – ( )

a) రాళ్ళు b) కన్నులు c) జీవులు

**9) పద్యం చదివి తప్పొప్పులను గుర్తించండి.**

ఎప్పుడు తప్పులు వెదకెడు
అప్పురుషుని గొల్వ గూడదది యెట్లన్నన్
సప్పంబు పడగ నీడను
కప్పవసించిన విధంబు గదరా సుమతీ!

1. నిరంతరం తప్పులు వెతికే వాడ్ని సేవించకూడదు. ( )

2. ఎప్పుడూ తప్పులు వెతికేవాడు కప్పలాంటివాడు. ( )

3. తప్పులు వెతికేవాని సన్నిధి పాముపడగనీడవంటిది. ( )

4. ఈ పద్యం సుమతి శతకంలోనిది. ( )

5. ఈ శతకం రాసిన కవి సుమతి భూపాలుడు. ( )

**10) వచన కవితను చదివి, ప్రశ్నలకు జవాబులు రాయండి.**

ఓ మనిషీ!
నీ యింటికి చలలో వెచ్చదనాన్నిచ్చేది నేను
నీ ఒంటిని ఎండ వేడిమి నుండి కాపాడే నీడను నేను
నీ యింటి తలుపును, కిటకీ పై కప్పునూ నేను
నీవు కూర్చునే కుర్చీ, పడుకునే మంచం, పయనించే పడవనూ నేనే నన్ను రక్షించు. ఇదే నా ప్రార్థన.

1. మనిషితో ఈ మాటలంటున్నది ఎవరు?
2. పడవను దేనితో తయారుచేస్తారు?
3. చలిలో వెచ్చదనాన్ని, వేడిమి నుండి నీడనూ
4. ఎవరిని రక్షించాలి?
5. కవితకు శీర్షికను నిర్ణయించండి.

## పరిచిత పద్యం - నమూనా ప్రశ్నలు

**అ) ఈ కింది పద్యానికి ప్రతిపదార్థం రాయండి.**

శివరాజంతట మేల్మొసుంగు దెరలో స్నిగ్ధాంబుధచ్ఛాయలో
నవ సౌదామినిబోలు నా యవనకాంతా రత్నమున్ భక్తి గా
రవముల్ వారగ జూసి బల్కె వనితా రత్నంబు లీ భవ్య హైం
దవ భూజంగము పుణ్యదేవతలు మాత తప్పు సైరింపుమీ!

**ఆ) ఈ కింది పద్యాన్ని పూరించి, భావము రాయండి.**

సురుచిర .................................. దిక్తటంబునన్.

**గమనిక :** పాఠ్యపుస్తకంలోని చుక్క గుర్తున్న పద్యాలు వస్తాయి. వీటికి ప్రతిపదార్థం రాయడం లేదా పద్యం గురించి భావం రాయాల్సి ఉంటుంది.

## స్వీయరచన నమూనా ప్రశ్నలు

**1. వెన్నెల :**

- వెన్నెల పాఠంలో కవి వర్ణించిన తీరును సొంతమాటల్లో రాయండి.

**2. ధన్యుడు :**

- ధన్యుడు పాఠం ఆధారంగా ధనం యొక్క ఆవశ్యకతను వివరించండి.
- హిరణ్యకుడు సంతోషించడానికి మంధరుడి మాటలు ఎలా తోడ్పడ్డాయో వివరిస్తూ సొంత మాటల్లో రాయండి.

**3. మాతృభావన :**

- 'మాతృభావన' పాఠం ఆధారంగా కవి ఇచ్చిన సందేశాన్ని సొంతమాటల్లో రాయండి.
- ఈ పాఠం ఆధారంగా భారతీయ సంస్కృతి గొప్పతనాన్ని విశ్లేషించి రాయండి.
- 'స్త్రీలను గౌరవించడం అందరి బాధ్యత' ఈ విషయాన్ని సమర్థిస్తూ సొంతమాటల్లో రాయండి.

**4. జానపదుని జాబు :**

- వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురికావడానికి కారణాలు వివరించండి.
- మీ ప్రాంతంలో రైతు సమస్యల గురించి రాయండి.
- వ్యవసాయ రంగం విజయవంతం కావడానికి మీరేం చేస్తారో వివరించండి.

**5. శతక మధురిమ :**

- పాఠం ఆధారంగా వివేకవంతుని సంపదలేవి? ఎందుకో వివరించండి.
- సంపదలేకున్నా పండితుడు ఎప్పుడు ప్రకాశిస్తాడో సొంతమాటల్లో రాయండి.
- అందరిలోను మంచిని చూడడం, మంచిగా మాట్లాడడం వలన కలిగే ఫలితాన్ని ఊహించి రాయండి.
- పాఠం ఆధారంగా 'మనం చేసే పనులు ఏ ఏ సందర్భాలలో ప్రయోజనాన్ని ఇవ్వవు' ఈ విషయాన్ని సమర్థిస్తూ రాయండి.

**6. నేనెరిగిన బూర్గుల :**

- బూర్గుల రామకృష్ణారావుగారి ఉపకారశీలిని గురించి సొంతమాటల్లో రాయండి.
- రచయిత పి.వి.నరసింహారావుతో రామకృష్ణారావు గారికి ఉన్న అనుబంధాన్ని సొంతమాటల్లో రాయండి.
- రామకృష్ణారావు గారు బహుభాషావేత్తగా చూపిన ప్రతిభను మీ సొంతమాటల్లో వివరించండి.

## 7. నగర గీతం :

- పేదరైతులు వ్యవసాయాన్ని వదిలి పట్టణాలకు ఎందుకు వస్తున్నారో సవివరంగా రాయండి.
- నీవు పట్టణంలో జీవిస్తున్నావని, ఊహించి, అక్కడ ఎదుర్కొనే సమస్యలేమిటో రాయండి.
- "పట్టణంలో దారిద్ర్యం. సౌభాగ్యం సమాంతర రేఖలు" అని కవి అనడంలో ఉద్దేశము ఏమై ఉంటుందో వివరించండి.

## 8. యక్షుడి అప్పు :

- కేశవదాసు స్థానంలో నీవు ఉంటే ఏమి చేస్తావో వివరంగా రాయండి.
- 'యక్షుడి అప్పు' పాఠంలో హాస్యం కలిగించిన సంఘటనలు ఏవి? ఎందుకు? హాస్యాన్ని కలిగించావో వివరించండి.
- 'యక్షుడి అప్పు' పాఠం ఆధారంగా కేశవరావు కుటుంబ స్థితిగతులను వివరించండి.
- రామగిరి పాత్ర ఆధారంగా ధనవంతుల స్వభావాన్ని విశ్లేషించి రాయండి.
- 'యక్షుడి అప్పు' నాటిక ఆధారంగా విశ్వనాథ సత్యనారాయణ రచనాశైలిని ఉదాహరణల ద్వారా వివరించండి.

## 9. బసవేశ్వర పరిణయం :

- బసవేశ్వర పరిణయం పాఠం ఆధారంగా పాల్కురికి సోమనాథుని రచనా శైలిని సొంతమాటల్లో రాయండి.
- 'బసవేశ్వర పరిణయం' పాఠం ఆధారంగా వివాహం జరిగిన తీరును వివరించండి.
- వివాహ సందర్భంగా కోలాటం, బహురూపులు, గొండి, సేరిణి, కేళిక మొదలైన నృత్యాలు ఎందుకు చేస్తారో సొంతమాటల్లో రాయండి.

## 10. మా ప్రయత్నం :

- "శాల్యూట్లన్నీ హీరోలకే, హీరోయిన్లు ఆ తర్వాతే... ఇదీ మన సమాజ వికాసం. చివరకు మిగిలేది హీరో గొప్పతనమే" అని షావుకారు జానకి గారు అన్నారు కదా! ఆమే అలా అనడానికి కారణాలను విశ్లేషిస్తూ, సమర్థిస్తూ రాయండి.
- ఏ రంగంలోనైన స్త్రీలు చేసిన కృషికి సరైన గుర్తింపు లభించకపోవడానికి కారణాలు ఏమై ఉంటాయో ఊహించి రాయండి.
- పూర్వం స్త్రీలు చదువుకోవటమే తప్పు అనేవారు కదా! నేడు అన్ని రంగాల్లో స్త్రీలు రాణిస్తున్నారు కదా! ఇంతటి మార్పు ఎలా జరిగిందని మీరు భావిస్తున్నారు.
- మీ అమ్మ మీ కుటుంబం కోసం చేస్తున్న కృషిని వివరించి, రాయండి.

**11. మాణిక్య వీణ :**

- "మంత్రాలతో చింతకాయలు రాలవు" ఈ వాక్యాన్ని సమర్థిస్తూ మీ అభిప్రాయాన్ని రాయండి.
- పాఠం ఆధారంగా మానవ ప్రగతికి పునాది ఎక్కడ పడిందో వివరిస్తూ రాయండి.
- చక్రం, నిప్పు మనిషి మనుగడకు ఎలా తోడ్పడ్డాయో సొంతమాటల్లో రాయండి.
- పాఠం ఆధారంగా మానవ పరిమాణ క్రమాన్ని వివరించండి.

**12. గోరంత దీపాలు :**

- 'గోరంత దీపాలు' పాఠం ఆధారంగా గోరంత దీపాలు కొండంత వెలుగునిస్తాయని సమర్థిస్తూ సొంతమాటల్లో రాయండి.
- రైలు పెట్టెలో తుడుస్తున్న బాలుడిలాంటి వారు అనేక మంది పిల్లలు చదువులేక, కష్టపడుతున్నారు కదా! సమాజంలో ఇలాంటి పరిస్థితి పోవాలంటే ఏమి చేయాలి?
- మనం చదివే మంచి పుస్తకాలు మన ఆలోచనలో, మన వ్యక్తిత్వంలో మార్పులు తెస్తాయని సమర్థిస్తూ రాయండి.

**13. భిక్ష :**

- భిక్ష పాఠం ఆధారం శ్రీనాథుని రచనా శైలిని సొంతమాటల్లో రాయండి.
- శివుడు, వ్యాసుని ఎందుకు పరీక్షించదలిచాడో సొంతమాటల్లో రాయండి.
- "ఉన్న ఊరు కన్నతల్లితో సమానం" ఈ వాక్యాన్ని సమర్థిస్తూ రాయండి.
- మనుషులకు ఏ ఏ సందర్భాలల్లో కోపం వస్తుంది? కోపం లాభమా! నష్టమా! వివరించండి.
- పాఠం ఆధారం కాశీ పట్టణ గొప్పతనాన్ని వివరించండి.
- ఈ పాఠం ఆధారంగా మీరు గ్రహించిన సందేశాన్ని విశ్లేషిస్తూ రాయండి.

**14. చిత్రగ్రీవం :**

- 'చిత్రగ్రీవం' పాఠం ద్వారా మానవులకు, పక్షులకు మధ్యగల సంబంధాన్ని వివరించండి.
- చిత్రగ్రీవం ఎదగడంలో వెనకబడడానికి కారణాలు ఏమై ఉంటాయి.
- ఇంట్లో చాలా మంది పావురాలను పెంచుకుంటారు కదా! వారు పొందే అనుభూతిని సొంతమాటల్లో రాయండి.
- 'చిత్రగ్రీవం' పాఠంలోని బాలుని స్థానంలో నీవుంటే ఏమి చేస్తావో వివరించండి.
- పాఠం ఆధారంగా పావురాల జీవన విధానాన్ని వివరించండి.

## సృజనాత్మకత - నమూనా ప్రశ్నలు

1) సూర్యోదయ సమయంలో మీకు కన్పించే దృశ్యాన్ని వర్ణిస్తూ ఒక కవితను రాయండి.

2) ధన్యుడు పాఠం ఆధారంగా ధనం ప్రాముఖ్యతను వివరిస్తూ ఒక వ్యాసం రాయండి.

3) సోన్‌దేవుడు, శివాజీ, యవనదేశ స్త్రీ మధ్య జరిగిన మాటలను సంభాషణ రూపంలో రాయండి.

4) పల్లె జీవితాన్ని ప్రతిబింబించేలాగా ఒక గేయాన్ని రాయండి.

5) బూర్గుల వారి ఉన్నత వ్యక్తిత్వమును తెలియజేస్తూ మీ మిత్రునికి ఒక లేఖ రాయండి.

6) నగరంలోని ప్రధానమైన సమస్య అధిక జనాభా వల్ల కలిగే అనర్థాలపై ప్రజలను చైతన్యపరిచేలా ఒక కరపత్రం తయారుచేయండి.

7) మీ ఇంట్లో / మీకు తెలిసిన వారి పెళ్ళికి సంబంధించిన ఆహ్వానపత్రిక తయారుచేసి ప్రదర్శించండి.

8) స్త్రీల సమస్యను ప్రతిబింబించేలా మహిళా ఉద్యమాలపై నినాదాలు రాయండి.

9) నీ చుట్టూ ఉన్న పరిసరాల్లో నీ బాల్యం నుండి ఇప్పటి వరకు కల్గిన అభివృద్ధిని, మార్పులను తెలియజేస్తూ ఒక వ్యాసం రాయండి.

10) మీ వయస్సు వాడైన బాలుడు బడిమానేసి చెత్త ఏరుకుంటూ కనపడినప్పుడు అతనిని బడికి తీసుకురావటానికి మీరు చేసే ప్రయత్నాన్ని సంభాషణ రూపంలో రాయండి.

11) కాశీపట్టణంలో పార్వతికి, వ్యాసునకు జరిగిన సంభాషణను కథ రూపంలో రాయండి.

12) మన పరిసరాల్లో జీవించే పశుపక్ష్యాదుల పట్ల మనం ఏ విధంగా మసలుకోవాలో తెలుపుతూ ఒక కరపత్రం రాయండి.

## C. నమూనా ప్రశ్న పత్రాలు, మాదిరి జవాబు పత్రం, మూల్యాంకన సూచికలు

### సంగ్రహణాత్మక మూల్యాంకనం

### మాదిరి ప్రశ్న పత్రం (ప్రథమభాష)-1

| | |
|---|---|
| తరగతి : 10వ | మార్కులు : 80 |
| ప్రథమ భాష : తెలుగు | సమయం : 3 గం॥ |

**I. చదవడం - అవగాహన చేసుకోవడం. (20 మార్కులు)**

**అ) కింది గద్యాన్ని చదివి కింది ప్రశ్నలకు జవాబులు రాయండి. 5×1=5**

శ్రీరాముడి శోకాన్ని పోగొట్టే ప్రయత్నం చేశాడు సుగ్రీవుడు. సీతాదేవిని తీసుకురావడంలో తన వంతు సాయం చేస్తానన్నాడు. రావణుణ్ణి సపరివారంగా హతమార్చేందుకు తన శక్తియుక్తులన్నింటినీ వినియోగిస్తానన్నాడు. దుఃఖం అనర్థదాయకం కనుక ఎప్పుడూ దుఃఖించవద్దన్నాడు. ఎల్లప్పుడు దుఃఖించే వారికి సుఖముండదు. తేజస్సు క్షీణిస్తుంది. ప్రాణాలు నిలవడమే కష్టంగా ఉంటుంది. కనుక దుఃఖస్థితి నుండి బయటపడమని ధైర్యవచనాలు చెప్పాడు.

1. శ్రీరాముడు ఎందుకు శోకించాడు?
2. సుగ్రీవుడు దేనికొరకు తన శక్తిని వినియోగిస్తానన్నాడు?
3. దుఃఖం వల్ల ఏం కలుగుతుంది?
4. శ్రీరాముడిని ఓదార్చిన వారెవరు?
5. ఈ భాగం ఏ కాండంలోనిది?

**ఆ) కింది గద్యభాగాన్ని చదివి ఐదు ప్రశ్నలను తయారుచేయండి. 5×1=5**

శ్రీకృష్ణదేవరాయలు 16వ శతాబ్దంవాడు. సాహిత్యంపై ప్రత్యేక అభిమానం కలవాడు. భువన విజయమనే సభామంటపంలో సాహిత్యగోష్ఠి నిర్వహించేవాడు. అనేక కవి పండితులను పోషించేవాడు. ఆయన ఆస్థానంలో 8 మంది ప్రసిద్ధ కవులను అష్టదిగ్గజాలు అని పిలిచారు. అందులో అల్లసాని పెద్దన అగ్రగణ్యుడు. వారిలో తెనాలి రామకృష్ణుడు వికటకవిగా పేరుపొందాడు. రాయలు రాజు మాత్రమే కాదు కవి కూడా. దేశభాషలందు తెలుగు లెస్స అని చాటాడు. ఆయన కాలం తెలుగుభాషకు స్వర్ణయుగమై భాసిల్లింది.

**ఇ) కింది పద్యానికి ప్రతిపదార్థం రాయండి. 1×5=5**

సురుచిరతారకా కుసుమ శోభి నభోంగణ భూమిఁ గాలమ
న్గరువపు సూత్రధారి జతనంబున దిక్పతికోటి ముందటన్
సరసముగా నటింపగ నిశాసతి కెత్తిన క్రొత్తతోపుఁ బెం
దెర యన నొప్పె సాంధ్యనవదీధితి పశ్చిమ దిక్తటంబునన్

**ఈ) కింది పద్యం చదివి ప్రశ్నలకు సరైన జవాబులు గుర్తించండి.** **5×1=5**

కమలములు నీటబాసిన
కమలాప్తుని రశ్మిసోకి కమలిన భంగిన్
తమ తమ నెలవులు దప్పిన
తమ మిత్రులే శత్రులగుట తథ్యము సుమతీ!

1. కమలాప్తుడు అనగా... ( )

   a) చంద్రుడు b) సూర్యుడు c) ఇంద్రుడు

2. నీట బాసినవి... ( )

   a) కమలములు b) పుస్తకములు c) మిత్రులు

3. "తమ స్థానములు కోల్పోతే" అనే అర్థం వచ్చే పాదం ( )

   a) 3వ పాదం b) 2వ పాదం c) 4వ పాదం

4. మిత్రులు శత్రువులెప్పుడు అవుతారు? ( )

   a) తమ స్థానం తప్పినప్పుడు b) తమ స్థానం తప్పినప్పుడు c) స్థానమే లేనప్పుడు

5. పై పద్యం ఏ శతకంలోనిది? ( )

   a) సుమతీ శతకం b) వేమన శతకం c) దాశరథీ శతకం

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

### ఎ) స్వీయరచన (30 మార్కులు)

**అ) కింది ప్రశ్నలకు 5 లేక 6 వాక్యాల్లో జవాబులు రాయండి.** **4×3=12**

1. మర్యాద, హద్దు మీరి ప్రవర్తిస్తే ఏమవుతుంది?
2. జీవితాన్ని కాచి వడపోయడమంటే ఏమిటి?
3. ఉన్న ఊరు కన్నతల్లితో సమానమంటారు ఎందుకు?
4. "స్త్రీలు భారతావని భాగ్యకల్పలతలు" - అనడంలో కవి ఉద్దేశం ఏమిటి?

**ఆ) కింది వానిలో ప్రతిభాగం నుండి ఒక ప్రశ్నకు తప్పని సరిగా 12 లేక 15 వాక్యాల్లో జవాబులు రాయండి.**
**3×6=18**

5. సంస్కారం నేర్వని చదువు, చంచల మనస్సుతో చేసే పూజ రెండు వ్యర్థమే - ఎలాగో సమర్థించండి.

(లేదా)

"నగరం మహావృక్షం మీద ఎవరికి వారే ఏకాకి" - వివరించండి.

6. "యాచక వృత్తి సమస్త గౌరవాన్ని హరిస్తుంది" – విశ్లేషిస్తూ రాయండి.

(లేదా)

రాజకీయాలలో బూర్గుల వారి సమ్యక్ దృష్టి కోణం సంకుచిత సైద్ధాంతిక అరలకు తావివ్వలేదు – దీనిని బట్టి మీరేమి గ్రహించారు.

7. శ్రీరాముడు శివధనుస్సును విరిచిన విధానాన్ని తెల్పండి.

(లేదా)

జ్ఞానాన్ని పొందడంలో నిరంతరం అప్రమత్తులై ఉండడం ఉత్తమ విద్యార్థుల లక్షణం – సమర్థిస్తూ రాయండి.

**బి) సృజనాత్మక వ్యక్తీకరణ (10 మార్కులు)**

**అ) కింది వానిలో ఏవైనా రెండు ప్రశ్నలకు జవాబులు రాయండి. 2×5=10**

8. బడి ఈడు పిల్లలందరూ బడికి వెళ్ళి చదువుకోవాలనే సందేశమిచ్చేలా 5 నినాదాలు రాయండి.

9. స్త్రీలపై జరుగుచున్న అత్యాచారాలను ఖండిస్తూ, వారిని గౌరవించాలని తెలుపుతూ ఒక "కరపత్రం" తయారుచేయండి.

10. శివాజీకి సోన్‌దేవుడికి మధ్య జరిగిన సంఘటనను సంభాషణ రూపంలో రాయండి.

## III. భాషాంశాలు

**ఎ) పదజాలం (10 మార్కులు)**

**అ) కింది అర్థాలు రాయండి. 2×1=2**

1. పరీక్షల <u>అనంతరం</u> సెలవులు ఇచ్చారు. (గీతగీసిన పదానికి అర్థం రాయండి)

2. ఈప్సితం అనగా ______________________________

**ఆ) కింది వాక్యాలలోని పర్యాయపదాలు గుర్తించండి. 2×1=2**

3. మేము కొత్త ఇల్లు కట్టాం. ఆ గృహం చిన్నదైనా బాగుంది. మా నికేతనమునకు అందరినీ ఆహ్వానిస్తున్నాను.

4. మన దేశంలో గంగానది, యమునా వాహినీ, కృష్ణ తరంగిణి, గోదావరి ప్రవంతి ముఖ్య నదులు.

**ఇ) కింది వాక్యాల్లో ప్రకృతి పదం గుర్తించి దానికి వికృతి పదం, వికృతి పదం గుర్తించి దానికి ప్రకృతి పదం రాయండి. 2×1=2**

5. వ్యాసుడు భిక్షమడిగాడు.

6. సమ్మక్క సారక్క జాతర బాగా జరిగింది.

**ఈ) కింది పదాలతో సొంతవాక్యాలు రాయండి.** **2×1=2**

7 జాగారం

8. పల్లెసీమలు

**ఉ) కింది వాటిని తెల్పుము.** **2×1=2**

9. "ఆరునూరైనా" ఈ పదాన్ని ఏ సందర్భంలో ఉపయోగిస్తాం.

10. "అందెవేసిన చెయ్యి" దీనిని ఏ సందర్భంలో ఉపయోగిస్తాం.

**బి) వ్యాకరణాంశాలు (10 మార్కులు)**

**అ) కింది వానికి సరైన జవాబును గుర్తించి బ్రాకెట్లలో రాయండి.** **5×1=5**

11. స్నిగ్ధాంబుధ – ఏ సంధి? ( )

a) గుణసంధి b) సవర్ణదీర్ఘసంధి c) వృద్ధిసంధి

12. ప్రాతాది సంధికి ఉదాహరణ ( )

a) పూవు + రెమ్మ b) శుభ + ఉదయం c) దేశ + అభిమానం

13. కఠినపరీక్ష – విగ్రహవాక్యం ( )

a) కఠినము యొక్క పరీక్ష b) కఠినమైన పరీక్ష c) కఠినము వలన పరీక్ష

14. "చదువది ఎంత గల్గిన రసజ్ఞత ఇంచుక చాలకున్నదా" – ఈ పద్యపాదం ( )

a) చంపకమాల b) ఉత్పలమాల c) మత్తేభము

15. శార్దూల పద్యంలో వచ్చే గణాలు ( )

a) భరనభభరవ b) మసజసతతగ c) నజభజజజర

**ఆ) కింది వాటిని రాయండి.** **5×1=5**

16. వర్షం వచ్చింది. చెరువు నిండలేదు. (సంయుక్త వాక్యం రాయండి.)

17. గురువు గారు మంచి నిర్ణయాలు తీసుకున్నారు. (కర్మణి వాక్యం రాయండి.)

18. "నేను రామాయణం చదివాను. నాకెంతో నచ్చింది" అని సురేష్ అన్నాడు. (పరోక్ష కథనం రాయండి.)

19. శ్రీనాథువర్ణించు జిహ్వ జిహ్వ (ఇందులోని అలంకారాన్ని గుర్తించుము.)

20. ఉపమాన ఉపమేయాలకు అభేదం చెప్పుట. (ఏ అలంకార లక్షణం)

## సంగ్రహణాత్మక మూల్యాంకనం - 10వ తరగతి

### మాదిరి ప్రశ్న పత్రం (ప్రథమభాష)-2

| | |
|---|---|
| తరగతి : 10వ | మార్కులు : 80 |
| ప్రథమ భాష : తెలుగు | సమయం : 3 గంll |

**I. చదవడం - అవగాహన చేసుకోవడం. (20 మార్కులు)**

**అ) కింది పేరా చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.** **5×1=5**

పంచవటిలో జీవనం ప్రశాంతంగా గడుస్తున్నది. ఒకనాడు శ్రీరాముడు పురాణ కథా ప్రసంగంలో ఉన్నాడు. అంతలో 'శూర్పణఖ' అనే రాక్షసి వచ్చింది. ఈమె రావణాసురుడి చెల్లెలు. శ్రీరాముడి సౌందర్యానికి ముగ్ధురాలైంది. తనను చేపట్టమన్నది. తమ మధ్య అడ్డుగా ఉన్న సీతాలక్ష్మణులను చంపితింటానన్నది. శ్రీరాముడు పరిహాసంగా లక్ష్మణుని వద్దకు వెళ్ళమన్నాడు. లక్ష్మణుడు తాను అన్నదాసుడనని, తనతో ఉంటే శూర్పణఖ కూడా దాస్యం చేయాల్సివస్తుందని, అందుకే శ్రీరాముణ్ణి చేరడమే సబబని సమాధానమిచ్చాడు. శ్రీరాముడివైపు తిరిగింది శూర్పణఖ. సీత ఉండడం వల్లనే తనను నిరాకరిస్తున్నాడని అట్టుడికిపోయింది. సీతాదేవిని అడ్డుతొలగించుకోవాలని ఆమెపై దాడికి దిగింది.

1. లక్ష్మణుడు శూర్పణఖతో ఏమన్నాడు?
2. శ్రీరాముడు శూర్పణఖను ఎందుకు నిరాకరించాడు?
3. శూర్పణఖ ఎవరు?
4. సీతారామ లక్ష్మణులు ఎక్కడున్నారు?
5. ఈ పేరాకు శీర్షిక నిర్ణయించండి.

**ఆ) కింది పేరా చదివి, అర్థవంతమైన ఐదు ప్రశ్నలు రూపొందించండి.** **5×1=5**

ఏకశిలానగరాన్ని రాజధానిగా చేసుకొని తెలుగునేలను వైభవస్థితిలో నిలిపిన కాకతీయ రాజుల్లో చివరివాడు రెండవ ప్రతాపరుద్రుడు. అతడు ఉత్తమ పరిపాలకుడు మాత్రమే కాదు. మానవధర్మాన్ని, కళామర్మాన్ని ఎరిగిన సాహితీమూర్తి. సంస్కృతాంధ్రభాషల్లో అనుపమాన పాండిత్యాన్ని సొంతం చేసుకున్న సత్కవీంద్రుడు. సంగీత, సాహిత్య, నృత్య, చిత్రలేఖన శిల్పకళలకు ఇతోధిక ప్రాధాన్యతనిచ్చి, వాటి విస్తృతికి విశేష సహకారమందించిన రసహృదయుడు, సహృదయుడు. ఎంతటి మహోన్నతులకైనా చంద్రునిలో మచ్చలా ఏవో బలహీనతలుంటాయి. వేట ప్రతాపరుద్రుని బలహీనత. క్రమం తప్పకుండా వేట వినోదాన్ని ఆస్వాదించేవాడు ప్రతాపరుద్రుడు. ఆ వ్యసనం నుండి మహారాజును దూరం చేయాలని ఎంతగా ప్రయత్నించినా సఫలంకాలేకపోయినాడు మంత్రి యుగంధరుడు.

**ఇ) పద్యం చదివి, ప్రశ్నలకు జవాబులు రాయండి.** **5×1=5**

కం॥ ఇందు గల డందులేడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందే కలడు దానవాగ్రణి వింటే.

1. సర్వోపగతుడు ఎవరు?
2. చక్రి ఎక్కడెక్కడున్నాడు?
3. ఈ పద్యం ఎవరిని సంబోధిస్తున్నది?
4. ఈ పద్యం ఏ గ్రంథంలోనిదై ఉంటుంది? (రామాయణం, భారతం, భాగవతం)
5. ఎందెందు వెదకి చూచిన అందందే గలవాడు ఎవరు?

**ఈ) కింది పద్యానికి ప్రతిపదార్థం రాయండి.** **1×5=5**

బీదలకన్నవస్త్రములు పేర్మినొసంగుము, తుచ్ఛసౌఖ్య సం
పాదనకై యబద్ధముల బల్కకు; వాదములాడబోకు; మ
ర్యాదనతిక్రమింపకు; పరస్పర మైత్రి మెలంగు మిట్టివా
వేదములం చెరుంగుము వివేకధనంబిది నమ్ము చిత్తమా!

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

### ఎ) స్వీయరచన (30 మార్కులు)

**అ) లఘు ప్రశ్నలు : కింది ప్రశ్నలకు 5 లేక 6 వాక్యాల్లో జవాబులు రాయండి.** **4×3=12**

1. శతక మధురిమ పాఠం నుండి మీరు గ్రహించిన ఏవైనా 4 నీతి వాక్యాలను తెల్పండి.
2. 'చరిత్ర నిర్మాతలుగా స్త్రీలకు గుర్తింపు దొరక'దని 'మా ప్రయత్నం' రచయిత్రులెందుకన్నారు?
3. "ఇవ్వీటిమీద నాగ్రహము దగునె?" అనే మాటలు ఎవరు, ఎవరితో ఏ సందర్భంగా అన్నారు?
4. విశ్వనాథ సత్యనారాయణ గారి జీవిత విశేషాలు తెల్పండి.

**ఆ) వ్యాసరూప ప్రశ్నలు : కింది ప్రశ్నలకు 12 లేక 15 వాక్యాల్లో జవాబులు రాయండి.** **3×6=18**

1. 'స్త్రీలను దేవతలుగా భావించి పూజించాలి' అనే మాటలను సమర్థించండి.

(లేదా)

ఈనాటి నగరజీవితాన్ని విశ్లేషించండి.

2. ‘ధన్యుడు’ అనే పేరు హిరణ్యకుని వృత్తాంతానికి ఎలా సరిపోయిందో సమర్థించండి.

(లేదా)

పశుపక్షులు తమ సంతానాన్ని పెంచే విధానాన్ని సొంతమాటల్లో వివరించండి.

3. రామాయణంలో మీకు నచ్చిన పాత్ర ఏది? ఎందుకో తెల్పండి.

(లేదా)

రామాయణం ఆధారంగా అన్నదమ్ముల అనుబంధాన్ని విశ్లేషించండి.

**బి) సృజనాత్మక వ్యక్తీకరణ (10 మార్కులు)**

**అ) కింది వానిలో రెండింటికి సృజనాత్మకంగా జవాబులు రాయండి. 2×5=10**

1. పల్లెటూళ్ళలోని ప్రకృతిని గురించి, పల్లెల్లోని మానవ ప్రకృతిని గురించి వివరిస్తూ మిత్రునికి లేఖ రాయండి.
2. మానవ జీవితాన్ని గురించిన విశ్లేషణను 8-10 పంక్తులకు తగ్గని కవిత ద్వారా తెల్పండి.
3. వివాహవేడుకల్లో వచ్చిన మార్పులను గురించి ఇద్దరు మిత్రుల సంభాషణ ద్వారా ప్రకటించండి.

**III. భాషాంశాలు**

**ఎ) పదజాలం (10 మార్కులు)**

**అ) కింది వాక్యాల్లోని గీత గీచిన పదాల అర్థాలను గుర్తించండి. 2×1=2**

1. వ్యక్తి గొప్పతనాన్ని తెల్పడానికి ప్రవర్తనే <u>గీటురాయి</u>. ( )

a) అద్దం b) సౌందర్యం c) అర్థం d) నిదర్శనం

2. శరీరానికే గాదు, మనసుకూ <u>రుగ్మత</u>లుంటాయి. ( )

a) బాధ్యతలు b) ఆలోచనలు c) జబ్బులు d) అందాలు

**ఆ) కింది పదాలకు నానార్థాలు రాయండి. 2×1=2**

1. అర్థి = ________________________________

2. లెస్స = ________________________________

**ఇ) ఈ కింది పదాలకు సమానార్థాన్నిచ్చే రెండు పదాలను ఎంపికచేసి రాయండి. 2×1=2**

1. నలిరేగు ____________ ____________

2. మిన్ను ____________ ____________

**ఈ) కింది పదాలను ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.** **2×1=2**

1. కలకలం : ______________________________

2. ముద్రవేసిన : ______________________________

**ఉ) కింద గీత గీసిన పదాలకు ప్రకృతులకు వికృతులు / వికృతులకు ప్రకృతులు రాయండి.** **2×1=2**

1. కవితలన్నీ కలిపి అతనొక కబ్బం తయారుచేశాడు.

   కవిత = ______________ కబ్బం = ______________

**బి) వ్యాకరణాంశాలు (10 మార్కులు)**

**అ) కింది గీత గీసిన పదాలను విడదీసి, సంధి ఏర్పడ్డవిధం తెల్పండి.** **2×1=2**

1. మహాత్ముడు గ్రామోద్ధరణ కోసం ఎంతో కృషి చేశాడు.
2. జలప్రళయంలో అసువులు కోల్పోయిన వాళ్ళ దీనగాథలు వింటే హృదయం బరువెక్కింది.

**ఆ) కింది సమాసాలను గుర్తించి, విగ్రహవాక్యాలు రాయండి.** **2×1=2**

1. మహేశ్వరనికరము బసవేశ్వరుని కళ్యాణం తిలకించేందుకు వచ్చారు.
2. అస్థిరభావం విడిచినప్పుడే గమనం సులువు అవుతుంది.

**ఇ) కింది పద్యపాదానికి గణవిభజన చేసి, ఆ పద్యం లక్షణాలు రాయండి.** **1×2=2**

1. అనలజ్యోతుల నీ పతివ్రతలఁ బాపాచారులైడాయు భూ

**ఈ) కింది వాక్యంలోని అలంకారాన్ని గుర్తించి, లక్షణం రాయండి.** **1×2=2**

1. అక్షయ్ వృక్షముల రక్షణ పర్యవేక్షణ జేస్తున్నాడు.

**ఉ) పరోక్ష కథనంలోకి మార్చండి.** **1×2=2**

1. "నేనంతటి వాడ్ని కాను" అన్నాడు రామగిరి.

# సంగ్రహణాత్మక ప్రశ్నపత్రం - పదవ తరగతి - తెలుగు (ప్రథమభాష)-3

**మార్కులు : 80**

## I. చదవడం - అవగాహన చేసుకోవడం (20 మార్కులు)

**అ) కింది గద్యాన్ని చదివి కింది ప్రశ్నలకు జవాబులు రాయండి. 5×1=5**

"శ్రీరాముడి శోకాన్ని పోగొట్టే ప్రయత్నం చేశాడు సుగ్రీవుడు సీతాదేవిని తీసుకురావడంలో తన వంతు సాయం చేస్తానన్నాడు. రావణుణ్ణి సపరివారంగా హతమార్చేందుకు తన శక్తియుక్తులన్నింటినీ వినియోగిస్తానన్నాడు. దుఃఖం అనర్థదాయకం కనుక ఎప్పుడూ దుఃఖించవద్దన్నాడు. ఎల్లప్పుడూ దుఃఖించే వారికి సుఖముండదు. తేజస్సు క్షీణిస్తుంది. ప్రాణాలు నిలవడమే కష్టంగా ఉంటుంది. కనుక దుఃఖస్థితి నుండి బయటపడమని ధైర్యవచనాలు చెప్పాడు."

1. శ్రీరాముడు ఎందుకు శోకించాడు?
2. సుగ్రీవుడు ఎందుకు దుఃఖించవద్దన్నాడు?
3. దుఃఖం వల్ల ఏం కల్గుతుంది?
4. శ్రీరాముణ్ణి ఎవరు ఓదార్చారు?
5. ఈ భాగం ఏకాండంలోది?

**ఆ)** శ్రీకృష్ణదేవరాయలు 16వ శతాబ్దం వాడు. సాహిత్యంపై ప్రత్యేక అభిమానం కలవాడు. తన ఆస్థాన సభలో భువనవిజయమనే సభామంటపంలో సాహిత్య గోష్ఠి నిర్వహించేవాడు. ఆస్థానంలో అనేక కవిపండితుల్ని పోషించేవాడు. ఆయన ఆస్థానంలో 8 మంది ప్రసిద్ధ కవులను అష్టదిగ్గజాలు అనిపిలిచారు. అందులో అల్లసానిపెద్దన అగ్రగణ్యుడు. తెనాలి రామకృష్ణుడు వికటకవిగా పేరొందినవాడే. రాయలు కవిపోషకుడే కాక స్వయంగా కవి కూడా! దేశభాషలందు తెలుగు లెస్స అని చాటిన శ్రీకృష్ణదేవరాయల కాలం తెలుగు భాషకు స్వర్ణయుగమై భాసిల్లింది.

*** పై పద్యాన్ని చదివి 5 ప్రశ్నలు తయారుచేయండి. 5×1=5**

**ఇ) కింది అపరిచిత పద్యం చదివి, ప్రశ్నలకు జవాబులు రాయండి. 5×1=5**

చదువది ఎంత గల్గిన రసజ్ఞత ఇంచుక చాలకున్న నా
చదువు నిరర్ధకంబు గుణ సంయుతులెవ్వరు మెచ్చరెచ్చటం
బదనుగ మంచికూర నలపాకము చేసిననైన నదు ఇం
పొదవెదు నుప్పులేక రుచిపుట్టగ నేర్చునటయ్య భాస్కరా!

1. ఈ పద్యంలో మకుటం ఏది?
2. రసజ్ఞత అంటే ఏమిటి?
3. చదువును దేనితో పోల్చారు?
4. ఎలాంటి చదువు నిరర్ధకం?
5. 'నిరర్ధకం' అంటే ఏమిటి?

**ఈ) కింది పద్యాన్ని పూరించి భావం రాయండి.** **1×5=5**

శివరాజంత మేల్మొసుగుతెరలో ... ... ... ... ... మాతా తప్పుసైరింపుమీ!

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

### ఎ) స్వీయరచన

**అ) కింది ప్రశ్నలకు 5 లేక 6 వాక్యాల్లో జవాబులు రాయండి.** **4×3=12**

1. చంద్రోదయాన్ని చూస్తున్నప్పుడు మీరు ఏవిధంగా అనుభూతి చెందుతారు?
2. పల్లెటూరి జీవితం ఎలా ఉంటుందో తెలపండి.
3. భిక్ష పాఠం ఆధారంగా వ్యాసుడెలాంటి వాడని నీవు భావిస్తున్నావు?
4. 'మా ప్రయత్నం' పాఠ్య రచయితల గురించి మీరేమి తెల్సుకొన్నారు?

**ఆ) కింది ప్రశ్నలకు 10 లేక 12 వాక్యాల్లో జవాబులు రాయండి.** **3×6=18**

1. చిన్నయసూరి కథన విధానం పట్ల మీ అభిప్రాయాలను రాయండి.

   (లేదా)

   చిత్రగ్రీవం గూర్చి నీవేమనుకుంటున్నావో తెలుపుతూ రాయండి.

2. బసవేశ్వరుని పరిణయం పాఠం ఆధారంగా మీరేమి గ్రహించారో రాయండి.

   (లేదా)

   చరిత్రలో మైలురాళ్ళుగా నిలిచిన అంశాలపై నీ అభిప్రాయమేమిటి?

3. రామాయణంలోని ఆదర్శపాత్రలేవి? అవి ఎందుకు ఆదర్శ పాత్రలుగా నిలిచాయో రాయండి.

   (లేదా)

   భారతీయ జీవన విధానానికి రామాయణం మార్గదర్శకమని నీవెలా చెప్పగలవు?

### బి) సృజనాత్మక వ్యక్తీకరణ (10 మార్కులు)

**అ) కింది వానిలో ఏవేని 2 ప్రశ్నలకు జవాబులు రాయండి.** **2×5=10**

1. నగర జీవితంలోని కష్టాల గురించి ఇద్దరు మిత్రులు మాట్లాడుకొనే సందర్భం ఆధారంగా సంభాషణలు రాయండి.
2. మీరు దర్శించిన ఏదైనా పర్యాటక క్షేత్రం గూర్చి వర్ణిస్తూ రాయండి.
3. మీ పాఠశాల వార్షికోత్సవానికి ప్రముఖులు వస్తున్నారు. వారిని ఇంటర్వ్యూ చేయడానికి ప్రశ్నావళిని తయారుచేయండి.

## III. భాషాంశాలు

### ఎ) పదజాలం

**అ) కింది వాక్యాల్లోని గీత గీసిన మాటకు అర్థం రాయండి.** **2×1=2**

1. <u>బుధులవల్ల</u> జ్ఞానం లభిస్తుంది.
2. <u>పరివ్రాజులు</u> మఠాల్లో నివసిస్తారు.

**ఆ) కింది పదాలకు పర్యాయపదాలు రాయండి.** **2×1=2**

1. శివుడు = ______________________________
2. మిన్ను = ______________________________

**ఇ) కింది పదాలనుపయోగించి సొంతవాక్యాలు రాయండి.** **2×1=2**

అ) తోరణము ఆ) శ్రీరామరక్ష

**ఈ) కింది వాక్యాల్లో ప్రకృతి వికృతులను గుర్తించండి.** **2×1=2**

1. విజ్ఞానమే ప్రగతికి మలుపు అసలు విన్నానమే లేకుంటే ఏం జరిగేదో కదా!
2. సిరి సంపదలు గలవారినే శ్రీమంతులు అంటున్నాం.

**ఉ) కింది పదాలకు నానార్థాలు రాయండి.** **2×1=2**

అ) గురువు ఆ) ముకురము

### బి) వ్యాకరణాంశాలు

**అ) కింది పదాలకు విగ్రహవాక్యాలు రాసి ఏ సమాసమో చెప్పండి.** **2×1=2**

1. చతుర్వేదాలు :
2. కఠిన పరీక్ష :

**ఆ) కింది పదాలను విడదీని సంధి పేరు రాయండి.** **2×1=2**

1. శుభాంగద :
2. మహోదయం :

**ఇ) కింది వాక్యాల్లోని అలంకారాన్ని గుర్తించండి.** **2×1=2**

అ) ఇంతింతై వటుడింతయై మరియు దానింతై నభోవీథిపై నంతై...

ఆ) ధోని కీర్తిచంద్రికలు ప్రపంచ వ్యాప్తంగా ప్రాకినవి.

**ఈ) 'మత్తేభం' వృత్త లక్షణాలను తెలియజేయండి.** **1×2=2**

**ఉ) ఈ కింది వాక్యాలు ఏ రకమైనవో గుర్తించండి.** **2×1=2**

1) ఆహా! మిరకపకాయ బజ్జీ ఎంత రుచిగా ఉంది.

2) ఇవాళ మా స్కూలు బస్సు వస్తుందో రాదో?

# సంగ్రహణాత్మక మూల్యాంకనం (SA)

## నమూనా ప్రశ్న పత్రం-4

| | |
|---|---|
| **తరగతి : 10వ** | **మార్కులు : 80** |
| **ప్రథమ భాష : తెలుగు** | **సమయం : 3 గం॥** |

**I. చదవడం - అవగాహన చేసుకోవడం. (20 మార్కులు)**

**అ) కింది పేరాను చదివి ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయండి. 5×1=5**

కిష్కింధకు ప్రయాణమయ్యారందరూ. సుగ్రీవుడు వాలిని మళ్ళీ యుద్ధానికి ఆహ్వానించాడు. వాలి అడుగు ముందుకు వేశాడు. కాని, అతని భార్య తార అడ్డుపడింది. ఒకసారి ఓడిపోయి దెబ్బలు తిన్న సుగ్రీవుడు మళ్ళీ ఆహ్వానించడం వెనుక ఏదో ఆంతర్యం ఉందని అభిప్రాయపడింది. సుగ్రీవుడికి శ్రీరాముడు అండగా ఉన్నాడన్న విషయాన్ని ప్రస్తావించింది. యుద్ధానికి వెళ్ళడం క్షేమం కాదని వారించింది. తార మాటలను పెడచెవిన పెట్టాడు వాలి. యుద్ధదిశగా అడుగులు వేశాడు.

1. వాలి క్షేమం కోరేవారెవరు?
2. వాలి విరోధి ఎవరు?
3. పై పేరాను బట్టి జరగబోయే యుద్ధంలో ఎవరు ఓడిపోవచ్చును?
4. వాలి తన భార్యమాటను పాటించాడా?
5. పై పేరాకు తగిన శీర్షికను పెట్టండి.

**ఆ) కింది పేరాను చదవండి. ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయండి. 5×1=5**

జీవావరణం మీద, పర్యావరణం మీద మనుషులు ఇంత కక్ష కటట్టారెందుకో? ఇలా ఉన్న చెట్లన్నింటినీ నరికేసుకుంటూపోతే చివరికి మనిషికి మిగిలేదేమిటి? అయినా ఇప్పటికే అనుభవిస్తున్నారు గదా! గ్రీన్ హౌజ్ ఎఫెక్టునీ... ఆమ్ల దర్పాలనీ... ఆధునిక కాలుష్య కారక సమస్యలన్నింటినీ చెట్లు నరికి వేతే కారణమని ఈ మానవ మేధావులే తేల్చి చెబుతారు. మళ్ళీ ఉన్న చెట్లన్నిటినీ నరికి భవనాలఖు, నగరాలూ నిర్మిస్తారు. వాళ్ళ అభివృద్ధి ఎటుపోతుందో వాళ్ళకే అర్థం కావడంలేదు.

1. కాలుష్యానికి కారణం ఏమిటి?
2. మానవులు చెప్పేదే చేస్తున్నారా?
3. మానవుల అభివృద్ధి జీవావరణానికి మేలు చేస్తోందా?
4. చెట్లు లేకపోతే ఏమౌతుంది?
5. పై పేరా దేనిని బోధిస్తోంది?

**ఇ) కింది పద్యమును చదవండి. ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయండి. 5×1=5**

పాల మీగడ మించిన పసిడి మనసు
తెలుగు భాషను మించిన తీపి పలుకు
పౌరుషంబుగ పులిపిల్ల తీరు నలరు
తెలుగు బిడ్డను గాంచంగ వెలుగు జగము.

1. పసిడి అంటే అర్థమేమిటి?

   a) బంగారం b) సింగారం c) కంగారు d) లోటు

2. తెలుగు భాషకంటె తియ్యనిది ఏది?
3. పౌరుషం కలిగిన జంతువుగా దేనిని పేర్కొన్నాడు?
4. లోకానికి వెలుగు నిచ్చేది ఎవరు?
5. పై పద్యానికి తగిన శీర్షికను సూచించండి.

**ఈ) కింది పద్యాన్ని చదవండి. ప్రతి పదార్థం రాయండి. 1×5=5**

బీదల కన్న వస్త్రములు పేర్మినొసంగుము తుచ్ఛ సౌఖ్య సం
పాదనకై యుద్ధముల బల్కకు, వాదములాడ బోకు, మ
ర్యాదనతిక్రమింపకు, పరస్పర మైత్రి మెలంగు, మిట్టివౌ
వేదములంచెరుంగుము, వివేక ధనం బిది నమ్ము చిత్తమా!

## II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

### ఎ) స్వీయరచన (30 మార్కులు)

**అ) కింది ప్రశ్నలకు 5 లేక 6 వాక్యాల్లో సమాధానాలు రాయండి. 4×3=12**

1. వెన్నెల, చంద్రుడు, చంద్రునిలోని మచ్చలను కవి ఎలా ఊహించాడు? దానిలోని ఔచిత్యం సొంతమాటలలో రాయండి.
2. 'మాతృభావన' పాఠ్యాంశం ఆధారంగా దానిని రచించిన కవి వ్యక్తిత్వాన్ని విశ్లేషించండి.
3. రామకృష్ణారావుగారిది పెద్దకుటుంబం కదా! పెద్ద కుటుంబం అంటే ఏమిటి? వివరించండి.
4. 'అంతర్వేది వెళ్ళగానే మార్చేయాలి' అంటే రచయిత ఉద్దేశం ఏమై ఉంటుంది?

**ఆ) కింది ప్రశ్నలకు 10 లేక 12 వాక్యాల్లో సమాధానాలు రాయండి. 3×6=18**

1. భిక్ష పాఠంలో కాశీలోని గృహిణులు, అన్నపూర్ణా దేవికి ప్రియమైన చెలులు అన్నారు గదా! పాఠం ఆధారంగా అన్నపూర్ణాదేవి, ఆ గృహిణుల స్వభావాలను విశ్లేషించి, వారి స్నేహానికి కారణాలు చూపండి.

   (లేదా)

   మాణిక్యవీణ పాఠం ఆధారంగా మానవ ప్రగతిని సమీక్షించండి.

2. మా ప్రయత్నం రచయిత్రులు "తలచుకోగానే ఒళ్ళు పులకరించే సాహసమూర్తులెందరో" అన్నారు కదా! ఆ సాహసమూర్తులు ఎవరు? వాళ్ళను తలచుకోగానే రచయిత్రులకెందుకు ఒళ్ళు పులకరించిందో రాయండి.

(లేదా)

గోరంత దీపాలు ఎవరు? ఆ దీపాలను నిలుపుతున్న వ్యక్తి మనస్తత్వాన్ని, ప్రవర్తనను విశ్లేషించండి.

3. వాలి, సుగ్రీవుల యుద్ధాన్ని వర్ణించండి. వాలి వధ న్యాయమా? కాదా? వివరించండి.

(లేదా)

అశోకవనంలో హనుమ – సీతల సంభాషణ ఆధారంగా వారి స్వభావాలను రాయండి.

**బి) సృజనాత్మక వ్యక్తీకరణ (10 మార్కులు)**

**అ) కింది అంశాల్లో ఏవేని రెండు ప్రశ్నలకు జవాబులు రాయండి. 2×5=10**

1. మీ పాఠశాలను గురించి మంచి మంచి పదాలతో ఆకర్షణీయంగా వర్ణించండి.
2. పల్లె జీవితంలోని అనుకూల అంశాలను వివరిస్తూ పది వాక్యాలలో ఒక వ్యాసం రాయండి.
3. 'మహిళల రక్షణ – మన కర్తవ్యం' అనే అంశంపై కరపత్రం రాయండి.

## III. భాషాంశాలు

**ఎ) పదజాలం (10 మార్కులు)**

**i) కింది వానిని కోరిన విధంగా పూర్తిచేయండి. 2×1=2**

**అ) అర్థాలు, పర్యాయపదాలు**

1. <u>రజనీకర బింబం</u> వెన్నెల విరజిమ్ముతూంది. గీతగీసిన దాని అర్థం గ్రహించి, సొంతవాక్యం రాయండి.
2. ప్రభుత్వ <u>ఉత్తరువు</u> పాటించాలి. గీతగీసిన దాని అర్థం గ్రహించి, సొంత వాక్యం రాయండి.

**ఆ) ప్రకృతి వికృతులు, నానార్థాలు 4×1=4**

1. రాజు <u>ఆజ్ఞ</u> అనుల్లంఘనీయము. వికృతి పదంతో వేరే వాక్యం రాయండి.
2. పల్లెటూర్లలో <u>పంక్తి</u> భోజనాలు సంప్రదాయబద్ధంగా ఉంటాయి. గీతగీసిన పదానికి వికృతిపదం రాయండి.
3. ఎవరి <u>పుత్రుడు</u> పైన వారికి ప్రేమ ఉంటుంది. వ్యుత్పత్తి రాయండి.
4. <u>శివుడు</u> మంగళ ప్రదుడు – వ్యుత్పత్తి రాయండి.

**ఇ) కింది పదాలకు వాక్యాలు పదాలు రాయండి. 2×1=2**

1. ఆజ్ఞ : __________ __________
2. నేత్రం : __________ __________

**ఈ) కింది మాటలను వివరించి రాయండి.** **2×1=2**

1. మాటంతే లెక్కలేదు : ______________________________

2. మాటలు నేర్చాడు : ______________________________

**బి) వ్యాకరణాంశాలు (10 మార్కులు)**

**అ) కింది బహుళైచ్ఛిక ప్రశ్నలలో సరైన సమాధానాన్ని గుర్తించండి.** **5×1=5**

1. సవర్ణదీర్ఘ సంధికి ఉదాహరణ? ( )

   a) పుణ్యావాసము b) రసైకస్థితి c) గుణవంతురాలు

2. ఆ హా హా! ఎంత వైపరీత్యము – దీనిలోని సంధి పేరు. ( )

   a) త్రికసంధి b) యడాగమసంధి c) ఆమ్రేడితసంధి

3. అసాధ్యమైనది లేదు – దీనిలో సమాసం పేరు? ( )

   a) ద్విగు సమాసం b) నఞ్ తత్పురుష సమాసం c) షష్ఠీ తత్పురుష సమాసం

4. కింది వానిలో సంభావనా పూర్వపదకర్మధారయ సమాసానికి ఉదాహరణ ఏది? ( )

   a) స్త్రీపురుషులు b) విద్యాధికులు c) గంగానది

5. గొడుగు పాగల గిలకలు గులకరింప – ఇది ఏ పద్యపాదం? ( )

   a) తేటగీతి b) ఆటవెలది c) కందము

**ఆ) కింది వానిని కోరిన విధంగా రాయండి.** **5×1=5**

1. హనుమంతుడు సముద్రాన్ని లంఘించాడు. మహాత్ములకు సాధ్యంకానిది లేదు కదా! – ఇది ఏ అలంకారం? ఎందుకు?

2. అరటిపంట్ల గెల పై చెయ్యి వేస్తే పళ్ళురాల్తాయి – ఇందులో ఏ అలంకారం ఉంది?

3. లోపలికి రావచ్చు! ఇది ఏ వాక్యము?

4. విమల చదివింది. విమల పరీక్ష బాగా రాసింది. విమల ప్యాసయ్యింది. – సంస్లిష్ట వాక్యంగా రాయండి.

5. ఆపదలందు ధైర్యగుణ, మంచిత సంపదలందు (దాల్మియును అను పద్యపాదము ఏ వృత్తానికి చెందినది?

# సంగ్రహణాత్మక మూల్యాంకనం

## నమూనా ప్రశ్న పత్రం - ద్వితీయభాష - తెలుగు

| | |
|---|---|
| **తరగతి : 10వ** | **మార్కులు : 80** |
| **ద్వితీయ భాష : తెలుగు** | **సమయం : 3 గం॥** |

**I. చదవడం - అవగాహన చేసుకోవడం. (20 మార్కులు)**

**అ) కింది పేరాను చదవండి. ప్రశ్నలకు సమాధానాలు రాయండి.** **5×1=5**

భద్రాచలంలో ఉన్న శ్రీరామ చంద్రుణ్ణి చూడ్డానికి జనం తండోపతండాలుగా రావడం మొదలయింది. అందువల్ల యాత్రికులకు సౌకర్యాలు కలగజెయ్యాల్సిన బాధ్యత తహసీలుదారుగా తనమీద ఉంది. అలాగే ఒక భక్తజన శిఖామణిగా రాముడి ఆలయానికి ఒక గోపురం, పాకారం మండపం గూడ కట్టించి ఆలయాన్ని బాగుచెయ్యాల్సిన అవసరం గూడ ఏర్పడింది. దీనికోసం ఒకనాడు గోపన్న ఆవూళ్ళో రైతులను పిలిపించి ఈ విషయం వాళ్ళకు చెప్పాడు. ఒక మంచి పనిచేద్దాం. మీరు నాతో సహకరించండి. అంటూ గోపన్న ప్రబోధించాడు. ఈ మాటలు విన్న ఊరిజనం అలాగే అని అంగీకరించారు. ఎవరి శక్తి కొద్దీ వారు సహాయం చెయ్యడానికి సిద్ధమయ్యారు. ఆలయ నిర్మాణం మొదలయింది.

1. యాత్రికులకు సౌకర్యాలు ఎందుకు కలగజేయాలి?
2. గోపన్న ఎవరి భక్తుడు?
3. గోపన్న రైతులను ఎందుకు పిలిచాడు?
4. ఆలయ నిర్మాణం ఎక్కడ మొదలయ్యింది?
5. ఎవరి ఆలయం నిర్మిస్తున్నారు?

**ఆ) కింది పేరాను చదవండి. ఇచ్చిన ప్రశ్నలకు సమాధానాలు రాయండి.** **5×1=5**

ఒక్కొక్కటే తీసి చూశాను. 'మీ పాఠం చాలా బాగుంటుంది. మంచిగా అర్థమౌతుంది. కానీ, తాగి రోడ్ మీద ఊగడం నచ్చలేదు సార్"... మీరంటే మాకిష్టం కానీ అమ్మాయిలను కామెంట్ చేయకండి సార్...' 'ఇతర ఉపాధ్యాయులను గురించి చెడుగా మాట్లాడకండి సార్',,, 'మీరంటే నాకు చాలా అభిమానం కానీ, మీ చూపులు నచ్చలేదు సార్, మీకు ఆడపిల్లలు లేరా...

1. పై పేరా దేంట్లోది?
2. పై పేరాలోని విషయాలను ఎవరు రాశారు?
3. పై పేరా ద్వారా ఎవరి ప్రవర్తన బాగోలేదు?
4. ఎవరిని కామెంట్ చేయకూడదు?
5. ఉపాధ్యాయుని పాఠం చెప్పేతీరు బాగుందా? ప్రవర్తన బాగుందా?

**ఇ) కింది పద్యాన్ని చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.** **5×1=5**

నలుగురు పలికెడి పలుకులె
చెలగును భువిమీద నెపుడు ఒలుగుల వెలుగై
పలికిన నొక్కడు నొప్పదు
తెలిసియు దానిని మసలర! తెలివిగ భువిలో!

1. ఎవరి మాటకు విలువ ఉంటుంది?
2. ఒక్కని మాటకు ఎందుకు విలువ ఉండదు?
3. 'నలుగురు పలికిన పలుకులు' – అంటే అర్థమేమిటి?
4. తెలివైన పని ఏది?
5. పై పద్యానికి తగిన పేరు పెట్టండి.

**ఈ) కింది పద్యానికి భావం రాయండి.** **1×5=5**

పరహితము సేయునెవ్వడు
పరమహితుండగును భూతపంచక విలువకున్
బరహితమె పరమధర్మము
పరహితునకు నెదురులేదు సర్వేందు ముఖీ!

## II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

### ఎ) స్వీయరచన (30 మార్కులు)

**అ) కింది ప్రశ్నలకు 4 లేక 5 వాక్యాల్లో జవాబులు రాయండి.** **4×3=12**

1. 'కలువ కనుమూసింది – కమలమ్ముమురిసింది' అంటే మీరేంగ్రహించారు?
2. తరిగొండ వెంగమాంబ గురించి రాయండి.
3. 'మూడు మెతుకులకంటె ముట్టదు' – ఈ వాక్యం ఏ సందర్భంలోనిది?
4. 'కూరువంజి' గురించి మీ సొంత మాటలలో రాయండి.

**ఆ) కింది ప్రశ్నలకు 10 లేక 12 వాక్యాల్లో జవాబులు రాయండి.** **3×6=18**

1. మనిషీ! మనిషీ! గేయ సారాంశం రాయండి.

(లేదా)

మహాత్ముల మనస్సులు ఎలా ఉంటాయి?

2. రాతి బసవన్న ఎవరు? అతని గురించి రాయండి.

(లేదా)

'జీవితం అశాశ్వతం, కానీ, కీర్తి ఉన్నదే అది శాశ్వతం' అంటే ఏమిటి? దానిని సంజయ 'రాయభారం' పాఠ్య విషయం ఆధారంగా సమర్థించండి.

3. ఎం.ఎస్.సుబ్బులక్ష్మి సినీ జీవితం గురించి రాయండి.

(లేదా)

రామదాసును ఖైదు చేయడం సమంజసమా! కాదా! ఎందుకు?

**బి) సృజనాత్మక వ్యక్తీకరణ (10 మార్కులు)**

**అ) కింది వానిలో ఒకదానికి సమాధానం రాయండి.** **1×5=5**

1. పరహితము మంచిది అని తెలిపే ఒక కథను రాయండి.
2. చంద్రోదయాన్ని వర్ణిస్తూ ఒక కవిత రాయండి.

**ఆ) కింది వానిలో ఒక లేఖ రాయండి.** **1×5=5**

1. ఆటల ప్రయోజనం గూర్చి మిత్రునకు లేఖ రాయండి.
2. మీ గ్రా సమస్యల గూర్చి పత్రికకు లేఖ రాయండి.

## III. భాషాంశాలు

**ఎ) పదజాలం (10 మార్కులు)**

**అ) కింది వాక్యాలలో ప్రకృతి, వికృతి పదాలను గుర్తించి రాయండి.** **10×1=10**

1. ఎవరి ధర్మం వారు నిర్వర్తించాలి. మన దమ్మమే మనను కాపాడుతుంది.
2. విద్యను మించిన సంపద లేదు. విద్దెను నిర్లక్ష్యం చేయకు.

(పై రెండిటిలోని ప్రకృతి – వికృతులను గుర్తించండి.)

**ఆ) కింది వాక్యాలలో గీతగీసిన పదాల అర్థం రాయండి.**

3. <u>అఘము</u> చేయరాదు – అర్థంరాసి, సొంతవాక్యం రాయండి.
4. ఎంతటి <u>క్లేశము</u> నైనా ఓర్పుతో అధిగమించాలి.

**ఇ) కింది వాక్యాలలో గీతగీసిన పదాల నానార్థాలు రాయండి.**

5. పక్షి తన <u>పక్షము</u> లు <u>పక్షము</u> రోజుల నుండి నొప్పిగా ఉండుటచే దక్షిణ <u>పక్షము</u> నకు ఎగురలేకుండెను.
6. <u>రాజు</u> రాత్రిని ప్రకాశింపచేయును. <u>రాజు</u> పాలన బాగుండాలి.

**ఈ) కింది పదాలకు పర్యాయపదాలు రాయండి.**

7. దిశ : ________________________________

8. విలువ : ________________________________

**ఉ) కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు వ్యుత్పత్తి అర్థాలు రాయండి.**

9. <u>ముని</u>కి తపస్సే కాలక్షేపం - వ్యుత్పత్త్యర్థం రాయండి.

10. వాలి తమ్ముడు <u>సుగ్రీవుడు</u> - వ్యుత్పత్త్యర్థం రాయండి.

**బి) వ్యాకరణాంశాలు (10 మార్కులు)**

**అ) కింది బహుళైచ్ఛిక ప్రశ్నలలో సరైన సమాధానాన్ని గుర్తించండి.** **5×1=5**

1. మంచి వారికి మంచి మిత్రులు - విభక్తి పేరు? ( )

 a) తృతీయ b) షష్ఠీ c) సప్తమి

2. 'ఎవ్విధం' దీని సంధి పేరు? ( )

 a) సవర్ణదీర్ఘసంధి b) ఆమ్రేడితసంధి c) త్రికసంధి

3. యణాదేశసంధికి ఉదాహరణ ( )

 a) అత్యుత్సాహం b) అమితోత్సాహం c) ఉత్సాహం

4. నాయిల్లు ఏసమాసం? ( )

 a) తృతీయా తత్పురుష b) షష్ఠీ తత్పురుష c) నఞ్ తత్పురుష

5. ఉత్పలమాలలో ప్రతి పాదంలోని గణాలేవి? ( )

 a) నజభజజజర b) మసజసతతగ c) భరనభభరవ

**ఆ) కింది ప్రశ్నలకు కోరిన విధంగా జవాబులు రాయండి.** **5×1=5**

1. కవిత పుస్తకం రాసింది - కర్మణి వాక్యంగా మార్చి రాయండి.

2. చదువులు చదవాలి.<br>తెలివీ పెరగాలి.<br>కలిమీ బలిమీ నిలవాలి. — దీనిలో ఏ అలంకారం ఉంది?

3. అమ్మా! అమ్మమ్మ, మమ్ము, రమ్మంది - దీనిలో ఏ అలంకారం ఉంది?

4. నేను పుస్తకం చదివాను - ఇది ఏ పురుషకథనంలో ఉంది?

5. నాచేత పాఠం చదవబడింది - కర్తరి వాక్యంగా మార్చండి.

## కాంపోజిట్ కోర్సు - తెలుగు - ప్రశ్నపత్రం

| | |
|---|---|
| తరగతి : 10వ | మార్కులు : 60 |
| ప్రథమ భాష : తెలుగు | సమయం : 3 గం॥ |

### I. చదవడం - అవగాహన చేసుకోవడం.

**అ) కింది గద్యాన్ని చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.** **5×1=5**

ఆంబోతుల్లా ఉన్న నలుగురు వ్యక్తులు ఎగబడి ఏకబిగిన నరికేస్తుండగా చెట్టు తాలూకు యజమానిలా ఉన్న ఓ పెద్దమనిషి నడుముకు చేతులేసుకొని నిలబడి వాళ్ళకి సూచనలిస్తున్నారు. మాలాంటి అమాయక ప్రాణులు ఆ చెట్టుపైన జీవిస్తున్నాయని, వాటిగూళ్ళు, గుడ్లు, పిల్లలు చిన్నాభిన్నమవుతాయని కనీస కనికరం కూడా తనట్టుగా ఎగబడి పోతున్నారు. నాశనం చేయడానికే తప్ప నిర్మించడానికి జన్మించలేమన్నట్లు వారి ప్రతాపాన్నంతా ఆ చెట్టు మీద చూపిస్తున్నారు.

1. పై విషయాన్ని బట్టి అక్కడేం జరుగుతోంది?
2. అక్కడ సూచనస్తున్నదెవరు?
3. వారిలో ఎలాంటి ఆలోచన లేకుండా పోయింది?
4. "ఒక్కసారిగా" అనే అర్థాన్నిచ్చే పదం గుర్తించండి.
5. "మాలాంటి అమాయక ప్రాణు/" అని ఎవరు అనుకొని ఉండవచ్చు?

**ఆ) కింది పద్యానికి మీ సొంతమాటల్లో భావం రాయండి.** **5×1=5**

శివరాజంతట మేల్ముసుగు దెరలో స్నిగ్ధాంబుద చ్ఛాయలో
నవసౌదామిని బోలు నాయసన కాంతా రత్నమున్ భక్తి గా
రవముల్ వారగ జూచి పల్కె "వనితారత్నంబు లీ భవ్య హైం
దవ భూజంగమ పుణ్యదేవతలు : మాతా! తప్పుసైరింపుమీ!"

### II. వ్యక్తీకరణ - సృజనాత్మకత

**ఎ) లఘు సమాధాన ప్రశ్నలు**

**అ) కింది ప్రశ్నలకు 4 లేక 5 వాక్యాలలో జవాబులు రాయండి.** **4×3=12**

1. పి.వి.నరసింహారావు రచనా శైలిని గూర్చి రాయండి.
2. నగరజీవితం ఎలాంటిదో రాయండి.
3. 'కన్నులపండువ' అంటే నీకేమి అర్థమైంది? ఉదాహరణతో సమన్వయించండి.
4. 'పండితుడు సంపద లేకున్నా శోభిస్తాడు' అనే మాట సమంజసమేనా? ఎందుకు?

బి) **వ్యాసరూప సమాధాన ప్రశ్నలు**

ఆ) **కింది ప్రశ్నలలో ఏవైనా మూడింటికి 10 లేక 12 వాక్యాల్లో జవాబులు రాయండి. ప్రతి భాగం నుండి ఒక ప్రశ్న రాయాలి.** **3×6=18**

**పద్యభాగం :** 1. మాతృభావన సారాంశాన్ని మీ సొంతమాటల్లో రాయండి. (లేదా)
బసవని పెళ్ళి ఆధారంగా వివాహ సంప్రదాయాలు రాయండి.

**గద్యభాగం :** 2. నగరజీవనం పల్లెజీవనాల్లో నీకేది నచ్చిందో వివరిస్తూ రాయండి. (లేదా)
పక్షి గూళ్ళు ఎలా ఉంటాయి? వాటినిర్మాణం గూర్చి వర్ణించండి.

**ఉపవాచకం :** 3. రాముని పాత్ర చిత్రణ గురించి రాయండి. (లేదా)
రామాయణం విశిష్ఠతను గూర్చి రాయండి.

సి) **సృజనాత్మక వ్యక్తీకరణ**

అ) **కింది వానిలో ఏవేని 2 ప్రశ్నలకు జవాబులు రాయండి.** **2×5=10**

1. శతక పద్యాల్లో నీతిని గూర్చి మిత్రునికి లేఖ రాయండి.
2. నీ చుట్టూన్న ప్రకృతిని వర్ణిస్తూ 10 పంక్తుల వచన కవిత రాయండి.
3. స్త్రీల చైతన్యంపై 10 నినాదాలు తయారుచేయండి.

**III. భాషాంశాలు**

ఎ) **పదజాలం**

అ) **గీతగీసిన పదాలకు నానార్థాలు రాయండి.** **2×1=2**

1. <u>కాలం</u> కలిసిరావాలంటారు పెద్దలు.
2. <u>గురువు</u> సన్మార్గాన్ని చూపిస్తాడు.

ఆ) **గీత గీసిన పదాలకు పర్యాయపదాలు రాయండి.** **2×1=2**

1. <u>వృక్షాల</u> వల్లనే మనకు చల్లదనం.
2. మానవ <u>దేహం</u> అశాశ్వతమైనది.

ఇ) 'చిత్రగ్రీవం' పదానికి వ్యుత్పత్తి అర్థం రాయండి. **1×1=1**

బి) **వ్యాకరణాంశాలు**

అ) **కింది పదాలను విడదీసి సంధిని గుర్తించండి.** **2×1=2**

1. సజ్జనుడు
2. వారందరూ

ఆ) **కింది ప్రశ్నలకు కోరిన విధంగా రాయండి.** **3×1=3**

1. "వనితారత్నము" పదానికి విగ్రహవాక్యం రాసి సమాసం పేరు రాయండి.
2. "శుభకరుడు, సురుచిరుడు, భవహరుడు, భగవంతుడెవడు..." ఈ పాదంలో ఉన్న అలంకారం గుర్తిచండి.
3. "తెలుగు వెలుగు నెపుడు తీసినందించునోయి" ఈ తేటగీతి పద్యపాదానికి గురులఘువులు గుర్తించండి. గణ విభజన చేయండి.

## D. జవాబుపత్రాలు దిద్దడం - సూచికలు / మార్గదర్శకాలు

### సంగ్రహణాత్మక ప్రశ్న పత్రం (పబ్లిక్ పరీక్ష మాదిరి)

మారిన పాఠ్యపుస్తకాలను అనుసరించి విద్యార్థులను సంసిద్ధం చేయడానికి ప్రశ్నపత్ర స్వరూప స్వభావాలను గురించిన అవగాహన అందరికీ (విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, పిల్లల తల్లిదండ్రులకు) అవసరం. ఈ ప్రశ్నపత్రాన్నే 9వ తరగతికి కూడా అన్వయించడం వల్ల 10వ తరగతికి వచ్చేసరికి వాళ్ళకు ఈ అంశంపట్ల పూర్తి అవగాహన కల్గుతుంది. కాబట్టి 9, 10 తరగతులకు ఈ విధానంలోనే పరీక్షలు నిర్వహించాలి.

## మార్కుల కేటాయింపు - సూచికలు

నూతనంగా రూపొందించిన పదో తరగతి వాచకాల కనుగుణంగా ప్రశ్నాపత్రం నమూనా తయారుచేయబడింది. ఎలాంటి ప్రశ్నలుంటాయి? ఏయే సామర్థ్యానికి ఎన్ని మార్కులుంటాయి? జవాబులను ఏ సూచికల ఆధారంగా మూల్యాంకనం చేయాలి? తదితర విషయాల పట్ల ఉపాధ్యాయులకు స్పష్టమైన అవగాహన ఉండటం అవసరం. ప్రశ్నపత్ర నిర్మాణం ఆధారంగా వీటిని పరిశీలిద్దాం.

### I. చదవడం - అవగాహన చేసుకోవడం (20 మార్కులు)

అ) పరిచిత గద్యం ఇచ్చి 5 ప్రశ్నలు అడగడం. (5 మార్కులు)

ఇందుకోసం ఉపవాచకంలోని అర్థవంతమైన పేరాను గ్రహించాలి.

ఆ) అపరిచిత గద్యం ఇచ్చి 5 ప్రశ్నలు అడగడం. (5 మార్కులు)

అర్థవంతమైన సాహిత్య అంశమో / సామాజిక అంశమో ఇవ్వబడాలి.

ఇ) అపరిచిత పద్యం ఇచ్చి 5 ప్రశ్నలు అడగడం. (5 మార్కులు)

సుప్రసిద్ధమైన పద్యం లేదా శతక పద్యం ఇవ్వడుతుంది.

* ఈ ప్రశ్నలన్నీ లక్ష్యాత్మక ప్రశ్నలే కనుక సరైన సమాధానానికి మార్కులు కేటాయించబడతాయి.

ఈ) పరిచిత పద్యం ఇచ్చి 5 ప్రతిపదార్థం అడగడం లేదా పద్యం మొదటి పాదం ఇచ్చి - చివరి పాదం - చివరి భాగం ఇచ్చి పూరించమనడం మరియు భావం అడగడం. (5 మార్కులు)

* ప్రతిపదార్థం అడిగినప్పుడు మార్కుల కేటాయింపు

| | | |
|---|---|---|
| అన్వయక్రమం | - | 1 మార్కు |
| పదాలు - అర్థాలు | - | 3 మార్కులు |
| అక్షరదోషాలు లేకుండా రాస్తే | - | 1 మార్కు |
| మొత్తం | - | 5 మార్కులు |

* పద్యం పూరించి భావం రాయమని అడిగినప్పుడు మార్కుల కేటాయింపు

| | | |
|---|---|---|
| పాదభంగం చెడకుండా పూరిస్తే | - | 2 మార్కులు |
| భావం సరిగ్గా రాస్తే | - | 2 మార్కులు |
| అక్షరదోషాలు లేకుండా రాస్తే | - | 1 మార్కు |
| మొత్తం | - | 5 మార్కులు |

** ద్వితీయ భాష ప్రశ్నపత్రంలో కంఠస్థ పద్యాన్ని ఇచ్చి భావం రాయమని అడగవచ్చు లేదా పద్యం పూరించమనవచ్చు లేదా పాదాలు తారుమారుగా ఇచ్చి పద్యాన్ని సక్రమంగా రాయమని అడగవచ్చు.

| పద్యం పూరించడం | పాదాలు తారుమారుగ ఇచ్చి సరిచేయడం | పద్యానికి భావం రాయడం |
|---|---|---|
| పాదభంగం లేకుండా పూరిస్తే 4 మార్కులు<br>అక్షర దోషాలు లేకుండా పూరిస్తే 1 మార్కు | పాదాల్ని క్రమంగా పేర్చడం 4 మార్కులు<br>అక్షర దోషాలు లేకుండా రాస్తే 1 మార్కు | భావం – 2 మార్కులు<br>పదజాలం, వాక్యనిర్మాణం – 2 మార్కులు<br>అక్షర దోషాలు లేకుండా రాస్తే 1 మార్కు |

## II. వ్యక్తీకరణ – సృజనాత్మకత

### ఎ) స్వీయరచన (30 మార్కులు)

#### అ) లఘు సమాధాన ప్రశ్నలు (12 మార్కులు)

పాఠ్యపుస్తకంలోని ప్రశ్నలు నేరుగా ఇవ్వకుండా అదే స్వభావం కల ప్రశ్నలు 4 అడగబడతాయి. ఒక్కో ప్రశ్నకు 3 మార్కులు. ఇవి ఆలోచించి రాసేలా, వ్యక్తీకరణ ప్రాధాన్యంగా ఉంటాయి.

* లఘు సమాధాన ప్రశ్నలకు మార్కుల కేటాయింపు.

సమాధానంలోనని విషయం, వాక్యనిర్మాణ క్రమం – 2 మార్కులు

అక్షర దోషాలు లేకుండా రాస్తే – 1 మార్కు

#### ఆ) వ్యాసరూప సమాధాన ప్రశ్నలు (18 మార్కులు)

పద్య పాఠ్యాంశాలు, గద్య పాఠ్యాంశాలు, ఉపవాచకం ఒక్కో విభాగం నుండి రెండు ప్రశ్నలివ్వబడతాయి. ఒక్కో విభాగం నుండి ఒక్కో ప్రశ్నకు సమాధానం రాయాలి. ఒక్కో ప్రశ్నకు 6 మార్కులు. ఈ ప్రశ్నలు ఆలోచించి సొంతంగా రాసేలా ఉంటాయి. ఇవన్నీ బహుళ సమాధానాలు రాయడానికి వీలున్న ప్రశ్నలు (Open Ended), విశ్లేషించడం, వివరించడం, వ్యాఖ్యానించడం, కారణాలు రాయడం, సమర్థిస్తూ లేదా విభేదిస్తూ రాయడం, రచయిత / కవి ఉద్దేశాలు రాయడం, సమకాలిన పరిస్థితులతో పోల్చడం, అన్వయించడం మొదలగు రూపాల్లో ప్రశ్నలు వస్తాయి. కాబట్టి మార్కుల కేటాయింపు కింది విధంగా జరగాలి.

* వ్యాసరూప సమాధాన ప్రశ్నకు మార్కుల కేటాయింపు.

విషయానికి తగిన భావం సారం రాస్తే – 3 మార్కులు

వాక్య నిర్మాణ క్రమం – 1 మార్కు

మంచి పదజాలాన్ని వినియోగించడం - 1 మార్కు

అక్షర దోషాలు లేకుండా రాస్తే - 1 మార్కు

**బి) సృజనాత్మకత (10 మార్కులు)**

పాఠ్యపుస్తకంలోని సృజనాత్మకత సామర్థ్యం కింద ఇచ్చి ప్రశ్నలవంటి స్వభావం గల ప్రశ్నలే వస్తాయి తప్ప యథాతథంగా రావు. మూడు ప్రశ్నలు ఇస్తే రెండు ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. ఒక్కో ప్రశ్నకు 5 మార్కులు.

సృజనాత్మక ప్రశ్నలు వేర్వేరు వ్యవహార రూపాల్లో ఉంటాయి. అవి

**సృజనాత్మకత అంశాలు :**

వర్ణిచడం, కవిరచనాశైలిని వర్ణించడం / వివరించడం, సంభాషణలు రాయడం, లఘునాటికలు రూపొందించడం, నినాదాలు, సూక్తులు రాయడం, అవగాహనను / అనుభవాలను లేఖలుగా రాయడం, ఇంటర్వ్యూ ప్రశ్నావళి, కవిత రాయం /గేయం, సన్మానపత్రం రాయడం / అభినందన పత్రం, వ్యాసం, కథ, కథ పొడిగింపు, కరపత్రం రూపొందించడం, చిత్రం గీయడం, రంగులువేయడం, కథనం (గమనించిన అంశంపై) మొదలగు రూపాల్లో జవాబులు రాయాల్సి ఉంటుంది. మార్కుల కేటాయింపు కింది విధంగా ఉంటుంది.

| వ్యవహార రూపం | మార్కుల కేటాయింపు |
|---|---|
| ఇచ్చిన అంశాన్ని వర్ణించడం | పోలికలు / ఉపమానాలు మంచిపదజాలం - 3 మార్కులు<br>వాక్య నిర్మాణ క్రమం - 1 మార్కు<br>అక్షర దోషాలు లేకుండా రాస్తే - 1 మార్కు |
| సంభాషణలు కనీసం 2 పాత్రలతో, ఒక్కో పాత్రకు 5 వాక్యాలు రాయాలి. | పాత్రోచిత సంభాషణలు - 3 మార్కులు<br>వాక్య నిర్మాణ క్రమం - 1 మార్కు<br>అక్షర దోషాలు లేకుండా రాస్తే - 1 మార్కు |
| లేఖ | లేఖా రచనా నియమాలు<br>(స్థలం, తేదీ, సంబోధన, చిరునామా, సంతకం) - 2 మార్కులు<br>విషయానుగుణంగా రాస్తే - 2 మార్కులు<br>వాక్య నిర్మాణం, అక్షర దోషాలు లేకుండా రాస్తే - 1 మార్కు |

| వ్యవహార రూపం | మార్కుల కేటాయింపు | |
|---|---|---|
| గేయం / కవిత 5–8 పంక్తుల పరిమితిలో రాయాలి. | విషయానుగుణంగా రాస్తే | - 2 మార్కులు |
| | ప్రాసతో కూడిన / కవితాత్మక పదజాలం | - 2 మార్కులు |
| | అక్షర దోషాలు లేకుండా రాస్తే | - 1 మార్కు |
| ఇంటర్వ్యూ ప్రశ్నావళి కనీసం 10 ప్రశ్నలు రాయాలి. | వ్యక్తిగత వివరాలు తెలుసుకొనే ప్రశ్నలు | - 1 మార్కు |
| | విషయగత ప్రశ్నలు | - 2 మార్కులు |
| | ప్రశ్నలక్రమం – అనుసంధానం | - 1 మార్కు |
| | అక్షర దోషాలు లేకుండా రాస్తే | - 1 మార్కు |
| నినాదాలు / సూక్తులు కనీసం 5 సూక్తులు రాయాలి. | విషయానికి అనుగుణంగా ఉంటే | - 2 మార్కులు |
| | ప్రాసతో కూడిన పదజాలం | - 1 మార్కు |
| | వాక్య నిర్మాణం | - 1 మార్కు |
| | అక్షర దోషాలు లేకుండా రాస్తే | - 1 మార్కు |
| కథ (మూడు పేరాలుండాలి) | ప్రారంభం / ఎత్తుగడ | - 1 మార్కు |
| | కథనం – సంఘటనాక్రమం | - 2 మార్కులు |
| | ముగింపు | - 1 మార్కు |
| | వాక్య నిర్మాణం, అక్షర దోషాలు లేకుండా రాస్తే | - 1 మార్కు |
| వ్యాసం | ఉపోద్ఘాతం | - 1 మార్కు |
| | విషయ వివరణ | - 2 మార్కులు |
| | ముగింపు | - 1 మార్కు |
| | వాక్య నిర్మాణం, అక్షర దోషాలు లేకుండా రాస్తే | - 1 మార్కు |
| కథ పొడిగింపు (6–8 వాక్యాలు) | అర్థవంతంగా పొడిగించడం | - 2 మార్కులు |
| | చక్కటి పదజాలంతో కూడిన వాక్యాలు | - 1 మార్కు |
| | ముగింపు | - 1 మార్కు |
| | వాక్య నిర్మాణం, అక్షర దోషాలు లేకుండా రాస్తే | - 1 మార్కు |

| వ్యవహార రూపం | మార్కుల కేటాయింపు |
|---|---|
| కరపత్రం | శీర్షిక ప్రచురణకర్తలు - 1 మార్కు<br>సందేశం - 2 మార్కులు<br>విషయం - ఆవశ్యకత - 1 మార్కు<br>వాక్య నిర్మాణం, అక్షర దోషాలు లేకుండా రాస్తే - 1 మార్కు |
| సన్మానపత్రం / అభినందనపత్రం | సన్మానగ్రహీత వివరాలు పొందుపర్చడం సందర్భం - 2 మార్కులు<br>ప్రశంసాత్మకంగా, సరైన పదజాలంతో రాస్తే - 1 మార్కు<br>చక్కని రచనా విధానం - 1 మార్కు<br>వాక్య నిర్మాణం, అక్షర దోషాలు లేకుండా రాస్తే - 1 మార్కు |
| సంఘటన రచన / గమనించిన అంశాన్ని కథనం రాయడం | ఎత్తుగడ / ప్రారంభం - 1 మార్కు<br>కథనం - 2 మార్కులు<br>ముగింపు - 1 మార్కు<br>వాక్య నిర్మాణం, అక్షర దోషాలు లేకుండా రాస్తే - 1 మార్కు |

## III. భాషాంశాలు (20 మార్కులు)

### ఎ) పదజాలం (10 మార్కులు)

పాఠ్యపుస్తకంలోని పదాలకు అర్థాలు, పర్యాయపదాలు, నానార్థాలు, వ్యుత్పత్త్యర్థాలు, జాతీయాలు, ప్రకృతి వికృతులు, సొంతవాక్యాలు మొదలగు వాటిలోంచి ఏవైనా 5 అంశాల్లో 2 చొప్పున 10 ప్రశ్నలు అడగబడతాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కోమార్కు. ఇది లక్ష్యాత్మక ప్రశ్నలే కనుక సమాధానం సరిగ్గా ఉంటే మార్కులు కేటాయించవచ్చు.

### బి) వ్యాకరణాంశాలు (10 మార్కులు)

పాఠ్యపుస్తకంలోని సంధులు, సమాసాలు, ఛందస్సు, అలంకారాలు, వాక్యాలు మొదలగు అంశాల నుండి ప్రశ్నలు అడగబడతాయి. 5 విభాగాలుగా విభాగానికి 2 చొప్పున 10 ప్రశ్నలకు 10 మార్కులు. ఇవి లక్ష్యాత్మక ప్రశ్నలే కనుక సమాధానం సరిగ్గా ఉంటే మార్కులు కేటాయించవచ్చు.



# IX. పదవ తరగతి - పాఠ్యబోధన వనరులు - అదనపు గ్రంథాలు

## తెలుగు - ప్రథమ భాష - పరామర్శ గ్రంథాలు

1. ప్రపంచ శాంతికై కృషిచేసిన వారి పుస్తకాలు (ఉదా : మహాత్మగాంధి, మదర్‌థెరిసా, నెల్సన్ మండేల మొ။)
2. వివిధ శాస్త్రవేత్తలు (శాస్త్రవేత్తలను గూర్చి తెలిపే పుస్తకం)
3. భారతదేశంలోని ప్రధాన నగరాలను గూర్చి తెలిపే పుస్తకం
4. 'కన్యాశుల్కం' గురజాడ
5. శ్రీనాథుని రచనలు
6. 'చిత్రగ్రీవం' ఓ పావురం కథ - ధనగోపాల్ ముఖర్జీ
7. పక్షులను గూర్చి తెలిపే గ్రంథం
8. నృసింహపురాణం - ఎఱ్ఱన
9. నీతి చంద్రిక - చిన్నయసూరి
10. శ్రీ శివభారతం - డా॥ గడియారం వేంకటశాస్త్రి
11. జానపదుని జాబులు - డా॥ బోయి భీమన్న
12. మల్ల భూపాలీయం (నీతిశతకం) - ఎలకూచి బాలసరస్వతి

13. చిత్త శతకం – శ్రీపతి భాస్కర కవి
14. తరిగొండ నృసింహ శతకం – తరిగొండ వెంగమాంబ
15. విశ్వనాథేశ్వర శతకం – గుమ్మన్నగారి లక్ష్మీనరసింహశర్మ
16. నింబగిరి నరసింహ శతకం – అందె వేంకటరాజం
17. శ్రీలొంకా రామేశ్వర శతకం – నంబి శ్రీధరరావు
18. అలిశెట్టి ప్రభాకర్ కవితా సంపుటి
19. 'అసంకలిత సాహిత్యం – 4 రూపకాలు సంపాదకీయాలు' విశ్వనాథ సత్యనారాయణ.
20. బసవ పురాణం – పాల్కురికి సోమనాథుడు
21. ఉత్పలమాల – ఉత్పల సత్యనారాయణ చార్య
22. భక్త చింతామణి శతకం – వడ్డాది సుబ్బరాయ కవి
23. మహిళా వరణం (సంపుటి)
24. విద్వాన్ విశ్వం రచనా సంపుటి
25. కథావాహిని – పులికంటి కృష్ణారెడ్డి
26. కాశీఖండం – శ్రీనాథుడు
27. వాల్మీకి రామాయణం యథాతథ వచన రచన (ఉదా : పుల్లెల శ్రీరామ చంద్రుడి గ్రంథం)

## తెలుగు – ద్వితీయ భాష – పరామర్శ గ్రంథాలు

1. శ్రీమదాంధ్ర మహాభాగవతం – బమ్మెర పోతన
2. హంపీ నుండి హరప్పా దాకా – తిరుమల రామచంద్ర
3. పాలవెల్లి – డా॥ పల్లా దుర్గయ్య
4. భారతం – ఉషశ్రీ
5. శ్రీరమాపరిణయం – తరిగొండ వెంగమాంబ
6. వరవిక్రయం – కాళ్ళకూరి నారాయణరావు
7. ఇస్మాయిల్ కవితలు – ఇస్మాయిల్

8. జానపదులు - జ్ఞానపదులు - దేవులపల్లి రామానుజరావు
9. కుమార శతకం - పక్కి అప్పల నరసయ్య
10. కాళికాంబ సప్తతి - పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి
11. దాశరథి శతకం - కంచెర్ల గోపన్న
12. సుభాషిత త్రిశతి - మూలం : భర్తృహరి అనువాదం ఏనుగులక్ష్మణకవి
13. నరసింహ శతకం - కాకుత్సం శేషప్పకవి
14. భారతీయ సాహిత్యం - సమకాలీన కథలు - సాహిత్య అకాడమీ
15. విశిష్ట మహిళామణులు - శాంతాభాస్కర్
16. భక్తరామదాసు - తెలుగు విశ్వవిద్యాలయ ప్రచురణ

## ఇతరములు

- శబ్దరత్నాకరం, నిఘంటువు
- సాహిత్య పదకోశం
- ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్యం - నాలుగు సంపుటాలు
- విద్యార్థి కల్పతరువు
- పురాతన నామకోశం
- వివిధ శతకాల పుస్తకాలు
- సాహిత్య, వ్యాసాల సంకలనాలు
- వార్తాపత్రికలలోని సాహిత్యపరమైన అంశాలు
- మ్యాగజైన్లలోని సాహిత్యపరమైన అంశాలు
- SCERT చే రూపొందించిన RVM, RMSA చే రూపొందించిన కరదీపికలు. ఉదా: నూతన పాఠ్యపుస్తకాలకు సంబంధించిన కరదీపికలు, నిరంతర సమగ్ర మూల్యాంకనం కరదీపిక, ప్రశ్నపత్రాల కరదీపిక మొదలగునవి.

**Websits:**

telangana.scert.gov.in

ap.scert.gov.in



# X. ఉపాధ్యాయుని తయారీ

ఒక కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించాలంటే... చక్కని ప్రణాళికతో, వనరులతో సంసిద్ధత అవసరం. వివిధ రంగాల్లో పనిచేసేవారు ఆయా రంగాల్లో నైపుణ్యాలను సాధనతో మెరుగుపరచుకోవడం అవసరం. ఉపాధ్యాయులకు సంసిద్ధత తప్పనిసరి. ఎంతో నమ్మకంతో పిల్లల భవిష్యత్తును మన చేతుల్లో పెట్టి పిల్లల ఉజ్జ్వల భవిష్యత్తుకై ఆరాటపడతారు తల్లిదండ్రులు. ఆ నమ్మకాన్ని, వృత్తి ధర్మాన్ని నిలుపుకోవటం కోసం నిరంతరం కొత్త ఆలోచనలతో తనను తాను సంస్కరించుకోవాలి ఉపాధ్యాయుడు. బోధనాభ్యసనకు తరగతి గదికి వెళ్ళే ఉపాధ్యాయులకు ఎలాంటి సంసిద్ధత అవసరమో చర్చించుకుందాం!

**ఉపాధ్యాయుల తయారీ ఎందుకు? ఏయే అంశాలలో ఎలా తయారుకావాలి?**

విద్యార్థులు నూతన పాఠ్యపుస్తకాల్లోని అన్ని సామర్థ్యాలు సాధించటంలో ఉపాధ్యాయుని పాత్ర కీలకమైనది. విద్యార్థులలో ఆలోచించి మాట్లాడడం, చదవడం, అవగాహన చేసుకోవడం, సొంతంగా రాయడం, సృజనాత్మకంగా వ్యక్తీకరించడం, ప్రాజెక్టుపనులు నిర్వహించడం, ప్రశంసా పూర్వక వైఖరులు పెంపొందించాల్సిన క్రమంలో ఉపాధ్యాయుల సంసిద్ధత తప్పనిసరి.

**ఉపాధ్యాయుడు ఏయే అంశాల్లో ఎలా తయారుకావాలి?**

ముఖ్యంగా 3 అంశాల్లో తయారుకావాలి.

అవి 1. బోధనకు సంసిద్ధత

2. మూల్యాంకనానికి సంసిద్ధత

3. నిర్మాణాత్మక, సంగ్రహణాత్మక పరీక్షలకు విద్యార్థులను తయారుచేయడం.

## అ) బోధనకు సంసిద్ధత :

పదవ తరగతి ప్రారంభం నుండే నూతన పాఠ్య పుస్తకాలకనుగుణంగా విద్యార్థుల బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించడానికి తయారుకావాలి. ఇందుకోసం

- వార్షిక ప్రణాళికను, పాఠ్యప్రణాళికను మరియు బోధనాభ్యసన సామాగ్రిని తయారుచేసుకోవాలి.
- తరగతి గదిలో భాషా వాతావరణాన్ని ఏర్పరచుకోవాలి. అనగా తగిన బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. వాటికి అవసరమైన సామాగ్రిని అందుబాటులో ఉంచుకోవాలి.
- సృజనాత్మకత, ప్రాజెక్ట్ పనుల నిర్వహణకు అవసరమైన వనరులను గుర్తించి, సామాగ్రిని అందుబాటులో ఉంచి, నిర్వహించాలి.
- బోధనలో పిల్లలను ఆలోచింపజేయడానికి, అవగాహన కల్గించడానికి పాఠాల వారీగా తగిన ప్రశ్నలను సిద్ధం చేసుకోవాలి.
- బోధనకు అవసరమైన సమాచారాన్ని సేకరించటం కోసం ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజి (ఉదా॥ అంతర్జాలం, సి.డి.లు, కంప్యూటర్లు, మొదలైనవి) ఉపయోగించుకోవాలి.
- పఠనాసక్తి కల్గించటానికి, పుస్తక సమీక్ష నిర్వహించటానికి గ్రంథాలయ పుస్తకాలను తరగతి గదిలో అందుబాటులో ఉంచే ఏర్పాటు చేసుకోవాలి.
- అభ్యాసాలను పిల్లలు సొంతంగా చేయగలిగేలా ప్రోత్సహించడానికి, సహాయపడడానికి కావలసిన ఆలోచనలతో సిద్ధంకావాలి.
- పదజాల వినియోగం కోసం నిఘంటువును పరిశీలింపజేయాలి.
- పిల్లలు రాసిన వాటిని నిరంతరం పరిశీలించడానికి, సరిచేసి అవసరమైన సూచనలు చేయటానికి సిద్ధమవ్వాలి.
- ముఖ్యంగా పిల్లలు అన్ని అభ్యాసాల సొంతంగా స్టడీమెటీరియల్, గైడ్లు, ప్రశ్నల బ్యాంకులను పిల్లలు ఉపయోగించకుండా నిరోధించాలి.

## ఆ) మూల్యాంకనానికి సంసిద్ధత :

**మూల్యాంకనం అంటే ఏమిటి?**

పిల్లల అభివృద్ధిని, ప్రగతిని ఎప్పటికప్పుడు అంచనావేసి అవసరమైన చర్యలు చేపట్టడమే "మూల్యాంకనం". ఈ మూల్యాంకనం 2 విధాలుగా నిర్వహించాలి.

### 1. నిర్మాణాత్మక మూల్యాకనం :

నిర్మాణాత్మక మూల్యాంకనంలో ఈ కింది అంశాలుంటాయి.

1. పుస్తక పఠనం – సమీక్ష / నివేదిక రాయడం (గ్రంథాలయ పుస్తకాలు / మ్యాగజైనులు / వార్తాపత్రికలు)
2. రాత అంశాలు (పాఠ్య పుస్తకంలోని అభ్యాసాలను సొంతంగా చేయడం, జవాబులు రాయడం.)
3. ప్రాజెక్టుపని (పాఠ్య పుస్తకంలో పాఠాల వారీగా ఇచ్చిన ప్రాజెక్టుపనులు)
4. లఘుపరీక్ష (పూర్తయిన పాఠాల ఆధారంగా సామర్థ్యాలకు సంబంధించిన ప్రశ్నలలో నిర్వహణ)

1. **పుస్తక పఠనం - సమీక్ష :**

- పుస్తక పఠనానికి అవసరమైన పుస్తకాలను పాఠశాల గ్రంథాలయం నుండి కాని ఇతర గ్రంథాలయాల నుండి కాని సేకరించి పిల్లలచే చదివించే ఏర్పాట్లు చేసుకోవాలి. నెలకొకసారి పుస్తకాలపై సమీక్ష నివేదిక రాయించాలి. (చిన్న పుస్తకమైతే మొత్తం పుస్తకం, పెద్దపుస్తకం అయితే సంఘటన, కథను తీసుకుని సమీక్ష చేయాలి.)
- పాఠశాల గ్రంథాలయంలో తగినన్ని / తగిన పుస్తకాలు లేనట్లయితే మనమే పిల్లలకు అందించే ఏర్పాట్లు చేయాలి.

2. **రాత అంశాలు :**

- ప్రతి పాఠంలోని ఏయే అంశాలు పిల్లలు సొంతంగా రాయాలో గుర్తించాలి.
- వాటి గురించి తరగతిలో చర్చించాలి. మన సమక్షంలోనే సొంతంగా రాసేలా చూడాలి.
- ఏరోజు ఏ సామర్థ్యాన్ని ఎలా అభ్యాసం చేయించాలో నిర్ణయించుకోవాలి.
- పిల్లలు సొంతంగా అభ్యాసాలకు సమాధానాలు రాయడం కోసం తగిన సూచనలు సిద్ధం చేసుకోవాలి.

3. **ప్రాజెక్టుపని :**

- పాఠ్యపుస్తకంలోని ప్రాజెక్ట్ పనుల జాబితా రాసుకోవాలి.
- ప్రాజెక్టుల స్వభావాన్ని గుర్తించి వర్గీకరించాలి.
- నిర్వహణకు అవసరమైన వనరులను సమకూర్చుకోవాలి.
- ఏయే ప్రాజెక్టుపనికి సమాచార సేకరణ ఎక్కడ లభిస్తుందో పిల్లలకిచ్చే సూచనలు సిద్ధం చేసుకోవాలి.
- ప్రాజెక్ట్ పనులకు అవసరమైన ఏర్పాట్లుచూసుకోవాలి.

4. **లఘుపరీక్ష :**

- లఘు పరీక్ష ఏయే సామర్థ్యాల్లో ఏయే అంశాల్లో ఎవరెవరికి నిర్వహించాలో నిర్ధారించుకోవాలి.
- లఘు పరీక్షలో పిల్లలు ఏ సామర్థ్యంలో వెనుకబడి ఉన్నారో గమనించి, వారిని ఆ సామర్థ్యంలో అభివృద్ధిని సాధించడానికి తగిన అభ్యాసం ఎలా కలిగించాలో ఆలోచించుకోవాలి.

  ఉదా : స్వీయరచన, సృజనాత్మకత, అపరిచిత గద్యం / పద్యం మొదలగునవి.

## 2. సంగ్రహణాత్మక మూల్యాకనం :

- పాఠాల వారిగా నమూనా ప్రశ్నలు తయారుచేసుకోవాలి.
- పరీక్ష పేపర్లు దిద్దటంపై శిక్షణ పొందాలి.
- సామర్థ్యాల వారిగా నమూనా ప్రశ్నాపత్రం తయారుచేసుకోవాలి.
- జవాబులు రాయటంలో పిల్లలకు అవగాహన కల్పించటానికి కావలసిన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి.

**పబ్లిక్ పరీక్షలకు పిల్లలను తయారుచేయడానికి సిద్ధం కావడం :**

- పాఠం ఆధారంగా పిల్లలను ఆలోచింపజేసే ప్రశ్నలను తయారుచేసుకోవాలి.
- పిల్లలతో అభ్యాసం చేయించడానికి సామర్థ్యాల వారిగా నమూనా ప్రశ్నలు తయారుచేసుకోవాలి.
- నిర్మాణాత్మక మూల్యాంకనం, సంగ్రహణాత్మక మూల్యాంకనంలో పిల్లల ప్రగతి ఆధారంగా వెనుకబడిన సామర్థ్యాలలో అభ్యాసం కల్పించడానికి ప్రణాళిక రూపొందించుకోవాలి.
- పరీక్షల్లో జవాబులు రాసే విధానంపై పిల్లలకు అభ్యాసం ఎలా చేయించాలో విధానం సిద్ధం చేసుకోవాలి.
- సంగ్రహణాత్మక పరీక్షల్లో జవాబుపత్రంలో మార్కుల కేటాయింపుపై ఇచ్చిన సూచికల ఆధారంగా పిల్లలకు అవగాహన కల్పించడానికి కావలసిన విధానాన్ని ఏర్పాటుచేసుకోవాలి.
- పఠనావగాహనలో అపరిత పద్యం / గద్యం / గేయం / కవిత మొదలగు అంశాలపై అవగాహన కల్పిచటానికి కావలసిన పద్య, గద్యాలను సిద్ధం చేసిపెట్టుకోవాలి.
- విద్యార్థులచే అభ్యాసం చేయించడానికి స్వీయ రచనలోని ప్రశ్నల స్వభావాన్ని దృష్టియందుచుకొని పాఠాల వారిగా అదనపు ప్రశ్నలు (అభ్యాసాల్లోనివి కాకుండా) తయారుచేసుకోవాలి.
- పిల్లలచే అభ్యాసం చేయించడానికి సృజనాత్మకత / ప్రశంసలలో అంశాలు (పుస్తకంలో ఇచ్చినవి) కాకుండా అదనపు అంశాలను తయారుచేసుకోవాలి.
- పిల్లలచే అభ్యాసం చేయించడానికి భాషాంశాలు (పదజాలం, వ్యాకరణాంశాలు) అభ్యాసాలలో ఇచ్చిన వాటినే కాకుండా వాటి మాదిరి ప్రశ్నలను ప్రశ్నపత్రం ఆధారంగా తయారుచేసుకోవాలి.

## పిల్లలూ – పరీక్షలూ

*నిరంతర పరీక్షిస్తున్నందువల్ల పిల్లల ఆత్మవిశ్వాసానికీ, ఆత్మగౌరవానికీ తీవ్రమైన నష్టం కలుగుతుంది. తాము నేర్చుకోగలమనే సంగతి ఇతరులు నమ్మాలని పిల్లలు కోరుకొంటారు. పరీక్షల వల్ల ఈ నమ్మకానికి అడుగడుగునా అడ్డంకి కలుగుతుంది. పిల్లలు ఏమి నేర్చుకొన్నారో పరీక్షించడానికి ప్రయత్నించడం వాళ్ళు ఏమి నేర్చుకోలేదో ఎత్తిచూపి భయపెట్టే ప్రమాదంగా మారుతుంది. ఇది పిల్లలపట్ల పదే పదే అవిశ్వాసం వ్యక్తంచేయడమై ప్రళయాంతకమైతుంది.*

*– జాన్‌హోల్ట్*